# వానపూలు

నవల

శ్రీకళ అబ్బరాజు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 233

కౌముది మాసపత్రికలో

జనవరి 2021 సంచిక నుంచి అక్టోబర్ 2022 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

**"అమ్మా! మనం** వస్తున్నట్టు స్వప్నకి తెలుసా?" ఉత్సాహంగా అడిగాన్నేను.

"ఊహూ" తల అడ్డంగా ఊపింది అమ్మ.

"గుడ్! దానికి సర్‌ప్రైజ్‌గా ఉంటుంది" కారు సీటులో కూర్చున్నచోటే జంప్ చేశాను.

అమ్మ నా వంక గంభీరంగా చూసింది.

ఆ చూపుకి అర్థం నాకు తెలుసు. "నీ ఓవర్ ఎగ్జైట్‌మెంట్ చాలు. ఇక ఆపు" అని.

వెంటనే, విండోగ్లాసు కిందకి దించి, తల కిటికీ దగ్గర పెట్టాను. బైట అప్పుడప్పుడే తెల్లవారుతూ వుంది. చీకటిని వదిలించుకుని ఎర్రబడుతూ వుంది ఆకాశం. చుట్టూ వున్న పొలాల పచ్చదనాన్ని వచ్చీరాని వెలుతురు సరిగా చూపించలేకపోతూ వుంది.

చల్లటిగాలి తెరలు తెరలుగా వచ్చి మొహాన్ని తాకుతూ వుంటే, మెడచుట్టూ వున్న స్కార్ఫ్‌ని చెంపలకి దగ్గరగా లాక్కున్నాను. స్కార్ఫ్ వెచ్చదనం చెంపల్ని తాకుతూ వుంటే గడిచిపోయిన సంఘటన ఒకటి గుర్తొచ్చింది.

అతని చేతులు నా బుగ్గల్ని తడిమిన క్షణం. అది గుర్తు చేసుకుంటూనే ఫక్కున నవ్వాను. "సందీప్ యిప్పుడెలా ఉండి వుంటాడు? " ఆలోచించాను.

"తనూ!"

నా అసందర్భపు నవ్వు అమ్మ గమనించినట్టుంది, మందలించింది. నేను సైలెంటయిపోయాను. కానీ ఒక్క క్షణం మాత్రమే.

"అమ్మా! ఆ చెట్లు, గాలీ, వెలుతురూ పొలాలూ చూస్తుంటే ఏదైనా అందమైన కవిత్వం రాయాలనిపిస్తుంది. కానీ ఏంటో పదాలన్నీ దగ్గరకు వచ్చి అల్లుకున్నట్టే అనిపిస్తాయి. మళ్ళీ వెంటనే పారిపోతాయి. అసలు కవిత్వం రాసేవాళ్ళు ఎలా రాస్తారో" గలగలా మాట్లాడుతూనే వున్నాన్నేను.

"ముందా విండో క్లోజ్ చెయ్యి" ఠక్కున ఆపేసింది అమ్మ. బుద్ధిగా విండోగ్లాస్ పైకి రోల్ చేసి, స్కార్ఫ్ సరిచేసుకుని కూర్చున్నాను. కారు ముందు గ్లాస్ మీద, మంచు బిందువుల్లో సూర్యకిరణాలు పడుతూ వున్నాయి.

వాటి కాంతి రంగురంగులుగా విడిపోయి, అందమైన నక్షత్రాల్లా ప్రకాశిస్తున్నాయి ఆ మంచుబిందువులు.

"ఇదీ.. బానే వుంది. అమ్మా అటు చూడు" నా వాక్యం పూర్తి కాలేదు.

"తనూ" ఈ సారి అమ్మ గొంతులో సీరియస్‌నెస్ పెరిగింది.

"అలా ఊరికే మాట్లాడుతూ వుండకు. డ్రైవర్‌కి కాన్‌సన్‌ట్రేషన్ కుదరదు" మందలించింది.

"ఓ.కే" కిటికీ వైపుకి మొహం తిప్పి కూర్చున్నాను. నా మౌనవ్రతం, మా డ్రైవరు ఏకాగ్రతా ఫలించి చిన్నగా ఓ గంటన్నరలో కారు వచ్చి మా యింటిముందు ఆగింది.

కారు దిగుతూనే రంగారావుగారూ యింకో యిద్దరు మనుషులు మా కోసం ఎదురుచూస్తూ కనిపించారు.

"హలో అంకుల్" అన్నాను ఆయన్ని చూస్తూనే.

ఆయన నన్ను చూసి నవ్వి "అమ్మా" అని పరిగెత్తుకుంటూ అమ్మ దిగిన డోర్ వైపుకి వెళ్ళారు. ఆయన ఇటు కారు డోర్ దగ్గర్నుంచి అటువైపు డోర్ దగ్గరకి వెళ్ళేలోపు వినయంతో సగానికి సగం వంగిపోయాడు.

అమ్మ మరీ నిటారుగా నిలబడి యింగో అంగుళం పెరిగినట్టనిపించింది. అమ్మ నోరు కూడా తెరవకముందే

"నమస్తే అమ్మా! ఈ సామానంతా నేను లోపల పెట్టిస్తాను. మీరు పదండమ్మా" చెప్పి, పనులన్నీ అక్కడున్న వాళ్ళకి పురమాయించాడు.

"ఇప్పుడు ఆఫీసులో ఉన్న స్టాపులో మనకి తెలిసిన వాళ్ళెవరైనా వున్నారా?" ఇంటివైపుకి నడుస్తూ అడిగింది అమ్మ.

"మీరు యిక్కడ్నుంచి వెళ్ళిన ఈ అయిదేళ్ళలో కదలకుండా వుంది నేనూ, పట్టాభినే అమ్మా! మిగిలిన వాళ్ళందరూ కొత్తవాళ్ళూ చిన్నవాళ్ళు" మాతోపాటే వస్తూ చెప్పాడాయన.

ఇంటిముందు గోడకి 'సుచరిత, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్' అని తగిలించి వున్న నేమ్‌ప్లేట్ దగ్గర ఆగిపోయింది అమ్మ.

"రంగారావుగారు ప్లీజ్ యిది తీసేయించండి. మనం పనిచేసేది ఆఫీసులో. యింటిదగ్గర ఈ నేమ్‌ప్లేట్ ఎందుకు?"చెప్పింది.

"అలాగే అమ్మా" తలుపాడాయన.

"మీరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళినప్పుడు ఎలా వుందో అచ్చం అలానే మెయిన్‌టెయిన్ చేస్తున్నానమ్మా యింటిని. ఈ రంగులు పదిహేనురోజుల కిందటే వేయించాం" చెప్పుకుపోతున్నాడు.

ఆయన మాట్లాడుతుండగానే, మెయిన్ డోర్ దాటి హాల్లోకి వచ్చాం. అక్కడున్న ఫర్నిచర్, గోడకి పెట్టి వున ఎల్.ఇ.డి టి.వి, కిటికీలకు వేసి వున్న కర్టెన్లు అన్నీ ఒకసారి పరీక్షగా చూసింది అమ్మ.

"అన్నీ సరిగ్గానే ఉన్నాయి కదా! ఏదైనా తేడా వుంటే మార్పించేద్దాం" రంగారావుగారు కంగారుపడిపోయారు.

"అన్నీ సరిగ్గానే వున్నాయంకుల్" అమ్మ మొహం చూసి చదివినట్టే చెప్పేశాను. అమ్మ తలతిప్పి నా వైపు పదునుగా చూసింది.

ఠక్కున నోరు మూశాను.

నిజానికి, అమ్మ మా యింటికి వేసే రంగుల దగ్గర్నుంచి, చిన్న చిన్న రిపేర్ల వరకూ, అన్నీ వీడియోకాల్స్‌లో పర్యవేక్షణ చేస్తూ చేయించింది. ఇంకా ఏం మార్పులు వుంటాయి?

అదీగాక, అమ్మ ఒకసారి డెసిషన్ తీసుకుంటే, దాన్ని చస్తే మార్చుకోదు. ఇప్పుడు 'మార్పు చేయాలి' అంటే క్రీం కలర్ గోడల మీద పింక్ పెయింట్ వెయ్యమంటుంటుందా?

ఏంటో రంగారవుగారి చాదస్తం అనుకోగానే నవ్వొచ్చింది. ఇంతలో రంగారావుగారు పురమాయించిన మనుషులు మా సూట్‌కేస్‌లు ఇంకా మిగిలిన లగేజీ అంతా లోపలికి తెచ్చి పెట్టారు.

"థాంక్స్ ఇక మీకు టైమవుతున్నట్టుంది" అమ్మ రంగారావుగారితో అంది.

"సరే అమ్మా! నేను యింటికి వెళ్ళి మీకు టిఫెన్లు పంపిస్తాను. ఇంకా ఏమన్నా కావలంటే నాకు ఫోన్ చేయండి" చెప్పి వెళ్ళిపోయాడాయన.

"మమ్మీ బాత్రూమ్‌లో షవర్ పెట్టించమన్నాను. పెట్టించావా? ఐ జస్ట్ కాన్ట్ సర్వైవ్ విత్ అవుట్ ఇట్" నా సూట్‌కేస్‌ని రూములోకి తీసుకెళుతూ అడిగాను.

"తనూ ఒక్క నిముషం" అమ్మ ఆపింది. నేను వేసుకున్న జీన్స్, పింక్ కలర్ టాప్ వంక పరీక్షగా చూసి "ఇకనుంచి ఇక్కడున్నన్ని రోజులూ నువ్వు సల్వార్ కమీజ్‌లే వేసుకోవాలి. ఇందాక నిన్ను చుట్టుపక్కల వాళ్ళు అదోలా చూశారు. గమనించావా?" అడిగింది.

"ఓ! నేనింకా నా ఇరవైమూడేళ్ళ యవ్వనాన్ని చూసి అలా నోరు తెరుచుకుని చూస్తున్నారనుకున్నాను. ఆ లుక్స్ నా బట్టలు చూశా?" కావాలనే వంకర్లు పోతూ సరదాగా అన్నాను.

"తనూ!"

"ఓకే" అన్నాను నీరసంగా.

"ఇంకో విషయం నువ్వు పొద్దున్నే జాగింగ్ సూట్ వేసుకుని రోడ్డుమీద పరిగెత్తకు. ఇంట్లోనే యోగా చేసుకో. త్వరలో కొత్త యోగాటీచర్ వస్తుంది నీకోసం" చెప్పింది.

"అమ్మా!" కంగారుగా అరచేతుల్ని రుద్దుకుంటూ అరిచాను.

"ఇది సిటీకాదు. నీ అలవాట్లని కొంచెం మార్చుకోవాలి. అది తప్పేమీ కాదు. లేకపోతే ఉయ్ విల్ బికమ్ ద పాయింట్ ఆఫ్ డిస్కషన్."

అమ్మ చెప్పిన పాయింట్‌కి నా దగ్గర జవాబు లేదు.

ఈ విషయమనే కాదు నాకు యిష్టమైన, అమ్మకు యిష్టంలేని ఏ విషయం గురించైనా వాదించడానికి నా దగ్గర ఆర్గ్యుమెంట్ ఉండదు.

"షీ ఈజ్ డామ్ రైట్.. యాజ్ ఆల్వేస్" అనుకుంటూ సూట్ కేస్‌ని నా రూములోకి లాక్కుని వెళ్ళాను.

నా గది తలుపు తీసి లోపలికి వెళుతూనే ఒక్కసారిగా అలా నిలబడిపోయాను. నాకు తెలుపు రంగంటే యిష్టం. నా గది గోడలకి తెల్లరంగు పెయింట్ వేసి వుంది. కిటికీలకి కర్టెన్లకి బదులుగా, వైట్ కలర్ బ్లైండ్స్ వేసి వున్నాయి.

చిన్నప్పటినుంచి నేను ఒక్కొక్కటిగా కొని దాచుకున్న గాజుబొమ్మలు షెల్ఫులో అందంగా అమర్చివున్నాయి.

దాని పక్కనే రెండు అట్టపెట్టెల్లో నాకు సంబంధించిన వస్తువులు. అంటే నా ఫ్రెండ్స్ యిచ్చిన గిఫ్ట్‌లు, నేను సేకరించి పెట్టుకున్న కీ ఛెయిన్లు, పోస్టర్లులాంటి సరంజామా అంతా వాటిల్లో ఉన్నాయి.

"వావ్! మామ్ అచ్చం నేను కోరినట్టే తయారు చేయించావు రూముని" అని ఎగిరి గంతేశాను.

"నేను వచ్చి మిమ్మల్ని యింకా అందంగా మారుస్తాను సరేనా?" చుట్టూ ఉన్న గోడలకి చెప్పి హుషారుగా బాత్రూం వైపుకి నడిచాను. స్నానం చేసి వచ్చి అమ్మ చెప్పినట్టే చుడీదార్ వేసుకుని తడితో అల్లుకుపోయిన జుట్టుని తుడుచుకుంటూ ఉన్నాను. ఇంతలో "హలో ఎవరైనా ఉన్నారా?" అంటూ ఓ కొత్తగొంతు వినిపించింది. తలపైనుంచి భుజం మీదకి జారిపోయిన టవల్‌ని వేళ్ళ అంచులతో పట్టుకుని తొంగి చూశాను.

కాజువల్ పాంటూ.. టీ షర్టు. ఎత్తుగా సరిపడా లావు కంటే కాస్త సన్నగా ఎవరబ్బా? ఇంకాస్త తలముందుకి పెట్టి చూశాను. వచ్చినతను కాస్త పక్కకి తిరిగి ఉండడంతో నొక్కులు తిరిగిన క్రాపూ ఒకవంతు మొహం మాత్రమే కనిపిస్తూ వుంది. చేతిలో సంచిని పట్టుకున్న వేళ్ళు రఫ్‌గా వున్నాయి అంటే అతనెవరో సడన్‌గా మెదడుకి తట్టింది.

"సందీప్ !"

నేను పిలిచేలోపే అతను ఠక్కున తలతిప్పి చూశాడు. మరుక్షణం నా పొట్టలో, వెన్నులో నరాలన్నీ జిల్లుమని బిగుసుకుపోయాయి. నా పెదవులు ఎప్పుడు తెరుచుకున్నాయో? నా చేతిలోని టవల్ ఎప్పుడు జారి కిందపడిపోయిందో తెలియనే తెలియలేదు. అతను నేనెవరో అస్సలు తెలియనట్టే చూసి తలతిప్పుకున్నాడు

ముందుగా అతన్ని పలకరించాలా. లేకపోతే వెచ్చగా అయిపోయిన చెంపల్ని చేతులతో రుద్దుకోవాలా? అదీ కాదంటే నేను కూడా ఏమీ తెలియనట్టే నటించాలా? అని ఆలోచించి తికమకపడుతూ వుండగానే అమ్మ వచ్చింది.

"సందీప్ ఎలా వున్నావు?" అమ్మ అతన్ని పలకరించింది.

అతను జవాబివ్వలేదు. నిర్లక్ష్యంగా తలవూపి "నాన్న మీకు యివి ఇచ్చి రమ్మన్నారు" అంటూ చేతిలోని సంచిని టీపాయ్ మీద పెట్టాడు.

అతని లెక్కలేనితనానికి అమ్మ మొహంలో చిరాకు కనిపించింది. సరిగ్గా ఏడు సంవత్సరాల కిందట జరిగిన యిలాంటి ఒక సందర్భం గుర్తుకొచ్చింది నాకు. అమ్మ సోఫాలో కూర్చుని రంగారావు అంకుల్ కోసం వెయిట్ చేస్తూ వుంది అప్పుడే సందీప్ వచ్చాడు. "మీ నాన్న రాలేదేం?" అమ్మ అడిగింది.

"నాన్నకి ఒంట్లో బాగోలేదు. నిన్న మీ పనిమీదే ఎండలో తిరిగి" అంటూ చివరిమాట మింగేశాడు.

అమ్మకి కోపం వచ్చిందో, రాలేదో తెలియలేదు. మొహంలో ఏ భావాలు కనిపించలేదు. "నీ సంగతేమిటీ? ఈ సంవత్సరం యింటర్ ఫైనలియర్ కదూ! బాగా చదవాలి. బుద్ధిగా వుండు" చెప్పింది.

"....."

"నిన్ను హాస్టల్లో చేర్పిస్తేకానీ బాగుపడవని మీ నాన్న అంటున్నాడు. బలాదూర్‌గా తిరగడం మాని బుద్ధిగా చదువు. మీ నాన్నకి కాస్త భారం తగ్గించు అర్థమైందా?"

"..."

"ఎవడితోనో గొడవపడి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళావు. పాపం, మీ నాన్న నా దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చాడు. చదువుకునే పిల్లాడివని పోలీసులు వదిలేశారు. నీకివన్నీ అవసరమా?"

"అమ్మ అడిగిన ఏ ఒక్క ప్రశ్నకీ సందీప్ జవాబివ్వలేదు. అతని కళ్ళు, అమ్మకి గౌరవం యిస్తున్నట్టు కిందకి వాలి ఉన్నాయికానీ శరీరం మొత్తం ఎదురు తిరుగుతున్నట్టే వుంది. అతను కుడిచేతిని ప్యాంటు జేబులో దూర్చి గట్టిగా పిడికిలి బిగించడం నేను చూస్తూనే వున్నాను.

అతను మౌనంగా, వాళ్ళ నాన్న పంపిన పళ్ళబుట్టని కిందపెట్టి వెనక్కి తిరిగాడు. అమ్మ చూడకుండా గబగబా అతని వెనకాలే వెళ్ళాను.

పోలీస్ స్టేషన్‌కి ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందో కనుక్కోవాలని నా ఉబలాటం.

"సందీప్...సందీప్"

నేనెంత పిలిచినా అతను వెనక్కి తిరగలేదు. ఒక్క పరుగుతీసి, అతనికి దగ్గరగా వెళ్ళాను. ఇంతలో కాలికేదో తగిలినట్టయ్యింది. టాస్ వేసిన కాయిన్‌లా అమాంతంగా బొక్కబోర్లా పడ్డాను. నా తెల్లరంగు చుడీదార్‌కి మట్టి అంటుకుంది. కుడి మోచేయి రాయికి కొట్టుకుని రక్తం బొటబొటాకారింది.

సందీప్ ఆగి, తలతిప్పి నావైపు చురుగ్గా చూశాడు. అప్పుడర్ధమైంది. అతనే కాలు అడ్డంపెట్టి నన్ను పడేశాడని. నెప్పికి, అవమానం తోడై నాకళ్ళలో నీళ్ళు తిరిగాయి. సందీప్ కళ్ళతో ఒక్క క్షణం సానుభూతి కనిపించింది. అతను వంగి నాకు చెయ్యి అందిస్తాడని ఆశగా చూశాను. కానీ అతను పట్టించుకోకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. ఆ సంఘటన గుర్తుకి రాగానే, అప్రయత్నంగా నా మోచేతిమీద ఆ గాయం తాలూకు మచ్చని ఒకసారి చూసుకున్నాను.

నేను ఆలోచనల్లో ఉండగానే, అతను పెద్ద పెద్ద అంగలతో గుమ్మందాటి బైటికి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాడని అర్ధం అయ్యాక, పరుగున అద్దం ముందుకు వెళ్ళి నన్ను నేను చూసుకున్నాను.

"ఈ యాంగిల్‌లో చూసి వుంటాడా? అయ్యో నెత్తిమీద జుట్టు అసహ్యంగా, కొమ్ముల్లా లేచి వుంది. నోరు మరీ పెద్దగా తెరిచానా? అద్దం ముందు అటూ యిటూ తిరిగి అనుకుంటూ వుండగానే, బైట బైక్ స్టార్ట్ అయిన శబ్దం వినిపించింది. గభాల్న కిటికీ దగ్గరకి వెళ్ళి బ్లైండ్స్‌తో మొహం దూర్చి చూశాను. నేను చూస్తుండగానే, హెల్మెట్ పెట్టుకుని, బైక్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

హూ.. నీరసంగా నిట్టూర్చాను. కనీసం హిందీ సిన్మా హీరోలా "ఒకటి రెండు, మూడు" అని లెక్కపెడితే వెనక్కి తిరిగి చూసినా ఎంత బావుండేది. ఎంతైనా, ఒకసారి నన్ను ముద్దు పెట్టుకోవాలని ట్రైచేశాడు కదా ఆ మాత్రం ఫీలింగ్స్ వుండవా? డౌటొచ్చింది.

అయినా అది ఎన్నేళ్ళ కిందటి సంగతి? రెండురోజుల్లో యిద్దరు గర్ల్ ఫ్రెండ్స్‌ని మార్చే రోజులివి. నువ్వు చెప్పే కథ శరత్‌చ్చంద్ర నవలల్లో బాల్యవివాహాల్లాంటి కథ తనూ. అనవసరంగా ఆలోచించకు. అంతరాత్మ బుజ్జగించింది.

"వంటల్లో ఆయిల్ తక్కువగా వాడండి. నాకు పెరుగు సహించదు. నాకోసం పెరుగు తోడు పెట్టకండి" నేను నిద్రలేచి హాల్లోకి వచ్చేసరికి అమ్మ ఎవరితోనో మాట్లాడుతూ వుంది.

"తనూ. ఈవిడ రాజ్యంగారు. వంట చెయ్యడానికి వచ్చారు. బ్రేక్‌ఫాస్ట్ నీకు కావల్సింది అడిగి చేయించుకో. ఇంకో విషయం రేపట్నుంచి కొంచెం త్వరగా నిద్రలేవాలి నువ్వు. యోగా టీచర్ వస్తుంది" చెప్పింది.

"ఒకే మామ్" బుద్దిగా తలుపాను.

"నేను ఆఫీసుకి వెళ్తున్నాను. ఏదైనా అర్జంట్ పని పడితే మెసేజ్ పెట్టు. మరీ ప్రాణాలమీదికి వస్తే తప్ప కాల్ చెయ్యకు. అవసరాన్ని బట్టి రంగారావుగారిని పంపిస్తాను" ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చి, హ్యాండ్‌బ్యాగ్ తగిలించుకుని వెళ్ళిపోయింది.

అమ్మ వెళ్ళగానే రాజ్యంగారు చేసిన బ్రెడ్ టోస్ట్ తిని సెల్‌ఫోన్ పట్టుకుని బద్ధకంగా సోఫాలో కూలబడ్డాను. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీశాను.

"అమ్మ తోటపని చెయ్యాలన్నారు నర్సరీనుంచి పూలకుండీలొచ్చాయి. ఎక్కడ పెట్టించమంటారు?" నెత్తిమీద చుట్టుకున్న తుండు తీసి విదిలిస్తూ అడిగాడొక మధ్య వయసాయన.

గేటు బయట ఆపి వున్న, వ్యాను యింజను గడగడమంటూ ఒకటే శబ్దం చేస్తూ ఉంది.

నిజానికి ఆయన చెప్పింది సగమే వినిపిస్తూ వున్నా నా ఊహాశక్తిని వాడి పూర్తి విషయం అర్ధం చేసుకోగలిగాను.

ఇలాంటి ప్రశ్నలకి జవాబులు చెప్పడం పని చేసేటప్పుడు సూపర్ వైజ్ చెయ్యడం చాలా కష్టం. అసలే నేను బద్దకం మూడ్‌లో ఉన్నాను.

నేను ఆలోచిస్తూ ఉండగానే "అమ్మా" ఈసారి కంగారుగా అరిచాడాయన.

నిద్రలేచాక ఒక్కసారికూడా తలదువ్వుకోలేదు. దానికి తోడు నైట్ డ్రస్ మీదకి అస్సలు మాచింగ్ కుదరని జాకెట్. నా వాలకం అయోమయంగా కనిపించడంతో భయపడ్డట్టున్నాడు అనుకుని "ఇటువైపు పెట్టండి" అని దారికి అడ్డం లేకుండా నా చేతివేళ్ళు ఎటు తిరిగితే అటు చూపించాను. లోపలికి వచ్చి, ఫోన్ చేతిలోకి తీసుకున్నానో లేదో మళ్ళీ కాలింగ్‌బెల్ మోగింది. తలుపు తీస్తూనే "వాటర్ కాన్" అంటూ సంజీవనీ పర్వతాన్ని భుజానుకెత్తుకున్న హనుమంతుడిలా కనిపించాడు వాటర్‌కాన్ అబ్బాయ్.

కాన్ దింపించి తిరిగి తలుపేసుకున్నాను.

వంటింట్లో రాజ్యంగారు వంట చేస్తున్నారు. మిరపకాయలు మాడి దగ్గువస్తున్నా కాన్‌సన్‌ట్రేషన్ చెదరకుండా ఆవిడ వంట చేయడం చూసి నాకు భయం వేసింది. ఫ్యూచర్‌లో పెళ్ళీ, గిళ్ళీ అయితే వంటమనిషి సెలవు పెడితే వంటొచ్చిన మొగుడికి అదేరోజు జ్వరం వస్తే జ్వరం వచ్చిన భర్తకి హోటల్ భోజనం పెట్టకూడదు కాబట్టి, వంట చెయ్యాల్సి వస్తుందా?

భయంతో గుడ్లు మిటకరించి రాజ్యంగారి వంక చూస్తూ కూర్చున్నాను. ఓ అయిదునిముషాల్లోనే "అమ్మా వంట అయ్యిందమ్మా" అంటూ ఆవిడ పొయ్యి కట్టేసి 'తలుపేసుకో'మని చెప్పి వెళ్ళిపోయింది.

ఆవిడటు వెళ్ళగానే మళ్ళీ కాలింగ్ బెల్ మోగింది. "అబ్బా! క్షణంపాటు కూర్చోనియ్యరూ నిల్చోనియ్యరూ" అని విసుగు పడుతూ లేచి తలుపు తీస్తూనే ఉన్నట్టుండి బిగుసుకుపోయాను.

**ఒక్క క్షణం** నా మెదడులో ఏదో లైట్ వెలిగినట్టైంది. ఆ లైట్ వెలుతురులో నా చింపిరి జుట్టు, నైట్‌పాంటూ, మ్యాచింగ్ లేని జాకెట్‌లో నా అవతారం స్పష్టంగా నాకే కనిపించింది.

అంతే! ఠకీమని తలుపేశాను.

గబగబా గదిలోకి పరుగెత్తి తలదువ్వుకున్నాను. జాకెట్‌కి జిప్ పెట్టేశాను.

"లిప్‌స్టిక్" మరీ ఎక్కువౌతుందా?" తేల్చుకునే లోపలే కాలింగ్‌బెల్ మళ్ళీ మోగింది. ఎక్కడివక్కడ వదిలేసి, కంగారుగా వచ్చి తలుతీశాను.

అతిగా ఆయాసపడుతున్న నావైపు విచిత్రంగా చూశాడతను.

"మీ యింటి రిపేర్లు, పెయింట్ ఖర్చుల లెక్కలు ఈ కాగితంలో ఉన్నాయి. ఇది మిగిలిన డబ్బు. మా నాన్నకి తీరికలేక నాకప్పగించాడు. మీ సేవతో బాటు, ఆఫీసు పని కూడా చేయాలిగా. ఇంకా మీవి రెండు పెయింట్ డబ్బాలు ఉండిపోయాయి. అవి రేపు తెచ్చి యిస్తాను" చెబుతున్నాడు.

సందీప్‌ని దగ్గరగా చూస్తున్నానన్న ఆనందంలో, అతనేం మాట్లాడుతున్నాడో కూడా సరిగ్గా అర్థంకాలేదు.

అతను నా చేతిలో ఓ కాగితంతోబాటు, బొత్తిగా ఉన్న నోట్లను కుక్కి వెనక్కి తిరిగాడు.

"సందీప్!.. ఒక్క నిముషం."

అతన్ని పిలిచాననే అనుకున్నాను. కానీ మాటలు గొంతుదాటి రాలేదు. నా కంగారుకి, చేతిలోనుంచి డబ్బులు జారి కిందపడిపోయాయి.

అతను చూసి కూడా చూడనట్టు వెనక్కి తిరిగాడు.

"ఒఠ్ఠి పొగరుబోతు. ఎప్పుడూ ఆ ఫేస్ అలాగే వుంటుంది కాబోలు" గొణుక్కుంటూ కిందపడిన డబ్బుని జాగ్రత్తగా తీస్తూ వున్నాను. ఇంతలో, గేటు ముందు ఒక స్కూటీ వచ్చి ఆగింది. "స్వప్నా" ఉత్సాహంగా లేచాన్నేను.

నాకంటే, ముందే వాళ్ళిద్దరి పలకరింపులు అయ్యాయి. స్వప్నని చూసి నవ్వాడు కూడా.

"నవ్వితే బావుంటాడు" అనుకుంటుండగానే, స్వప్న సుడిగాలిలా వచ్చి చుట్టేసింది.

"ఎన్నాళ్ళైంది మనం కలిసి" అంది ఉత్సాహంగా లోపలికి నడుస్తూ.

"మేం నిన్ననే వచ్చాం. మేమేదో పనుల్లో బిజీగా వుంటూ అనుకుని, నిన్ననే నువ్వు పరిగెత్తుకుంటూ వచ్చి నన్ను కలవాలి కదా! ఏం చేస్తున్నావ్ మరి?" అంటూ సరదాగా స్వప్న చెవి మెలేస్తూ.

"నిజమేనే. నువ్వొచ్చావంటే, రెక్కలు కట్టుకుని వాలిపోదామనే అనుకున్నాను. కానీ ముఖ్యమైన పని ఒకటి వచ్చింది. అందుకే రాలేదు." అని ఓ క్షణం ఆగి.

"నా కన్నా ముఖ్యమైన పనేంటి? అని మాత్రం అడగకు. అది సర్‌ప్రైజ్! తర్వాత చెప్తాను" అంది నవ్వేస్తూ.

ఇద్దరం నా రూంలోకి వెళ్ళి కూర్చున్నాం.

"అవునూ..! సందీప్ యిక్కడికొచ్చాడేంటి?" అడిగింది మాటల మధ్యలో.

"ఏదో యింటి రిపేర్లూ, ఖర్చులూ తాలూకు డబ్బులు యిచ్చి వెళ్ళాడు" చేతిలో డబ్బుని డ్రాలో పెడుతూ నిర్లక్ష్యంగా చెప్పాను.

"ఓ.. సందీప్ నాన్నగారు మీ అమ్మ దగ్గర పనిచేస్తారు కదూ" అంది మంచం మీద వెనక్కి వాలుతూ.

"మా అమ్మ దగ్గర పనిచేయడంకాదు. ఇద్దరూ ఒకే ఆఫీసులో పని చేస్తారు" కరెక్ట్ చేశాను.

"కానీ.. నో అఫెన్స్! నేను చెప్పిందే కరెక్టు. మీ సొంతపన్లు కూడా ఆయన చేతే చేయిస్తారుగా. మొన్నీమధ్య ఆయనకి ఒంట్లో బాగోలేకపోతే, మీ యింటి పెయింట్ వర్క్ అంతా సందీపే చూసుకోవాల్సి వచ్చింది.

పాపం ఆ పనుల్లో పడి, టెండర్ వేసే రోజు లేటుగా వచ్చి, మాధవన్నయ్య దగ్గర తిట్లు కూడా తిన్నాడు."

"ఇందులో కోపం తెచ్చుకోవడానికేముందీ? నిజమే కదా" అన్నాను తేలిగ్గా తీసుకోవడానికి ప్రయత్నం చేస్తూ.

"ఇంతకీ, మాధవన్నయ్య టెండర్‌కీ, సందీప్‌కీ ఏంటి సంబంధం?" అడిగాను స్వప్నని.

"సందీప్ యిప్పుడు మా అన్నయ్య దగ్గరే పనిచేస్తున్నాడు. ఎం.బి.ఏ పూర్తయ్యి రెండేళ్ళయినా, ఎక్కడా ఉద్యోగంలో కుదురుగా పనిచేయలేదు. ఆ మధ్య ఢిల్లీలో మంచి కంపెనీలోనే ఉద్యోగం వచ్చింది. అయినా, ఆర్నెల్లకల్లా వెనక్కి వచ్చేశాడు.

నీకు తెలుసుగా అదో రకం మనిషి. ఎక్కువగా మూడీగా, అప్పుడప్పుడూ నార్మల్‌గా ఉంటుంటాడు.

సొంతగా ఏదో వ్యాపారం పెట్టాలని ఆలోచనట. కానీ, చేతిలో డబ్బులేదు. అందుకే ప్రస్తుతానికి మాధవన్నయ్యకి బిజినెస్‌లో తోడుగా వుంటున్నాడు. ఆ సంగతొదిలెయ్. నీ గురించి చెప్పు. బి.టెక్ అయిపోయింది. నెక్స్ట్ జాబ్ చేస్తావా? లేకపోతే చదువు కంటిన్యూ చేస్తావా?"

"అబ్బా! ఎగ్జామ్స్ అయిపోయి వారం కూడా కాలేదు. ఇప్పుడే ఆలోచించే మూడ్ లేదు. అమ్మతో డిస్కస్ చేసి నిర్ణయించుకుంటాను. మరి నీ సంగతేంటి? సైకాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తావా?" తిరిగి ప్రశ్న వేశాను.

"చెయ్యాలనే వుంది. కానీ అంతకన్నా ముఖ్యమైన విషయం యింకోటి కూడా వుంది. అన్నీ తర్వాత తీరిగ్గా చెప్తాను కానీ ముందు ఆకలేస్తుంది. అన్నట్టు సైకాలజీకీ, బయాలజీకీ చాలా దగ్గర సంబంధం వుంది తెలుసా? టైంకి అన్నం తినలేదనుకో. అది మన హ్యాపీ మూడ్ మీద ఎఫెక్ట్ చూపిస్తుందన్నమాట" అంది పొట్టమీద చెయ్యిపెట్టి గుండ్రంగా తిప్పుతూ.

స్వప్నని చూసి నవ్వొచ్చింది నాకు.

"రెండు నిముషాల్లో స్నానం చేసి వస్తాను. లంచ్ చేద్దాం" అంటూ లేచి వార్డ్‌రోబ్ తెరిచాను. నా జీన్స్, స్కర్ట్స్ ఒక్కటి కూడా కనిపించలేదు. "ఖచ్చితంగా వాటిని మానవమాత్రుడి కంటబడకుండా దాచి పెట్టి వుంటుంది. అమ్మా! యూ ఆర్ యింపాజిబుల్" అనుకుంటూ చేతికి అందిన డ్రస్ బైటికి తీశాను.

స్నానం చేసి వస్తూనే, "ఓ మైగాడ్" అంటూ స్వప్న కేక.

"ఏమైంది?" పరుగున స్వప్న కూర్చున్న చోటికి వెళ్ళాను.

"నా ఫోన్ ఉన్నట్టుండి ఆగిపోయింది. వీడియోగేమ్ మధ్యలో ఉన్నాను" అంది నీరసంగా.

నేను పకపకా నవ్వాను.

"కాస్సేపటిదాకా యింట్లో ఏ గాడ్జెట్సూ పనిచేయవు. అమ్మ 'ఎక్స్‌ఫినిటీ అని కొత్త డివైజ్ యిన్ స్టాల్ చేసింది. ఆటోమేటిగ్గా లంచ్‌టైంకీ, డిన్నర్ టైంకీ, ఇంట్లో వున్న ఫోన్లన్నీ ఆగిపోతాయి."

"బాబోయ్!" అరిచింది స్వప్న.

"అంతేకాదు. ఇంట్లో వైఫైని కూడా కూడా అమ్మ ఫోన్‌లో నుంచి కంట్రోల్ చేస్తుంది. అదేకాదు నా ఫోన్‌లో లొకేషన్ ట్రాకింగ్ కూడా వుంది. ఇంకా నా ఇ మెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పాస్‌వర్డ్స్ అన్నీ అమ్మకి తెలుసు" చెప్పాను గడగడా.

"బాబోయ్ ఎలా బతుకుతున్నావే" అంది స్వప్న ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేస్తూ.

"మా సంచరిత మీ అమ్మ అనుకో. నువ్వూ నాలానే బతికేస్తావు. ఇందులో ఆశ్చర్యపడేదేమీలేదు" అన్నాను నవ్వేస్తూ.

మర్నాడు పొద్దున్నే ఐదున్నరకి అలారం మోగడంతో మెలుకువ వచ్చింది. అలారం ఆపి, మొహం మీద పడుతున్న జుట్టుని వెనక్కి తోసుకుంటూ బద్ధకంగా కళ్ళు విప్పాను.

గదిలో పసుపురంగు బెడ్‌లాంప్ వెలుతురు తప్ప యింకేమీ కనిపించడంలేదు. కళ్ళు నులుముకుని చూశాను. కిటికీలో నుంచి మసకచీకటి కనిపించింది.

"అమ్మో! యింత పొద్దున్నే అలారం దేనికి?" నాలో నేను మాట్లాడుకుంటూ ఉండగానే, నా గది తలుపు తెరుచుకుంది. నా గది తలుపుకి లోపలనుంచి గడియవేసుకోవడానికి వీలులేదు. టి.విల్లో, సినిమాల్లో తలుపులు బిగించుకుని అఘాయిత్యాలు చేసుకునే టీనేజ్ పిల్లల స్టోరీలు చూసిన దగ్గర్నుంచి అమ్మ రూల్ పాస్ చేసింది. అందుకే నా గదిలోకి అమ్మ ఎప్పుడంటే అప్పుడు ఎంట్రీ యిచ్చేయగలదు.

"లే!.. లేచి త్వరగా ఫ్రెష్ అయి రా" చెప్పింది అమ్మ.

"ఎందుకమ్మా యింత త్వరగా లేవడం?" అడిగాను చిన్నపిల్లలు.

"ఇంకో అరగంటలో యోగా టీచర్ వస్తుంది."

"ఇంత పొద్దున్నేనా?" అడిగాను ఆశ్చర్యపోతూ.

"ఆ అమ్మాయి యింకా చాలామందికే యోగా నేర్పిస్తుంది. ఆ తర్వాత ఆ అమ్మాయి కాలేజీకి కూడా వెళ్ళాలట"

ఈ టైంకే కుదురుతుందంటే, నేనూ 'సరే' అన్నాను. త్వరగా లేచి రెడీ అవ్వు.

యోగా మాట్స్ నీ మంచంకిందనే వున్నాయి. కానీయ్.. త్వరగా" చెప్పేసి వెళ్ళిపోయింది.

నేను లేచి, మొహం కడుక్కుని, యోగా చేయడానికి వీలుగా కాస్త వదులుగా వుండే పైజమా, కుర్తాలోకి మారేసరికి నా కొత్త యోగా టీచర్ వచ్చింది.

పాఠాలు చెబుతుందని టీచర్ అనాల్సిందేకానీ వయసులో నా కంటే చిన్నగానే వుందా అమ్మాయి. పచ్చటి పసిమి కాకపోయినా, చామనఛాయ కంటే, మెరుగ్గానే వుందామె రంగు. కళ్ళు పెద్దవిగా వున్నాయి.

అవసరానికి మించి యోగా చేస్తుందేమో. మనిషి మరీ సన్నగా వుంది.

"హాయ్! నా పేరు తన్మయి" పరిచయం చేసుకున్నాను.

"చిత్రాంగద. చిత్ర అంటారు" చెప్పి "మొదలు పెడదామా?" అంది వెంటనే.

"చల్లగాలిలో అయితే బావుంటుందేమో. టెర్రస్‌పైకి వెళదామా?" అడిగాను ఉత్సాహంగా.

ఆ క్షణం నా మైండులో తెల్లని కుర్తా, పైజమా వేసుకున్న హీరోయిన్లు కొబ్బరిచెట్లు బ్యాక్ డ్రాప్‌లో యోగా చేస్తున్న సీన్లు వరుసగా కదిలాయి. చిత్ర నన్నోసారి విచిత్రంగా చూసింది. వెంటనే, యోగా మాట్ మీద కూర్చుని, ''ముందు ఈ రెండువేళ్ళతో ముక్కుని పట్టుకోండి'' అంది. చేసి చూపిస్తూ

''హూ! అవమానం నెంబర్ వన్. అస్సలు మన టైప్ కాదు'' గొణుక్కుని చతికిలపడ్డాను. ఏదో రాందేవ్ బాబాజీ పుణ్యమా అని, కొద్దో గొప్పో నాలెడ్జ్ ఉండడంతో చిత్ర చెప్పేది త్వరగానే పట్టేశాను. ఓ పావుగంట ప్రాణాయామం చేయించి, ఆ తర్వాత చిన్న చిన్న ఆసనాలు వేయించింది.

ఒళ్ళంతా రకరకాలుగా మంచి విన్యాసాలు చేయడం మొదటిసారి కావడంతో దీనంగా మొహం పెట్టాను. అయినా చిత్ర సరిగ్గా నలబై నిముషాల తర్వాతే పాఠం విరమించింది.

''హమ్మయ్య'' క్లాసయిపోయిందనగానే, హుషారుగా లేచాను.

''చిత్రా! నీ నెంబర్ యివ్వు. నీకు ఫ్రీ టైమ్‌లో ఫోన్ చేస్తే ఓ.కేగా'' అడిగాను.

చిత్ర యింకోసారి నన్ను విచిత్రంగా చూసింది.

''సారి నాకు అంత టైం ఉండదు'' చెప్పింది ఠక్కున.

''అవమానం నెంబర్ టూ'' నాలో నేనే గొణుక్కున్నాను.

చిత్ర వెళ్ళేటప్పుడు, ''రేపు యిదే టైంకి వస్తానండి'' అని అమంతో చెప్పింది వినయంగా.

''మరీ పొద్దున్నే రావడానికి నీకు యిబ్బంది అయితే, మా డ్రైవర్ని రమ్మని చెబుతాను'' అమ్మ చిత్రతో అంది.

''థ్యాంక్సండీ'' కానీ అవసరంలేదు. మా బావ నన్ను బైక్ మీద దింపుతాడు. వెళ్ళేటప్పటికి వెలుతురు వస్తుంది కాబట్టి, నేను వెళ్ళగలను'' సమాధానమిచ్చింది.

''ఆహా'' కనుబొమలు పైకెగరేశాను.

''మా అమ్మకి పోలికలు మార్చేసి, ఓ యిరవైయ్యేళ్ళు వెనక్కి పంపించి, యోగా టీచర్‌ని చేస్తే, అచ్చం యిలానే వుంటుందేమో'' పైకే అనేశాను.

''శివశంకరీ! శివానంద లహరీ.. శివశంకరీ''

స్వప్న వాళ్ళ హాల్లోకి అడుగుపెడుతూనే, టి.వి సౌండు పెద్దగా వినిపిస్తూవుంది.

"బామ్మా! కాస్త టి.వి సౌండు తగ్గించు. బుర్ర పనిచేయక ఛస్తున్నా" వెనకాలే స్వప్న అరుపులు వినిపించి నవ్వొచ్చింది.

నేరుగా, స్వప్న వాళ్ళ బామ్మ అన్నపూర్ణమ్మగారి గదిలోకి వెళ్ళాను.

ఆ గదిలో గోడకి పెద్ద టి.వి అమర్చివుంది. ఎంత పెద్ద స్క్రీన్ అంటే దాదాపుగా గోడ కనిపించడమే లేదు.

తెరమీద నలుగురు ఎన్.టి.ఆర్‌లు కనిపించారు.

ఒక ఎన్.టి.ఆర్ పాట పాడుతూవుంటే మిగిలిన వాళ్ళు పక్కవాయిద్యాలు వాయిస్తూ వున్నారు.

ఎదురుగ్గా ఒక పెద్ద బండరాయితో ఓ ముసలాయన గడగడా వూగిపోతూ వున్నాడు.

దగ్గరికి వస్తే చెవులు పగిలిపోయేలా వుంది సౌండు. అన్నపూర్ణమ్మగారు ఆ టీవిలో మొహం పెట్టి మరీ చూస్తూ వుంది.

"హమ్మయ్య! నువ్వొచ్చి మంచిపని చేశావు" నన్ను చూడగానే ఊపిరి పీల్చుకుంది స్వప్న.

"బామ్మా! ఇక టి.వి ఆపేయ్. అటు చూడు నీకోసం ఎవరొచ్చారో" అంటూ ఆవిడ చేతిలో రిమోట్ లాక్కుని టి.వి కట్టేసింది.

"అయ్యయ్యో! టి.వి ఆపేశావేమిటే ఇప్పుడు రామారావు గంధర్వగానంతో ఆ రాయిని కరిగిస్తాడే" అంటూ తలతిప్పి చూసిందావిడ.

"తన్మయీ! ఎప్పుడొచ్చావ్" అంటూ నన్ను చూసి చేతులు బార్లా చాపింది.

"ఎలా వున్నావ్ బామ్మా!" అంటూ ముందుకు వంగి ఆవిడ్ని కావలించుకున్నాను.

"ఇదిగో యిలా వున్నాను" అందావిడ నా చెయ్యిపట్టుకుని.

"కొత్త టి.వి 85 ఇంచులట. వారం కిందటే తెచ్చారు. వీళ్ళెవరికీ టి.వి చూసే తీరికలేదు. ఆ ఫోన్లు నొక్కుకుంటూ కూర్చుంటారు. అందుకే నా గదిలో పెట్టించుకున్నాను. బావుందా?" అందావిడ చిన్నపిల్లలా టి.వి వైపుకి చెయ్యి చూపిస్తూ.

బామ్మ మొహం చూసి నాకు నవ్వొచ్చింది. ఆ వయసులో కూడా చిన్నపిల్లలా ఆవిడ చూపించే ఉత్సాహానికి ముచ్చటేసింది కూడా. "చాలా బావుంది బామ్మా" అన్నాను ఆవిడ పక్కనే సోఫాలో కూర్చుంటూ.

"అవునేవ్ స్వప్నా నిన్నో విషయం అడగాలి. ఈ పెద్ద టి.విని చూస్తుంటే నా మనసు పరిపరివిధాలుగా పోతుందే టి.వి ఆపేశాక కూడా దీనిముందే కూర్చుని ప్రార్థన చేయాలనిపిస్తుంది. నువ్వేదో సైకాలజీ అంటుంటావుగా ప్రతిదానికీ అదేంటో చెప్పు" అన్నపూర్ణమ్మగారు అడిగింది.

"ప్రతిమనిషి పసిబిడ్డగా వున్నప్పటినుంచి ఎదుగుతూ వుండే క్రమంలో వాళ్ళకి ఎదురైన సంఘటనలూ, వాటి తాలూకు భావాలూ అన్నీ మెదడులో బలంగా ముద్రపడిపోయి వుంటాయి. నువ్వు చిన్నపిల్లగా వున్నప్పుడు మీ అమ్మో, నాన్నో ఎత్తుకుని వుంటారు నిన్ను. నీకు భయం వేసినప్పుడూ, ఇన్‌సెక్యూర్డ్‌గా అనిపించినప్పుడూ దగ్గరకి తీసుకుని లాలించి వుంటారు.

ఇంకాస్త వయసొచ్చాక గుళ్ళో పెద్ద పెద్ద దేవుడి విగ్రహాల ముందు మోకరిల్లి సేఫ్‌గా ఫీలయ్యి వుంటావు. నీ మనసుకి దగ్గరైనవీ, ఆకారంలో పెద్దవీ కనిపించినప్పుడు నీకు సేఫ్‌గా, హ్యాపీగా అనిపిస్తూ ఉండొచ్చు. అందుకే నీకు దిగులుగా వున్నప్పుడు నీకు ఆ టి.వి ముందు మోకరిల్లాలనిపిస్తుందేమో" చెప్పింది నవ్వుతూ.

"అంటే, నాకు తెలియకుండానే నా మనసులో మా అమ్మా, నాన్నా అలా ఉండిపోయారంటావా?" ఆశ్చర్యపోయింది అన్నపూర్ణమ్మగారు.

"అవును. తల్లి కడుపులో ఉన్నప్పటినుంచే, పిల్లలు తల్లిమాటలు, ఆలోచనలూ వింటూ పెరుగుతారు. తల్లిదండ్రుల ప్రభావం మనమీద చాలా వుంటుంది. వాళ్ళెప్పుడూ ఆలోచనల రూపంలో, భావాల రూపంలో మన మనసులోనే వుంటారు."

స్వప్న మాటలు వింటుంటే, నా మనసులో ఒక ప్రశ్న మెదిలింది.

"ఒకవేళ మా నాన్న బ్రతికి వుండుంటే నేనింకాస్త డిఫరెంట్‌గా వుండేదాన్నా?" పైకే అనేశాను.

వెంటనే, స్వప్న, అన్నపూర్ణమ్మగారూ ఠక్కున నా వైపుకి తిరిగారు.

"అయామ్ సారీ" స్వప్న నా చేతులు పట్టుకుని అంది.

"డోంట్ వర్రీ నాకు మా నాన్న గురించిన గుర్తులేవీ లేవు. అందువల్ల నాకు ఎలాంటి ఫీలింగ్స్ లేవు. అయినా మా అమ్మ ఒక్కటి చాలు. బాబోయ్ షీ ఈజ్ ఆర్ ఓవర్ మై లైఫ్" అన్నాను నవ్వేస్తూ

"స్వప్నా..స్వప్నా"

స్వప్న అన్నయ్య మాధవ్ వచ్చాడక్కడికి.

స్వప్న వాళ్ళకి గ్లాస్‌జార్ ఫ్యాక్టరీ, రైస్ మిల్లులూ ఉన్నాయి. అవన్నీ మాధవన్నయ్యే చూసుకుంటుంటాడు. ఇవికాక రియల్ ఎస్టేట్ బిజినెస్ కూడా చేస్తూ వుంటాడు.

"ఏమ్మా? బావున్నావా?" నన్ను చూస్తూనే పలకరించాడు.

"స్వప్నా! ఆ అబ్బాయి వచ్చినప్పుడన్నా కాస్త ఆ టి.వి పెట్టకుండా ఉండేట్టు చూడు" విసుగ్గా చెప్పి, మళ్ళీ ఆఫీస్ రూంలోకి వెళ్ళిపోయాడు.

"అబ్బాయి? ఉహూ ఏమిటి సంగతి?" కనుబొమలు ముడివేసి స్వప్నకేసి చూశాను.

"ఇవాళ అమ్మా, నాన్నలని కలవడానికి తనీష్ వస్తున్నాడు. స్వప్న సిగ్గుపడుతూ చెప్పింది.

"ఆ అబ్బాయిని హైదరాబాదులో ప్రేమించిందంట. వారం నుంచి యింట్లో ఈ విషయం మీదే శషభిషలు. చివరికి మావాడే మెత్తబడి, ఆ అబ్బాయిని రమ్మన్నాడు. మాట్లాడతానంటున్నాడు" పూర్తి వివరం అన్నపూర్ణమ్మగారు చెప్పింది.

"ఇంత పెద్ద విషయం నాకు చెప్పకుండా దాచావా? ఇతనా బడా ధోకా" అన్నాను కోపం నటిస్తూ.

"అందుకేగా యివాళ నీ డిన్నర్ మా యింట్లో అని పట్టుబట్టి పిలిచాను. తనీష్ ఎలా వున్నాడో చూసి చెప్పు" అంది నవ్వుతూ.

"స్వప్నా! నువ్వింకా రెడీ కాలేదా? స్వప్నా వాళ్ళ అమం విశాల స్వప్నని చూస్తూనే కంగారుగా అరిచింది.

"తన్మయీ! నువ్వన్నా కాస్త తొందరపెట్టమ్మా" నాకు చెప్పి హడావుడిగా ఎలా వచ్చిందో అలానే వెళ్ళిపోయింది.

ఆవిడ పనివాళ్ళనీ, వంటవాళ్ళనీ హడవుడీ పెడుతున్న తీరుని చూస్తుంటే, తనీష్‌ని బాగా యాక్సెప్ట్ చేసేసిందని అర్థమైంది. స్వప్న ఆంటీకి తనీష్ గురించి ఏం చెప్పిందో తెలియదుకానీ ఖచ్చితంగా డబ్బున్నవాళ్ళు మాత్రం అయివుంటారు.

**"తనూ!** బ్యూటీషియన్ వచ్చినట్టుంది. నువ్వు కాసేపు బామ్మ దగ్గరే వుండు. నేను రెడీ అయివస్తాను" అని,

"బామ్మా! నీ గదంతా నీట్‌గా సర్దాను. మందులు టైంకి నేను వచ్చి యిస్తాను. ఈలోపే, ఎక్కడ పెట్టానబ్బా. అనుకుంటూ అలమరలన్నీ పీకి పెట్టకు" అన్నపూర్ణమ్మగారికి చెప్పి వెళ్ళిపోయింది.

స్వప్న తయారై వచ్చేలోపల, అన్నపూర్ణమ్మగారు కూడా తేలికగా వుండే గద్వాల్ చీరకట్టి మామూలు కళ్ళజోడు తీసి, బంగారం ఫ్రేం వున్న కళ్ళజోడు పెట్టి తయారయ్యింది.

అనుకున్నట్టుగానే, ఏడుగంటలకల్లా తనీష్ వచ్చాడు. తెల్లగా, పొడుగ్గా చూడడానికి అందంగా వున్నాడు. పాలిష్డ్‌గా, చాలా నీట్‌గా కూడా వున్నాడు. బ్లాక్ కలర్ బ్లైజర్, చేతికి పెట్టుకున్న బ్రాండెడ్ వాచ్ చూస్తుంటే, ఫార్మల్ మీటింగ్‌కి బాగా ప్రిపేరయి వచ్చాడనిపించింది.

"బావున్నాడు" స్వప్న చెయ్యిగిల్లి చెప్పాను.

"జెల్‌తో క్రాఫుని బాగా సెట్ చేశాడు. పర్ఫెక్ట్ జెంటిల్‌మాన్ లుక్స్ వున్నాయి" అన్నాను నవ్వుతూ.

అతను బామ్మగారిని చూస్తూనే, వంగి కాళ్ళకు దణ్ణం పెట్టాడు. అక్కడే, సగం మార్కులు కొట్టేశాడు.

మాధవన్నయ్య, స్వప్న వాళ్ళ నాన్న శ్రీనివాసరావుగారూ, తనీష్‌ని దాదాపుగా రౌండప్ చేశారు.

ప్రశ్నలతో అతన్ని అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నారు.

స్వప్న, తనీష్ పక్కనే కొద్దిగా ఎడంగా, అదే సోఫాలో కూర్చుని వుంది. బంగారు రంగు పూవులూ, తీగెలూ ఉన్న లేత నారింజ రంగు గాగ్రాలో మెరిసిపోతూ వుంది. ఆ మెరుపు ప్రత్యేకంగా చేసుకున్న అలంకరణవల్లో, నగల వల్లోకాదు. ఆగకుండా మొహం మీద పుస్తున్న నవ్వుల పువ్వుల వల్ల. నాతో మాట్లాడుతున్నట్టే వున్నా, మధ్య మధ్యలో ఓరకంట తనీష్‌ని చూస్తూ, అతని యిబ్బందిని చూసి ముసి ముసిగా నవ్వుతూ వుంది.

స్వప్న ఎప్పుడూ సంతోషంగానే వుంటుంది. కానీ, యింత సంతోషంగా ఉండడం మాత్రం యిదే మొదటిసారి నేను చూడడం.

స్వప్నే కాదు. యింట్లో అందరూ సంతోషంగా కనిపించారు నా కళ్ళకి. కాస్సేపు, కబుర్లు అయ్యాక డిన్నర్‌కి లేచారంతా. భోజనానికి కూర్చోబోతుండగా, "స్వప్నా! సందీప్ ఒక్కడే ఆఫీస్ రూంలో ఉన్నాడు. అతన్ని కూడా బోజనానికి పిలువు" స్వప్న వైపు చూసి చెప్పాడు మాధవన్నయ్య.

"సందీప్"

ఆ పేరు వినగానే, ఒక్కసారిగా మెదడులో న్యూరాన్లన్నీ వెలిగాయి నాకు. "నువ్వు కూర్చో. నేను పిలుచుకుని వస్తాను" స్వప్నని ఆపి నేను లేచాను.

మాధవన్నయ్య వాళ్ళ ఆఫీసు రూంకి యింటివైపు నుంచి ఒక తలుపు వుంది. తనీష్ వస్తున్నాడన్న హడావుడిగా తలుపు సరిగ్గా వేసినట్టులేదు. కొద్దిగా వారగా తెరిచేవుంది.

నేను కావాలనే, హడావుడిగా గలగలలాడుతూ వెళ్ళకుండా, నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళాను.

చిన్నగా తలుపుని తోసి, తల మాత్రం లోపలికి దూర్చాను.

ఎదురుగా వున్న గోడకి, కాస్త అవతలగా ఖాళీగా వున్న ఓ రివాల్వింగ్ ఛెయిర్, దానిముందు ఒక బల్ల కనిపించాయి.

కళ్ళని పక్కకి తిప్పుతూనే, పొడుగాటి బ్లాక్ కలర్ లెదర్ సోఫాలో, ఒళ్ళో లాప్‌టాప్ పెట్టుకుని కనిపించాడు సందీప్.

వెంటనే నా కళ్ళు అతన్ని కిందనుంచి పైకి స్కాన్ చేసేశాయి. అంచులు చిరిగిపోయి వున్న జీన్స్ పాంటు, నేలని బిగబట్టి వున్న పెద్ద పాదాలు, అలసిపోయిన మొహం. కానీ కళ్ళు మాత్రం చురుగ్గా, దీక్షగా పనిచేస్తున్నట్టు కనిపించాయి.

"అన్నీ ఫర్వాలేదు. కానీ ఆ మొహం మాత్రం ఎప్పుడూ సీరియస్‌గా వుంటుందెందుకో" పైకే గొణిగాను.

అతను చటుక్కున తలెత్తి నా మొహంలోకి చూశాడు.

అతన్నే ఆసక్తిగా గమనిస్తున్నట్టున్న నా పెద్ద పెద్ద కళ్ళు. తొంగి చూస్తున్నట్టున్న నా మొహం.

గడియ పట్టుకుని వేలాడుతూ విచిత్రంగా వున్న నా బాడీపోశ్చర్. అన్నీ గుర్తుకువచ్చి ఠక్కున నిటారుగా నిలబడ్డాను. నెమ్మదిగా, గొంతు సవరించుకుని, సందీప్ దగ్గరికి వెళ్ళి నిలబడ్డాను. పైకి మనిషిని బాగానే కనిపిస్తున్నా. లోపల మైండులో మాత్రం ఒకటే కంగారుగా వుంది నాకు.

"తనూ. బీ కేర్‌ఫుల్. నో నెర్వస్ టాక్. సరిగ్గా మాట్లాడు. సరేనా?" అంతరాత్మ లోపల్నుంచి హెచ్చరించింది. "సరే" దానికి జవాబుగా నేను పైకే అరిచాను. అతను నావైపోసారి విచిత్రంగా చూసి మళ్ళీ లాప్‌టాప్‌లోకి తలదూర్చబోతుంటే,

"ఆగు నిన్ను భోజనానికి పిలుస్తున్నారు" ఠక్కున చెప్పాను.

అతను ఆశ్చర్యంగా చూశాడు.

"నన్నేనా?"

"అవును" చెప్పాన్నేను.

"చాలా లేటయినట్టుంది. నేను వెళతాను" లాప్‌టాప్ మూసేసి లేచి నిలబడుతూ అన్నాడు.

"హలో ! మరి నేనెందుకు వచ్చాననుకుంటున్నావు?" అడిగాను బింకంగా. అతను నిర్లక్ష్యంగా చూశాడు.

"ఇప్పుడు నువ్వు రానంటే, మాధవన్నయ్య వచ్చి నిన్ను బతిమాలాలి. కాబోయే అల్లుడికన్నా నీకు ఎక్కువ యింపార్టెన్స్ యిచ్చినట్టు కనిపించాలి. నీ ఐడెంటిటీ కోసం యింత డ్రామా అవసరమా?" అన్నాను అతనివైపు చూస్తూ.

అతను నా వంక కోపంగా చూశాడు.

"ఛ! అనవసరంగా పిచ్చివాగుడు వాగేశావు" అంతరాత్మ లోపల్నుంచి గిల్లింది.

"పద! అందరూ వెయిట్ చేస్తున్నారు" అంటూ నాలుగడుగులు వేసి వెనక్కి తిరిగాను.

"అతను విచిత్రంగా చూస్తున్నాడు. నెర్వస్‌గా ఉన్నానని తెలిసిపోతుందా?" నాలో నేనే అనుకున్నాను.

"ఏమన్నా అన్నావా?" ఈసారి అతను అడిగాడు.

"నేనా?" లేదే ఇంకా బతిమాలాలా? రావచ్చుగా"

"అవును. నువ్వు పక్కకి జరిగితే వెళ్ళొచ్చు" అన్నాడు కనుబొమలతో డోర్‌ని చూపిస్తూ. అప్పుడు చూసుకున్నాను నేను సరిగ్గా తలుపుకి అడ్డంగా అతనివైపుకి తిరిగి నిలబడివున్నాను.

"ఓకే. లెట్స్‌గో" అంటూ డోర్ హేండిల్ పట్టుకుని తోశాను.

ఎంతకీ తలుపు తెరుచుకోలేదు. అతను ముందుకి వంగి తలుపు తీసే ప్రయత్నం చేశాడు. నాకు అర్థమై, నా చేయి వెనక్కి తీసుకునేలోపే, యిద్దరి చేతివేళ్ళూ కలుసుకున్నాయి.

"సారీ" గబుక్కున నా చేయి వెనక్కి లాక్కున్నాను.

"ఇది యిలా లాగాలి" తలుపుని లోపలివైపుకి తీస్తూ అన్నాడు. కంగారులో నేను వేరే వైపుకి లాగుతున్నానని అర్థమైంది అప్పటికి. నేను వెళ్ళేదాకా డోర్ పట్టుకుని నా వెనకాలే వచ్చాడు సందీప్.

మేం వెళ్ళేసరికే అంతా భోజనాలు మొదలు పెడుతున్నారు. డైనింగ్ టేబుల్ దగ్గర రెండు కుర్చీలు మాత్రమే ఖాళీగా వున్నాయి. మాకోసం అదీ.. పక్కపక్కనే.

"పప్పు, ఆవకాయ, రసం, పెరుగు వడలు, బటర్ నాన్స్, పన్నీర్.."

"వావ్! ఆంటీ భలే ఎరేంజ్ చేశారు" ఉత్సాహంగా అంటూ కుర్చీలో కూర్చున్నాను.

"నాన్స్ మన వనజేనా చేసింది? మౌత్ మెల్టింగ్" ఓ ముక్క తుంచి నోట్లో పెట్టుకుంటూనే అన్నాను.

నేనిలా అంటుండగానే నా చేతిమీద ఏదో పాకినట్టు అనిపించింది. నేను కెవ్వున అరిచేలోపు నా చేతిని గట్టిగా పట్టుకున్నాడు సందీప్.

"వాళ్ళకి మాట్లాడుకోవడానికి వుంది కొద్ది సమయమే. వాళ్ళకి ఛాన్సు యివ్వు" సందీప్ నా చెవి దగ్గరకి వంగి చెప్పాడు.

నిజమే నాకు తట్టలేదు.

ఇందాక పాకిన పురుగు ఈయనగారి చేతివేళ్ళేనన్నమాట అనుకుని నవ్వుకుంటూ ప్లేటు కెలుకుతూ కూర్చున్నాను.

మాధవన్నయ్య, శ్రీనివాసరావుగారూ క్యాజువల్‌గా మాట్లాడుతున్నట్టే, తనీష్ వద్దనుండి యిన్ఫర్మేషన్ రాబడుతున్నారు.

స్వప్న తింటున్నట్టు నటిస్తూ ఉందంతే.

ధ్యాసంతా వాళ్ళ సంభాషణల మీదే వున్నట్టు మొహం చూస్తేనే చెప్పేయొచ్చు.

నేను ఓరకంట సందీప్ వైపు చూశాను.

అతని మొహం చూస్తే, సంతోషంగా ఉన్నట్టు కానీ, యిబ్బంది పడుతున్నట్టు కానీ అనిపించలేదు. అలాగే నాతో మాట్లాడేటప్పుడు కనిపించే చిరాకూ, అసహనం కూడా లేదు.

భోజనాలయ్యాక స్వప్న వాళ్ళ నాన్నగారూ, మాధవన్నయ్య తనీష్‌ని తీసుకుని మేడమీదకి వెళ్ళారు.

"ఇప్పుడు అంకుల్ రెండు పెగ్గులు తీసుకుంటూ, తనీష్‌తో స్పెషల్‌గా మాట్లాడతారు"కదూ స్వప్న కేసి కన్నుగీటుతూ అన్నాను.

అప్పుడే, సందీప్ ఆఫీస్ రూం వైపుకి మెళుతూ కనిపించాడు.

"ఒక్క నిముషం యిప్పుడే వస్తాను" అంటూ డిసర్ట్ ట్రే తీసుకుని అతని వెనకాలే వెళ్ళాను.

"అప్పుడే వెళ్ళిపోతున్నావా?" అంటూ అతనికి ఎదురుగా వెళ్ళి నిలబడ్డాను.

"అసలేంటి నీ ప్రాబ్లం?" ఈసారి అతని చిరాకు మాటల్లో కనిపించింది.

"నిన్ను నేను మర్యాదగా భోజనానికి పిలుచుకు వెళ్ళాను. నువ్వు కనీసం మాట వరసకైనా, యింత రాత్రప్పుడు ఒంటరిగా ఎలా వెళతావు? అని అడగలేదు"

బైట ఎంత చీకటిగా వుందో అతనికి అర్ధం కావాలన్నట్టుగా కళ్ళు పెద్దవి చేసి మరీ, కిటికీలో నుంచి తొంగి చూశాను.

"నాకు టూ వీలర్ లేదు. టూ మంత్స్ బాకీ మూడోసారి యాక్సిడెంట్ చేశానని, అమ్మ దాన్ని యినప సామాన్లవాడికి అమ్మేసింది. కారు తీసుకుని రాలేదు. ఈ టైంలో ఎవర్ని దించమని అడుగుతాను? తనీష్‌తో బిజీగా వున్నారంతా" పోస్లే ఒక్కదాన్నే ఆటోలో వెళ్ళిపోతాను.

"అదృష్టం బావుంటే, యిల్లు చేరతాను" అన్నాను డ్రామా క్వీన్‌లాగా.

"సరే.. పద" అన్నాడతను పొడిగా.

"ఉండు. ఈ ఇంగ్లీష్ ట్రైఫిల్ తినేసి వెళదాం" అన్నాను ఉత్సాహంగా ట్రేని ఎత్తి చూపిస్తూ.

"సరే. త్వరగా తినేసిరా" అన్నాడతను విసుగ్గా.

"ఇది మా యిల్లు కాదు. ఇవి మా యింటి వంటకాలు కానేకావు. కాబట్టి, నువ్వు ఎక్స్‌ట్రా చిరాగ్గా ఉండక్కర్లేదు. తినొచ్చు." అంటూ ట్రైఫిల్ బౌల్‌ని అతని చేతిలో పెట్టాను.

నిజానికి, ఆ మాట అంటున్నప్పుడు నాకే బాధేసింది. సందీప్ మాధవన్నయ్య దగ్గర పనిచేస్తున్నాడు. అతన్ని వాళ్ళింట్లో అందరూ అతన్ని గౌరవంగా చూస్తారు.

కానీ, సందీప్ వాళ్ళ నాన్న మా యింట్లో చేతులు కట్టుకుని నిలబడతాడు.

ఇక అతనికి మా మీద గౌరవం ఎలా వుంటుంది? అతనేమనుకున్నాడో నాకు తెలియదు. కానీ, నేనిచ్చిన బౌల్‌ని మాట్లాడకుండా అందుకున్నాడు.

నా ముందు నిలబడడానికి, యిబ్బంది పడుతున్నట్టుగా, బాల్కనీలోకి నడిచాడు.

అతన్ని యిబ్బంది పెట్టడమే నా ధ్యేయంగా నేనూ అతని వెనకాలే వెళ్ళాను.

బాల్కనీలో వరుసగా క్రోటన్ మొక్కల కుండీలు పెట్టివున్నాయి. నా దుపట్టాని వాటికి తగలకుండా తప్పిస్తూ వెళ్ళి అతని పక్కనే రైలింగ్‌ని ఆనుకుని నిలబడ్డాను.

ఎండాకాలం పోయి, యింకా వానలు మొదలుకావడానికి మధ్యగా ఉన్న రోజులేమో, వాతావరణం చల్లగా, హాయిగా వుంది.

''ఇవాళ వెదర్ చాలా బావుంది కదూ'' నిర్మలంగా వున్న ఆకాశంవైపు చూస్తూ అతనితో మాట కలిపాను.

అతను మాట్లాడలేదు.

బౌల్‌లోని తెల్లని విప్పింగ్ క్రీంని, ఎర్రటి స్ట్రాబెర్రీస్‌తో కలిపేపనిలో బిజీగా వున్నాడు. గబగబా తినేస్తే, ''త్వరగా యింటికెళ్ళిపోవచ్చు'' అన్నట్టుంది అతని వాలకం.

''రోజూ ఈ టైందాకా వర్క్ చేస్తావా?'' అడిగాను.

''పనిని బట్టి'' క్లుప్తంగా వచ్చింది జవాబు.

''ఇంకా, క్రికెట్ బెట్టింగ్‌లు కడుతున్నావా?''

అతను చివాలున తలెత్తి నా వైపు చురుగ్గా చూశాడు.

''అవును ఆ లాప్ టాప్ కూడా ఆ డబ్బులతో కొన్నదే నీకేమైనా అభ్యంతరమా?'' కోపంగా అన్నాడు.

''తనూ! ఒక గంట క్రితం అతనితో మాట్లాడాలంటేనే తడబడిపోయావు. ఇప్పుడు చూడు. ఎంత ఓవర్‌గా మాట్లాడుతున్నావ్''

అంతరాత్మ చెవిలో దూరి అరిచింది.

''సరే..సరే'' దానికి జవాబు చెప్పి, సందీప్ వైపుకి తిరిగాను.

''అంటే ఒకసారి మీ నాన్న నువ్వు బెట్టింగులు కడతున్నావని బాగా తిట్టినట్టున్నారు. ఇంకా ఓ పూట జైల్లో కూడా వుండి వచ్చావని గుర్తు. ఆ దెబ్బతో అన్నా మానేశావేమో అని అడిగాను''

సందీప్ వెంటనే, చేతిలోని బౌల్ బల్లమీద పడేసి, లాప్ టాప్ తీసుకుని గబగబా కదిలాడు.

''కోపం వచ్చినట్టుంది గురువుగారికి'' అనుకుంటూ

''సందీప్! వస్తున్నా! ఆగు'' అంటూ చేతిలోని బౌల్‌ని ఉన్నచోటే కిందపెట్టేసి, అతని వెంట పరుగుతీశాను.

"ఓ.కే అయామ్ సారీ. పద వెళదాం" సందీప్ ఎదురుగా నిలబడుతూ అన్నాను.

అతను మాట్లాడకుండా వెళ్ళి, బైక్ స్టార్ట్ చేశాడు.

నేను గబుక్కున ఎక్కి కూర్చున్నాను.

"స్పేర్ హెల్మెట్ లేదా?"

నేను అడుగుతూనే అతను ఠక్కున తీసి యిచ్చాడు.

"అలవాటుగా ఎవర్నో బైక్ ఎక్కించుకుని తిప్పుతున్నాడన్నమాట" నవ్వొచ్చింది నాకు.

"ఆగు" బైక్ కాస్త దూరం వెళ్ళగానే సందీప్ భుజం మీద గిచ్చాను. అతను బండి పక్కకి ఆపి, వెనక్కి తిరిగాడు.

"నీకు వినిపించదేమోనని గిచ్చానంతే. నాకిక్కడ ఓ చిన్న పని వుంది. ఫైవ్ మినిట్స్ వెయిట్ చెయ్యి. ప్లీజ్" హెల్మెట్ తీస్తూ చెప్పి, ఎదురుగా వున్న ప్రొవిజన్స్ స్టోర్ వైపుకి పరుగు తీశాను.

ఓ పదినిమిషాల తర్వాత, సంచి నిండుగా చాక్లెట్లు, బిస్కెట్లు, వేరుశెనగ ఉండలు వేసుకుని వచ్చాను.

"అయ్యిందా?" బైక్ స్టార్ట్ చెయ్యబోతూ అడిగాడు.

"ఆ!c మా అమ్మ ఓ కొత్త యోగా టీచర్‌ని పెట్టింది. మరీ పొద్దున్నే వచ్చేస్తుంది. నాకేమో నిద్రలేస్తూనే ఆకలేస్తుంది. ఆ యోగా అయ్యేలోపు నీరసం వస్తుంది. ఇవి నా రూంలో అమ్మకి తెలియకుండా దాచేస్తా. చిత్ర వచ్చేలోపు కొంచెం 'పేట్ కీ పూజ' అయిపోతుంది.

"ఇంతకీ చిత్ర అంటే ఎవరో తెలియదు కదూ. నా యోగా టీచర్ పేరు చిత్ర. నీలాగే చాలా సీరియస్. అస్సలు నవ్వదు" గడగడగా చెప్పుకుపోతున్నాను.

అతను తదేకంగా నా మొహంలోకే చూస్తూ వున్నాడు. ఉన్నట్టుండి నాకో విషయం గుర్తుకొచ్చింది.

"చిత్ర అంటే మీ చుట్టాలమ్మాయి కదూ. నేను పదోక్లాసులో ఉన్నప్పుడు వాళ్ళు ఈ వూరికి వచ్చారేమో కదా" నేను చేసిన పొరబాటు అర్థమైంది.

"ఆ అమ్మాయి మంచిదే మరీ పొద్దున్నే వచ్చి నిద్రలేపుతుందని అలా అన్నానంతే. సారీ..సారీ" కంగారుగా చెప్పి, బైకెక్కి కూర్చున్నాను. కాసేపటికి, బైక్‌ని మా యింటి ముందు ఆపాడు.

"థాంక్యూ" దిగుతూనే చెప్పాను.

"ఫర్వాలేదు" చెప్పి బైక్ స్టార్ట్ చెయ్యబోయాడు.

అయినా, అక్కడ్నుంచి కదల్లేదు నేను. తెల్లని దుప్పటా కింద చేతివేళ్ళని నులుముకుంటూ అలాగే నిలబడిపోయాను.

"ఇంకేంటి?" అతను నావైపు తిరుగుతూ అడిగాడు.

"ఒక విషయం అడుగుతాను. నిజం చెప్తావా?" అతని మొహంలోకి చూసే ధైర్యం లేక కళ్ళు కిందకి వాల్చేస్తూ అడిగాను.

"ఏంటి?"

నేను ఒక్క క్షణం ఆగాను. ఒక్కసారిగా చుట్టూ నిశ్శబ్దం ఆవరించినట్టనిపించింది నాకు. రోడ్డు మీద జనాలెవ్వరూ లేరు.

అతను నేనేం చెబుతానా? అని నా మొహంలోకే చూస్తున్నాడు.

నా గుండె చప్పుడు నాకే వినిపిస్తూ వుంది. సూటిగా అతనివైపు చూసి అడగలేకపోయాను.

"సారీ. ఏం అడగాలనుకున్నానో మర్చిపోయాను" అన్నాను తడబడిపోతూ. అతను నావైపు అదోలా చూసి, బైక్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోగానే, మనసంతా స్తబ్దుగా అయిపోయింది. ఇంకొంచెంసేపు అతనితో గడిపితే బావుండనిపించింది. "నేను సందీప్‌ని యిష్టపడుతున్నానా?"

అవుననే చెప్పింది మనసు.

హాండ్‌బాగ్‌లో నుంచి, స్పేర్ తాళం తీస్తుండగా లోపలనుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"అచ్చా! కోయీ బాత్ నహీ!

మై రఖతీ హూ" హిందీలో అమ్మ ఫోన్‌లో మాట్లాడుతూ వుంది. ఆ ఫోన్ గుజరాత్ నుంచి అని అర్థమైంది నాకు. ఎందుకంటే మా నాన్న గుజరాతీ. బహుశా నాన్న తాలూకు చుట్టాలెవరన్నా ఫోన్ చేసి వుంటారు. మా నాన్నని నేనెప్పుడూ చూడలేదు. నాకు ఊహ తెలియకముందే నాన్న ఈ లోక వదిలి వెళ్ళిపోయాడు. కనీసం ఫోటోలో కూడా ఆయన మొహం నేను ఎరగను.

టి.వి సీరియల్స్‌లో చూపించినట్టు, నాకు కూడా గుజరాత్‌లో ఓ దాదా, దాదీ, ఓ పెద్ద ఫ్యామిలీ వుందేమో నాకు తెలియదు. నేనెప్పుడూ గుజరాత్ కి వెళ్ళలేదు సరికదా, ఆ భాష మాట్లాడేవాళ్ళు మా యింటికి రావడం కూడా చూడలేదు. ఎప్పుడన్నా, ఓసారి యిలాంటి ఫోన్ మాత్రం వస్తుంది. అమ్మ రెండు నిమిషాలు మాట్లాడి పెట్టేస్తుంది.

చిన్నప్పుడు, నాకు కూడా నాన్న, బామ్మ తాతయ్యలాంటి వాళ్ళు ఉన్నారా? అన్న సందేహాలే రాలేదు.

ఆ సందేహం వచ్చే వయసుకి ఒక్కసారన్నా వాళ్ళు మనకోసం రాలేదంటే వాళ్ళు మనకి లేనట్టే'' అన్న తెలివి వచ్చింది.

''కానీ యివన్నీ ఆలోచించి కూడా ప్రయోజనం లేదు'' నిట్టూర్చి, తలుపు తీశాను.

లోపలికి వచ్చేసరికి, చేతిలో సెల్‌ఫోన్‌తో సోఫాలో కూర్చుని కనిపించింది అమ్మ.

''నీకు ఫోన్ చేద్దామనే చూస్తున్నాను. చాలా లేటయ్యింది. ఎవరు డ్రాప్ చేశారు?'' అడిగింది నన్ను చూస్తూనే.

''సందీప్ బైక్ మీద డ్రాప్ చేశాడు'' చెప్పాను.

సందీప్ పేరు చెప్పినప్పుడు అమ్మ మొహంలో ఎటువంటి రియాక్షనూ లేదు. ఎన్ని రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ వున్నా, అంతే నమ్మకం కూడా వుంది అమ్మకి నా మీద.

ఇప్పటివరకు నేను అమ్మకి అబద్ధం చెప్పలేదు.

నేను అమ్మ దగ్గర ఏ విషయమూ దాచనని అమ్మకి కూడా తెలుసు.

''షాపింగుకి వెళ్ళాలి. లంచ్ చేసి రెడీగా వుండు'' స్వప్న ఫోన్ చేసింది. గబగబా రాజ్యంగారు చేసిన సాంబారుతో, రెండు ముద్దలు నోట్లో కుక్కుకుని ఆదరాబాదరాగా రెడీ అయ్యి, స్వప్న కోసం వెయిట్ చేస్తూ కూర్చున్నాను.

స్వప్న ఎంతకీ రాలేదు.

ఎప్పుడనగా ఫోన్ చేసిన మనిషి? ఇప్పటివరకూ పత్తాలేదు. గేటు బైటకి వచ్చి అసహనంగా అటూ, యిటూ తిరుగుతూ వున్నాను.

ఇంతలో వెనకనుంచి ఏదో వచ్చి నా ఎడమకాలి మడమమీద 'ఠప్' మని తగిలింది. కాలిలో నరం జివ్వుమంది.

''అబ్బా!'' కాలు పైకి ఎత్తివేస్తూ వెనక్కి తిరిగి చూశాను.

ఎర్రటి క్రికెట్ బాల్. కాస్తదూరంలో పడివుంది.

ఇంతలో ఒకతను పరిగెత్తుతూ నా వైపుకి వచ్చాడు.

''హే! తన్మయీ'' చూస్తూనే గుర్తుపట్టి పిలిచాడు నన్ను.

''వెంకట్'' అతని గొంతు వినగానే నేనూ గుర్తుపట్టాను.

''ఎలా వున్నావ్?'' చాలా సంవత్సరాలైంది నిన్ను చూసి'' అంటూ వంగి బాల్‌ని అందుకోబోయాడు.

అతనికంటే ముందే, నేను చటుక్కున వంగి, ఆ బాల్‌ని అందుకున్నాను.

"దీన్ని మాత్రం యివ్వను" అన్నాను చేత్తో బాలుని వెనక్కి దాచేస్తూ.

"అన్నా! త్వరగా బాల్ తీసుకురా" అంటూ వెనుకనుంచి పిల్లలు అరుస్తూ వున్నారు.

"నీకు దెబ్బతగిలినట్టుంది కదా! అయామ్ సారీ" అన్నాడు నన్ను కూల్ చేయడానికి ప్రయత్నిస్తూ.

"అలా రా దారికి" అంటూ బాల్‌ని యిచ్చేయబోతున్నదాన్నల్లా వెనుకనుంచి సందీప్ రావడం చూసి ఆగాను.

చెమటకి తడిసి ఒంటికి అంటుకున్న టీషర్ట్ కాలర్‌ని పైకి ఎగరేస్తూ పరుగులాంటి నడకతో వస్తూ వున్నాడు.

ఎదురెండకి అతని కళ్ళు చిన్నవిగా అయిపోయాయి. మెడ కండరాల మీదనుంచి ధార కట్టిన స్వేదాన్ని చేత్తో రుద్దుకుంటూ మా దగ్గరికి వచ్చి ఆగాడు.

ఒక్క క్షణం ధృఢంగా ఉన్న అతని చేతులమీద, పొడవాటి అతని చేతివేళ్ళ మీద నా చూపులు ఆగాయి.

"ఏంటి యిష్యూ. బాలు ఏది?" అడిగాడతను ఆయాసపడుతూ.

నేను కావాలనే, నా చేతిలో బాల్‌ని అతనికి కనిపించేలా పైకి ఎగరేసి పట్టుకున్నాను.

"ఈ బాల్‌తో ఎవరి తలైనా పగలకొడితే ఎక్కువ డబ్బులు యిస్తామన్నారా?" అన్నాను సందీప్ వైపుకి చూస్తూ వెటకారంగా.

సందీప్ నా వైపు కోపంగా చూసి ఏదో అనబోతూ వుంటే వెంకట్ ఆపాడు.

**"పాపం** తన్మయి కాలికి దెబ్బ తగిలిందిరా" చెప్పాడతనితో.

"తన్మయీ మేమూ పెద్దవాళ్ళం అయ్యాం బెట్టింగుల్లాంటివి ఎప్పుడో మానేశాం. నువ్వు యిలాంటివాటికి దూరంగా వుండమని నాకు క్లాస్ పీకి వెళ్ళాక, ముఖ్యంగా సందీప్‌ని దూరంగా వుంచమని నాకు మరీ మరీ చెప్పిన తర్వాత.. నువ్వు చెప్పావని వాడితో చెప్పాను.

వాడు అప్పుడే యిలాంటివన్నీ మానేశాడు. ఇప్పుడంతా క్లియర్ అయినట్టేనా? ఇక బాల్ యివ్వు" అన్నాడు యిద్దరివంకా చూసి నవ్వుతూ.

పట్టుబడ్డ దొంగల్లా అయ్యింది మా ఇద్దరి పరిస్థితి.

ఈ వెంకట్ అప్పటికీ, యిప్పటికీ ఏం మారలేదు. భలే యిరుకున పెట్టేస్తాడు మనుషుల్ని.

"సందీప్ నిజంగానే నేను చెప్పాననే మానేశాడా?"

నా ప్రశ్నకి జవాబు తెలుసుకోవాలని సూటిగా అతని కళ్ళలోకి చూశాను. కానీ అతను నాకా అవకాశం యివ్వలేదు.

ఠక్కున నా చేతిలోని బాల్‌ని లాగేసుకుని "పదరా!" అంటూ వెంకట్‌తో పాటు వెనక్కి తిరిగాడు.

ఒక్క క్షణం నిరాశగా అనిపించింది. అతన్ని వెనకనుంచి చూస్తూ అలాగే నిలబడిపోయాను.

"హలో"

ఎప్పుడు వచ్చిందో స్వప్న వెనుక నుంచి నా భుజం మీద చెయ్యివేస్తూ పిలిచింది.

"అబ్బా" వెనక్కి తిరగబోతూ, బాధగా మూలిగాను.

"ఏమైంది?" అడిగింది కంగారుగా.

"ఎడమకాలి మడమకి దెబ్బ తగిలింది. చిన్న దెబ్బేలే" అన్నాను నవ్వే ప్రయత్నం చేస్తూ.

"పోనీ, షాపింగ్ యింకోరోజు చేద్దాంలే" అంది స్వప్న కంగారుపడిపోతూ.

"చిన్న దెబ్బే. అదే ఒక యాంగిల్‌లోనే నొప్పి పుడుతుంది. ఐ కెన్ మేనేజ్. పద" అన్నాను ధైర్యంగా.

ఇద్దరం షాపింగ్‌కి బయల్దేరాం. ఒక రెండు గంటలు గడిచినా మా షాపింగ్ పూర్తికాలేదు. సిటీలో షాపింగ్‌కి అలవాటుపడ్డ మాకు, ఆ చిన్న టౌన్‌లో షాపింగ్ చేయడం కష్టంగానే తోచింది.

చివరిలో, ఎలాగే ఓ నాలుగు చుడీదార్‌లు సెలెక్ట్ చేసింది స్వప్న.

ఆ తర్వాత స్వప్న వాళ్ళ బామ్మకి చీరలు కొనే పనిలోపడ్డాం. నాలుగు షాపులు తిరిగినా, నాణ్యమైనవీ, నచ్చినవీ దొరకలేదు.

"పోనీ బామ్మ షాపింగ్ ఆంటీని చెయ్యమనరాదూ" అన్నాను విసుగుపుట్టి.

"ఇంకా నయం. మా అమ్మ చీరలు కొన్నదంటే, అవి చిరిగిపోయి పీలికలైపోయేదాకా, అవి మోకుల్లాగా వున్నాయనీ, ముడుచుకుపోతున్నాయనీ నసపెట్టి చంపేస్తుంది మా బామ్మ. ఎంతైనా అత్తగారు కదా!.

అందుకే బామ్మకి చీరలు కొనే డ్యూటీ నాది. నిజానికి యివాళ బామ్మకోసం షాపింగ్ చేద్దామనే బయలుదేరాను. ఆవిడ పేరు చెప్పి నేను కొనుక్కుంటున్నాను" అంది స్వప్న నవ్వుతూ.

నాకు మాత్రం నవ్వు రాలేదు.

"దేవుడా! యింకా తిరగాలి కాబోలు" అనుకున్నాను.

ఇంకో రెండు షాపులు తిరిగాక, మా అదృష్టం ఫలించి, స్వప్న వాళ్ళ బామ్మ కోరిన రంగుల్లో చీరలు దొరికాయి.

వాటిని, వాట్సప్‌తో ఫోటో తీసి పంపి, ఒకే అనిపించుకున్న తర్వాత మా షాపింగ్ అఫిషియల్‌గా పూర్తయ్యింది.

"ఇక నా వల్ల కాదు. ఒక్క అడుగు వెయ్యలేనింక" చెప్పేశాను నేను.

"ఐస్ క్రీం షాప్‌కి వెళదాం పద. కాసేపు కూర్చోవచ్చు" అంటూ ఐస్ క్రీం పార్లర్‌కి తీసుకెళ్ళింది.

చెరొక ఐస్‌క్రీం కప్పు తీసుకుని, కార్నర్ టేబుల్ దగ్గర కూర్చున్నాం.

"ఇంతకీ తనీష్ మీ యింట్లో అందరికీ నచ్చినట్టేనా?" అడిగాను స్పూన్‌తో ఐస్‌క్రీంని కదిలిస్తూ.

"నీకేమన్నా డౌటా?" స్వప్న నవ్వింది.

"ఇంతకీ తనీష్‌కీ నీకూ పరిచయం ఎలా అయ్యింది?" అప్పటికే రెండురోజులనుంచి నా మెదడులో నానుతున్న ప్రశ్నని బైటపెట్టాను.

ఐస్‌క్రీంని చప్పరిస్తూ పెదాలను ఒత్తిపట్టి నవ్వింది స్వప్న.

"మా ఇద్దరికీ సుజిత అనే ఓ కామన్ ఫ్రెండుంది. దాని బర్త్‌డే పార్టీలో కలిశాం. నిజానికి తనీష్ సుజిత అన్నయ్య ఫ్రెండు. ఇద్దరూ కలిసి బెంగుళూరులో రియలెస్టేట్ బిజినెస్‌లో యిన్వెస్ట్ చేశారట. అనుకోకుండా, సుజీ బర్త్‌డే టైంకి హైదరాబాదులో వుండడం, పార్టీకి రావడం, నాకు పరిచయం కావడం, అన్నీ అలా కాజువల్‌గా జరిగిపోయాయి. మే బి యిట్స్ డెస్టినీ" అంది మెరిసే కళ్ళతో.

"ఇంతేనా నీ లవ్‌స్టోరీ" అన్నాను తేలిగ్గా మూతి విరుస్తూ.

"ఏం బాలేదా?"

"బావుండడానికి ఏముందీ? పార్టీలో కలిశారు. నీదో.. అతనిదో 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అయ్యుంటుంది. ఆ తర్వాత నెంబర్స్ ఎక్స్‌ఛేంజ్ చేసుకున్నారు. ఫేస్‌బుక్‌లో, వాట్సప్‌లో కనెక్ట్ అయ్యారు. ముందు మెసేజ్‌లు, అవుటింగ్‌లూ. ఒకరోజు అతను ప్రపోజ్ చేసి వుంటాడు. వెంటనే, నువ్వు అతన్ని తెచ్చి మీ ఉఇంట్లో పరిచయం చేశావు. అంతేనా?"

"కథలా వింటే అలానే అనిపిస్తుంది. నిజంగా నువ్వెవరినన్నా ప్రేమిస్తే కదా తెలిసేది. తనీష్ నన్ను ప్రపోజ్ చేసిన తీరు వండ్రఫుల్. నన్ను డిన్నర్‌కి పిలిచిన రోజు రాత్రి రెస్టారెంట్ అంతా తనే బుక్ చేడాడు. అంత పెద్ద డైనింగ్ హాల్లో మేం యిద్దరమే వున్నాం. హాలు మొత్తం ఎర్రని గులాబీలతో అలంకరించి వుంది. పెద్ద పెద్ద గ్లాస్ విండోల మీదుగా లైట్లు వెలుగుతూ వున్నాయి. రంగురంగుల నక్షత్రాల్లా వెలిగే లైట్ల మధ్య, గులాబీ తోటలోకి అడుగుపెట్టినట్టుగా అనిపించింది నాకా క్షణం.

అప్పుడే నాకు అర్థం అయ్యింది. 'ఇట్స్ గోయింగ్ టు బీ బిగ్ డే' అని. అనుకున్నట్టుగానే, తనీష్ నన్ను ప్రపోజ్ చేశాడు. అది నా లైఫ్‌లో మర్చిపోలేని మూమెంట్. ఆ రోజు అతను చెప్పిన మాటలు నాకు యింకా గుర్తున్నాయి. అప్పుడు యిచ్చిందే ఈ డైమండ్ రింగ్" అంది చేతిని ముందుకు చూపిస్తూ.

స్వప్న చెపుతూనే వుంది. నా పాటికి నేను ఆలోచనల్లో కూరుకుపోయాను.

ఒకవేళ సందీప్ నన్ను ప్రపోజ్ చేస్తే ఎలా చేస్తాడు? ఖచ్చితంగా డైమండ్ రింగ్ మాత్రం కొనలేడు. బహుశా ఓ గులాప్పువ్వు కొంటాడేమో.

ఇక్కడికి దగ్గర్లో 'కానీ' ఖర్చు లేకుండా దొరికే రొమాంటిక్ ప్లేస్ అంటే, బీచ్ ఒక్కటే వుంది. కాబట్టి ఆ గులాప్పువ్వు నలక్కుండా, ఓ ఖాళీ టూత్ పేస్ట్ డబ్బాలో పెట్టుకుని, నన్ను బైక్ మీద ఎక్కించుకుని బీచ్‌కి తీసుకెళతాడు.

అక్కడ చల్లగాలిలిలో, తడి యిసుకలో కాళ్ళు దిగబడిపోతూ వుంటే యిద్దరం చేతిలో చెయ్యి వేసుకుని నడుస్తూ వుంటాము.

ఇంతలో సందీప్ సడన్‌గా ఆగిపోయి, చొక్కాలోపలనుంచి అట్టపెట్టె తీసి నా ముందు మోకాళ్ళ మీద కూర్చుంటాడు.

"ఈ టూత్ పేస్ట్ డబ్బా ఏంటబ్బా?" అని నేను ఆలోచించేలోపే దాన్లోంచి గులాప్పువ్వుని బైటకి తీస్తాడు.

అవతల, సూర్యాస్తమయం అవుతూ వుంటే ఆకాశం అన్ని రంగులు అందంగా అద్దుకుని వుంటుంది. ఇంకోపక్క చల్లగా కాళ్ళని తడుపుతూ సముద్రపు అలలు.

మాతోపాటు అక్కడ వాకింగ్ చేసేవాళ్ళూ, యిసకలో గూళ్ళు కట్టి ఆడుకునే పిల్లలూ అందరూ ఒక్కసారిగా ఆగిపోయి మావైపు చూస్తారు.

సందీప్ పువ్విచ్చి 'నన్ను పెళ్ళి చేసుకుంటావా?' అని అడిగాక చప్పట్లు కొట్టడానికి రెడీగా వుంటారు.

"వావ్! వాటె బ్యూటిఫుల్ మూమెంట్" అనుకుంటుండగానే, ఇంతలో గుంపులో నుంచి ఎవరో 'ఆ అమ్మాయి మన టౌన్ ప్లానింగ్ ఆఫీసరుగారి అమ్మాయి కదూ' అని అరుస్తారు. వెంటనే నేను భయపడి పరుగందుకుంటాను.

సందీప్, క్రికెట్ ప్లేయర్ కాబట్టి, నన్ను ఈజీగానే పట్టుకోగలడు. నేను గబుక్కున ఆ పువ్వు తీసుకుని, "యస్" చెప్పేస్తాను.

ఇంటికి వచ్చాక, ఆ పువ్వుని ఏ ఫ్లవర్ వాజ్‌లో పెట్టినా, మా అమ్మ కనిపెట్టేస్తుందనే భయంతో దాన్ని పుస్తకాల మధ్యలో పెట్టి 'అప్పచ్చి' చేసేస్తాను.

ఆ తర్వాత ఎలాగొలా మా పెళ్ళి అవుతుంది. అదెలాగో వూహించడం కష్టంగా తోచి, ఆ పార్ట్ వదిలేశాను.

కొన్ని సంవత్సరాల తర్వాత, మా పాప అడుగుతుంది.

"ఈ ఎండిపోయిన పువ్వేంటీ మమ్మీ" అని.

అప్పుడు నేను "మీ డాడీ" అంటూ మొదలుపెట్టి కథంతా చెబుతాను. ఈలోపు నా నాలుగేళ్ళ కొడుకు వచ్చి, ఠపీమని ఆ పువ్వు రెక్కలన్నీ లాగి తుంపి పడేస్తాడు.

ఎన్నో సంవత్సరాల నుంచి అణిగిపోయి, ఎండిపోయిన ఆ కాస్త గుర్తుకూడా ఆ రోజుతో చిత్తు చిత్తు అయిపోతుంది.

స్వప్నకి వున్నట్టు నా దగ్గర మా ప్రేమకి గుర్తుగా డైమండ్ రింగ్ వుండదు. కానీ మా పిల్లల రూపంలో మా ప్రేమ సజీవంగా వుంటుంది.

అంతే.

'నో డైమండ్ రింగ్, నో డైమండ్ రింగ్ ' అంటూ పెద్దగా అరిచాను.

"ఏంటా అరుపులు? నేను కథ చెబితే నువువ్ ఏకంగా పిక్చరే వేసుకుంటున్నావా?" అంది స్వప్న నా మొహం మీద చెయ్యి ఆడిస్తూ.

"ఓహ్! బ్యూటిఫుల్ పిక్చర్లే. అన్నట్టు ఈ ప్రపోజల్ వ్యవహారం జరిగి యేడాది అయ్యిందని చెప్పినట్టు గుర్తు నాకు. మరి ఈ యేడాదిగా మీ మధ్య" ఆగలేక ఐస్ క్రీం చప్పరిస్తూ అడిగేశాను.

"నీ అనుమానం నాకు అర్ధమైంది. గత మూడునెలల నుంచి ఉయ్ ఆర్ లివింగ్ టు గెదర్. హైదరాబాద్‌లో ఉన్నన్ని రోజులూ అతను నా అపార్ట్‌మెంట్‌లో వుంటాడు" ముందుకి వంగి చిన్నగా చెప్పింది.

"ఓ మైగాడ్" నా చేతిలో స్పూన్ కప్పులోకి పడిపోయింది.

"ఇంట్లో వాళ్ళకి తెలియకుండా యింత పెద్ద స్టెప్పా? ఏమైనా నీకు చాలా ధైర్యం స్వప్నా" అన్నాను కళ్ళు పెద్దవి చేస్తూ.

నా మాటలకి స్వప్న మొహంలో రంగులు మారాయి.

"నేనేమో అల్ట్రా మోడ్రన్ సొసైటీలో పెరగలేదు. చిన్నప్పటి నుంచి మనం చూసిన లోకం ప్రభావం నామీద కూడా వుంది. ఇలాంటిపని చేయాలంటే నాకూ భయమేసింది.

మా సైకాలజీ వాళ్ళ భాషలో చెప్పాలంటే చిన్నప్పట్నుంచి చూసిన సొసైటీ కట్టుబాట్లన్నీ 'స్ట్రాంగ్ కాగ్నిటివ్ బిలీవ్స్' లాగా నా మెదడులో స్టక్ అయి వున్నాయి. ఏ సెక్యూరిటీలేని రిలేషన్‌తో ముందుకు వెళ్ళడానికి నేనూ భయపడ్డాను.

కానీ తనీష్‌ని కోల్పోతానన్న భయం. ఆ భయాన్ని దాటేసింది నేను పూర్తిగా అతన్ని నమ్మినట్టు, నమ్మించడానికే ఒక అడుగు ముందు వేశాను. నేనేకాదు ప్రేమించుకునే జంటల్లో చాలాశాతం మంది అమ్మాయిలకి నాకెదురైన పరిస్థితిఏ ఎదురౌవుతుంది'' చెప్పింది భారంగా.

''ఓ! ఏమన్నా అంటే, 'నీకు నామీద నమ్మకం లేదా?' అని దబాయిస్తారు కాబోలు. పోనీలే మీ లవ్‌స్టోరీకి ఓ హేపీ ఎండింగ్ వచ్చేసింది కాబట్టి, నువ్వు యింకెక్కువ ఆలోచించక్కర్లేదు'' అన్నాను నవ్వేస్తూ.

''థాంక్యూ తనూ'' చప్పున ముందుకి వంగి నా చేతులు పట్టుకుంది.

''ఈ విషయం నీతో చెప్పాక, నా మనసులో భారం దించుకున్నట్టుగావుంది ఈ యింట్లో ఎవరికీ ఈ విషయం గురించి తెలియదు. నువ్వు పొరపాటున కూడా...''

''చెప్పొద్దంటావ్. అలాగే'' అన్నాను స్వప్న వాక్యాన్ని పూర్తి చేస్తూ.

''థాంక్యూ'' స్వప్న ఆర్ద్రంగా చెప్పింది.

''చాల్లే నీ ఫార్మాలిటీస్. ఇక ఈ ఐస్ క్రీం కాస్తా మిల్క్ షేక్ అయిపోయింది కానీ పద వెళదాం'' అన్నాను హేండ్‌బాగ్ తగిలించుకుని లేస్తూ.

షాపింగ్ ఉత్సాహంలో తెలియలేదుకానీ క్రికెట్ బాల్ తగిలినచోట పాదం బాగానే వాచి నొప్పి చేసింది.

ఈ వంకతో ఓ వారంపాటు రావొద్దని చిత్రకి ఫోన్ చేసి చెప్పాను. హాయిగా, ఏడింటిదాకా నిద్రపోయి లేచి చిన్నగా కుంటుతూనే వెళ్ళి స్నానం చేసి రెడీ అయ్యి హాల్లోకి వచ్చాను.

నేను వచ్చేసరికి, అమ్మ వంట రాజ్యంగారి అమ్మాయికి క్లాస్ పీకుతూవుంది.

''ఫేస్ బుక్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్షిప్పుల విషయంలో జాగ్రత్తగా వుండాలి. పర్సనల్ ఇన్ఫర్మేషన్ సోషల్ ఫామ్స్‌లో ఎక్కువగా షేర్ చేయడం మంచిది కాదు.

ముఖ్యంగా, నీలాంటి టీనేజ్‌లో వుండే ఆడపిల్లల్ని టార్గెట్ చేయడానికి యిలాంటి సోషల్ నెట్‌వర్క్ సైట్లని క్రిమినల్స్ బాగా వాడుకుంటున్నారు.

మీ యింటికి నీకోసం వచ్చే ఫ్రెండ్సంతా మీ అమ్మకి ఎలా తెలుసో నీ సోషల్ నెట్‌వర్క్‌లో వుండే ఫ్రెండ్స్ కూడా మీ అమ్మకి తెలియాలి. ఇదంతా నీ సెక్యూరిటీ కోసమే.

''అమ్మ చెబుతూ వుంటే ఆ అమ్మాయి చేతులు నులుముకుంటూ, బిక్కమొహం వేసుకుని వింటూ వుంది.

ఆ వయసులో నేనూ అలాగే భయపడేదాన్ని. మనుషుల్లోని చీకటి కోణాల గురించి కొత్తగా తెలుసుకుంటున్నప్పుడు భయపడడం సహజం.''

''నువ్వు మరీ అంత భయపడక్కర్లేదు. సోషల్ నెట్‌వర్క్స్ వాడుకో. కానీ, కాస్త జాగ్రత్తగా అంతే'' వాతావరణాన్ని తేలికచేస్తూ అన్నాను.

''తనూ!'' అమ్మ సీరియస్‌గా నా వైపు చూసింది. నేను ఠక్కున నోరు మూశాను.

అమ్మ ఈసారి రాజ్యంగారి వైపుకి తిరిగింది.

''మనకి ఈ కాలం పద్ధతులూ, అలవాట్లూ తెలియదని చేతులు కట్టుకుని కూర్చుంటే సరిపోదు. పిల్లల కోసం కష్టపడుతున్నారు మీరు. అది మాత్రమే సరిపోదు. వాళ్ళని సరైన పద్ధతిలో పెంచడానికి మనకి తెలియని కొత్తవిషయాల్ని నేర్చుకునే ప్రయత్నం కూడా చేయాలి.

ఇదేం బ్రహ్మ విద్యేం కాదు.

మీ అమ్మాయి ఈ మెయిల్ ఎకౌంట్లూ, ఛాటింగ్ ఎకౌంట్లూ చూడడం నేర్చుకోండి. పిల్లలతో బాటూ మనమూ నడిచి చూస్తేగానీ, వాళ్ళ యిబ్బందులేంటో మనకీ అర్థంకావు. కాలాన్ని బట్టి మనమూ మారాలి.''

రాజ్యంగారు అమ్మ చెప్పే విషయాల్ని భక్తిశ్రద్ధలతో వింటూ వుంది.

''చూడమ్మా ఏ రిలేషన్ అయినా హానెస్ట్‌గా వుండాలి. నీకు యింకొంచెం వయసు వచ్చేవరకు మీ అమ్మా నాన్నలకి తెలియని ప్రపంచంలో నువ్వు తిరగకుండదు. రేపు నీకేదైనా సమస్య వస్తే చూసుకోవలసింది వాళ్ళే'' ఆ అమ్మాయికి మళ్ళీ గట్టిగా చెప్పింది.

ఆ తర్వాత ఏం జరగబోతుందో వూహించి, నేను లేచే లోపలే అమ్మ ''తనూ..'' అంటూ పిలిచింది.

నేను తిరిగి ఠక్కున కూర్చున్నాను.

''రాజ్యం ఆంటీకి ఆ మెయిల్ ఎకౌంట్లూ, ఛాటింగ్ ఎకౌంట్లూ ఎలా చూసుకోవాలో నేర్పించు'' చెప్పి.

''నీ ఐడి, పాస్‌వర్డ్‌లు ఆమెకి యివ్వు'' అని ఆ అమ్మాయికి చెప్పి వెళ్ళిపోయింది.

టీనేజ్ అమ్మాయిలు కనిపిస్తే చాలు. ఉపన్యాసం మొదలుపెడుతుంది అమ్మ. దానికి ఏ కారణం అవసరంలేదు. హుం...

''మామ్! యూ ఆర్ యింపాజిబుల్'' అనుకుంటూ టీపాయ్ మీద వున్న లాప్‌టాప్‌ని అందుకున్నాను.

ఎలాగో తంటాలుపడి, కష్టం మీద రాజ్యంగారికి కొంత వివరించాను.

"మిగతాది రేపు నేర్చుకుంటాలే అమ్మా" అంది ఆవిడ ఓ అరగంట గడిచాక.

"దీనికంటే కూతుర్ని నమ్మడం 'ఈజీ' అని ఆవిడ ఫిక్సయిందని నాకు అర్థమయ్యింది."అందరూ మా అమ్మలు ఉండలేరు కదా! బహుశా, సింగిల్ పేరెంట్‌గా ఉండి ఆడపిల్లని పెంచడం వల్లేమో. కొన్ని విషయాల్లో చాలా సీరియస్‌గా వుంటుంది అమ్మ.

రాజ్యంగారు కూతుర్ని తీసుకుని వెళ్ళిపోతూనే, రంగారావుగారు వచ్చారు.

"అమ్మా! పైన బాత్రూంలో గీజరు లీకవుతుందన్నారని, ఎలక్ట్రీషియన్‌ని తెచ్చాను" అమ్మకి చెప్పి చేతులు కట్టుకుని నిలబడ్డాడాయన.

అమ్మ ఒకసారి, సెల్‌ఫోన్‌లో టైం చెక్ చేసి, "ఒక్క అరగంటలో అయిపోతుందంటే రమ్మనండి. లేకపోతే, ఆదివారం రమ్మనండి" అంది గంభీరంగా.

"అలాగే అమ్మా!" అంటూ బైటికెళ్ళి ఎలక్ట్రీషియన్‌కి పిలుచుకు వచ్చాడు. ఎలక్ట్రీషియన్‌కి మేడమీద బాత్రూంని చూపించి వచ్చి, "అమ్మా! ఒక్క విషయం" అన్నాడు నసుగుతూ.

"చెప్పండి" చేతిలో ఫైలుని బ్యాగులో సర్దుతూ అంది.

"మా యింట్లో ఆడవాళ్ళు చిన్న కార్యక్రమం ఏదో పెట్టుకున్నారు. అందుకు మిమ్మల్ని పిలవాలని మా ఆవిడ వచ్చింది" చెప్పాడు నెమ్మదిగా.

"రమ్మనండి" బ్యాగ్‌ని తిరిగి బల్లమీద పెడుతూ చెప్పింది. వెంటనే, ఆయన బైటికి వెళ్ళి భార్యను వెంటబెట్టుకుని వచ్చాడు.

మధ్య పాపిడితో నున్నగా దువ్వి వెనక్కి క్లిప్ పెట్టి వదిలేసిన జుట్టు, చామనఛాయలో ఉండే ఒంటిరంగు. కాస్త పెద్దగా వుండే గుండ్రని స్టిక్కర్, ప్యూర్ సిల్క్ చీరలో నాలుగేళ్ళ క్రితం చూసినప్పుడు ఎలా వుందో అలానే వుందావిడ.

ఆవిడనీ, సందీప్‌నీ విడివిడిగా చూసినా, తల్లీకొడుకులని యిట్టే పోల్చుకోవచ్చు.

ఆవిడ వస్తూనే "మీ పేరు సుమిత్రకదూ. బావున్నారా?" అమ్మ పలకరించింది.

వెంటనే నేనూ సోఫాలో నుంచి లేచి నిలబడ్డాను.

"బావున్నామండీ. అమ్మాయా?" అంటూ నావైపు తిరిగిందావిడ.

"బాగా పెద్దదయిపోయింది. బంగారు బొమ్మలా వుంది" అంటూ నా బుగ్గ పట్టుకుని లాగింది.

"రేపు సాయంకాలం మా యింట్లో సాయిబాబా భజన పెట్టుకున్నామండి. మా అబ్బాయికి యింకా ఎక్కడా సరైన ఉద్యోగం రాలేదు. సాయిబాబా భజన పెట్టుకుంటే, మంచి జరుగుతుందని మా వాళ్ళంతా ఎప్పట్నుంచో చెబుతున్నారు. ఇన్నాళ్ళకి కుదిరింది. ఆ బాబా దయవల్ల వాడికో మంచి ఉద్యోగం వస్తే అదే చాలు" అందావిడ భారంగా.

"ఉద్యోగం రావడంలేదా? వచ్చిన జాబ్‌నల్లా అయ్యగారు మధ్యలో వదిలేసి వస్తున్నారా? అది చెప్పరేం?" మనసులోనే గొణుక్కున్నాను.

"మీరూ అమ్మాయి రేపు సాయంత్రం ఆరున్నరకి మా యింటికి తప్పకుండా రావాలి" చెప్పి చేతిలోని కుంకుమ భరిణె తీసి నాకు బొట్టు పెట్టింది.

"నాకు కుదరదు. వీలైతే అమ్మాయి వస్తుంది" చెప్పింది అమ్మ పొడిగా.

అమ్మకి యిలాంటివాటి మీద నమ్మకం లేదని నాకు తెలుసు. అలాగని, ఎదుటివారి నమ్మకాల విషయంలో జోక్యం కలిగించుకోదు. అమ్మ పొడి సమాధానానికి ఆవిడ మొహంలో నవ్వు ఏమాత్రం చెక్కు చెదరలేదు. ముందుగానే అమ్మతో ఎలా నడుచుకోవాలో బాగా ప్రిపేరయి వచ్చినట్టనిపించింది.

వాళ్ళిద్దరూ బైటికెళ్ళిపోగానే అమ్మ నన్ను పిలిచింది. "నిన్ను అడక్కుండానే నువ్వు వస్తావని చెప్పాను. నీకు కాలునొప్పి ఎక్కువగా వుంటే బలవంతంగా వెళ్ళక్కర్లేదు. నేనిప్పుడే రంగారావుగారితో చెప్తాను" అంది నా కాలు వైపుకి చూస్తూ.

"నో!! నో!!" కంగారుగా అరిచాను.

"నేను బాగానే వున్నాను. మరీ తన్మయిలా పర్‌ఫెక్ట్‌గా నడవలేకపోయినా, ఏ హంసలానో, నెమలిలానో నడుస్తూ మేనేజ్ చేసేస్తాను. ఎవరో ఒకరం వెళ్ళకపోతే బావుండదు కదమ్మా"

నా మాటలకి అమ్మ నవ్వింది.

"సరే నీ యిష్టం. ఎలక్ట్రీషియన్ వెళ్ళిపోగానే తలుపు జాగ్రత్తగా వేసుకో నాకు ఆఫీసులో లేటవ్వచ్చు. నువ్వు వెళ్ళేముందు నాకొక మెసేజ్ పెట్టు" చెప్పి వెళ్ళిపోయింది.

"యస్స్...స్" ఆనందంగా అరిచాను.

**రెడ్ కలర్...ఊహూ!!** చాలా బ్రైట్‌గా వుంటుంది.

యల్లో.. నో...

వైట్.. దీని డిజైన్ అస్సలు బాలేదు.

వార్డ్‌రోబ్‌లో తగిలించి వున్న చుడీదార్లన్నీ తీసి చూశాను. మరీ ఖరీదైన బట్టలు వేసుకుని అందరికంటే భిన్నంగా కనిపించాలని కాదుకానీ కాస్త ప్రత్యేకంగా వుండాలని నా తాపత్రయం.

చివరికి క్రీం కలర్ మీద త్రెడ్ వర్క్ చేసిన ఒక చుడీదార్‌ని సెలెక్ట్ చేశాను.

డ్రస్‌కి మ్యాచ్ అయ్యేలా నెమలిబొమ్మ వున్న బంగారు లాకెట్, బుట్టలూ పెట్టుకున్నాను.

వెళ్ళేది పూజకి కాబట్టి, వదులుగా జడ అల్లుకుని కళ్ళకి ఐ లైనర్ పెట్టి పెదవులకి లైట్‌గా లిప్‌స్టిక్ వేశాను.

అద్దం ముందు నిలబడి ముందునుంచి, పక్కనుంచి అన్ని యాంగిల్స్‌లో చూసుకుని సంతృప్తిగా నిట్టూర్చాను. సందీప్ వాళ్ళిల్లు మా యింటికి దగ్గర్లోనే వుంది. అమ్మకి మెసేజ్ పెట్టి, డోర్ లాక్ చేసి, కాలినడకన బయలుదేరాను.

వీధి మలుపు తిరిగాక, ఎర్రరంగు వేసిన యినపరేకు గేటుని చూసి అదే యిల్లని గుర్తుపట్టాను. చిన్నప్పుడొకసారి రంగారావుగారితో ఆ యింటికి వచ్చాన్నేను. ఇన్ని సంవత్సరాలైనా ఆ యింటి రూపు రేఖలు మారలేదని ఆ గేటుని చూస్తూనే అర్థం అయ్యింది.

అది పాతకాలపు చిన్నడాబా. దానిముందు పెంకులతో దించిన పొడవాటి వరండా.

ఇంటిముందు ఎక్కువ ఖాళీస్థలం ఉండడం ఒక్కటే ఆ యింటి ప్రత్యేకత.

గేటు తీసి నా చిన్నప్పుడెప్పుడో చూసినట్టున్న పరిసరాల్ని గమనిస్తూ ముందుకి నడిచాను.

మామూలుగా యింటి ముందు అందంగా పెంచుకునే, పూలమొక్కలూ, క్రోటన్స్‌కి బదులుగా, పొట్లపాదులూ, ఆకుకూర మడులూ పెంచారు. వాటి మధ్య రెండు మందార చెట్లు మాత్రం వున్నాయి.

వరండా ముందు మట్టికుండీలకు బదులుగా, ప్లాస్టిక్ డబ్బాలతో పెంచిన చామంతి మొక్కలు వరుసగా పెట్టివున్నాయి.

ఓ నలుగురైదుగురు తప్ప అప్పటికి యింకా పెద్దగా జనాలు రాలేదు. వచ్చినవాళ్ళు కూర్చోవడానికి వరండాలో చాపలు పరుస్తూ వుంది ఓ అమ్మాయి. ఆ అమ్మాయి కళ్ళూ, పొడవాటి జడ. చూసి సందీప్ చెల్లెలు సుమ అని ఠక్కున గుర్తుపట్టాను.

"హాయ్ సుమా! బావున్నావా?" పలకరించాను సుమ నా పలకరింపుకీ, చిరునవ్వుకీ సమాధానం యివ్వకుండా, పొడవాటి జడను వెనక్కి విసిరేస్తూ తన పనిలో తను వుండిపోయింది.

ఇంతలో, సందీప్ వాళ్ళమ్మ సుమిత్రాదేవి వరండాలోకి వచ్చింది.

"రామ్మా! రా! బావున్నావా?" అంటూ మొహమంతా నవ్వు పులుముకుని లోపలికి ఆహ్వానించిందావిడ.

రంగారావుగారు కూర్చోవడానికి కుర్చీ చూపించారు.

"సుమా! మంచినీళ్ళు తీసుకురా" సుమిత్రాదేవి కేకేసింది. రెండు నిముషాల తర్వాత సుమ మంచినీళ్ళగ్లాసుతో వచ్చింది. చక్రాల్లాంటి కళ్ళతో చురుక్కుమనేట్టు చూసి, గ్లాసు చేతికిచ్చి వెళ్ళిపోయింది.

"అమ్మ కూడా వస్తే బావుండేదమ్మా" అడిగింది సుమిత్రాదేవి.

"ఇవాళ ఆఫీసులో లేటవుతుందని చెప్పింది. అయినా అమ్మకి యిలాంటివన్నీ నమ్మకం లేదు" ఉన్నమాట నిజాయితీగా చెప్పాను.

"దానేముందీ? ఎవరిష్టాలు వాళ్ళవి. నీ డ్రస్ చాలా బావుంది" అంది నవ్వుతూ.

ఆవిడలా మాటిమాటికీ నవ్వుతూ, నాకు మర్యాదలు చేస్తుంటే, చాలా యిబ్బందిగా అనిపించింది. మా అమ్మ పెద్ద ఆఫీసర్ అని క్షణక్షణానికీ గుర్తు చేస్తున్నట్టుగా వుంది.

"అత్తయ్యా! పులిహోర తాళింపు అయ్యింది. ఇక వంటింట్లో పని అయిపోయినట్టేనా? గుమ్మంలో నుంచి చిత్ర గొంతు వినిపించింది.

చిత్ర సుమిత్రాదేవిని 'అత్తయ్యా' అని పిలవడం చూసి ఆశ్చర్యపోయాను. చిత్ర సందీప్ వాళ్ళ చుట్టాలమ్మాయి అని తెలుసుగానీ, సుమిత్రాదేవి అత్త అని, చిత్ర బావ సందీప్ అనీ తెలిసి ఆశ్చర్యపోయాను. అంటే, చిత్రని రోజూ తెల్లవారుఝామునే యోగా క్లాసుకి డ్రాప్ చేసేది సందీపేనా? అయ్యగారి దగ్గర స్పేర్ హెల్మెట్ అందుకే రెడీగా వుందన్నమాట ఎందుకో ఆ విషయం అర్ధమయ్యాక మనసంతా చేదుగా అయిపోయినట్టైంది.

చిత్ర పసుపురంగుకి ఎర్రరంగు అంచువున్న పట్టుచీర కట్టుకుంది. జడలో పూలు, చేతులకి మ్యాచింగు గాజులతో, సినిమాలో పెళ్ళిచూపుల సీన్లో హీరోయిన్లా కనిపించింది నా కళ్ళకి.

కట్టూబొట్టూనేకాదు, మాటా మంచీ కూడా పూర్తిగా భిన్నంగా వుంది. ఎప్పుడూ నవ్వడం, మాట్లాడడం చేతకాదన్నట్టుగా కనిపించే చిత్రేనా అని అనుమానం వచ్చి చెయ్యిగిల్లుకున్నాను కూడా.

"అత్తయ్యా వింటున్నావా?" గాజులు గలగలలాడిస్తూ మళ్ళీ పిలిచింది చిత్ర.

"ఇప్పుడే వస్తానమ్మా" చెప్పి వెళ్ళిందావిడ.

"కనీసం స్వప్న వచ్చినా బావుండేది. కాస్త కంపెనీ యిచ్చేది" అనుకుంటూ చుట్టూ చుస్తూ కూర్చున్నాను.

"సున్నం పెచ్చులూడిపోతున్నట్టున్న పాతగోడలూ, వాటికి సరిపోనట్టు కొత్తగా పెయింట్ వేసిన కిటికీలూ దర్వాజులూ గోడ పక్కగా సందులో పడేసిన పాతబక్కెట్లూ, చీపుళ్ళూ దండెం మీదవేల్లాడుతున్న బట్టలు చూసి "క్లాసిక్ ఓల్డ్ హౌస్" అనుకున్నాను.

అలా ఎంతసేపు కూర్చున్నానో తెలియకుండానే, చీకటి పడిపోయింది లైట్లు వెలిగాయి.

వరండాలో మూడువంతుల పైన జనం నిండారు.

నాపరాయి గచ్చుమీద ముగ్గులు పెట్టి, దానిమీద కాస్త ఎత్తున్న పీటని వేశారు. దానిపై ఒక పాతపట్టుచీరని కప్పి, దాదాపుగా మూడడుగుల ఎత్తువున్న బాబా ఫోటోని పెట్టారు.

దీపారాధన చేసి, సాంబ్రాణీ కడ్డీలు వెలిగించారు. ఈ పనులన్నీ సుమ, చిత్ర కలిసి చేశారు. ఆ పనులు చేయడంలో యిద్దరి మధ్య ఒకలాంటి కెమిస్ట్రీ కనిపించింది నాకు. చూపులతోనే సైగలు చేసుకుంటూ మధ్య మధ్య నా వైపు చూసి నవ్వుకుంటూ పనులు పూర్తిచేశారు.

వచ్చిన పేరంటాళ్ళలో కొంతమంది, "ఎవరమ్మాయివి నువ్వు?" నగలు పెట్టుకోలేదేమీ?" లాంటి ప్రశ్నలు అడిగారు నన్ను. వాటికి నేను జవాబిచ్చేలోపలే

"మన రంగారావు వాళ్ళ ఆఫీసరమ్మగారి అమ్మాయి. అయినా ఈ కాలం పిల్లలు మనలా నగలేం పెట్టుకుంటారూ" అని వాళ్ళే జవాబిలిచ్చుకున్నారు.

ఇంతలో ఓ పెద్దవయసావిడ వచ్చిందక్కడికి. పిలిచింది సుమ. "మామ్మా రండి మీరు యిటు కుర్చీలో కూర్చోండి పిలిచింది సుమ.

"మోకాళ్ళ నెప్పులు ఉన్నవాళ్ళకి కుర్చీలు వేశాం" అంది నావైపు ఎగతాళిగా చుస్తూ సుమ మాటలు నాకు అర్థమయ్యాయి. అలాగని, కుర్చీలో నుంచి లేస్తే మరింత గేలి చేస్తుందని ఆ మాటలు విననట్టే నటించాను.

ఇంతలో చిత్ర పరుగున గుమ్మం దగ్గరికి వచ్చింది. "అదిగో బావ వచ్చాడు" అంటూ.

ఆ మాట వింటూనే నేను అప్రయత్నంగా తలతిప్పి చూశాను. చీకట్లో నుంచి వరండా వైపుకి నడుస్తున్నకొద్దీ అతని ఆకారం స్పష్టంగా కనిపిస్తూవుంది.

భుజానికి బ్యాగ్ తగిలించుకుని అతను వస్తూ వుంటే, అతని నడకని అదేపనిగా చుస్తూ ఉండిపోయాను.

"ఒక్కసారి అతను నా వైపు చూస్తే బావుండు. చూస్తే బావుండు" మనసులో మాటని పెదవులు శబ్దం లేకుండా జపిస్తున్నాయి.

కళ్ళు స్పష్టంగా పైకి చెప్పేస్తున్నాయి. కానీ నా ఆరాటంతో అతనికేమీ సంబంధం లేదన్నట్టుగా పక్కగా వున్న సందులోనుంచి పెరటి గుమ్మం వైపుకి నడిచాడు.

తల తిప్పుతూనే చిత్ర నావైపే చూస్తూ కనిపించింది. నా కళ్ళని చదివి ఏదో అర్థం చేసుకున్నట్టు ఆమె కనుబొమలు ముడుచుకున్నాయి.

సందీప్ యింట్లోకి వస్తూనే, చిత్ర పరుగున అతని దగ్గరికి వెళ్ళింది. "బావా నువ్వు యిప్పుడే వచ్చావు. కానీ తప్పనిసరై ఓ పని చేసిపెట్టాలి. ప్రసాదాలు పెట్టి యివ్వడానికి పేపర్ ప్లేట్స్ కావాలి, ఇంకా ఈ పాకెట్ రిటర్న్ యివ్వాలి.

"నేను సగ్గుబియ్యం తెమ్మన్నాను నిన్ను. తెల్లగా గుండ్రంగా వుంటాయని చెబితే నువ్వు సగ్గుబియ్యం బదులు కర్పూరం బిళ్ళలు తెచ్చావు" చెప్పి నవ్వింది.

సందీప్ చిత్ర చేతిలోని పాకెట్ అందుకున్నాడు.

"బావా ఉండు నీ దగ్గర ఛేంజ్ ఉండదెప్పుడూ" అంటూ పరుగున వెళ్ళి డబ్బు తెచ్చి చనువుగా అతని చొక్కా జేబులో పెట్టింది.

"మంచినీళ్ళు కావాలా?" ఆమె అడుగుతుంటే వద్దని చెప్పి వెనక్కి తిరిగాడతను.

అదంతా చూస్తుంటే నా మనసు నిర్లిప్తంగా అయిపోయింది. కొత్తపెళ్ళికూతురిలా అలంకరించుకుని, చిత్ర సందీప్‌తో చనువుగా వుండడం, అతను బుద్ధిమంతుడిలా ఆమె మాట వినడం నాకెందుకో నచ్చలేదు.

"ఎందుకో నచ్చకపోవటం ఏమిటి? జెలసీ.. జెలసీ అంటారు దాన్ని" అంతరాత్మ అరిచి చెప్పింది.

ఒక పావుగంటలో సందీప్ తిరిగి వచ్చాడు. ఈసారి అతని కంటబడడం నాకే యిష్టంగా అనిపించలేదు. అందుకే పూజ ప్రారంభం అవుతూనే, కుర్చీమీద నుంచి దిగి కింద కూర్చున్నాను.

భజనలూ, పాటలూ అయ్యాక హారతి యిచ్చారు.

నేను నమస్కారం చేసుకుని వస్తుంటే, చిత్ర పులిహోర, గుగ్గిళ్ళు పేపర్‌ప్లేట్స్‌లో పెట్టి తెచ్చి యిచ్చింది.

వెళ్ళేవాళ్ళు ఒక్కొక్కరే చెప్పి వెళుతున్నారు.

"వస్తానమ్మా చిత్రా. నీ చేతి పులిహోర తింటానీవేళ, ఆ రుచి యింకెక్కడా రాదు" చెప్పిందొకావిడ.

మరొకావిడ వెనక్కి తిరుగుతూ పక్కనున్నామెతో అంటూ వుంది.

"పాపం తల్లి లేని పిల్ల తండ్రికి సంపాదన శూన్యం. ఆ యింట్లో, ఈ యింట్లో ఆసనాలు అవీ నేర్పుతూ, కాలేజీ ఫీజులు కట్టుకుంటుంది. ఆ బాబా ఈ పిల్లని చల్లగా చూడాలి" ఆ మాటలు చెవినపడ్డాయి.

నేనూ యింటికి వెళ్ళడానికి సిద్ధమయ్యాను. బాండేజీ వేసిన పాదానికి యిబ్బంది కలగకుండా జాగ్రత్తగా చెప్పుల్లో కాళ్ళు పెడుతూనే, సుమిత్రాదేవి వచ్చింది.

"అమ్మకి కూడా ప్రసాదం యిస్తాను పట్టుకెళ్ళమ్మా" చెప్పింది.

"ఫర్వాలేదండీ చెప్పానుగా. అమ్మకి యిలాంటి వాటిల్లో నమ్మకం లేదని"

"నమ్మకం కోసం కాకపోతే రుచి కోసం తింటారు. కొద్దిగా యిస్తాను పట్టుకెళ్ళు" అని వద్దంటున్నా, నా చేతిలోనే ప్రసాదం ప్లేటు తీసుకుని, ఇంకో పెద్ద డబ్బాలో మరింత వేసి, కొబ్బరిచిప్పలు, పండ్లు పూలతోబాటు కవరులో పెట్టి యిచ్చింది.

రంగారావుగారు ఇంటిదాకా దిగబెడతానని అంటే, వద్దని వారించాను. "అమ్మని అడిగానని చెప్పమ్మా" సుమిత్రాదేవి మరీ మరీ చెప్పింది.

అసలే చికాగ్గా వున్న నా మనసుకి, వాళ్ళ మాటలు మరింత చికాకు కలిగించాయి. వాళ్ళ ఆరాటం అంతా తమ మంచితనం ప్రదర్శించుకోవాలని ఈ కాకా పట్టడం అంతా అందుకే.

అసలు, తప్పు పూర్తిగా అమ్మదేనా? వీళ్ళది మాత్రం లేదా? ఆలోచిస్తూ గేటు దాటాను.

వీధి దీపాల వెలుగుతో బాటు, వెన్నెల వెలుగు కూడా రోడ్డంతా పరుచుకుని వుంది.

నెమ్మదిగా, నాలుగడుగులు వేశానో లేదో

"తన్మయీ అని పిలుపు వినిపించింది. తలతిప్పి చూశాను. రోడ్డుకి కాస్త అవతలగా, సందీప్, వెంకట్ యిద్దరూ ఎదురెదురుగా బైకులు పార్క్ చేసి, కూర్చుని కనిపించారు.

నేను ఆగుతూనే, వెంకట్ పరుగున దగ్గరికి వచ్చాడు.

"హాయ్! యిప్పుడు ఎలా వుంది నీ కాలునొప్పి? అడిగాడు వస్తూనే.

"ఫర్వాలేదు. మరీ యిబ్బంది పెట్టట్లేదు"

సరేగానీ "నువ్వేంటిక్కడ?"

"చిన్న పనేదో వుంటే సందీప్, నేనూ డిస్కస్ చేస్తున్నాం. నిన్ను యింటిదగ్గర డ్రాప్ చేస్తాను పద" అన్నాడు చొరవగా.

"అక్కర్లేదు. నేను వెళ్ళగలను"

"అలా..ఎలా? మా వల్లే నీకు దెబ్బ తగిలింది. మా వల్ల అంటే, నిజానికి ఆ బాల్ సందీప్‌గాడే విసిరేశాడనుకో. నిన్ను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మా మీద వుంది. కనీసం యింటిదాకా అన్నా డ్రాప్ చేసి మా పాపం కొంచెం తగ్గించుకోనీ" అన్నాడు నవ్వుతూ.

వెంకట్ అన్న తీరుకి నాకు నవ్వొచ్చింది. "సరే పద" అన్నాను. నవ్వి. వెంకట్, ఉన్నట్టుండి, ఏదో ఆలోచిస్తున్నవాడిలా మొహం పెట్టి, వెనక్కి తిరిగాడు.

"రేయ్ సందీప్ సందీప్ "అంటూ పెద్దగా కేకేశాడు.

"తన్మయిని యింటి దగ్గర డ్రాప్ చేయాలి. నాకు యిప్పుడే అర్జంటు పనొకటి గుర్తొచ్చింది. నువ్వు డ్రాప్ చేస్తావా?"

సందీప్ వస్తూనే చెప్పేసి యిద్దరి వంకా కొంటెగా చూసి కన్నుగీటాడు.

వెంకట్ చేసిన పనికి, ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ ఉండగానే అతను వెళ్ళిపోయాడు.

ఇద్దరం, యిబ్బందికరమైన పరిస్థితిలో చిక్కుకున్నాం

"అయామ్ సారీ నేను డ్రాప్ చేయమని అడగలేదు. వెంకట్" అని నసుగుతూ తలెత్తి సందీప్ వైపు చూశాను.

"ఇ..నో వాడెప్పుడూ యిలాగే చేస్తుంటాడు. కానీ, వాడేమీ తప్పుగా చెప్పలేదు. పద డ్రాప్ చేస్తాను" అన్నాడు వెనక్కి తిరగబోతూ.

"వద్దు" గబుక్కున సందీప్ చెయ్యిపట్టి ఆపాను. పూజకి వచ్చినవాళ్ళు యిళ్ళకి తిరిగి వెళుతూ అక్కడక్కడా రోడ్డు మీద కనిపిస్తున్నారు.

"నేను నడిచే వెళతాను" వాళ్ళవైపు చూస్తూ చెప్పాను. చెప్పి, రెండడుగులు వేశానో లేదో. కాలికేదో తగిలింది గబుక్కున ముందుకి తూలి పడబోయాను. "అమ్మా!" అంటూ అరిచాను కూడా.

కిందపడిపోతున్నాననే అనుకున్నాను. ఇంతలో, సందీప్ చెయ్యి బలంగా నా నడుమును చుట్టేసింది. మరో చేతితో నా భుజాన్ని పట్టుకుని నేను పడిపోకుండా పట్టుకున్నాడు. నేను పూర్తిగా అతని చేతుల్లో వాలిపోయి వున్నాను.

ఏం జరిగిందో అర్ధంకావడానికి ఒక్క క్షణం పట్టింది నాకు.

నొప్పిగా వున్న కాలిని జాగ్రత్తగా కదిలిస్తూ, పక్కకి తిరిగే ప్రయత్నం చేశాను.

అతను, నేను మళ్ళీ పడిపోకుండా నా రెండు భుజాలను జాగ్రత్తగా పొదివి పట్టుకున్నాడు.

నేను నిటారుగా అవుతూనే, యిద్దరం మరింత దగ్గరయ్యాం. ఎత్తునుంచి పడుతున్న స్ట్రీట్ లైట్. వెలుతురులో అతని మొహం స్పష్టంగా కనిపిస్తూ వుంది.

ఒక్క క్షణం యిద్దరి కళ్ళూ కలుసుకున్నాయి.

అతని కళ్ళలోకి చూస్తుంటే, చుట్టూ వున్న పరిసరాలు మాయం అయిపోయినట్టు అనిపించింది. కేవలం అతనూ నేనూ. నా బుగ్గల్లోకి వెచ్చని ఆవిర్లు నింపుతున్న నా గుండె చప్పుడు అంతకు మించి మరేవీ నా స్పృహలోకి అందడంలేదు.

"తన్మయీ! ఆర్యూ ఓ.కే" అతను భుజం తట్టడంతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాను.

రోడ్డు మధ్యలో అతని చేతుల్లో వాలిపోయి వున్నానన్న విషయం స్ఫురణకు వచ్చింది. వెంటనే అతనికి దూరంగా జరిగాను.

నేను తిరిగి నిలదొక్కుకునే వరకు అతను నా చేయి వదలకుండా జాగ్రత్తగా పట్టుకున్నాడు.

"థాంక్యూ!" అతని చేతిని వదిలి చుడీదార్ దుప్పట్టాని సరిచేసుకున్నాను.

"ఇక నేను వెళతాను. మళ్ళీ పడిపోనులే" అన్నాను నవ్వుతూ.

"ఇంటిదాకా వస్తాను పద" అన్నాడతను.

అతని వాలకం చూస్తే, నా మాట వినేట్టుగా లేడని అర్థం అయ్యింది.

"సరే! నీ యిష్టం" నువ్వు నాతోపాటూ వస్తానంటే మాత్రం, మళ్ళీ పడిపోనని గ్యారంటీ యివ్వలేను" అన్నాను నవ్వుతూ.

వెంటనే అంతరాత్మ లేచింది.

"తనూ! మళ్ళీ ఎగుడు దిగుడు వాగుడు మొదలుపెట్టావు" అంటూ.

దాన్ని జోకొట్టి అతనితో బాటు నడవడం మొదలుపెట్టాను.

"సందీప్ నిన్నొక ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్తావా?" అన్నాను అతనివైపుకి తిరిగి.

"అడుగు" పాంటు జేబుల్లో చేతులు పెట్టి నడుస్తూ అన్నాడు.

"నీకు యింకా సరైన జాబ్ దొరకలేదంటే, నాకు నమ్మబుద్ధి కావడంలేదు. ఇది నిజమేనా?"

సందీప్ నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఎందుకంటే 'నువ్వు ఏ జాబ్ లోనూ కుదురుగా ఎందుకుండవు?' అని అడగకుండా చాలా మర్యాదగా అడిగావు కదా" అందుకు నవ్వొచ్చింది"

"నువ్వు పొరబాటుగా అర్థం చేసుకున్నావు. నువ్వు జాబ్ వదిలేశావంటే, దాని వెనక ఏదో కారణం వుండుంటుంది. అది ఏంటి? అని నా ప్రశ్న!"

"నేను జవాబివ్వకపోతే" నా మొహంలోకి చూస్తూ అన్నాడు.

"నీ పర్సనల్ లైఫ్ నీ యిష్టం అని వూరుకుంటాను" ఈజీగా తీసుకుంటున్నట్టు భుజాలెగరేశాను.

అతను నవ్వాడు.

"సరే యింకో ప్రశ్న అడుగుతాను. దీనికి మాత్రం నువ్వు జవాబు చెప్పి తీరాలి. ఎందుకంటే, యిది నాకు సంబంధించినది కూడా" అనడమైతే అన్నాను కానీ అడగాలంటే, మనసులో అలజడి మొదలైంది.

"అడుగు..ఏంటో"

"ఒక రోజు కాలేజ్‌లో నువ్వూ నిరంజన్ గొడవపడ్డారు. ఆ తర్వాత నువ్వు నేనున్న క్లాస్‌రూంలోకి వచ్చావు. అప్పటికే అందరూ యిళ్ళకి వెళ్ళిపోయారు. నేనొక్కదాన్నే స్వప్న కోసం వెయిట్ చేస్తూ వున్నాను. అప్పుడు నువ్వు నా దగ్గరికి వచ్చావు. అంటే చాలా ఆ తర్వాత మాట్లాడడానికి సిగ్గుపడ్డాను.

"ఎప్పుడు?" ఆలోచిస్తున్నట్టు అడిగాడు.

ఇన్ని సంవత్సరాలూ నేను ఏ సంఘటనని గుర్తుపెట్టుకుని మురిసిపోతున్నానో అతనికా విషయం గుర్తేలేదా? లేకపోతే నటిస్తున్నాడా?

"నేను యింటర్మీడియట్‌లో వున్నప్పుడు గుర్తులేనట్టు నటించకు" అన్నాను కోపంగా.

అతను ఉన్నట్టుండి "బల్లి...బల్లి" అని అరిచాడు.

నేను ఒంటికాలితోనే ఒక్క దూకు దూకి, అతని చేతిని గట్టిగా పట్టుకున్నాను.

"ఎక్కడ బల్లి? ఎక్కడ" అని నేను కంగారుగా అరుస్తూ వుంటే, అతను పెద్దగా నవ్వాడు.

"ఎక్కడాలేదు. నీకు బల్లి అంటే భయమని నాకు తెలుసు"

అతనామాట అంటూనే, గట్టిగా ఊపిరి పీల్చుకుని అతని చెయ్యి వదిలేశాను.

"నేను అడిగిన ప్రశ్నకి జవాబు యిదికాదు. నన్ను డైవర్ట్ చేయడానికి ట్రై చేయకు" అన్నాను కోపంగా.

అతను నడుస్తున్నవాడల్లా ఉన్నట్టుండి ఆగిపోయాడు.

"తన్మయీ! అప్పట్లో నువ్వంటే నాకు కోపంగా వుండేది. ఆరోజు, క్లాస్‌రూంలో నువ్వొక్కదానివే వున్నావు.

నీ పక్కనే గోడమీద బల్లి వుంది. నీకు బల్లి అంటే భయమని నాకు తెలుసు. నిన్ను ఎటూ కదలకుండా చేసి, నీమీద దాన్ని పడేయాలని వచ్చాను. కానీ నేనాపని చేయలేకపోయాను.

కానీ నువ్వనుకున్నట్టు వేరే ఉద్దేశ్యంతో నిన్ను తాకలేదు" నా మొహం మీద నుంచి చూపులు పక్కకి తప్పిస్తూ అన్నాడు.

"కానీ నాకు అలా అనిపించలేదు. నువ్వు ఏ ఉద్దేశ్యంతో వచ్చినా నా కళ్ళలోకి చూస్తూనే దారి తప్పినట్టూ. నీ మనసులోపల అంతర్లీనంగా ఉన్నదేదో పైకి పొంగివచ్చినట్టు అనిపించింది" ఈ మాటలు అతనితో చెప్పాలనిపించినా, చెప్పలేదు.

"ఎనీవే యిన్ని సంవత్సరాల తర్వాత కూడా నువ్వు గుర్తుపెట్టుకుని అడిగావంటే, నీకు నా మీద చాలాకోపం వచ్చివుంటుంది.

అయామ్ సారీ" చెప్పాడతను సిన్సియర్‌గా.

"నిజంగా కోపం రాలేదు. కానీ యిప్పుడు నువ్వంటున్న మాటలకి కోపం వస్తుంది" ఈ మాటలు కూడా నా మనసులోనే ఆగిపోయాయి.

అప్పటికే, దాదాపుగా యింటిదాకా వచ్చేశాం.

ఇంతలో, ఓ పదేళ్ళ కుర్రాడు పరిగెత్తుకుంటూ మా దగ్గరికి వచ్చాడు. ఆ అబ్బాయి చేతిలో రంగురంగుల గులాబీలు కలిపి కట్టిన అందమైన బొకే ఒకటి వుంది.

"తన్మయి అంటే నువ్వేనా?" ఆయాసపడుతూ అడిగాడు నన్ను.

"అవును.."

"అయితే.. యిది నీకే" అని బొకేని గబుక్కున నాచేతిలో పెట్టి తుర్రుమని పారిపోయాడు.

"ఏయ్! ఆగు ఎవరిచ్చారిది?" నేను అరుస్తూనే వినిపించుకోకుండా పరిగెత్తాడు.

నేను ఒకసారి ఆ బొకే వంక చూశాను.

తాజా గులాబీలతో చాలా అందంగా వుంది. పంపినవారి నేమ్ ట్యాగ్ కోసం బొకేని అటూ యిటూ తిప్పి చూశాను.

ఎక్కడా కనిపించలేదు.

"ఎవరు పంపించి వుంటారు?" అంటూ యధాలాపంగా తలెత్తి సందీప్ వైపు చూశాను.

"ఎవరో యిడియట్! యిక్కడే ఎక్కడో వుండివుంటాడు" సందీప్ మొహం కోపంతో ఎర్రబడింది.

వెంటనే పెద్ద పెద్ద అంగలేస్తూ వీధి మలుపు దాక వెళ్ళిచూశాడు.

ఎవరూ కనిపించినట్టులేదు. చేతులు దులుపుకుంటూ కోపంగా వెనక్కి వచ్చాడు.

"పిరికి వెధవ పారిపోయి వుంటాడు" సందీప్‌కి కోపం తగ్గలేదు. ఎర్రబడి ముడుచుకుపోయిన అతని మొహం చూసి నాకు నవ్వొచ్చింది.

"ఏంటి నీ ఉద్దేశ్యం? అందమైన అమ్మాయికి ఎవరూ పూలబొకే యివ్వకూడదా అన్నాను తమాషాగా భుజాలెగరేస్తూ.

"చాలు అర్థం అయ్యింది" అన్నాడతను విసుగ్గా.

నేను, నా చేతిలోని బొకేని సరదాగా అటూ యిటూ తిప్పి చూశాను.

**ఆ పూలని** చూస్తుంటే స్వప్న ప్రపోజల్ గురించి చెప్పినప్పుడు నాకు వచ్చిన ఊహలు గుర్తొచ్చాయి.

"బీచ్ ఒడ్డున సందీప్ నన్ను ప్రపోజ్ చేస్తున్నట్టూ.. ఎవరో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గారి అమ్మాయి కదూ అని అరిచినట్టూ నేను పారిపోతే, నలిగిపోయిన గులాప్పూవు చేతిలో పట్టుకుని నా వెనకాలే పరుగెత్తి వస్తున్నట్టు ఊహించుకున్న సీన్లు గుర్తొచ్చి నవ్వొచ్చింది.

"నవ్వింది చాలు. ఆ బొకే యిక్కడే వదిలెయ్. అది ఎవరు పంపించారో నువ్వు దాన్ని యాక్సెప్ట్ చేసి, వాళ్ళని ఎంకరేజ్ చెయ్యక్కర్లేదు" సందీప్ కోపంగా అన్నాడు.

"ఇంత అందమైన పూలని రోడ్డు మీద వదిలేయాలా? అసలు అందమైన గిఫ్ట్‌లని ఎందుకు యిస్తారో నీకు తెలుసా? మనకి వాటిని పారేయాలనిపించినా, మనసురాక, యాక్సెప్ట్ చేసేస్తామని. అయినా నువ్వెందుకు వర్రీ అవుతున్నావ్? ఈ బొకే నాకు వచ్చింది. నేను డిసైడ్ చేస్తాను" అన్నాను పంతంగా.

"యస్! యు ఆర్ రైట్" విసుగ్గా చెప్పాడతను.

"థాంక్యూ! యింటిదాకా వచ్చినందుకు. ఇందాక మీ అమ్మగారు అంటుంటే విన్నాను. నాలుగురోజుల్లో నీకొక యింటర్వ్యూ వుందని. ఈసారి అంతా మంచే జరుగుతుంది. ఆల్ ద బెస్ట్" అన్నాను నవ్వుతూ.

అతని మూడ్ యింకా మామూలుగా మారలేదని, అతని మొహం చూస్తూనే అర్థమైంది నాకు.

మరింకేమీ మాట్లాడకుండా వెనక్కి తిరిగాడు.

నేనూ గేట్ తీసుకుని లోపలికి నడిచాను. రెండడుగులు వేసి, మళ్ళీ వెనక్కి తిరిగి బైటికి వచ్చి చూశాను. సందీప్‌ని వెనకనుంచి రెండు క్షణాలు చూసి, నా చేతిలోని బొకేని ఎక్కడ అందుకున్నానో అక్కడే రోడ్డుమీద వదిలేసి వెనక్కి తిరిగాను.

తెల్లవారి ఆరింటికల్లా ఎప్పటిలా చిత్ర వచ్చింది. నిన్నటి సాయంత్రం నన్ను చూడనట్టే, ఏమీ తెలియనట్టే తన పని ప్రారంభించింది.

కానీ నేను మాత్రం ఎప్పటిలా ఉండలేకపోయాను. సందీప్ ఆమెని డ్రాప్ చేసి, యింకా అక్కడే వున్నాడా? పొద్దున్నే వచ్చాడంటే నైట్ సూట్‌లో వుండివుంటాడా?

ఎర్లీబర్డ్ అనుకుంటూ లేకపోతే ఆరింటికల్లా చిత్రని వాళ్ళింటి దగ్గర ఎక్కించుకుని యిక్కడ డ్రాప్ చేయడం సాధ్యమేనాలాంటి ప్రశ్నలన్నీ బుర్రని తొలిచేస్తుంటే దొంగలాగా కిటికీ సందుల్లో నుంచి సందీప్ కనిపిస్తాడేమో అని చూశాను.

కానీ బైట చెట్లు ఎదురువాళ్ళ బిల్డింగు తప్ప యింకేమీ కనిపించలేదు.

చిత్ర కాలు మీద ఎక్కువగా స్ట్రెస్ పడని ఆసనాలు వేయించి, త్వరగానే వెళ్ళిపోయింది. చిత్ర వెళ్ళిపోయాక బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళాను.

"తన్మయీ స్నానం చేయకుండానే బ్రేక్‌ఫాస్ట్‌కి వచ్చావు యివాళ" నా అవతారం చూసి అడిగింది అమ్మ.

"ఆకలిగా వుంది" అన్నాను బ్రెడ్‌టోస్ట్ అందుకుంటూ.

అమ్మ ఒక్క క్షణం నా మొహంలోకి పరీక్షగా చూసింది. 'మరీ పొద్దున్నే లేవడం నీకు అలవాటులేదుగా. అందువల్ల అలిసిపోతున్నావేమో! పోనీ చిత్రని రావొద్దని చెప్పేదా?' అంది.

"నో అమ్మా! అలాంటిదేం వద్దు. నీకు తెలుసా, చిత్ర వాళ్ళమ్మ చిత్ర చిన్నపిల్లగా వున్నప్పుడే చనిపోయిందట. ఈ యోగా క్లాసుల డబ్బులతో కాలేజ్ ఫీజ్ కట్టుకుంటుందిట" చెప్పాను.

"సరే!" అమ్మ నా వంక మెచ్చుకోలుగా చూసింది.

"మరి నీ కెరీర్ గురించి ఏం ఆలోచించావు? జాబ్స్‌కి అప్లై చేస్తున్నావా? ఇంకేమన్నా ప్లాన్స్ వున్నాయా?" కాఫీ కప్పు అందుకుంటూ అడిగింది.

"ఇంకా ఏమీ డిసైడ్ చేసుకోలేదు. కొద్దిగా ఆలోచించి చెప్తాను" అన్నాను సీరియస్‌గా.

"ఏదో ఒకటి త్వరగా డిసైడ్ చేసుకో"

"అలాగే" తలూపాను.

"అర్జంటుగా మా యింటికి రా" స్వప్న మెసేజ్ చూసుకుని, లంచ్ అవుతూనే, బయల్దేరి వెళ్ళాను.

"హమ్మయ్య! నువ్వు వచ్చేశావ్. పద మనం కాలేజీ దాకా వెళ్ళొద్దాం" తలుపు తీస్తూనే చెప్పింది స్వప్న.

"అమ్మ ఫ్రెండ్ సువర్చల ఆంటీ నీకు తెలుసు కదా. మనం చదివేటప్పుడు లెక్చరర్‌గా వుండేది. ఇప్పుడు ప్రిన్సిపాల్ అయ్యింది. వాళ్ళ అమ్మాయికి అమెరికా పంపించడానికి డ్రెసెస్ కావాలిట" స్వప్న చెబుతూనే వుంది.

"బాబోయ్ షాపింగ్‌కా. నేను రాను" కంగారుగా అరిచాను.

"అబ్బా! అంత టెన్షన్ పడకు. మా అమ్మ ఆల్రెడీ షాపింగ్ చేసేసింది. నా కోసం అంటే చెయ్యదు కానీ ఫ్రెండ్‌కి అంటే మాత్రం ఆఘమేఘాల మీద కానిచ్చేసింది. మనం చెయ్యాల్సిందల్లా, సువర్చల ఆంటీకి 'హలో' చెప్పి ఆ బ్యాగ్ యిచ్చేసి రావడమే" చెప్పింది వివరంగా.

నేను ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టాను.

"ప్లీజ్ రావే తల్లీ! ఆవిడసలే జిడ్డు. నువ్వొస్తే కనీసం నీ పేరు చెప్పి తప్పించుకుందామని నా ప్లాన్" అంటూ పరుగున వెళ్ళి, ఒక్క నిముషంలో బ్యాగ్‌తో వచ్చి నిలబడింది.

ఇద్దరం స్వప్న కారులో కాలేజీకి వెళ్ళాం.

నాలుగేళ్ళ క్రితం మేం ట్రాన్స్‌ఫర్ అయి ఈ టౌన్ వదిలి వెళ్ళేవరకూ నేను అక్కడే చదివాను.

అర్ధచంద్రాకారంలో వరుసగా కట్టిన క్లాస్‌రూమ్స్. వాటికి ఎదురుగా విశాలంగా వున్న ఖాళీస్థలం. మధ్యలో పెద్దగా, ఎత్తుగా వున్న రావిచెట్టు, దాని చుట్టూ గుండ్రంగా కట్టిన అరుగు.

'ఫైకస్ రెలిజియోజ', రావిచెట్టు శాస్త్రీయనామం చిన్న రేకు మీద పెయింట్‌తో రాసి, చెట్టుకి వేళ్ళాడదీసి వుంది.

"హే! మై ఫేవరెట్ స్పాట్" అనుకుంటూ హుషారుగా వచ్చి రావిచెట్టు కింద కూర్చున్నాను. స్వప్న కూడా నా వెనకాలే వచ్చింది.

"ఈ చెట్టు ఆకులు గలగలమని శబ్దం చేస్తుంటే వినడం చాలా యిష్టం నాకు. మనం హేపీగా వున్నప్పుడు మనతోబాటూ సందడి చేస్తూ ఒంటరిగా అనిపించినప్పుడు మనలో నిశ్శబ్దాన్ని తరిమేస్తున్నట్టు వుంటుంది కదా ఈ ఆకుల చప్పుడు. అరోమా థెరపీలాగా ... యిది సౌండ్ థెరపీ" అన్నాను స్వప్నతో.

"ఆ!!c మా బామ్మకి ఆ పెద్ద టి.వి యిచ్చిన ఎఫెక్టు. నీకు ఈ చెట్టు యిస్తుందన్నమాట. కానీయ్. ఎంజాయ్ చేస్కో. నేను ప్రిన్సిపాల్ రూంకి వెళ్ళొస్తాను" చెప్పి ఎడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వైపుకి నడిచింది స్వప్న.

"తన్మయీ" ఎవరో పిలిచినట్టు వినిపించింది.

"నిరంజన్" ఎదురుగా నిలబడ్డ వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. చక్కగా యిస్త్రీ చేసిన షర్టూ, పాంటూ, పక్కకి దువ్విన క్రాఫూ, కళ్ళజోడుతో ఎప్పటిలాగే వున్నాడు.

"నువ్వు మళ్ళీ యిక్కడికి వచ్చావని నాకు కనీసం చెప్పనేలేదు" కంప్లైంట్ చేస్తున్నట్టు అన్నాడు.

"జస్ట్ కొద్దిరోజులే అయ్యింది. అమ్మకి యిక్కడికే ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అవునూ నువ్విక్కడ ఏంటి?" అడిగాను.

"ఇప్పుడు ఈ కాలేజీలోనే లెక్చరర్‌గా చేస్తున్నాను." చెప్పి నా ఫీలింగ్స్ చదవడానికన్నట్టుగా నా మొహంలోకి చూశాడు.

నేను ఏమీ మాట్లాడలేదు.

"నిజానికి యింత చిన్న జాబ్ చేయాల్సిన అవసరం నాకు లేదు. నీకు తెలుసుగా. మాది రిచ్ ఫ్యామిలీ అని. అయినా, నాకు వర్క్ వేల్యూ తెలుసు. ఆ పొగరుబోతు సందీప్‌లాగా కాదు నేను. అసలు, మొదట ఈ జాబ్ ఆఫర్ వాడికే యిచ్చారు. కానీ నాకు యిష్టంలేని పని చేయలేను" అని రిజెక్ట్ చేశాడట.

"సందీప్‌తో వీడి వైరం యింకా కంటిన్యూ అవుతుందన్నమాట. కాలేజ్‌లో ఉన్నన్నాళ్ళూ యిద్దరూ ఆపోజిట్ క్రికెట్ టీమ్స్‌లో వుండి తెగ కొట్టుకునేవాళ్ళు" చిన్నగా పైకే అనేశాను.

"ఏమన్నా అన్నావా?" అడిగాడు నిరంజన్ వెంటనే.

"ఊహూ"

"నాకు తెలుసు. నువ్వేమనుకుంటున్నావో. ఆ సందీప్ మీ యింటిపనులూ అవీ చేస్తుంటాడుగా. వాడిమీద నీకు సాఫ్ట్‌కార్నర్ ఉండొచ్చు. బట్ నో అఫెన్స్. ఒక మాట చెప్తాను. నిన్న నైట్ నిన్ను సందీప్‌తో చూశాను. ఐ వార్న్ యూ. దూరంగా వుండు వాడికి."

నిరంజన్ మాటలు వింటూంటే, నాకెందుకో అనుమానం వచ్చింది. "ఆగు! నిన్న నాకు ఫ్లవర్స్ పంపింది నువ్వేనా?" అడిగాను కూర్చున్న చోటినుంచి లేచి నిలబడుతూ.

వెంటనే, నిరంజన్ మొహం వెలిగిపోయింది.

"ఈ విషయం నీకు ఎలా చెప్పాలా అని తెగ మధనపడిపోతున్నాను. కానీ, నువ్వే కనిపెట్టేశావు. నిన్న నీ పక్కనే ఆ సందీప్‌గాడు వుంటే అనవసరంగా గొడవ జరుగుతుంది. నీ మూడ్ చెడిపోతుంది. అది నాకిష్టంలేదు. ఎనీవే.. థాంక్యూ ఫర్ యాక్సెప్టింగ్ ద ఫ్లవర్స్. ఐ యామ్ సో హేపీ" అన్నాడు మెలికలు తిరిగిపోతూ.

"హూ!!" ఏమనాలో తెలియక నిట్టూర్చాను. ఇంతలో స్వప్న ప్రిన్సిపాల్ రూం నుంచి బైటికి రావడం చూసి ప్రాణం లేచొచ్చింది."

"స్వప్నా! వస్తున్నా" అని ఒక్క కేకపెట్టి వెనక్కి తిరిగి చూడకుండా పరిగెత్తాను.

"ఇందాక నేను వదిలివెళ్ళినప్పుడు మంచి మూడ్‌లో వున్నావు. ఇంతలోనే ఏమయ్యింది?" నన్ను ఎగాదిగా చూస్తూ అడిగింది స్వప్న.

"నిరంజన్ వచ్చాడు. ఇక్కడే లెక్చరర్‌గా వర్క్ చేస్తున్నాడట. వస్తూనే, సందీప్ మీద కంప్లైంట్లు మొదలు పెట్టాడు. వీళ్ళు యింకా కొట్టుకుంటూనే వున్నారులా వుంది" చెప్పాను స్వప్నతోబాటూ పార్కింగ్ వైపుకి నడుస్తూ.

"ఆ! వీడు అనేదానికి తగ్గట్టుగానే, ఆ సందీప్‌కి ప్రతిదీ ఎదురొస్తూ వుంటుంది. వాళ్ళ అమ్మ ఏదో మంచి జరగాలని యింట్లో భజన పెట్టించిందట నిన్న. ఆ వచ్చినవాళ్ళలో ఎవరో సందీప్ లాప్‌టాప్ కొట్టేశారట. పూర్ గై" చెప్పింది స్వప్న.

"ఓ.. మైగాడ్" నిజంగానే బాధగా అనిపించింది నాకు.

"తన్మయీ నువ్వేంటిక్కడ?" క్రికెట్ గ్రౌండ్‌లోకి వస్తూనే, నన్ను చూసి ఆశ్చర్యంగా అడిగాడు వెంకట్.

"ఏం రాకూడదా?" బెంచీ మీద నుంచి లేస్తూ అన్నాను.

"మామూలుగా మా క్రికెట్ బ్యాట్, బాల్‌ని చూస్తూనే ఎగిరిపడతావు కదా! అందుకని అడిగాను" నవ్వుతూ అన్నాడు.

"ముందీ విషయం చెప్పు. సందీప్ హైదరాబాద్ నుంచి వచ్చాడా? యింటర్వ్యూ ఎలా జరిగింది?" అడిగాను ఆరాటంగా.

"ఓహో! తమరు యిక్కడికి రావడానికి కారణం అదన్నమాట" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

"ప్లీజ్.. వెంకట్" అన్నాను వారిస్తున్నట్టుగా.

"ఓకే..ఓకే వాడికి జాబ్ రాలేదు. రాదుకూడా" అన్నాడు రెండు చేతులూ పైకెత్తుతూ.

ఆ మాటతో నా మొహం పాలిపోయింది. వెంకట్‌ని కొట్టాలన్నంత కోపం కూడా వచ్చింది.

నేను నోరు తెరిచేలోపల వెంకట్ మళ్ళీ చెప్పాడు. "వాడసలు యింటర్వ్యూకి వెళ్ళలేదు. వెళ్ళకపోవడం ఏమిటి? అసలు జాబ్‌కే అప్లై చెయ్యలేదు. వాడొక ఆగ్రో కంపెనీ పెట్టాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఇంటర్వ్యూ పేరు చెప్పి, లైసెన్సులు, పర్మిటు కోసం తిరుగుతున్నాడు. వాళ్ళింట్లో సంగతులు నీకు తెలుసో తెలియదో. వాళ్ళ నాన్నకి సొంత ఆలోచనలేదు. ఆయనకి వచ్చే జీతం యింటి ఖర్చులకే సరిపోదు. దీకి తోడు చిత్ర వాళ్ళ ఫ్యామిలీని కూడా వీళ్ళే పోషించాలి.

సందీప్ వాళ్ళమ్మ పైకి కనిపించినంత మెత్తని మనిషికాదు. ఆవిడ అనుకున్నది జరిగిపోవాలి. లేకపోతే ఇంట్లో ఎవ్వరినీ ప్రశాంతంగా ఉండనీయదు. మొన్నటికి మొన్న ఏదో భజనో, పూజో, అంటే, ఐదువేలు అప్పు నా దగ్గరే తీసుకున్నాడు. ఇంకా సుమ యింజనీరింగ్ కాలేజీకి ఫీజులు కట్టాలి.

ఇప్పుడు వీడు జాబ్ చేయడం, వాళ్ళ పరిస్థితుల్ని బట్టి అత్యవసరం. అయినా, వీడు జాబ్ చెయ్యను. అనుకున్నదే సాధించాలి అనే మొండి ఘటం. మాధవ్ దగ్గర పనిచేస్తే వ్యాపారంలో అనుభవం వస్తుందని చేరాడంతే. రేపో మాపో అదికూడా మానేస్తాడు.

ఇప్పుడీ వ్యాపారం విషయంగా తిరుగుతున్నాడని తెలిస్తే యింట్లో గొడవలౌతాయని అలా అబద్ధం చెప్పాడు"

వెంకట్ చెప్పింది విని, నేను ఆశ్చర్యపోయాను.

"ఓ.. అదన్నమాట సంగతి. సరే ఇది సందీప్‌కి యివ్వు నువ్వు ఏం చెప్తావో నాకు తెలియదు. కానీ, నేను యిచ్చినట్టు మాత్రం తెలియకూడదు. నేనిచ్చానని తెలిస్తే అస్సలు తీసుకోడు" అంటూ, బెంచీమీద వున్న బాక్స్‌ని తీసి, వెంకట్ చేతిలో పెట్టబోయాను.

"హాయ్! వెంకట్" అంటూ సందీప్ అప్పుడే అక్కడికి వచ్చాడు.

"తన్మయి కూడా యిక్కడే వుందే" అంటూ నా వైపు చూసి నవ్వాడు.

అదే అదనుగా వెంకట్ ఠక్కున తన చేతిని వెనక్కి తీసేసాడు.

"తన్మయి నీ కోసమే వెయిట్ చేస్తూ వుంది. నీకేదో యివ్వాలట" అంటూ ఎప్పటిలా యిరికించేసి వెళ్ళిపోయాడు.

"ఈ వెంకట్‌ని ఛస్తే నమ్మకూడదు" కోపంగా చూస్తూ ఉండగానే, సందీప్ వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.

"ఇది..ఇది నా దగ్గర ఊరికే పడివుంది. నేనెలాగూ వాడట్లేదు. నీకేమైనా ఉపయోగపడుతుందేమోనని తెచ్చాను" అంటూ నా చేతిలోని బాక్స్‌ని అతని చేతిలో పెట్టాను.

"ఏంటిది?" అంటూ అక్కడే నా ముందే తీసి చూశాడు.

"మాక్ బుక్ ప్రో.. లాప్‌టాప్. బ్రాండ్ న్యూ. సారీ నేను తీసుకోను. అయినా ఎందుకు తెచ్చావు యిది?" సూటిగా నా మొహంలోకి చూస్తూ గట్టిగా అడిగాడు.

"ఎందుకంటే చెప్పానుగా. నేను వాడడంలేదు. కనీసం నీకైనా ఉపయోగిస్తుందని తెచ్చాను" అన్నాను చేతులు నులుముకుంటూ.

"సారీ ఐ కాన్ట్ టేకిట్" చెప్పి. లాప్‌టాప్ నా చేతిలో పెట్టి వెనక్కి తిరిగాడు.

నేను గబుక్కున అతని ముందుకి వెళ్ళి అడ్డంగా నిలుచున్నాను. "నువ్వు మామూలుగానే ఎవరు గిఫ్ట్ యిచ్చినా తీసుకోవా? లేకపోతే నేను యిచ్చానని వద్దంటున్నావా?" అడిగానతన్ని.

"తన్మయి ప్లీజ్ అడ్డులే" విసుగ్గా అన్నాడు.

"నువ్వు జవాబు చెప్పేదాకా నేనిలానే వుంటాను" అన్నాను మొండిగా. అ

అతను కింద పెదవిని ఒత్తిపెట్టి చిరాకుగా చూశాడు.

"ఎందుకింత దయ చూపిస్తున్నావు నా మీద? మీ అమ్మ ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని మా చేత నానా చాకిరీ చేయించుకుంటుంది. ఇప్పుడు నువ్వు. నీ దయ మామీద చూపించి జీవితాంతం కట్టుబానిసల్ని చేయాలనా? మమ్మల్ని యింకా వాడుకుందామా? నువ్వు అసలు ఎందుకు నా లైఫ్‌లో యింట్రస్ట్ చూపిస్తున్నావు? నువ్వూ వద్దూ నీ గిఫ్టూ వద్దు. వదిలెయ్ ప్లీజ్" ఆవేశంగా అన్నాడతను.

"కాదూ" గట్టిగా అరవాలనిపించింది.

"నీ మీద ప్రేమతో తెచ్చాను. నువ్వు యిబ్బందిపడుతుంటే, చూడలేక తెచ్చాను" అని చెప్పాలనిపించింది. కానీ చెప్పలేకపోయాను.

"ఇక ఎప్పటికీ, మా మధ్య రిలేషన్ యిలాగే వుంటుందా? ఇది మారదా? నేనిచ్చే గిఫ్టే అతను తీసుకోవడంలేదు. యిక నేనంటే యిష్టం ఎలా వుంటుంది"

ఈ ఆలోచన వస్తూనే మనసులో నుంచి బాధపొంగుకు వచ్చింది. కళ్ళనుంచి జలజలా నీళ్ళు కారాయి.

హఠాత్తుగా నా కళ్ళల్లో నీళ్ళు చూస్తూనే అతను మెత్తబడ్డాడు.

"తన్మయీ నేను నిన్ను హర్ట్ చేయాలనే ఉద్దేశ్యంతో అలా అనలేదు. కానీ యిదంతా చూస్తుంటే, అలాగే అనిపిస్తుంది నాకు. ప్లీజ్. యిది నేను తీసుకోలేను" ఈసారి నెమ్మదిగా చెప్పాడు.

అతని మాటలతో నాకు కాస్త ధైర్యం వచ్చింది.

"తన్మయీ అతను మెత్తబడ్డాడు. ఈ అవకాశాన్ని వాడుకో" లోపల అంతరాత్మ సలహా యిచ్చింది. వెంటనే ఆ సలహాని అమలులో పెట్టాను.

"సందీప్ నువ్వు నన్ను ఓ ఫ్రెండ్‌లా చూడకపోయినా, నేనెప్పుడూ నిన్ను ఓ మంచి స్నేహితుడిలానే చూశాను.

చిన్నప్పటినుంచి, నువ్వు నన్ను విసుక్కున్నా, ఛీదరించుకున్నా, ఎగతాళి చేసినా, నీ వెనకాలే తిరిగాను. నేనెలాంటిదాన్నో నీకు తెలుసు. నిజంగా నిన్ను అవమానించాలని నేనీ లాప్‌టాప్ తేలేదు. నీ లాప్‌టాప్ పోయిందని తెలిసింది. నువ్వు యిబ్బంది పడుతున్నావేమో అని ఆలోచించి నీకోసం తెచ్చాను.

నీ బిజినెస్‌కి ఉపయోగపడుతుందని తెచ్చాను. ఏం వెంకట్ యిస్తే నువ్వు తీసుకోవా?" ఏడుస్తూనే మొత్తం చెప్పి అతను వంక చూశాను.

నేనాశించిన మార్పు అతని మొహంలో కనిపించింది. అది నేను చెప్పిన మాటలవల్ల రాలేదు. తడిగా వున్న నాకళ్ళు, ఎర్రబడ్డ చెంపలు కందిపోయి అదురుతూవున్న నా పెదవులూ ఆ పనిచేశాయి.

ఎందుకంటే అతని చూపులు అక్కడే తిరుగుతూ వున్నాయి.

"నువ్వు యిది తీసుకోకపోతే నా మీద ఒట్టే. కావాలంటే నీ దగ్గర డబ్బు వచ్చాక నాకు యిచ్చెయ్యి" ఆఖరి ఋణం వదిలాను.

"సరే" అతను ముందుకి వంగి నా చెంపలమీద తడిని వేలితో నెమ్మదిగా తుడిచాడు.

అతనూ, ఏదో అర్థంకాని అయోమయ స్థితిలో ఉన్నాడని నా మనసుకి అర్థం అయ్యింది.

"ఒక అమ్మాయి అతని గురించి అంతలా ఆలోచించడం అతని కోసం కన్నీళ్ళు పెట్టుకోవడం అతన్ని కదిలించిందేమో? అతనికీ యిది ఓ కొత్త అనుభూతి అయ్యుంటుది.

నా మనస్సు ఈ విధంగా బైటపడిపోయింది. అతను ఖచ్చితంగా గ్రహించే వుంటాడు" అలా అనుకోగానే సూటిగా అతని కళ్ళలోకి చూడలేకపోయాను.

"ఇక ఈ లాప్‌టాప్ నీది" అంటూ లాప్‌టాప్ బ్యాక్స్‌ని అతని చేతిలో పెట్టి వెనక్కి తిరిగాను.

"ఆగు" నా చెయ్యిపట్టుకుని ఆపాడు సందీప్.

"ఇందాక నీ బిజినెస్‌కి ఉపయోగిస్తుందని దీన్ని తెచ్చాను అన్నావు. నా బిజినెస్ గురించి నీకు ఎవరు చెప్పారు? వెంకటేనా?"

''అవును. కానీ నువ్వేం కంగారు పడకు. నీ అంతట నువ్వు చెప్పేదాకా నేనీ విషయం ఎవరికీ చెప్పను. సరేనా'' చెప్పానతనికి.

''థాంక్యూ''

ఆ మాట అంటున్నప్పుడు అతని చూపులు, నా చూపులతో కలుసుకున్నాయి. అతని కళ్ళలో నేను చూడాలనుకున్న భావమేదో తళుక్కున మెరిసింది. నేను సంతృప్తిగా వెనుతిరిగాను.

అమ్మ ఆఫీసుకి వెళ్ళగానే స్వప్న వాళ్ళింటికి వెళ్ళాన్నేను. కాలింగ్‌బెల్ కొడుతూనే స్వప్న వచ్చి తలుపు తీసింది. రెండు చేతులకీ నల్లరంగు అంటుకుని వున్న గ్లౌవ్స్‌తో కష్టపడి తలుపుని మోచేతులతో, ముందుకి నెట్టడానికి ప్రయత్నిస్తూ వుంటే నేనే తలుపు తీసి లోపలికి వచ్చాను.

''ఏం చేస్తున్నావ్?'' స్వప్న గ్లౌవ్స్‌కి అంటిన రంగుని చూస్తూ అడిగాను ఆశ్చర్యంగా.

ఇంతలో ''అమ్మాయ్ ఎవరే వచ్చింది? సగంలో పని ఆపి వెళితే ఎలా?'' లోపలనుంచి అన్నపూర్ణమ్మగారి గొంతు ఖంగుమంది.

''మన `తనూ`నే బామ్మా! ఉండు వస్తున్నా'' చెప్పి, నా వైపు చూసి చిలిపిగా కన్నుగీటింది.

''మనం తెచ్చిన చీరెల రంగులకి బామ్మ తెల్లజుట్టు సరిగ్గా మ్యాచ్ అవలేదుట అందుకే బామ్మ జుట్టుని డై చేస్తున్నా'' అన్నపూర్ణమ్మగారి గదిలోకి నడుస్తూ చెప్పింది.

లోపల సగం తెల్లజుట్టు, సగం నల్లజుట్టు విరబోసుకుని కూర్చున్న బామ్మగారిని చూస్తే నాకు నవ్వాగలేదు.

''సారీ బామ్మా! మిమ్మల్ని చూసి ఎగతాళిగా నవ్వడంలేదు. ఇది చేసిన పని వల్ల నవ్వొస్తోంది'' పొట్టపట్టుకుని నవ్వుతూనే సంజాయిషీగా చెప్పాను.

''ఫర్వాలేదులేవే. నన్ను చూసి మొహం తిప్పుకుని పోకుండా కనీసం నవ్వుతున్నారు. నాకు సంతోషమే. నువ్వూ మా స్వప్నలాంటిదానివే నాకు నేనేం అనుకోను'' అంది భోళాగా.

''మరి నువ్వు త్వరగా పనికానిస్తే మనం ఎంగేజ్‌మెంట్ షాపింగ్‌కి వెళ్దాం. అన్నట్టు తనీష్ కూడా వస్తున్నాడా?'' అడిగాను స్వప్నని.

''లేదు బిజీగా వున్నాడట. నా షాపింగ్ వరకు మనం చేస్తున్నాం. మిగతావి అమమ చూసుకుంటుంది.''

"సరే అయితే నువ్వు బొమ్మ జుట్టికి సరిగ్గా అతికీ అతకకుండా గబగబా రంగువేసిరా వెనక పక్క ఎలా వుందీ అనేది ఎలాగూ బొమ్మకి కనపడదు కదా! ఇంతలో నేను అమ్మకి మెసేజ్ పెట్టి వస్తాను" అని తమాషాగా నవ్వుతూ తలుపు దగ్గరికి వేసి బైటికి వచ్చాను. మాధవన్నయ్య ఆఫీస్ రూం బాల్కనీ దగ్గర సందీప్ నిలబడి వున్నాడు. లోపల మాధవన్నయ్య, అంకుల్ యిద్దరూ కనిపించలేదు. అతని వాలకం చూస్తే నాకోసమే ఎదురుచూస్తున్నట్టనిపించింది.

"నువ్వేంటిక్కడ?" అతని దగ్గరకి వెళ్ళి అడిగాను."

"మీ నవ్వులు బైటిదాకా వినిపిస్తున్నాయి. ఖచ్చితంగా నువ్వు వచ్చివుంటావని ఊహించి, వెయిట్ చేస్తున్నాను" చెప్పాడు.

"తనూ.. లోపలినుంచి అంతరాత్మ ఆనందంగా అరిచింది. సందీప్ నీకోసం వెయిట్ చేస్తున్నాడు చూశావా? ఇలాంటి రోజు రానే వచ్చింది"

"ష్..." అంతరాత్మని ఊరుకోబెట్టాను.

సందీప్ నా వంక విచిత్రంగా చూశాడు

"ఏంటి నీలో నువ్వే మాట్లాడుకుంటూ వుంటావా?" అడిగాడు అనుమానంగా.

**నేను నవ్వాను.**

"నువ్వూహించినట్టు నాకే మెంటల్ ప్రాబ్లెమ్స్ లేవుగానీ నేనడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పు ముందు.

"నువ్వేంటిక్కడ?" అంటే యిలా తలుపు దగ్గర ఎందుకు నిలబడ్డావు? అనికాదు.

ఇంకా ఆఫీసుకి ఎందుకు వస్తున్నావూ అని. నువ్వింకా యిక్కడే పనిచేస్తుంటే నీ సొంత కంపెనీ పనులు ఎప్పుడు మొదలు పెడతావు?" అడిగాను దబాయింపుగా.

"అన్నీ ఏర్పాట్లు చేసుకుంటున్నాను. త్వరలోనే ఈ జాబ్ కూడా మానేస్తాను. మాధవ్‌కి కూడా ఈ విషయం తెలుసు. మాధవ్ సలహాలతోనే ముందుకి వెళుతున్నాను" చెప్పాడు.

నేను అర్థం అయినట్టు తలాడించాను.

"మరి యింట్లోవాళ్ళని ఎలా మేనేజ్ చేస్తాడో" అనుకున్నాను కానీ ఆ విషయం అడగలేకపోయాను.

ఇక మాట్లాడడానికేమీ లేదన్నట్టు యిద్దరం కాసేపు మౌనంగా నిలబడ్డాం. ఏదో అయస్కాంతశక్తి పట్టిలాగినట్టు. యిద్దరం అక్కడ నుంచి కదల్లేదు. అతను నా వెనకాల ఏదో చూస్తున్న నెపంతో నా మెడవంపునీ, నా జుట్టుతో దోబూచులాడుతున్న నా చెవి జుంకాని చూస్తూ వున్నాడు.

నేను కళ్ళు దించుకుని కిందకి చూస్తున్నట్టు నటిస్తూ, క్రికెట్ ఆడీ ఆడీ గట్టిబడ్డట్టున్న అతని చేతికండరాల్ని, మధ్య మధ్యలో నా మీదే అతుక్కుపోతున్న అతని చూపుల్నీ గమనిస్తూ నిల్చున్నాను. "తనూ! ఎక్కడున్నావ్?" ఉన్నట్టుండి స్వప్న కేక వినిపించడంతో తుళ్ళిపడ్డాను.

గబగబా అడుగులు ముందుకి వేస్తూ ధడాలున సందీప్‌ని ఢీకొట్టాను. అప్పటికి అర్ధమైంది. గజిబిజిగా వున్న నా మెదడు పొరబాటు చేసిందని. అతనూ నా పొరబాటుని గ్రహించి వెంటనే తప్పుకోలేదు. అంటే అతను కూడా యిదే కోరుకుంటున్నాడా?

నేను అతనికి దూరంగా జరిగే ప్రయత్నం చేయలేదు. అతనికి దగ్గరగా వుంటే ఒక రకమైన గంధం నన్ను చుట్టేసినట్టనిపించింది. అది పెర్ఫ్యూమ్ వల్ల వచ్చింది కాదు. కేవలం అతని వునికిని తెలిపే అతని శరీర పరిమళం.

ఈసారి పూర్తిగా ఏదో మాయలో చిక్కుబడిపోయినట్టే అనిపించింది నాకు. ఇది జరిగింది రెండు క్షణాలపాటే అయినా దాని తాలూకు అనుభూతి సుదీర్ఘంగా నాటుకుపోయింది మనసులో.

క్రమంగా నేను అతని మాయలో నుంచి బైటపడుతూనే నా పరిస్థితి అర్ధమైంది.

నా కుడిచేయి, చెంప అతని ఛాతీకి ఆనుకుని వున్నాయి. అతని స్పర్శని అనుభూతి చెందుతూ ఓ క్షణంపాటు అలాగే వుండిపోయాను.

"నువ్వు వెళ్ళాల్సింది అటు" నవ్వుతూ అంటున్న సందీప్ మాటలు వినిపించాయి.

గబుక్కున, దూరంగా జరిగి అతనివైపు చూశాను.

"తన్మయీ! మళ్ళీ పొరబాటు చేశావు. దొరికిపోయావు" లోపలినుంచి మాటలు వినిపించాయి.

"సరే..సరే.. ఇక చాలు" అనుకుంటూ వెనక్కి తిరిగాను. ఒకసారి మళ్ళీ వెనక్కి తిరిగి అతని కళ్ళలోకి చూడాలనిపించింది. కానీ ఆ పని చేయలేదు.

అతని చూపులు కొంటెగా నా వెంటే వస్తున్నాయని మాత్రం నాకు తెలుసు.

"పద..పద యిప్పటికే లేటయ్యింది" మెట్లు దిగుతూ స్వప్న పిలిచింది. ఎర్రబడ్డ నా మొహాన్ని మామూలుగా ఉంచే ప్రయత్నం చేస్తూ గట్టిగా గాలిపీల్చుకుని స్వప్న వెనకాలే నడిచాను.

ఈసారి షాపింగ్‌కి సిటీకి వెళ్ళాం.

స్వప్నతో ఎంగేజ్‌మెంట్‌కి నేను కూడా కొత్తబట్టలు కొనుక్కున్నాను. మా షాపింగ్ పూర్తయ్యాక హోటల్‌లో లంచ్ చేసి, కార్ పార్కింగ్ దగ్గరికి వస్తుంటే వెంకట్ కనిపించాడు.

"హాయ్ మీరిద్దరూ షాపింగ్‌కి వచ్చారా?" మా చేతుల్లోని బ్యాగ్స్ చూసి అడిగాడు.

"అవును. షాపింగ్ పూర్తయ్యింది. వెనక్కి వెళ్ళబోతున్నాం" చెప్పాన్నేను.

"ఓ.." అని ఒక్క క్షణం ఆగాడు వెంకట్.

"తనూ! ఇఫ్ యూ డోంట్ మైండ్ అలా కాఫీ షాప్‌లో కూర్చుందామా. నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

స్వప్న నా వైపు చూసింది.

"ఓ.కే నేను యింటికి వెళతాను. మీరు కంటిన్యూ అవ్వండి. వెంకట్ నిన్ను డ్రాప్ చేస్తాడు సరేనా?"

"ష్యూర్!" వెంకట్ చెప్పగానే స్వప్న కారులో కూర్చుంది. నేనూ, వెంకట్ ఎదురుగా వున్న కాఫీ షాప్‌లోకి వెళ్ళాం.

"అంటే యిప్పుడు సమస్య డబ్బు అన్నమాట" వెంకట్ చెప్పిందంతా విని సాలోచనగా అన్నాను.

"సందీప్, అన్నీ ముందే కరెక్ట్‌గా ప్లాన్ చేసి పెట్టుకున్నాడు. లైసెన్సులూ, పర్మిట్లూ వచ్చేశాయి. గోడౌన్ కూడా లీజుకి తీసుకున్నాం. వాడి సమస్యల్లా డబ్బే. అందుకే నేను ఎక్కువ పెట్టుబడి పెట్టి పార్ట్‌నర్‌గా చేరతానని చెప్పాను. వాడు మాధవ్ దగ్గర కొంత అప్పుచేసి యింకా కొన్నాళ్ళు జాబ్ చేయగా వచ్చిన డబ్బు పెట్టుబడిగా పెడుతున్నాడు. ప్రస్తుతానికి అన్నింటికీ ఎడ్వాన్స్‌లు మాత్రమే యిచ్చాం. కాకపోతే నాకు ఓ ప్రాబ్లం వచ్చింది. మా నాన్న సంగతి నీకు తెలుసుగా. ఆయన రాజకీయాల్లో ఉన్నాడు. నన్నూ పాలిటిక్స్‌లోకి రమ్మని వత్తిడి చేస్తున్నాడు. పోయినసారి ఎలక్షన్ ప్రచారానికి ఆయనతోబాటు తిరగలేదని, అలిగి నాలుగు నెలలు నాతో మాట్లాడలేదు. నా ఎలవెన్స్‌లన్నీ కట్ చేశాడు. సందీప్‌తో కలిసి బిజినెస్ చేయడం ఆయనకి అస్సలు యిష్టంలేదు. ప్రస్తుతానికి యిది చిన్న బిజినెస్‌లా కనిపిస్తున్నా, దీనికి చాలా స్కోప్ వుంది. డబ్బు వచ్చేకొద్దీ బిజినెస్‌ని పెంచుకోవచ్చు.

ఆ పాలిటిక్స్ అంటే నాకు అస్సలు పడదు. నీకు తెలుసుగా. నాకు బాగా బద్దకం. అందరితో సరిపడదు. నైన్ టూ నైన్ జాబ్ అస్సలు చెయ్యలేను.

అలాగని ఖాళీగా వుండలేను. అందుకే వాడు బిజినెస్‌లో పార్ట్‌నర్‌గా వుంటావా అని అడగ్గానే ఒప్పుకున్నాను.

ఇప్పుడు మా నాన్నని డబ్బు అడిగితే 'ససేమిరా' యివ్వనంటున్నాడు. అమ్మనడిగి కొంత ఎమౌంట్ ఎడ్జస్ట్ చేశాను. బాంక్‌లోన్ తీసుకోవడానికే ప్రోబ్లం అయ్యేట్టుంది. మార్ట్‌గేజ్ పెట్టడానికి ప్రాపర్టీ ఏదైనా చూపించాలి" అన్నాడు గట్టిగా గాలిపీలుస్తూ.

"మొత్తం ఎంత ఎమౌంట్ కావాల్సివస్తుంది?" అడిగాను.

"నిజానికి ఒక్కసారే పెద్ద ఎమౌంట్ కూడా అక్కర్లేదు. మెషినరీకే ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కట్టాలి. రైతులకి సీజనల్ పేమెంట్స్, వర్కర్స్‌కి రెగ్యులర్‌గా యివ్వాలి. కాకపోతే సమయానికి డబ్బు అందకపోతే యిరుక్కుపోతాం.

మాధవ్‌ని యిప్పటికే చాలా అడిగాం. మా నాన్నమీద అస్సలు ఆశలేదు. పోనీ సందీప్ వాళ్ళ యిల్లు ష్యూరిటీ కింద పెట్టి లోన్ తీసుకుందామంటే వాడిదీ నాలాంటి సమస్యే.

వాళ్ళ యింట్లో ఒప్పుకోరు. నిజానికి వాళ్ళకి ఈ బిజినెస్ సంగతే తెలియదు. అయినా మాకున్న బోలెడు ఆస్తుల్ని ష్యూరిటీగా చూపించకపోగా వాళ్ళకున్న ఒకే ఒక్క యింటిని తాకట్టు పెట్టమని ఏ మొహం పెట్టుకుని సలహా యిస్తాను? "

"సందీప్ ఏమంటున్నాడు?"

"వాడికింకా ఈ సిట్యుయేషన్ గురించి తెలియదు. నేను డబ్బు ఏర్పాటు చేస్తాననే అనుకుంటున్నాడు."

"షాపింగ్‌కి వచ్చేముందు సంతోషంగా కనిపించిన సందీప్ మొహం గుర్తొచ్చింది నాకు.

"అసలు ఈ బిజినెస్ స్టార్ట్ చేస్తున్నాడని తెలిస్తే సందీప్ వాళ్ళ యింట్లో రియాక్షన్ ఎలా వుంటుందో" వెంకట్ కాఫీ సిప్ చేస్తూ అన్నాడు.

"సందీప్ యింత పిరికివాడని అనుకోలేదు. వూళ్ళో అందరిముందు ఎవరికీ తలవంచని ధీరుడిలా ఆటిట్యూడ్ చూపిస్తాడు. ఇంట్లో వాళ్ళని కన్విన్స్ చేయడానికి బదులుగా అబద్దాలు చెప్పడం దేనికి?" అడిగాను ఖాళీ కప్పుని బల్లమీద పెడుతూ.

వెంకట్ నవ్వాడు. "పిల్లల్ని పెద్దవాళ్ళు అర్థం చేసుకుని వాళ్ళకి నచ్చినట్టు వాళ్ళని బతకనిస్తే ఇక ఈ భూమ్మీద సమస్యలు సగం తగ్గిపోతాయి. దానికి నేనే నిలువెత్తు సాక్ష్యం. మా నాన్న నన్ను బెదిరించి నాకు డబ్బులు కట్ చేస్తాడు. వాళ్ళమ్మ అయితే ఏకంగా బావిలో దూకేస్తుంది. మనిషికి ఫ్యామిలీ అనేది బలమేకాదు. ఒక్కోసారి బలహీనత కూడా అవుతుంది."

వెంకట్ మాటలకి నేను ఆశ్చర్యపోయాను.

"పైకి నెమ్మదిగా, మామూలుగా కనిపించే సుమిత్రాదేవి యింత అసాధ్యురాలా?" ఆశ్చర్యపోయాను.

కానీ వెంకట్ నాకివన్నీ ఎందుకు చెప్తున్నాడు? అనుమానం వచ్చి అదే అడిగానతన్ని.

"నువ్వు మా బిజినెస్‌లో పార్ట్‌నర్‌షిప్ తీసుకుంటావా?" బల్లమీదకి వంగుతూ సూటిగా అడిగాడు.

"నేనా?" ఆశ్చర్యపోయాను.

"ఇట్స్ నాట్ ఎబౌట్ మనీ. కలిసి పనిచేయడానికి మన మైండ్ సెట్ సరిగ్గా సరిపోతుంది. వర్క్‌లో సమస్యలు వుండవు. అందుకే యిదంతా నీకు చెప్పాను. ఇక డెసిషన్ నీది."

ఒక్క క్షణం నాకంతా అయోమయంగా తోచింది. నా కెరీర్‌ని ఎప్పుడూ యిలా బిజినెస్ యాంగిల్‌లో ఆలోచించలేదు.

"తనూ! సందీప్‌తో కలిసి పనిచేయడానికీ, అతనికి తోడుగా నిలడటానికి యిదొక అవకాశం" అంతర్వాణి అరిచింది గట్టిగా.

"ఓకే నాక్కొంచెం టైమివ్వు. ఆలోచించి చెప్తాను" చెప్పి, హ్యాండ్‌బ్యాగ్ తగిలించుకుని లేచాను.

వెంకట్ చెప్పినదాని గురించి బాగా ఆలోచించిన తర్వాత అమ్మ గదిలోకి వెళ్ళాను. అప్పటికే అమ్మ గదిలో ట్యూబ్‌లైట్ ఆఫ్ చేసి వుంది. బెడ్ పక్కనే రీడింగ్ లాంప్ మాత్రం వెలుతుగూ వుంది. తలుపు చప్పుడవగానే చదువుతూ వున్న పుస్తకం మూసి నావైపు చూసింది అమ్మ.

నేను వెళ్ళి బెడ్ మీద అమ్మ పక్కన కూర్చున్నాను.

"ఏంటి తనూ? ఏదైనా ముఖ్యమైన విషయం మాట్లాడాలా?" అడిగింది. ఎంతో యింపార్టెంట్ విషయం కాకపోతే, నేను ఆ టైంలో రానని అమ్మకి తెలుసు.

"నా కెరీర్ గురించి, నేనొక నిర్ణయం తీసుకున్నాను" చెప్పాను చేతులు నులుముకుంటూ.

"చెప్పు" ఆసక్తిగా ముందుకు జరిగి అడిగింది.

"నేను బిజినెస్ చెయ్యాలనుకుంటున్నాను. అగ్రిబేస్డ్ బిజినెస్. మనచుట్టుపక్కల వూళ్ళలో రైతులనుంచి పంట కొనుగోలు చేసి వాటిని క్లీన్ చేసి, ప్యాక్ చేసి ఎక్స్‌పోర్ట్ చెయ్యాలి. అమెరికాలో కొన్ని యిండియన్ స్టోర్స్‌తో డీల్ కూడా కుదిరింది. ఫుడ్ ప్రాసెసింగ్‌కి కావల్సిన ఎక్విప్‌మెంట్‌కి కూడా అడ్వాన్స్ యిచ్చేశారు. గోడౌన్స్ వర్కర్స్ రెడీ. కంపెనీ రిజిస్ట్రేషన్, ఎక్స్‌పోర్ట్ పర్మిట్‌లూ, లైసెన్సుల పనికూడా అయిపోయింది.

ఇది కొంచెం బాగా సాగితే వాల్‌మార్ట్, కాస్ట్‌కోలాంటి స్టోర్స్‌కి కూడా కాంట్రాక్స్ తీసుకోవచ్చు.

ఇంకా వెజిటబుల్స్, ఫ్రూట్స్ నుంచి ప్యూరీ, జ్యూస్, పికిల్స్‌లాంటి ప్రాసెసెడ్ ఫుడ్స్ తయారుచేసే యింకో వింగ్ కూడా స్టార్ట్ చెయ్యొచ్చు. చాలా స్కోప్ వుంది ఈ బిజినెస్‌లో'' గబగబా వివరాలన్నీ చెప్పి ''ఎమంటావు అమ్మ'' అంటూ అమ్మ మొహంలోకి చూశాను. ''నాకు తెలిసి, నువ్వు స్వప్న వాళ్ళింటికీ, షాపింగుకీ మాత్రమే తిరిగావు. ఇవన్నీ ఎప్పుడు చేశావు?'' అనుమానంగా అడిగింది.

''నిజానికి ఇందులో నా ప్రమేయం ఏం లేదు. ఆల్రెడీ నా ఫ్రెండ్స్ ఈ సెటప్ అంతా చేసి వుంచారు. కాస్త ఫండింగ్ తక్కువైంది. అందుకే నన్ను పార్టనర్‌గా చేరమని అడిగారు.

''అలా చెప్పు. ఇదంతా నువ్వెప్పుడు చేశావా అని నేను ఆశ్చర్యపోయాను. ఇంతకీ నీ బిజినెస్ పార్ట్‌నర్స్ ఎవరు?''

''వెంకట్ అని, అపోజిషన్ పార్టీ ఎమ్మెల్యే పూర్ణారావుగారి అబ్బాయి... యింకా'' అని ఒక్క క్షణం ఆగాను. సందీప్ పేరు చెబితే, అమ్మ ఎలా రియాక్ట్ అవుతుందా?'' అనుకుంటూ.

''ఇంకా'' రెట్టించింది అమ్మ.

''సందీప్ మన రంగారావు అంకుల్ వాళ్ళ అబ్బాయి'' ఠక్కున చెప్పేసి అమ్మవైపు చూశాను.

''వెరీగుడ్ చాలా మంచి అయిడియా. ఎప్పుడూ జాబ్స్ అనేకాకుండా యిలాంటి అవకాశాల్ని కూడా అందిపుచ్చుకోవాలి'' మెచ్చుకుంది అమ్మ.

''చెప్పానా అమ్మ ఎప్పుడూ ఓపెన్ మైండ్‌తో ఆలోచిస్తుందని'' అంతరాత్మకూడా అరిచి చెప్పింది.

''అసలు ఈ ప్రాజెక్టు అయిడియా, ఎగ్జిక్యూషన్ ప్లాను అంతా సందీప్‌దే అమ్మా. వెంకట్, నేనూ జస్ట్ పార్ట్‌నర్స్'' చెప్పాను ఉత్సాహంగా.

''అప్పుడే పార్ట్‌నర్‌షిప్‌దాకా వెళ్ళిపోయావు. నేనింకా నీ ప్రపోజల్‌కి ఒప్పుకోలేదు.'' అంది సీరియస్‌గా.

తుస్సున గాలి తీసేసినట్టయ్యింది నాకు.

''ఇప్పుడేకదా చాలా మంచి అయిడియా.. జాబ్సేకాదు, యిలాంటివి కూడా చేయొచ్చు అన్నావు'' అన్నాను మూతి విరుస్తూ.

''అవును అన్నాను. కానీ బిజినెస్‌కి నువ్వు సరిపోతావు అనలేదు.''

''అమ్మా'' గబుక్కున ముందుకి దూకి, అమ్మ చేతులు పట్టుకున్నాను.

"ప్లీజ్ అమ్మా! ఒకసారి ట్రై చేస్తే కదా నేను సరిపోతానో లేదో తెలిసేది. నా ఫ్రెండ్ శ్వేత బొటిక్ పెట్టింది. శైలూ ఈవెంట్ ఆర్గనైజర్‌గా చేస్తుంది. అప్పుడు నువ్వే వాళ్ళని మెచ్చుకున్నావు. వాళ్ళ పేరెంట్స్ ఆ ఛాన్స్ యివ్వకపోతే వాళ్ళు మాత్రం చేసేవాళ్ళా?"

కానీ బిజినెస్ అంటే ఎక్స్‌పీరియన్స్ చాలా అవసరం తనూ. నువ్వు ఈ లైన్‌లో వెళ్ళాలనుకుంటే కొన్నాళ్ళు ఎవరిదగ్గరైనా వర్క్ చేశాక, మొదలుపెడితే బావుంటుంది" చెప్పింది.

నా ఆశ మీద నీళ్ళు చల్లినట్టయ్యింది.

"అమ్మా! ఎక్స్‌పీరియన్స్ వచ్చాక అవకాశం రావాలని రాసిపెట్టిలేదు. ఇదొక మంచి అవకాశం. అందులోనూ వీళ్ళు నా ఫ్రెండ్స్. వీళ్ళతో కలిసి పనిచేయడానికి నాకు కంఫర్ట్ వుంది. ప్లీజ్.. అమ్మా" బతిమాలాను.

"సరే ఆలోచించి రేపు చెబుతాను" ఆఖరుగా అంది.

మర్రోజు ఉదయం ఆఫీసుకి వెళుతూ అమ్మ పిలిచింది నన్ను.

ఠక్కున వెళ్ళి ఎదురుగా నిలబడ్డాను.

"సందీప్..వెంకట్ వీళ్ళలో ఎవరో ఒకర్ని వచ్చి నన్ను కలవమని చెప్పు. వచ్చేటప్పుడు బడ్జెట్ ప్లాన్, యింకా ఇప్పటివరకూ యిచ్చిన ఎడ్వాన్స్‌ల తాలూకు బిల్స్‌తో సహా మొత్తం ఫైలుతో రమ్మని చెప్పు" కారు కీస్ తీసుకుంటూ చెప్పింది.

"హుర్రే" ఆనందంగా అరిచాను.

"అయితే నువ్వు ఒప్పుకున్నట్లేనా?" అడిగాను ఆనందంగా.

"ఇట్స్ నాట్ ఎ బాడ్ అయిడియా" చెప్పి వెళ్ళిపోయింది.

అమ్మ అటు వెళుతూనే వెంకట్‌కి ఫోన్ చేశాను. అమ్మతో మాట్లాడటానికి సందీప్ కంటే వెంకట్ అయితే బావుంటుందనుకున్నాను. అంతేగాక సందీప్‌కి నేను పార్టనర్‌గా చేరుతున్నానన్న విషయం సర్‌ప్రైజ్‌గా వుంచాలన్నది నా ఆరాటం.

వెంకట్ మాయింటికి రావడం, అమ్మ కన్విన్స్ అవడం అన్నీ ఓ వారంలో జరిగిపోయాయి.

బ్యాంక్ ష్యూరిటీ కింద మా యింటిని తాకట్టు పెట్టడానికి అమ్మ ఒప్పుకుంది.

"అమ్మా! ఒక చిన్న రిక్వెస్ట్" అన్ని విషయాలూ నిర్ణయం అయిపోయాయి అనుకున్న తర్వాత అమ్మతో అన్నాను.

"ఏంటి?"

"ఈ బిజినెస్ సంగతిగానీ ఇందులో నా పార్ట్‌నర్‌షిప్ సంగతికానీ, రంగారావు అంకుల్‌తో చర్చించొద్దు.. ప్లీజ్"

"ఎందుకు?" అమ్మ అనుమానంగా అడిగింది.

"సందీప్ వాళ్ళింట్లో ఈ విషయాలేమీ తెలియదని వెంకట్ చెప్పాడు. వాళ్ళ ఫ్యామిలీ మేటర్స్ గురించి నాకు తెలియదు. కానీ నావల్ల ఏ ప్రాబ్లమ్స్ రాకూడదని" అంటూ నసిగాను.

"తన్మయీ మీరు యింకా చిన్నపిల్లల్లాగా బిహేవ్ చేస్తున్నారు. కనీసం యింట్లో వాళ్ళని కన్విన్స్ చేసుకోలేని మనిషి రెస్పాన్సిబుల్‌గా బిజినెస్ ఎలా చేస్తాడు? ఇంతలా భయపడేవాడు ఏం చేస్తాడో ఏంటో" అసహనంగా అంది.

"అందరూ నీలా ఓపెన్ మైండ్‌తో ఉండరు కదమ్మా" బతిమాలాను.

"సరే కానీ. నీ పరంగా నేను ఎవ్వరి దగ్గరా నిజం దాచిపెట్టను" చెప్పింది సీరియస్‌గా.

"ఓ.కే" చెప్పి, 'హమ్మయ్య' అని నిట్టూర్చాను.

అనుకున్నపని అనుకున్నట్టు అయిపోయింది. సందీప్‌కి ఈ విషయం చెప్పడం ఒకటే మిగిలిపోయింది.

"స్వప్న ఎంగేజ్‌మెంట్‌కి సందీప్ తప్పకుండా వస్తాడు. అక్కడ మాట్లాడతాను అని నిశ్చయించుకున్నాను.

స్వప్న ఎంగేజ్‌మెంట్ రోజున సాయంత్రం నాలుగింటినుంచే నా తయారీ మొదలైంది.

తలారా స్నానం చేసి స్వప్నతోబాటు షాపింగ్‌కి వెళ్ళినప్పుడు కొనుక్కొచ్చిన చీరని బైటికి తీశాను. లేత నారింజరంగు మీద బంగారు రంగు త్రెడ్ వర్క్ చేసిన చీర అది.

రాజ్యంగారి సహాయంతో, చీర కట్టడం పూర్తిచేశాను. నాకు తెలిసిన కాస్తపాటి జ్ఞానంతో పమిటకొొంగు, కుచ్చిళ్ళని అందంగా సర్దాను. జుట్టుని ముందువైపు చివరల కొద్దిగా కర్ల్ చేసి వదిలేశాను.

మెడలో సన్నటి నీటిబిందువులా కనిపించే డాలర్ ఉన్న గొలుసు, వదిలేసిన జుట్టులోనుంచి తళుక్కుమంటూ కనిపించేట్టు పెద్ద పెద్ద జూకాలు పెట్టుకున్నాను.

లైట్‌గా మేకప్ చేసుకుని మ్యాచింగ్ లిప్ స్టిక్ వేసి ఆఖరుగా పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకోవడంతో సింగారం పూర్తయ్యింది.

వావ్! తన్మయీ చాలా అందంగా వున్నావు. నచ్చాల్సిన వాళ్ళకి నచ్చేస్తావేమో? అంతరాంతం అంటుంటే దాన్ని ముద్దుగా విసుక్కుని అద్దం ముందునుంచి పక్కకి తొలిగాను. కారు కీస్ తీసుకుని చెప్పులు వేసుకుంటుంటే రాజ్యంగారు వచ్చారు.

"అమ్మాయిగారూ మీరు బాగా పొడుగ్గా వుంటారు కదా అయినా హీల్స్ ఎందుకు వేసుకుంటున్నారు?" సందేహం బైటపెట్టిందావిడ.

"ఇంకా పొడవుగా కనిపించడానికి" అని నవ్వి "అమ్మ వస్తే నేను స్వప్న ఎంగేజ్‌మెంట్‌కి వెళ్ళానని చెప్పండి" అని చెప్పి బయల్దేరాను.

రోజూ చూసే యిల్లే అయినా, స్వప్న ఎంగేజ్‌మెంట్ కోసం ముస్తాబయ్యాక చాలా కొత్తగా కనిపించింది వాళ్ళయిల్లు.

ఇంటిముందు గార్డెన్‌లో చిన్న స్టేజ్‌లాంటిది కట్టారు. నక్షత్రాలన్నీ వచ్చి వరుసగా నిలబడ్డాయా అన్నట్టు, ఆవరణ అంతా చిన్న చిన్న లైట్లు మినుకుమినుకుమంటూ వెలుగుతున్నాయి.

స్టేజికి ఎదురుగా లాన్‌లో, కాస్త కాస్త దూరంలో గుండ్రని టేబుల్స్, వాటి చుట్టూ కుర్చీలూ వేసి వున్నాయి.

ప్రతి టేబుల్ మీద మల్లెపూవులా తెల్లగా వున్న లేస్ టేబుల్ క్లాత్‌ని పరిచారు వాటి మీద రంగురంగుల పూలతో వున్న చిన్న చిన్న ఫ్లవర్ వేజ్‌లు పెట్టి వున్నాయి.

వెళుతూనే స్వప్న వాళ్ళమ్మగారు విశాలాంటీ ఎదురొచ్చి పలకరించింది.

"అమ్మ రాలేదేంటమ్మా?" అంటే "అమ్మకి గేదరింగ్స్ అంటే కాస్త యిబ్బంది ఆంటీ కంఫర్ట్‌బుల్‌గా వుండలేదు. రేపు ఉదయాన్నే వచ్చి మిమ్మల్ని కలుస్తానని చెప్పమంది" అని చెప్పి లోపలికి నడిచాను.

అప్పటికే చాలామంది అతిథులు వచ్చారు. చుట్టూ వున్న జనంలో సందీప్ కోసం వెతికాయి నాకళ్ళు.

**"హలో సందీప్** కోసం చూస్తున్నావా?" వెంకట్, హఠాత్తుగా వచ్చి పలకరించాడు.

"అవును.." నిజాయితీగా తలుపాను.

"అదుగో అటు చూడు" వెంకట్ చెయ్యి చూపించిన వైపు చూశాను.

సందీప్ చేతిలో కార్డ్‌బోర్డ్ బాక్స్ పట్టుకుని వెళుతూ కనిపించాడు. పక్కనే మాధవన్నయ్యకూడా వున్నాడు.

"త్వరగా, ఈ సస్పెన్స్ క్లోజ్ చేసి, సందీప్‌కి విషయం చెప్పు" అనేసి, నవ్వుతూ వెళ్ళిపోయాడు వెంకట్.

నేను సందీప్ వైపుకి నడిచాను.

"హలో! తన్మయీ!" ఎదురుగా నిరంజన్ వచ్చాడు.

"యూ ఆర్ లుకింగ్ గార్జియస్..."

"థాంక్యూ!" మొక్కుబడిగా జవాబిచ్చాను.

నా మనసంతా ఎప్పుడెప్పుడు వెళ్ళి సందీప్‌తో మాట్లాడదామా అని వుంది. ఒకసారి యిందాక సందీప్ కనిపించినవైపు చూశాను. అతనక్కడ కార్డ్‌బోర్డ్ బాక్సులు సర్దుతూ ఉన్నాడు. మధ్య మధ్య నావైపే చూస్తూ వున్నాడు కూడా.

"ఆరోజు కాలేజ్‌లో హఠాత్తుగా మాయమైపోయావు" ఆ తర్వాత నీతో మాట్లడడానికి మీ యింటికి వద్దామనుకున్నాను. కానీ నువ్వేమనుకుంటావో? మీ అమ్మగారేమనుకుంటారో అని ఆగిపోయాను" నిరంజన్ వదలడంలేదు నన్ను. మాట్లాడుతూనే వున్నాడు.

"మంచి ఆలోచన చేశావు. అలా ఆడపిల్లల యింటికి రావడం కరెక్ట్‌కాదు" చెప్పి కదిలే ప్రయత్నం చేశాను.

"ఆగు" మళ్ళీ అడ్డుపడ్డాడు నిరంజన్. "మా అమ్మా నాన్నా అక్కడున్నారు రా! పరిచయం చేస్తాను" అంటూ నా చేయి పట్టుకోబోయాడు.

నేను గబుక్కున చెయ్యి తప్పించాను.

"తన్మయీ త్వరగా యిక్కడ్నుంచి కదులు. ఏదో అనర్థం జరిగేట్టుంది" అంతరాత్మ హెచ్చరించింది.

"అయామ్ సారీ నేనొక ఫోన్ కాల్ చేయాలి. ఇట్స్ అర్జంట్" అని చెప్పి త్వరగా అక్కడ్నుంచి కదిలాను.

రెండడుగులు అయినా వేశానో లేదో నా హీల్స్ తిరగబడ్డాయి. హీల్స్‌కి చీరకట్టు తోడయ్యింది. అంతే. దబ్బున ముందుకి తూలాను.

నిరంజన్ వెనకనుంచి నా చెయ్యి పట్టుకుని ఆపాడు.

"ఆర్యూ ఆల్‌రైట్" అతనడుగుతుంటే "అయామ్ ఓకె" అని చెప్పి ముందుకి కదిలాను.

"నా మనసంతా సందీప్ వైపే లాగుతూ వుంది. దానికి తోడు, నిరంజన్ నాకు దగ్గరగా మసలడం చూస్తే అతనేమనుకుంటాడో అన్న ఆందోళన కూడా మొదలయ్యింది. అదే ఆలోచిస్తూ హడావుడిగా అడుగులు వేయబోతుంటే వెనుక నుంచి చీరకొంగు లాగినట్టయ్యింది.

తిరిగి చూస్తే ఎంబ్రాయిడరీ చేసిన నా చీర చెంగు పక్కనే వున్న పొదకి చిక్కుకుని వుంది.

దానికంటే, భయంకరమైన దృశ్యం.

పక్కనే మోకాళ్ళ మీద కూర్చుని నిరంజన్ భక్తిగా నా చీర చెంగుని తప్పిస్తున్నాడు.

చూసేవాళ్ళకి, అతను నా గురించి ఎంత శ్రద్ధ తీసుకుంటున్నాడో అర్థమయ్యేలా ఓ విపరీతమైన ఎక్స్‌ప్రెషన్ కూడా పెట్టాడు. నాకు భయమేసింది. ఆందోళనగా సందీప్ వైపు చూశాను.

నేను ఊహించినట్టే అతను నన్నూ, నిరంజన్‌ని చూస్తున్నాడు. అంతేకాదు. గబగబా నడుచుకుంటూ మా వైపే వస్తున్నాడు కూడా.

ఇప్పుడు వీళ్ళిద్దరూ గొడవపడితే? స్వప్న ఎంగేజ్‌మెంట్‌లో రసాభాస జరగకూడదు. అనుకున్న వెంటనే "ప్లీజ్ నాకోసం ఏదైనా డ్రింక్ తీసుకురాగలవా?" నిరంజన్‌ని అడిగాను అతన్ని అక్కడ్నుంచి పంపించే ఉద్దేశ్యంతో. "ష్యూర్" అంటూ వెళ్ళాడతను.

అతనటు వెళ్ళిన రెండు నిముషాలకి సందీప్ నా దగ్గరికి వచ్చాడు.

"తనూ నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు కోపం కనిపించకుండా వుండే ప్రయత్నం చేస్తూ.

"నేనూ నీతో మాట్లాడాలనే అనుకుంటున్నాను. మేడ మీద వెయిట్ చేస్తుంటాను. పది నిమిషాల్లో వచ్చేయ్. ముఖ్యంగా మాట్లాడాల్సిన విషయం" అన్నాను నవ్వుతూ.

"ఈ టైంలో అక్కడ ఎవరూ వుండరు. నువ్వు ఒంటరిగా వెళ్ళి వెయిట్ చేస్తావా? పద ఇద్దరం కలిసే వెళదాం" అన్నాడు కంగారుగా.

అతనలా నా గురించి ఆందోళన పడడం చూసి నాకు నవ్వొచ్చింది. ఎప్పుడు సందీప్‌తో నేను చూడని ఆ యాంగిల్ నాకు నచ్చింది కూడా.

ఇంతలో మాధవన్నయ్య సందీప్‌ని పిలిచాడు.

"ఇప్పుడే వస్తాను. ఎక్కడికీ వెళ్ళకు" నా కళ్ళలోకి చూస్తూ గట్టిగా చెప్పి వెళ్ళాడు.

"ఎక్కడికీ వెళ్ళకు" అతని మాటల్ని రిపీట్ చేసి నవ్వుకున్నాను.

"బాగానే అధికారం చూపిస్తున్నాడు తనూ" మనసు చెప్పింది.

చీర చెంగుని వేలికి చుట్టుకుంటూ, అతనికోసం ఎదురుచుస్తూ అక్కడే నిలబడ్డాను. అప్పుడే, సుమ, చిత్ర జంటగా అటువైపు వచ్చారు.

నేను నవ్వుతూ పలకరించానిద్దరినీ. చిత్ర మొక్కుబడిగా జవాబిచ్చింది. సుమ ఎప్పటిలాగే మొహం తిప్పుకుని వెళ్ళిపోయింది.

"ఈ రిలేషన్స్ ఎప్పటికైనా మెరుగుపడతాయా?" వాళ్ళు వెళ్ళినవైపే చూస్తూ అనుకుంటూ వుండగానే, "ఇదిగో ...బాదంపాలు" అంటూ రెండు చేతులతో రెండు గ్లాసులు పట్టుకుని నిరంజన్ నా ముందు ప్రత్యక్షమయ్యాడు.

"ఓ బాదంపాలు తెచ్చావా? నాకు బాదంపాలు సహించవు" మనసులో చికాకు పడుతూ, పైకి నవ్వాను.

"ఓ సారీ నాకు తెలియదు. కూల్ డ్రింక్స్ తెస్తానుండు" అంటూ వెళ్ళబోతుంటే కంగారుపడిపోయాను.

"పర్లేదు.. ఐ విల్ టేకిట్" అంటూ బాదంపాల గ్లాసు అందుకున్నాను.

"మా పేరెంట్స్‌కి పరిచయం చేస్తానన్నానుగా. అదిగో యిక్కడే వున్నారు" నిరంజన్ అంటుంటే వారించబోయాను.

ఈలోపే, నిరంజన్ వాళ్ళని పిలవడం వాళ్ళు మా వైపు తిరిగి చూడడం జరిగిపోయాయి.

తప్పనిసరై, మొహమాటం కొద్దీ నిరంజన్ వెంట నడిచాను.

"అమ్మా! నాన్నా" ఇద్దర్నీ చూపించగానే నమస్కారం చేశాను.

"నేను చెప్తుంటానుగా తన్మయీ అని.. మా కాలేజ్‌లోనే చదువుకుంది. ఈ మధ్యే వీళ్ళ అమ్మగారికి ట్రాన్స్‌ఫర్ అయ్యి మళ్ళీ యిక్కడికి వచ్చారు.

టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సుచరితగారు. తన్మయి వాళ్ళ అమ్మ" నిరంజన్ పరిచయం చేశాడు.

నిరంజన్ వాళ్ళ అమ్మ నా వైపు అభిమానంగా చూసి నవ్వింది.

"ఏం చదువుకున్నావమ్మా?" ఆవిడ అడిగింది.

నేను జవాబు చెప్పేలోపే "తనూ" అంటూ హఠాత్తుగా సందీప్ వచ్చాడక్కడికి.

"పద.. వెళ్దాం" నాకు జవాబు యిచ్చే అవకాశం యివ్వకుండానే గట్టిగా నా చెయ్యిపట్టుకుని లాక్కెళ్ళాడు.

అతను నా చేతిని పట్టుకున్న తీరుని బట్టే అతని కోపం తీవ్రత అర్థమవుతూ వుంది నాకు.

"ప్లీజ్! సందీప్ చిన్నగా. ఈ హీల్స్‌తో పరిగెత్తలేను. చీర అడ్డం పడుతుంది. సందీప్

నేను చెబుతూనే వున్నా. అతను నా మాట వినిపించుకోవడం లేదు. నన్ను తీసుకుని గబగబా మెట్లవైపుకి నడిచాడు.

"సందీప్" గట్టిగా అరిచాన్నేను.

"నడవడం రానప్పుడు ఎవరు వేసుకోమన్నారు హీల్స్? చూసేవాళ్ళకి వినోదం కాకపోతే. ఇవన్నీ అవసరమా?" కోపంగా అన్నాడు.

ఇద్దరం అప్పటికే మెట్ల దగ్గరికి వచ్చాం. అతను పెద్ద పెద్ద అంగలతో మెట్లు నేనూ అవస్థపడుతూ అతనితోబాటే మెట్లు ఎక్కుతూ వున్నాను.

మెట్ల మధ్యలో మలుపు దగ్గరకి వచ్చాం యిద్దరం. అతను పట్టుకున్న చోట చెయ్యి విపరీతంగా నొప్పి మొదలయ్యింది.

"సందీప్ చెయ్యి నొప్పిపుడుతుంది" నేను ఉన్నట్టుండి ఆగి, అతని చేతిని వదిలించుకునే ప్రయత్నం చేశాను. నెప్పికీ, ఆందోళనకీ నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అతను ఆగి ఒక్క క్షణం నా మొహంలోకి చూశాడు. వెంటనే, అతని చెయ్యి పట్టు సడలింది.

నేను నా చేతిని తప్పించి గట్టిగా విదిలించాను. అతను పట్టుకున్నచోట ఎర్రని చారికలు ఏర్పడ్డాయి.

అతను చప్పున నా చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"అయామ్ సారీ" వేళ్ళతో నా చేతిమీద రుద్దుతూ మెల్లగా అన్నాడు నాతో

"నిరంజన్ నా వెంటపడుతున్నాడు. నేనుగా కావాలని ఎవరికీ వినోదం కల్పించాలనుకోలేదు.

ఈ హీల్స్ ఈ చీర ఈ సింగారం వేరెవరికోసమో కాదు. అది నీకు అర్థం కావడంలేదు" చివరి వాక్యాలు చెప్పేటప్పుడు అప్రయత్నంగా నా కళ్ళు కిందకి వాలిపోయాయి.

నెమ్మదిగా అతని కోపం చల్లబడిపోయింది. అది నాకు అర్థమైంది.

అతని చూపులు చీరపొరల్లో నుంచి, దోబూచులాడుతున్నట్టున నా నడుము ఒంపుల్నీ, ఎర్రబడ్డ చెంపల్నీ, వాలిపోయిన నా కనురెప్పల్నీ వెచ్చగా తాకుతున్నాయి.

నా కళ్ళు చూడకపోయినా నా మనసుకి అంతా స్పష్టంగా కనిపిస్తూ వుంది.

"నాతో మాట్లాడాలన్నావుగా పద" ఒక్క క్షణం ఆగి అన్నాడతను. అతనింకేదైనా చెబుతాడేమోనని ఆశగా తలెత్తి అతని మొహంలోకి చూశాను. అతను మౌనంగా వెనక్కి తిరిగి, మెట్లు ఎక్కడం ప్రారంభించాడు. నేను గబుక్కున ఒక మెట్టు ఎక్కి, చప్పున అతని చేతిని పట్టుకున్నాను. ఆ స్పర్శలో యిద్దరి మనసులూ, ఒకరికొకరికి అర్థం అయినట్టు అనిపించింది నాకు. పైనుంచి చూస్తే కింద అంతా నక్షత్రాలతో ముగ్గు వేసినట్టుగా వుంది. కింద జరుగుతున్న సందడీ, కోలాహలం తాలూకు శబ్దాలు పైకి లీలగా వినిపిస్తూ వున్నాయి.

సందీప్‌కి, వెంకట్ నాతో మాట్లాడిన విషయం, నన్ను పార్ట్‌నర్‌గా ఉండమని అడిగిన సంగతి మొదలుకుని వెంకట్ మా యింటికి వచ్చి అమ్మతో మాట్లాడడం, అమ్మ ఒప్పుకోవడం వరకూ అంతా పూసగిచ్చినట్టు చెప్పాను.

అంతా విని, సందీప్ ఆశ్చర్యపోయాడు. "మా అమ్మ నేను బిజినెస్‌లో యిన్వెస్ట్ చేయడానికి ఒప్పుకుందనే విషయం అతనికి నిజంగా నమ్మబుద్ధి కాలేదు. "రేపు ఉదయం పదిగంటలకల్లా మనం బాంక్‌కి వెళ్ళాలి. రెడీగా వుండు. ఇదివరకులా విసుగ్గా చిరాగ్గా సమాధానాలు యిస్తే కుదరదు. ఇప్పుడు నేనూ నీలాగే మీ కంపెనీతో షేర్ హోల్డర్‌ని. అర్ధమైందా?" అన్నాను కిలకిలా నవ్వుతూ.

అతను మౌనంగా నావైపు చూశాడు. ఆ చూపులో భావం నాకు అర్ధంకాలేదు.

"ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్ ప్రారంభమౌతున్నట్టుంది. పద.. వెళదాం" అంటూ నా పని అయిపోయిందన్నట్టుగా వెనక్కి తిరిగాను.

అతను గబుక్కున నా చెయ్యి పట్టుకుని ఆపాడు.

నేను మళ్ళీ వెనక్కి తిరిగి అతని ఎదురుగా నిలబడ్డాను. నా చేతిమీద ఎర్రగా పడిన చారికల మీద, అతని చేత్తో మృదువుగా తాకుతూ, తలెత్తి నా కళ్ళలోకి చూశాడు.

"ఇదంతా ఎందుకు చేస్తున్నావు? నీకి బిజినెస్ అవసరమా?" అడిగాడు.

"నా...కోసం చేస్తున్నాను" జవాబిచ్చాను.

"అబద్ధం చెప్పకు. నీది రిస్కులు, ఎడ్వంచర్స్ చేసే మనస్తత్వం కాదు. నువ్వీ పని నాకోసం చెయ్యక్కర్లేదు" నిజాయితీగా వచ్చాయతని మాటలు. "నీకు సమాధానం కావాలి. అంతేకదా! నిరంజన్‌తో నువ్వు నన్నెందుకు మాట్లాడొద్దు అంటున్నావు? అదే కారణంతో నేను నీకు సహాయం చెయ్యాలనుకుంటున్నాను."

నిరంజన్ పేరెత్తగానే సందీప్ మొహం మారిపోయింది.

"వాడెలాంటివాడో నీకు తెలియదు. వాడినుంచి నిన్ను ప్రొటెక్ట్ చేయడానికే నేనలా అన్నాను" చెప్పాడు విసుగ్గా.

"నేనూ అదే చేస్తున్నాను. నువ్వు అనుకున్నట్టుగా నీ కంపెనీని మొదలు పెట్టాలనీ, డబ్బుకోసం నువ్వు యిబ్బంది పడకూడదనీ..

చాలా? యింకా చెప్పాలా?"

నేను మాట్లాడుతూ వుంటే, అతను అలాగే చూస్తూ ఉండిపోయాడు. నా మాటల వెనుక ఉన్న నా మనసు అతనికి మళ్ళీ పట్టుబడి పోయింది.

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

నా కళ్ళలోకి చూస్తూ క్రమంగా అతను తన ఉనికినే మర్చిపోతున్నట్టూ తెలుస్తూవుంది నాకు. అతను యింకాస్త దగ్గరగా జరిగి నా భుజాల చుట్టూ చేతులు వేశాడు.

"ఎందుకు నా గురించి యింతలా ఆలోచిస్తావు" గుసగుసగా వినిపించాయి అతని మాటలు.

ఆ క్షణంలో జవాబు యివ్వడం అనవసరమనిపించింది.

నెమ్మదిగా, యిద్దరి శ్వాసలూ దగ్గరయ్యాయి. అతని చూపు నా పెదవుల మీద ఆనింది.

లోపల చిన్న బెరుకులాంటిది మొదలయ్యింది నాలో.

"తనూ! నువ్వు జీవితకాలంపాటు పదిలంగా దాచుకోవాల్సిన మూమెంట్ వచ్చేసింది" మనసు అదేపనిగా చెబుతూ వుంది.

ఆ క్షణాన్ని పదిలపరుచుకోవడానికి మానసికంగా సిద్ధమయ్యాను. అతని పెదవులు నా పెదవుల్ని అందుకోబోతున్నాయి. ఇంకొక్క క్షణంలో అతను నాకు పూర్తిగా దగ్గరవుతాడనగా 'బావా!' అన్న పిలుపు వినిపించింది.

ఇద్దరం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం. మెట్ల దగ్గర గుమ్మంలో చిత్ర నిలబడి మా యిద్దరినీ మార్చిమార్చి చూస్తూ వుంది.

అప్పటిదాకా, కప్పివుంచిన మాయేదో ఉన్నట్టుండి వీడిపోయింది. వెంటనే అతనికి దూరంగా జరిగాను.

ఎర్రబడ్డ నా చెంపల్ని అరచేతుల్లో పెట్టుకుని, వేగంగా కొట్టుకుంటున్న గుండెను స్వాధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశాను. "బావా! అత్తయ్యకి తలనెప్పిగా వుందట. యింటిదగ్గర డ్రాప్ చెయ్యమంటుంది. రా" చెప్పి నా వైపు నిరసనగా చూసి వెనక్కి తిరిగింది చిత్ర.

ఆమె వెనకాలే సందీప్ కూడా వెళ్ళిపోయాడు.

***

మరుసటి రోజు ఉదయం చిత్ర యోగా క్లాసుకి రాలేదు.

"చిత్రకీ, సందీప్ చెల్లి సుమకీ, యిన్ఫోసిస్ ఫౌండేషన్ వాళ్ళ స్కాలర్ షిప్స్ వచ్చాయట.

ఇకనుంచి యోగాక్లాసులు లిమిటెడ్‌గా తీసుకోవాలనుకుంటుందిట. రానని మెసేజ్ పెట్టింది" ఉదయాన్నే అమ్మ చెప్పింది. 'సరే' తేలిగ్గా అనేశాన్నేను.

***

పదిగంటలకల్లా వెంకట్, సందీప్, నేనూ ముగ్గురం కలిసి బాంక్‌కి వెళ్ళాం. అనుకున్నట్టు పని సజావుగా అయిపోయింది. మేం రైతుల దగ్గర పంట కొనుగోలు చేసే సమయానికి బ్యాంక్ వాళ్ళు ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ లోన్ శాంక్షన్ చేసేట్టు మాట్లాడుకున్నాం.

''ఒకసారి మన ఆఫీసు కూడా చూసొద్దాం'' వెంకట్ అనడంతో ముగ్గురం వెంకట్ కారులో బయలుదేరాం.

దాదాపుగా టౌన్ అవుట్‌స్కర్ట్స్ దాటి వెళ్ళాక, రోడ్డు పక్కన పొలాల దగ్గర కారు ఆగింది.

ఎత్తైన సిమెంటు స్థంభాలు పాతి, యినుపతీగెలు చుట్టిన పెద్ద స్థలం, దాని మధ్యలో పెద్ద గోడును కనిపించాయి.

''ఇదేనా, మన వర్కింగ్ ప్లేస్'' కారు దిగుతూనే, అడిగాను ఉత్సాహంగా.

''అవును పద వెళ్దాం'' చెప్పాడు వెంకట్. గేటు దగ్గరికి రాగానే, దాదాపుగా ఓ నలభైయేళ్ళ వయసున్న వ్యక్తి వచ్చి గబగబా తలుపు తీశాడు.'మల్లన్న' అని ఇదివరకు మా నాన్న దగ్గర పనిచేసేవాడు. మన ఆఫీసుకి వాచ్‌మెన్‌గా పెట్టాను'' సందీప్‌కి చెప్తూ పరిచయం చేశాడు వెంకట్.

సందీప్ 'సరే'నన్నట్టు తలాడించాడు.

మేము నడిచేదారిలో కుడి చేతిపక్కగా, కాళ్ళు కడుక్కోవడానికి ఒక పెద్ద రాతి తొట్టి వుంది. దాని నిండా నీళ్ళు నింపివున్నాయి. తొట్టికి నీళ్ళు నింపడానికి కాస్త దూరంలో ఒక పంపు వుంది.

గేటు నుంచి గోడౌన్‌దాకా వెళ్ళడానికి నాపరాళ్ళు పరిచిన దారితో బాటూ, పక్కనే వున్న పెద్దగేటు నుంచి కార్లు, లారీలూ రావడానికీ, పోవడానికి యింకో వెడల్పాటి మట్టిరోడ్డు కూడా వుంది.

గోడౌన్‌కి ఆనుకుని కుడిపక్కగా ఐదారడుగుల వెడల్పుతో బారుగా పెద్ద రేకుల వసారా వేసివుంది. దానికి చివరన ఒక గది వుంది.

''ఈ చిన్నగదే మన ఆఫీసు'' అంటూ ఆ గది తలుపులు తీశాడు వెంకట్. గది నిజంగానే చిన్నదిగా వుంది. అయినా, చక్కటి గాలీ, వెలుతురు వుండడం వల్ల మరీ యిరుకుగా అనిపించడంలేదు.

ఆ గదిలో ఒక పెద్ద టేబులూ, దానికి రెండువైపులా కుర్చీలూ, గోడవారగా ఒక అలమర దాని పక్కగా ఒక బెంచీ వున్నాయి. ఆ గదిలో వున్న మొత్తం ఫర్నిచర్ అదే''బావుంది. మనకి ఇది సరిపోతుంది'' చెప్పాను మనస్ఫూర్తిగా.

''ఇక్కడ ఇంకా బావుంటుంది'' అంటూ గది వెనకవైపు ఉన్న తలుపులు తీశాడు వెంకట్.

మేం వున్న గదికి కాస్త దూరంలో పొలం గట్ల మీద వరుసగా చెట్లు, ఆ చెట్ల దగ్గర ఒక చిన్న నీటి కొలను.

ఎండకి నీళ్ళమీద సూర్యకిరణాలు పడి, గాలికి అలలు వచ్చినప్పుడల్లా నీళ్ళు తళుక్కున మెరుస్తున్నాయి.

"చాలా బావుంది. వర్కింగ్‌ప్లేస్ ఓ.కే. మరి వర్క్ సంగతేంటి?" అన్నాను వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

"ఇక్కడ్నుంచి, ఓవర్ టు మిస్టర్ సందీప్. ఎందుకంటే మేనేజ్‌మెంట్ అంతా సందీప్‌దే నాకు అస్సలు సంబంధంలేదీ విషయంతో" అంటూ రెండు చేతులూ సందీప్ వైపుకి చూపించాడు.

సందీప్ వెంటనే లాప్‌టాప్ ఓపెన్ చేసి, వర్కింగ్ ప్లాన్ అంతా వివరించాడు.

ఏయే సీజన్స్‌లో ఏ పంట వస్తుంది? క్లీనింగ్, ప్యాకేజింగ్, షిప్పింగ్‌లో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి? అలాంటివన్నీ వివరంగా చెప్పాడు.

క్లీనింగ్ కోసం తెచ్చిన మెషినరీని గోడౌన్‌లో వెనకపక్కగా ఫిక్స్ చేయించి, ప్యాకేజింగ్ మెటీరియల్ తెచ్చే డ్యూటీ వెంకట్‌కి అప్పగించాడు.

లైన్ మీద తిరిగి మెటీరియల్ కొనుగోలు చేయడం, షిప్పింగ్ డ్యూటీ సందీప్ చూసుకుంటానన్నాడు.

"మరి నేనేం చెయ్యాలి?" అడిగాను.

"ఎకౌంట్స్ చూసుకోవడం, వర్కర్స్‌కీ, రైతులకీ పేమెంట్స్ యివ్వడం చేయాలి. నీ పని యింటినుంచి కూడా చెయ్యొచ్చు. కాకపోతే, మొదట్లో కొద్దినెలలు ఆఫీసుకి రెగ్యులర్‌గా వస్తా బావుంటుంది.

ఇక్కడ పనులు ఎలా జరుగుతున్నాయో సూపర్ వైజ్ చేస్తూ వుండు. మేమిద్దరం బైట తిరిగే పనులు లేనప్పుడు యిక్కడ చూసుకుంటూ వుంటాం. ఒకసారి నమ్మకమైన మనుషులు లేనప్పుడు యిక్కడ చూసుకుంటూ వుంటాం. ఒకసారి నమ్మకమైన మనుషులు దొరికి, పని ట్రాక్‌లో పడితే నువ్వు రావాల్సిన అవసరంలేదు. ఇంకొక మేనేజర్‌ని హైర్ చేసుకోవచ్చు. మేం ఫ్రేం వర్క్ అంతా ఒక నెలలో సెటప్ చేస్తాం.

ఆ తర్వాత నుంచి నువ్వు పని మొదలుపెట్టొచ్చు" చెప్పాడు సందీప్.

"ఆహా! నాకిన్ని కన్సెషన్స్.. బావుంది. మీతో వర్క్ చేయడం" అన్నాను నవ్వుతూ.

"మరి, నువ్వు మేజర్ షేర్ హోల్డర్‌వి కదా" అన్నాడు వెంకట్ కూడా నాతో పాటు నవ్వి.

నెలరోజులపాటు వెంకట్, సందీప్ కంటికి కనిపించడమే కష్టమైపోయింది బిజినెస్ సెటప్ కోసం తిరుగుతూనే వున్నారు.

నేను యింట్లో హాయిగా, టి.వి ముందు సోఫాలో కూర్చుని యాపిల్స్ తింటుంటే, అమ్మకి అనుమానం వస్తూ వుంది.

"తనూ! నిజంగా నువ్వు ఆ డబ్బుని బిజినెస్‌లో యిన్వెస్ట్ చేశావా?" అని అడిగింది కూడా. ఆఖరికి ఓ నెలన్నర తర్వాత వెంకట్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టాడు.

"రేపు ఆఫీసుకి రా" అంటూ.

**పొద్దున్నే లేచి,** ఉత్సాహంగా రెడీ అయ్యాను. వర్క్‌ప్లేస్ కాబట్టి కంఫర్ట్‌బుల్ వుండే బట్టలూ, చెప్పులూ వేసుకున్నాను. వెళ్ళబోయేముందు అమ్మ పిలిచింది.

"ఇక నుంచి ఆఫీసుకి కారులో వెళ్ళిరా" అంటూ కారు తాళాలు చేతిలో పెట్టింది.

"థాంక్యూ.. అమ్మా" ఉత్సాహంగా ఎగిరి అమ్మని కౌగలించుకున్నాను.

ఆఫీసుకి వెళ్ళేసరికి అప్పటికే, అక్కడ పనిజరుగుతూవుంది. బియ్యం, కందిపప్పు, మినుములూలాంటివి శుభ్రం చేస్తూవున్నారు వర్కర్లు. వెంకట్ లారీలో నుంచి బస్తాల్ని దింపిస్తున్నాడు.

నేను నేరుగా ఆఫీసు రూంలోకి వెళ్ళాను.

అక్కడ యింకొన్ని మార్పులు కనిపించాయి.

గోడకి ఒక పెద్ద గడియారం, రిమైండర్స్ పిన్ చేసుకోవడానికి ఒక సాఫ్ట్ బోర్డు. ఇంకా టేబుల్ పక్కగా ముఖ్యమైన కాగితాలు పెట్టుకోవడానికి వీలుగా ఓ చిన్న సేఫ్ బిగించి వున్నాయి.

సందీప్ కోసం చూస్తూ, ఆఫీసుగది ముందున్న కారిడార్‌లో నుంచి గోడౌన్ వెనుక పక్కకి వెళ్ళాను.

అక్కడ మెషనరీ ముందు మోకాళ్ళ మీద కూర్చుని రెంచితో నట్లు బిగిస్తూ కనిపించాడు సందీప్.

పైనున్న వెంటిలేటర్ నుంచి కొద్దిపాటి వెలుతురు అతనిమీద పడుతూవుంది. పక్కకి తిరిగి వున్న అతని మొహంలో, పొడవాటి ముక్కు పెన్సిలుతో గీసినట్టు స్పష్టంగా కనిపిస్తూ వుంది. దీక్షగా చూస్తున్నట్టున్న అతని చిన్న కళ్ళు నుదుటి మీదకి పడుతూ వున్న అతని జుట్టు ఆ వెలుతురులో మెరుస్తూ కనిపించాయి.

అతని ఏకాగ్రతకి భంగం కలిగించకుండా, నేను నిలబడ్డ చోట నుంచే, అతన్ని చూస్తూ వున్నాను.

కొద్ది నిముషాలకి అతను తలయెత్తి నన్ను చూశాడు.

"తనూ! డోంట్ స్పేర్. ఏవైనా మాట్లాడు" అంతరాత్మ హెచ్చరించింది.

"బిజీగా వున్నట్టున్నావు" అన్నాను నవ్వుతూ.

"చిన్న రిపేరు వుంటే ఫిక్స్ చేస్తున్నాం. రేపట్నుంచి యిది వర్క్ అవుతుంది" అంటూ రెంచిని పక్కనున్న వర్కర్‌కి అందించి లేచాడు.

"పద నువ్వేం చేయాలో చెబుతాను" చొక్కా చేతిని కిందకి లాక్కుంటూ నడిచాడు.

నేను అతని వెనకాలే వెళ్ళాను.

లాప్‌టాప్ ఓపెన్ చేసి, నేను చెయ్యాల్సిన పనులన్నీ చెప్పి, ఒక్కొక్కటే వివరించాడు.

పని విషయంలో ఎంత శ్రద్ధగా, నిక్కచ్చిగా వుంటాడో అతను అప్పుడే అర్ధమైంది నాకు.

ఒక్కొక్కటే, అర్ధం చేసుకుంటూ, నేర్చుకునే ప్రయత్నం చేశాన్నేను. మధ్య మధ్యలో వెంకట్‌నీ, సందీప్‌నీ అడిగి సందేహాలు తీర్చుకుంటూ, ఎలాగో మొదటిరోజు పని అయ్యిందనిపించాను.

సెలవుల్లో హాయిగా రెస్టు తీసుకోవడానికి అలవాటుపడ్డ శరీరం, కాస్త శ్రమకే అలసిపోయినట్టనిపించింది.

సాయంకాలం అవుతూనే, గది వెనుక తలుపు తీసుకుని, బైటకి వచ్చాను. అప్పటికే చల్లగాలి తిరిగింది. దూరం నుంచి, రకరకాల పక్షులు కొలను దగ్గర చేరి కనిపించాయి.

కుంగుతున్న సూర్యుడు ఆకాశానికి రంగులద్దాడు.

నాకు తెలియకుండానే నా అడుగులు అటువైపుకి మళ్ళాయి. కొలను పక్కన అడ్డంగా వేసివున్న పెద్ద దుంగలాంటి దానిమీద కూర్చున్నాను. నారింజ రంగులోకి తిరిగిన ఆకాశం, నీళ్ళలో తళుక్కుమంటూ మెరుస్తూ వుంది.

"వావ్! యిట్స్ బ్యూటిఫుల్" ఆ అందాన్నంతా మనసులో నింపుకునే ప్రయత్నం చేస్తూ అనుకున్నాను.

ఇంతలో పిట్టల అరుపులతో బాటు, సన్నగా గాలి చప్పుడు ఆ వెంట అడుగుల చప్పుడు వినిపించింది.

సందీప్ వచ్చి, నా పక్కన కూర్చున్నాడు.

"నువ్వు యిక్కడే వుండి వుంటావని ఊహించాను" అన్నాడు నవ్వుతూ.

"అంటే నీకోసం వెతుక్కుంటున్నాడన్నమాట" అంతరాత్మ అతని మాటల్లో పాయింటు పట్టేసి, నాకు చెప్పింది.నేను నవ్వాను.

స్వప్న ఎంగేజ్ మెంట్ తర్వాత దాదాపు నెలన్నర తర్వాత మేమిద్దరం యిలా ఏకాంతంగా కలవడం.

ఆ రోజు అతని కళ్ళలోకి చూస్తూ, ప్రపంచాన్నంతా మర్చిపోయినట్టుండడం, ఇద్దరం దగ్గరవుతామనుకున్న క్షణంలో చిత్ర రావడం.. అనీ గుర్తొచ్చాయి.

"ఆ ఫీలింగ్స్ అతనిలో యింకా వున్నాయా? నిజంగా నన్ను ప్రేమిస్తున్నాడా? ప్రేమిస్తే యింకా ఎందుకు మౌనంగా వున్నాడు?" రకరకాల ప్రశ్నలు మనసుని తొలిచేశాయి.

చుట్టూ వున్న పరిసరాల్ని ఆస్వాదిస్తూ, కదులుతు వున్న నీటి అలల వంక చూస్తూ మౌనంగా కూర్చున్నాడతను.

రోజంతా పనిచేసి అలిసిపోయినా అతని మొహంలో ఆనందం కొట్టొచ్చినట్టు కనిపిస్తూవుంది. ఈ రోజు కోసం అతను ఎన్ని సంవత్సరాల నుంచి ఎదురుచూశాడో.

ఆ అందమైన సాయంకాలాన్ని చూసి, నేనెంత సంతోషించానో, ఆనందంగా వున్న అతని మొహం చూశాక అంతకన్నా ఎక్కువ సంతోషించాను.

"వచ్చే వారం, మన ఫస్ట్ షిప్‌మెంట్ యూస్‌కి వెళుతుంది. ఇందాకే అన్ని డేట్స్, బుకింగ్స్ కన్‌ఫర్మ్ అయ్యాయి" చెప్పాడతను.

"విష్ యూ గుడ్‌లక్" నవ్వుతూ అన్నాను.

"నీకు కూడా. నువ్వు కూడా పార్టనర్‌వే. మర్చిపోయావా?"

"నిన్ను చూస్తే నిజంగానే, అన్నీ మర్చిపోయేట్టున్నాను" మనసులోనే అనుకున్నాను.

అతను మళ్ళీ మౌనంగా ఆకాశంలోకి చూస్తూ కూర్చున్నాడు. అతని మనసు, యిప్పుడూ ఎలా వుందో నేను సరిగ్గా అర్థం చేసుకోగలిగాను. ఇంక, అతన్ని వేరే ఏ ప్రశ్నలూ అడగాలనిపించలేదు.

ఆ క్షణాల్ని అలాగే అతనికి వదిలేయాలనిపించింది.

ఆ సమయంలో అతను నన్ను గుర్తుచేసుకున్నాడు. అది చాలు నాకు

"నేను వస్తాను.." అంటూ కూర్చున్నచోటినుంచి లేచాను. మొదటిరోజే ఎక్కువపని చేసి అలసిపోయాను" చెప్పి నవ్వి అక్కడ్నుంచి బయలుదేరాను.

"ఇంటికి వస్తూనే, స్వప్న ఫోన్ చేసింది.

పెళ్ళికోసం కొన్న నగలూ, చీరలూ చూడడానికి రమ్మని పిలిచింది. స్వప్న పిలిచాక కాదనలేను కాబట్టి అమ్మకి చెప్పి స్వప్న వాళ్ళింటికి బయలుదేరాను.

చీరలూ, నగలూ చూసి వాటి గురించి చర్చించుకుని అక్కడే భోజనం చేసి ఇంటికి బయలుదేరే సరికి రాత్రి తొమ్మిదిగంటలయ్యింది. కారు డ్రైవ్ చేసుకుంటూ, దాదాపుగా యింటి దగ్గర వున్న మలుపుదాకా వచ్చాను.

మలుపు దగ్గర, హెడ్‌లైట్స్ వెలుతురులో రోడ్డు పక్కన, ఆపివున్న బైక్ మీద కూర్చుని వున్న ఆకారం కనిపించింది.

"సందీప్" అతని బండి పోశ్చర్‌ని బట్టి వెంటనే గుర్తుపట్టాను.

ఈ టైంలో యిక్కడున్నాడేంటి?" కారు పక్కకి తిప్పి ఆపాను.

"హి ఈజ్ నాట్ వెల్" నా మనసు చెప్పింది.

"స్వప్న వాళ్ళింటి నుంచి వస్తూ నిన్ను చూసి ఆగాను. నువ్విక్కడేం చేస్తున్నావు?" అతని దగ్గరికి వస్తూ అన్నాను.

"జస్ట్ ఫర్ ఫ్రెష్ ఎయిర్" పొడిగా వచ్చాయతని మాటలు.

"కొద్ది గంటల క్రితం ఆఫీసులో ఎంతో ఆనందంగా కనిపించాడు. ఇప్పుడిలా సడన్‌గా, మూడీగా ఏదో జరిగింది" అర్థమవుతూ వుంది కానీ అతన్ని అడగడానికి ధైర్యం చాల్లేదు.

"నువ్వెప్పుడైనా అబద్ధం చెప్పవా?" అడిగాడతను.

"ఓ చాలాసార్లు కాకపోతే అవన్నీ చిన్నప్పుడు సరదాగా అమ్మని ఆటపట్టించడానికి చెప్పివుంటాను.

కానీ ముఖ్యమైన విషయాల్లో ఎప్పుడూ అమ్మతో అబద్ధం చెప్పలేదు. నిజాలు దాచిపెట్టలేదు."

అతనొకసారి నావైపు చూసి, తిరిగి చేతిలోని సెల్‌వంక తదేకంగా చూస్తూ వున్నాడు.

"నీకు తెలుసా తనూ నేను చిన్నప్పుడు ఎప్పుడూ మా నాన్నని మీ అమ్మ ముందు చేతులు కట్టుకుని నిలబడడమే చూశాను. ఆయన్ని అలా చూస్తున్నకొద్దీ నాకు యిండిపెండెంట్‌గా బతకాలనే కోరిక బలపడుతూ వచ్చింది.

మా దగ్గర డబ్బులేదు. కానీ నాకు ఎదగాలనే కోరిక వుంది.

నాకు జీవితంలో కొన్ని గోల్స్ వున్నాయి.

ఏదో ఒక ఉద్యోగంలో చేరి యింకొకరి ముందు చేతులు కట్టుకుని నిలబడాలంటే, నాకు అసహ్యం.

మా ఆర్థికపరిస్థితికి భయపడి నేను తలొంచానంటే, ఇక ఎప్పటికీ నేను తలెత్తుకు బతకలేను.

అందుకే నేను మా సమస్యల్ని బీదరికాన్ని మర్చిపోతాను. నాకెప్పుడూ నా గోల్ మాత్రమే కనిపిస్తుంది. అందుకే నేను యింట్లో వాళ్ళని పట్టించుకోను. వాళ్ళ కోరికకి తగ్గట్టు జాబ్ చెయ్యలేను.

నేనేం చెయ్యాలనుకుంటున్నానో వాళ్ళకి అర్థంకాదు. అర్థం చేసుకోరు కూడా" అతను అవన్నీ నాతో చెప్తున్నట్టుగా లేదు. తన ఆలోచనల్ని విశ్లేషించుకోవడానికి తనలో తను మాట్లాడుతున్నట్టుగా వుంది.

సందీప్ బాధకి కొంతలో కొంత కారణం నేనూ, మా అమ్మ అనే విషయాన్ని నేను జీర్ణించుకోలేకపోయాను.

అతనికి మా అమ్మ అంటే కోపం నాకు తెలుసు. కానీ, మా వల్ల అతను బాధపడుతున్నాడంటే, నేను భరించలేకపోయాను.

"అంతకన్నా అతను చిన్నప్పటిలా నన్ను కిందపడేసి నవ్వినా బావుండు" అనిపించింది.

ఆ క్షణం ఏం మాట్లాడాలో నాకు అర్థంకాలేదు.

నా రెండు చేతులూ ముందుకు చాచి, అతని చేతిని పట్టుకున్నాను. నిజానికి, అతని స్పర్శతో కలిగే భరోసా నాకే కావాల్సివుంది. ఇద్దరం ఒక్క క్షణం మౌనంగా వున్నాం.

అతని మనసులో ఏ ఆలోచనలు పరిగెడుతున్నాయో నాకు తెలియదు. కానీ నాకు చేతనయితే అతని బాధనీ, ఆందోళనల్ని తుడిచిపెట్టుకుపోయేలా చేయాలని వుంది.

ఇంతలో కాస్త దూరం నుంచి "బావా" అన్న పిలుపు వినిపించింది."చిత్ర" అంతరాత్మ ఠక్కున చెప్పింది. చిత్ర ఎక్కడికైనా వచ్చేయగలదు. ఆశ్చర్యపోయాన్నేను. ఆమెని చూస్తూనే అతను గబుక్కున నా చేతుల్లోనుంచి, తన చేతిని తప్పించాడు. పరిగెత్తుతూ వచ్చిందేమో ఆయాసపడుతూ మాదగ్గరికి వచ్చి నిలబడింది. ఒక్క క్షణం చిత్ర నావైపు అదోరకంగా చూసి, వెంటనే సందీప్ వైపుకి తిరిగింది.'

ఇద్దరూ కళ్ళతోనే ఏదో మాట్లాడుకున్నారు. వెంటనే సందీప్ లేచి బైక్ స్టార్ట్ చేశాడు. నేను చూస్తుండగానే చిత్ర అతని బైక్ వెనకాల ఎక్కి కూర్చుంది.

"బావా నీకోసం ఎన్ని వీధులు చుట్టి వస్తున్నానో తెలుసా? అత్తయ్య సంగతి నీకు తెలిసిందే కదా! అంత మాత్రానికే భోజనం మానేసి వస్తావా?" చిత్ర సందీప్‌కి మాత్రమే వినిపించేట్టు చెప్పాలనుకున్న మాటలన్నీ నాకు వినిపించాయి.

"ఇంట్లో, సుమిత్రాదేవితో గొడవన్నమాట" విషయం అర్థమైంది నాకు. కానీ చిత్ర సందీప్ కోసం ఆరాటపడుతూ అంత రాత్రివేళ వెతుక్కుంటూ రావడం, ఇద్దరిమధ్యా కనుసైగలతో మాట్లాడుకునేంత అండర్‌స్టాండింగ్ ఉండడం నాకు నచ్చలేదు.

ఆ ఆలోచనలతోనే, కారు డ్రైవ్ చేసుకుంటూ యిల్లు చేరాను.

"ఆఫీసుకి లేటవుతుంది. ఛ. ఈ కారు కూడా యిప్పుడే ట్రబులివ్వాలా?" విసుగ్గా స్టీరింగ్ మీద పిడికిలితో గుద్దాను.

"ఎన్నిసార్లు స్టార్ట్ చేసినా ప్రయోజనం లేదు. సరిగ్గా సగం దూరంలో ఆగిపోయింది. ఇప్పుడేంటి చెయ్యడం?" అనుకుంటూ వుండగానే వెంకట్ కారు వచ్చింది అటుగా.

"ఏంటీ ప్రాబ్లెం?" నన్ను చూసి విండోగ్లాసు కిందకి దించుతూ అడిగాను. నేను కారు సంగతి చెప్పాను.

వెంటనే కారు దిగి వచ్చి బ్యానెట్ ఎత్తి చూశాడు. ఓ ఐదు నిమిషాలు అటూ యిటూ చూసి, ఇది మెకానిక్ ఫిక్స్ చేయాల్సిందే మా మెకానిక్‌కి ఫోన్ చేసి చెప్తాను. నువ్వు కారు లాక్ చేసి కీస్ నాకివ్వు. నేను చూసుకుంటాను. ప్రస్తుతానికి ఆఫీసుకి నా కారులో వెళదాం" చెప్పాడు. ఇద్దరం వెంకట్ కారులో బయల్దేరాం.

కాస్త దూరం వెళ్ళగానే ఉన్నట్టుండి సడన్ బ్రేక్ వేశాడు వెంకట్. హఠాత్తుగా బ్రేక్ వేయడంతో, దాదాపుగా నా తల డాష్ బోర్డ్‌కి కొట్టుకున్నంతపనైంది. సీట్‌బెల్ట్ పెట్టుకోకపోతే ఖచ్చితంగా నా తల పగిలి ఉండేదే.

ఆ సడన్ బ్రేక్‌కి కారణం ఒక్క క్షణం తర్వాత అర్థమైంది నాకు. కారుకి అడ్డంగా ఓ యాభై, యాభై అయిదేళ్ళ మనిషి పడిపోయి ఉన్నాడు. ఇద్దరం వెంటనే కారు దిగి చూశాం.

సమయానికి బ్రేక్ వేయడం వల్ల అతనికేమీ కాలేదు. ఒకసారి అతనికేసి పరీక్షగా చూశాను.

నెరసిన జుట్టు, గడ్డం సగం దాకా ఊడిపోయి వున్న చొక్కా గుండీలు ఆమడదూరంలో వున్నా, ముక్కు పగిలిపోయేలా కంపు.

నేలమీద పడుకుని దొర్లుతూ ఏదో గొణుగుతూ వున్నాడు.

"ఫుల్లుగా తాగిపడిపోయాడు. పాపం యింటికి చేరుద్దాం" అన్నాడు వెంకట్.

"ఇప్పుడా?" ఆశ్చర్యంగా అన్నాను.

"లేటయితే ఏమీ యిబ్బందిలేదు. 'ధర్మో రక్షతి... రక్షితం" అన్నారు. ఓ తాగుబోతుని మనం జాగ్రత్తగా యింటికి చేరిస్తే రేపు మనం తాగి పడిపోతే యింకొకరు మనల్ని యింటికి చేరుస్తారన్నమాట."

నేను వెంకట్ వైపు చూసి కళ్ళెగరేశాను.

"అంటే మరీ యిలా తాగి రోడ్డుమీద పడిపోననుకో. డ్రింక్ చేస్తే డ్రైవ్ చేయకూడదు కదా అదీ నేను చెప్పేది" అంటూ చిన్నగా ఆయన్ని లేవదీశాడు. నేను త్వరగా వెళ్ళి కారు వెనక డోర్ తీశాను.

వెంకట్ ఆయన్ని లోపల కూర్చోబెట్టి ఎలాగో తంటాలుపడి ఆయన ఎక్కడుంటాడో కనుక్కున్నాడు.

కారుని వెనక్కి తిప్పి చిన్నగా ఆయన్ని యింటిదగ్గర దింపాం. తీరా చూస్తే యింటికి తాళం వేసి వుంది.

ఇంటిముందు అరుగుమీద ఆయన్ని జాగ్రత్తగా పడుకోబెట్టి వచ్చాడు వెంకట్.

"ఇవాళ కాస్త సోషల్ సర్వీస్ చేసి, పుణ్యం సంపాదించుకున్నాను" అంటూ వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు వెంకట్.

కారు కాస్త సాగిన తర్వాత

"సందీప్ నిన్న నీతో ఏమన్నా చెప్పాడా?" అడిగాను వెంకట్. వెంకట్ నావైపోసారి అనుమానంగా చూశాడు.

"నిన్న వాళ్ళింట్లో జరిగిన హైడ్రామా గురించి నీకు కూడా తెలిసిందన్నమాట" అన్నాడు కూల్‌గా

"హై డ్రామానా?"

"ఆ!! నిన్న వాళ్ళింట్లో మనం స్టార్ట్ చేసిన బిజినెస్ గురించి తెలిసిందట. వీడికి జాబ్ చేసే వుద్దేశ్యమే లేదని వాళ్ళమ్మకి స్పష్టంగా అర్థమైనట్టుంది. ఇంట్లో పెద్ద గొడవ జరిగిందని చెప్పాడు. వాళ్ళమ్మ సంగతి నాకు బాగా తెలుసు.

అన్నం పళ్ళాలు ఎగరగొట్టడం, బావిలో దూకడంలాంటివి చేస్తుంటుంది.

పాపం నిన్నవాడు చాలా డిస్టర్బ్ అయ్యాడు. రాత్రి పన్నెండింటికి ఫోన్ చేసి, చెప్పాడీ విషయాలన్నీ"

వెంకట్ చెప్పింది వింటుంటేనే నాకు ఏదోలా అనిపించింది.

"నిన్న సందీప్ అప్‌సెట్‌గా వుండడానికి కారణం సుమిత్రాదేవి అన్నమాట. సందీప్ అలిగి, అన్నం తినకుండా వచ్చేస్తే వెనకాలే చిత్ర 'బావ' కోసం పరిగెత్తుకుంటూ వచ్చిందన్నమాట" సీను మొత్తం వూహించగలిగాను.

"అలాంటి పరిస్థితుల్లో కూడా అనుకున్నది సాధించాలన్న పట్టుదల వుంది అతనిలో అనుకుంటుండగానే, "చూస్తూ వుంటే సందీప్ మీద ప్రేమ పొంగిపొర్లిపోతున్నట్టుంది" అంతరాత్మ గుసగుసలాడింది.

"ష్.. ష్" పైకే అరిచాను.

"ఏనా అన్నావా?" వెంకట్ నావైపు విచిత్రంగా చూస్తూ అడిగాడు.

"లేదే" తమాషాగా భుజాలెగరేసి, నవ్వాను.

అప్పటికే కారు గోడౌన్ దగ్గరికి వచ్చేసింది.

"నేను వాళ్ళింట్లో సంగతులు నీకు చెప్పానని వాడికి తెలియనివ్వకు. నాకు క్షేమం వుండదు" కారు దిగుతూ చెప్పాడు వెంకట్.

"అయితే ఈ విషయం గుర్తుపెట్టుకుంటాను" అన్నాను వెంకట్ వైపు చూసి.

"తనూ.." వెంకట్ కంగారుపడిపోయాడు.

"జస్ట్ కిడ్డింగ్.." అన్నాను మళ్ళీ నవ్వేస్తూ.

లంచ్ టైం తర్వాత కాస్సేపు బైటికి వచ్చి అటూ యిటూ వాకింగ్ చేస్తూ వున్నాను.

"ఎవరు కావాలమ్మా" మల్లన్న మాటలు వినిపించి, గేటు వైపు చూశాను. గేటు దగ్గర సుమిత్రాదేవి, చిత్ర నిలబడివున్నారు.

"మల్లన్నా! సందీప్ సార్ వాళ్ళ అమ్మగారావిడ పంపించు" చెప్పాన్నేను.

వాళ్ళిద్దరూ లోపలికి వస్తూనే, మల్లన్నకి రెండు కాఫీలు తెమ్మని పురమాయించాను.

"ఏమ్మా! బావున్నావా? నువ్వూ యిందులో పార్టనర్‌విట కదా" చిరునవ్వులు ఒలికిస్తూ నన్ను పలకరించింది.

"ఔనండి" జవాబిచ్చాను.

"సందీప్ లేడా?" అడిగిందావిడ.

"పనిమీద బైటికి వెళ్ళాడు. ఇంకాసేపట్లో రావచ్చు"

ఆవిడ అర్థమైనట్టు తల ఊపింది.

తర్వాత నా ప్రమేయం లేకుండా యిద్దరూ ఆవరణ అంతా తిరిగి చూసి వచ్చారు.

"ఈ పెసరపప్పు, కందిపప్పు అమ్మి ఎప్పటికి డబ్బు సంపాదించాలి? హాయిగా ఉద్యోగంలో చేరివుంటే ఈ పాటికి నెలకి లక్షన్నర జీతం వచ్చేసి. లోన్ తీసుకుని హాయిగా అపార్టుమెంటూ, కారూ కొనుక్కుని వుండేవాడు" సుమిత్రాదేవి అసంతృప్తిగా అంటూ వుంది.

"పోనీలే అత్తయ్యా బావ, యిందులో డబ్బు సంపాదిస్తాడేమో ఎవరికి తెలుసు? అయినా బావకి యిలాంటి సలహాలిచ్చి సపోర్టు చేస్తున్నవాళ్ళని అనాలి. హాయిగా కూర్చుని తినగల కుటుంబాలు వాళ్ళవి. మన పరిస్థితులు వాళ్ళకేం తెలుస్తాయి?" చిత్ర నా వైపు చూసి మూతి విరిచింది. ఐదు నిమిషాల తర్వాత కాఫీ తాగి యిద్దరూ లేచారు.

"వస్తానమ్మా నీకసలు పని అలవాటులేదు. అయినా కష్టపడుతున్నావు" నా బుగ్గలు నిమురుతూ చెప్పింది సుమిత్రాదేవి.

ముందురోజు రాత్రి ఆవిడ చేసిందంటున్న వీరంగానికీ యిప్పుడు ఆవిడ నటిస్తున్న తీరుకీ పోలిక కుదుర్చుకోలేక తికమకపడిపోయాన్నేను.

సరిగ్గా, వాళ్ళు బయలుదేరే టైంకి వెంకట్ వచ్చాడు. వస్తూనే సుమిత్రాదేవిని పలకరించి "రండి ఆంటీ మిమ్మల్ని డ్రాప్ చేస్తాను" అంటూ వినయంగా కారులో ఎక్కించుకుని వెళ్ళాడు.

"హమ్మయ్య" ఊపిరి పీల్చుకుని, తిరిగి ఆఫీసురూంలోకి వెళ్ళాను. షిప్ మెంట్‌కి కొన్ని టన్నుల సరుకు రెడీ అయ్యింది.

వర్కర్స్‌కి యివ్వాల్సిన పేమెంట్ లెక్కలు చూస్తూ కూర్చున్నాను. సాయంత్రం 5 గంటలయ్యింది.

కొలను దగ్గర బెంచీమీద కూర్చుని అలవాటుగా సూర్యాస్తమయాన్ని చూస్తూ వున్నాను.

అంతలో సందీప్ వచ్చాడక్కడికి. పదిగంటలకి పనిమీద బయటికి వెళ్ళిన మనిషి అప్పటికి తిరిగొచ్చాడు ''ఏంటి యింకా, యిక్కడే వున్నావు?'' అడిగాడు వచ్చి నా పక్కనే కూర్చుంటూ.

''నా కారు ట్రబులిచ్చింది. వెంకట్ మీ అమ్మగారినీ, చిత్రనీ డ్రాప్ చేయడానికి వెళ్ళి మళ్ళీ తిరిగి రాలేదు.

నన్నెవరైనా డ్రాప్ చేస్తారా అని ఎదురు చూస్తున్నాను'' సందీప్ ఆశ్చర్యంగా చూశాడు నావైపు.

''అవును. మీ అమ్మ, చిత్ర యిద్దరూ నీ బిజినెస్‌ని పర్యవేక్షించడానికి వచ్చారు. నీ వాటా షేర్‌ని అమ్మేయడానికి ఒక పార్టీని కూడా తెచ్చారు'' అన్నాను సీరియస్‌గా మొహం పెట్టి.

అతని మొహంలో మారిన రంగుల్ని చూసి నేను పకపకా నవ్వాను.

''డోంట్ వర్రీ జస్ట్ జోక్ చేశాను అంతా స్మూత్‌గానే సాగింది. నీ సెటప్ అంతా చూసి వెళ్ళారు'' చెప్పాను.

**తను భారం** దించుకున్నట్టు నిట్టూర్చాడు.

''తనూ భారం దించుకున్నటు నిట్టూర్చాడు.

''తనూ! నిన్న రాత్రి మీ అమ్మ గురించి నేనేదైనా మాట్లాడి'' అతను చెప్పబోతుంటే నేను అడ్డు తగిలాను.

''ఫర్వాలేదు. నాకు తెలుసు. నీకు మా అమ్మ అంటే ద్వేషం అని. మీ నాన్నగారిని పర్సనల్ సర్వెంట్‌లా చూస్తుందని నీకు కోపం. ఆ కోపం అంతా నా మీద చూపించేవాడివి.

నేను అర్థం చేసుకోగలను. కొన్ని ఫీలింగ్స్ బలంగా మనసులో నాటుకుపోతాయి. వాటిని ఎవ్వరూ మార్చలేరు.

నేనే ఎగ్జాంపుల్ నువ్వెంత హర్ట్ చేసినా, విసుక్కున్నా నీ వెనకాలే తిరుగుతుంటాను. చివరికి బిజినెస్‌లో కూడా నీ వెంటే వున్నాను'' అన్నాను నవ్వడానికి ప్రయత్నిస్తూ.

''అదంతా ఒకప్పటి మాట. నిన్ను బాధపెట్టాలని నా ఉద్దేశ్యంకాదు. ఐ నో! నో ఫ్యామిలీ ఈజ్ పర్ఫెక్ట్. మా అమ్మ సంగతే చెప్పాలంటే'' అతను చెప్పబోతుంటే.

''ప్లీజ్'' అంటూ ఆపానతన్ని.

''కొన్ని విషయాలు మాట్లాడే ధైర్యం, వినగలిగే ధైర్యం అందరికీ వుండదు. ముఖ్యంగా ఫ్యామిలీ గురించి. కొన్ని యిబ్బందికరమైన విషయాల్ని మనసుతో అర్థం చేసుకుని వదిలేయాలి'' చెప్పాను నెమ్మదిగా.

అతను నన్ను కొత్తగా చదువుతున్నట్టు చూశాడు.

మాటల్లో పడి ఎప్పుడు మబ్బులు ఆకాశాన్ని కప్పేశాయో గమనించనేలేదు. అప్పటికే వాతావరణం బాగా చల్లబడిపోయింది. ఒక్కొక్క చినుకూ పైనుంచి చుక్కలు చుక్కలుగా పడుతూవుంది.

"హేయ్! వానపూలు" అన్నాను నేను సరదాగా చేతులు చాపుతూ.

"వానపూలంటే?"

ఒక్కొక్క చినుకే పూలజల్లులుగా అక్కడక్కడా ఒక్కొక్కటే పడుతూ ప్లెజెంట్‌గా వుంటే వాటిని 'వానపూలు' అంటారు. నేను చెబుతూ వుండగానే గాలి హోరు పెరిగింది. చినుకులుగా మొదలైన వాన కాస్తా సన్నని జల్లులా మారింది.

"నీ వానపూలు ఆగిపోయి వర్షం మొదలైంది. పద వెళదాం" సందీప్ అనడంతో నేను కదిలాను.

కాస్త దూరం నడిచామో లేదో వాన తీవ్రత పెరిగింది. తెలియకుండానే యిద్దరం ఒకరి చేయి ఒకరం పట్టుకున్నాం. వానజోరు యింకా పెరిగింది.

గాలికి అడుగులు కూడా సరిగ్గా పడడంలేదు. చలికి శరీరం కుంచించుకుపోతున్నట్టుంది.

గబగబా యిద్దరం గోడౌన్ పక్కనున్న కారిడార్‌లోకి వెళ్ళాం. వాన దాడినుంచి తప్పించుకున్న తర్వాత అర్థమైంది, అతని చేతిని నేను ఎంత గట్టిగా పట్టుకున్నానో. వెంటనే నా చేతిని వదిలే ప్రయత్నం చేశాను. కానీ అతను నా చేతిని మరింత గట్టిగా పట్టుకున్నాడు. అతని చూపుల్లో ఉద్దేశ్యం స్పష్టంగా అర్థమవుతూ వుంది నాకు. మనసులో అదోరకమైన కలవరం మొదలైంది. వానకి, తడిసి ఒంటికి అతుక్కుపోతున్నట్టున్న చుడీదార్‌ని ఒంటిచేత్తో సరిచేసుకునే ప్రయత్నం చేశాను.

అతను యింకొంచెం దగ్గరగా వచ్చాడు. అతని చేతిలో వున్న నా చేతిమీద పట్టు మరింత బిగుసుకుంది. అమాంతంగా ముందుకు వంగి, రెండవ చేతిని గోడకానించి నన్ను కదలకుండా చేశాడు.

అతను ముందుకి వంగడంతో అతని జుట్టులో నుంచి, ముక్కుమీద నుంచి ఒక్కొక్కటిగా నీటి చుక్కలు రాలి నా ఒంటిమీద పడుతున్నాయి.

తడిసి, గట్టిగా అతుక్కుపోయిన అతని చొక్కాలో నుంచి, ధృఢంగా వున్న చేతి వంపులు, చెంపల మీద బరువుగా తగులుతున్న అతని ఊపిరి నా మెదడుని పనిచెయ్యనియ్యకుండా చేశాయి.

"తన్మయీ ఇంక నీ వికెట్ పడిపోయినట్టే జాగ్రత్త" అంతరాత్మ అరుపులు నా శరీరం కంపించింది.

అతను నెమ్మదిగా నా మెడ మీదకి వంగాడు.

"తనూ! ఐ లవ్ యూ!"

ఆ మాటలు లయబద్ధంగా వున్న అతని ఊపిరితో కలిసి తియ్యగా వినిపించాయి. ''ఇప్పుడు కాదు. నిన్ను ఎప్పట్నుంచి ప్రేమిస్తున్నానో నాకే తెలియదు.''

''ఐ నో.. దట్'' చెప్పాన్నేను.

''అదికాదు. నాకు కావల్సిన జవాబు'' అంటూ అతను నా చెంపలని పెదవులతో మృదువుగా తాకాడు.

''ఐ లవ్ యూ..టూ''

నా మాటలు పూర్తికాకముందే అతను ముందుకి వంగి నా పెదవుల్ని అందుకున్నాడు. ఆ క్షణం నేను ఎవరో ఏమిటో పూర్తిగా మర్చిపోయాను. అతని శ్వాసలూ, స్పర్శ నాలో వెచ్చదనాన్ని నింపాయి.

ఇంతలో, వానకి చెట్టుకొమ్మ ఒకటి విరిగిపడి పెద్ద చప్పుడైంది. అదిరిపడి తలతిప్పి చూశాను.

ఇద్దరం ఒకరికొకరు దూరంగా జరిగాం. తడిసిన బట్టలు, తోడు చలిగాలి. లోపలనుంచి సన్నగా వణుకు ప్రారంభమైంది. సందీప్ ఆఫీస్ రూంలోకి వెళ్ళి రెండు నాప్‌కిన్సే తెచ్చాడు.

వాటితో తలతుడుచుకుని వాన ఆగడం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం. నేను బైట కురుస్తున్న వాననీ, చెట్లనీ చూస్తున్నట్టుగా నటిస్తూ, మధ్య మధ్య సందీప్ వైపుకి చూస్తూ వున్నాను.

అతని మొహం వింత వెలుగుతో ఆనందంగా వుండడం చూసినప్పుడల్లా నా బుగ్గలు ఎర్రబడుతూ వున్నాయి.

కాస్సేపటికి వాన వెలిసింది.

సందీప్ బైక్ మీద యింటి దగ్గర దించాడు.

బైక్ దిగి, ''ఓ.కే బై..'' అంటూ వెనక్కి తిరగబోతుంటే, నా చెయ్యి పట్టుకుని ఆపాడు.

గంట క్రితం, జరిగిన సంఘటన తర్వాత హఠాత్తుగా అంతా మారిపోయినట్టయ్యింది.

నా మనసుకి సంతోషం తప్ప మరొకటి తెలియదన్నట్టూ, నేను ఎక్కడ వున్నా అతని చూపులు వెంబడిస్తున్నట్టూ వుంది.

''ఓ.కే సీయూ టుమారో'' నవ్వుతూ అతని చేతిని తప్పించుకున్నాను. నా మనసు గాల్లో తేలిపోతుండగానే, అతనికి వీడ్కోలు చెప్పి, ఉత్సాహంగా గేటు దగ్గరకి వచ్చాను.

అమ్మ అక్కడే నిలుచుని చూస్తూ కనిపించింది. హఠాత్తుగా అమ్మని చూసేసరికి తడబడిపోయాన్నేను. ''నా మొహం మీద జరిగినదంతా క్లియర్‌గా రాసినట్టు కనిపిస్తుందా? అమ్మ అంతా కనిపెట్టేసిందా?'' కంగారుపడుతూ లోపలికి వెళ్ళాను.

"వాన పడుతూ వుంది. కారు రిపేరుకి యిచ్చానని చెప్పావు. ఎలా యింటికి వస్తావో అని నేను టెన్షన్ పడుతూ వున్నాను. ఇలాంటప్పుడు ఫోనన్నా చేయాలి. లేకపోతే ఫోన్ చేసినప్పుడు కనీసం ఫోన్ తీసి మాట్లాడాలి" కోపంగా అంది అమ్మ.

"సారీ! అమ్మా"

"బట్టలు బాగా తడిశాయి. వెళ్ళి త్వరగా మార్చుకో" అమ్మ అనడం తరవాయి, మళ్ళీ తిరిగి చూడకుండా నా గదిలోకి వెళ్ళాను. పొడిబట్టల్లోకి మారి తల ఆరబెట్టుకుంటూ బ్యాగ్‌లో నుంచి సెల్ బైటికి తీశాను.

అమ్మ దగ్గర్నుంచి ఆరు మిస్స్‌డ్ కాల్స్ వున్నాయి.

రాత్రి భోజనం చేసి పడుకున్న దగ్గర్నుంచి ఒకటే తలనొప్పి, ఒళ్ళు నొప్పులు. చేయికూడా కదపలేనంత భారంగా అనిపించింది శరీరం.

కాస్సేపటికి "తనూ..! తనూ" అంటూ అమ్మ గొంతు వినిపించింది. తర్వాత నన్ను లేపి కూర్చోబెట్టినట్టు గుర్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందో అస్సలు గుర్తులేదు.

పొద్దున లేస్తూనే, "హాచ్.. హాచ్" అంటూ తుమ్ములు వచ్చాయి.

"ఎలావుంది యిప్పుడు నీకు?" అంటూ అమ్మ నా గదిలోకి వచ్చింది.

"హాచ్" గట్టిగా తుమ్మాను.

"రాత్రంతా ఒకటే జ్వరం నీకు" అంటూ నుదుటి మీద చెయ్యిపెట్టి చూసింది.

"జ్వరంలేదు. కానీ యివాళ రెస్ట్ తీసుకో. ఆఫీసుకి వెళ్ళకు" చెప్పింది అమ్మ.

"నాలుగురోజుల్లో షిప్ మెంట్ వెళ్ళాలి. ఇది మా మొదటి కాంట్రాక్ట్. ఒక్క గంట వెళ్ళి వస్తాను. "

"ఇవాళ వెళ్తే, యింకో నాలుగురోజులు సెలవు పెట్టాల్సొస్తుంది. ఏది బెటరో ఆలోచించుకో" చెప్పింది అమ్మ.

"షి ఈజ్ డామ్ రైట్. యాజ్ ఆల్వేస్" అనుకుంటూ. సందీప్‌కీ, వెంకట్‌కీ ఆఫీస్‌కి రావడం లేదని మెసేజ్ చేశాను.

సాయంత్రం ఐదుగంటల టైంలో స్వప్న దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది.

"అబ్బా! నీ పెళ్ళి షాపింగ్ తర్వాత చూస్తాను. యివాల్టికి రెస్టు కావాలి స్వప్నా!" అన్నాను ఫోన్ తీస్తూనే.

"అమ్మా! నేను అన్నపూర్ణమ్మ బామ్మని"

"ఆవిడెందుకు ఫోన్ చేసింది?" అనుకుంటూ నిటారుగా అయ్యాను.

"ఒకసారి అర్జంటుగా మా యింటికి రాగలవా? స్వప్న, తనీష్‌ల పెళ్ళి కాన్సిల్ అయ్యేట్టుంది. స్వప్న కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూ వుంది. నువ్వు వస్తే దానికి కాస్త ధైర్యంగా వుంటుంది" చెప్పి ఫోన్ పెట్టేసింది.

నేను హడావుడిగా డోర్ లాక్ చేసుకుని స్వప్న వాళ్ళింటికి వెళ్ళాను. అక్కడికి వెళ్ళాక నేను విన్న షాకింగ్ న్యూస్..

"తనీష్‌కి ఆల్రెడీ పెళ్ళయ్యిందట. ఎంగేజ్‌మెంట్‌కి తనీష్, తనీష్ తండ్రి మాత్రమే రావడంతో మాధవన్నయ్యకి అనుమానం వచ్చి ఎంక్వైరీ చేయించాడు.

ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన ఎంగేజ్‌మెంట్ ఫోటోలు చూసి తనీష్ భార్య కూడా వీళ్ళని కాంటాక్ట్ అవడానికి ట్రై చేసిందట.

అలా అసలు విషయం బైటపడింది.

మాధవన్నయ్య మాటలు విని నాకు నోట మాట రాలేదు. స్వప్న పరిస్థితి అయితే మరీ దారుణంగా వుంది.

దాదాపు సంవత్సరం నుంచి 'లివింగ్ టు గెదర్; రిలేషన్‌లో వుంటూ అతని మోసం తెలుసుకోలేకపోయిందంటే నిజంగా అతను ఎంత తెలివిగ మేనేజ్ చేశాడు. నేను ఆలోచించలేకపోయాను.

'ప్రేమ గుడ్డిది' అంటారు అందుకేనేమో. స్వప్న మాత్రం మాధవన్నయ్య మాటలు నమ్మేస్థితిలో లేదు. ఇంట్లో వాళ్ళందరూ రకరకాల ప్రశ్నలు స్మధించారు. మాధవన్నయ్య ఆధారాలు చూపించడమే కాక, తనీష్ భార్యతో కూడా మాట్లాడించేసరికి స్వప్నకి నోట మాట రాలేదు. స్వప్నే కాదు. అక్కడున్న అందరి పరిస్థితి అలాగే వుంది. "వాడొట్టి ఈట్. ఇంకా నయం మనం వాడి వలలో పడకముందే నిజం తెలిసింది. మన డబ్బు, బిజినెస్‌ని దృష్టిలో పెట్టుకునే వాడు ఈ ప్లాన్ చేశాడు" మాధవన్నయ్య కోపంగా అన్నాడు.

"నిజంగా అతని మాయలో పడలేదా? స్వప్న అతనితో కలిసి వుంటున్న సంగతి యింకా యింట్లో ఎవరికీ తెలియదేమో?" నాకు అనుమానం వచ్చింది.

ఇంతలో "అయ్యో స్వప్నా స్వప్నా" అంటూ అన్నపూర్ణమ్మగారు కంగారుగా అరవడంతో స్వప్న వైపుకి తిరిగారందరూ.

స్వప్న సోఫాలో కుప్పకూలిపోయి వుంది.

స్వప్న మొహం మీద నీళ్ళు చిలకరించి లేపి గదిలోకి తీసుకు వెళ్ళారు. తెలివిలోకి వస్తూనే మళ్ళీ భోరున ఏడుపు మొదలుపెట్టింది.

"నేను తనీష్‌తో మాట్లాడాలి" అంటూ సెల్‌ఫోన్ కోసం హాల్లోకి పరుగుతీసింది.

మాధవన్నయ్య బలవంతంగా ఆపాడు స్వప్నని.

"ఇప్పుడు వాడితో మాట్లాడి ఏం సాధిస్తావు? అనవసరంగా మనసు పాడుచేసుకోవడం తప్ప.

నువ్వు గట్టిగా నిలదీస్తే అబద్దాలు చెప్పడమో, బుకాయించడమో చేస్తాడు. ఇంకా నయం ఈ విషయం పెళ్ళికి ముందే తెలిసింది" మాధవన్నయ్య అరిచాడు.

ఏడ్చి, ఏడ్చి స్వప్న కళ్ళు ఉబ్బిపోయాయి.

బలవంతంగా ఒక నిద్రమాత్ర మింగించి సోఫాలో పడుకోబెట్టారు.

"దాన్ని కొద్దిరోజులు ఒంటరిగా వదలకండి" అన్నపూర్ణమ్మగారు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అంది.

ఇంట్లో అందరికంటే ఆవిడకి స్వప్నతో ఎక్కువ ఎటాచ్ మెంట్.

"ప్రేమించింది కరెక్టే. వాడు మోసగాడు అని తెలిసి కూడా యింతలా బెంబేలు పడడం దేనికి?" విసుక్కున్నాడు మాధవన్నయ్య.

"ఆడపిల్ల కదరా" నచ్చ చెప్పింది అన్నపూర్ణమ్మ.

స్వప్న నిద్రలోకి జారుకునే దాకా కూర్చుని వెళ్ళిపోయారంతా. ఆ గదిలో నేనూ అన్నపూర్ణమ్మగారూ మాత్రమే మిగిలాం.

నిద్రపోతున్న స్వప్న మొహం చూస్తుంటే తనీష్ మొదటిసారి యింటికి వచ్చిన రాత్రి గుర్తుకు వచ్చింది.

నవ్వుతూ, తుళ్ళుతూ ఆనందంగా గడిపిన ఆ క్షణాలు, అబద్ధం అని తెలిస్తే ఎంత బాధ?

మామూలుగా అయితే, స్వప్న నాకు అర్ధమయ్యేది కాదేమో? కానీ సందీప్‌తో గడిపిన కొద్ది క్షణాలు నన్ను అతనికి ఎంత దగ్గర చేశాయో స్వయంగా అనుభవించాక స్వప్న పడే బాధ పూర్తిగా అర్ధమౌతుంది.

ఇంటికి వచ్చాక కూడా చాలాసేపు స్వప్నే కళ్ళముందు మెదులుతూ వుంది. అందంగా నవ్వుతూ కనిపించే తనీష్ మొహం వెనుక అంత మోసం వుంది అంటే నాకే నమ్మబుదిద్ కాలేదు.

కోరుకున్నది జరగకపోతే ఆ నిరాశని తట్టుకోగలమేమో కానీ నమ్మకం ముక్కలైపోతే తట్టుకోవడానికి చాలా మానసికబలం కావాలి.

ఆ రాత్రి అమ్మతో స్వప్న సంగతంతా చెప్పాను. తనీష్‌తో స్వప్న ఎంత దూరం వెళ్ళిందీ అతని గురించి బైటపడ్డ నిజాలూ అన్నీ చెప్పేశాను.

"ఇలాంటప్పుడే ఆ అమ్మాయీ, వాళ్ళ యింట్లో వాళ్ళూ మరింత జాగ్రత్తగా వుండాలి. ఎందుకంటే వాడూ కష్టాపడి యేడాదిపాటు వేసిన ప్లాను, పెట్టిన పెట్టుబడి వేస్టు అయిపోయిందంటే వాడు సహించలేదు. దానికోస ఏదైనా చెయ్యొచ్చు" చెప్పింది అమ్మ.

"నిజమే"

ఇప్పటివరకూ తేనె పూసిన కత్తిలా ఎంత మోసం చేశాడు అనే ఆలోచిస్తున్నారు కానీ ముందు ముందు ఏం చేయగలడు? అన్న ఆలోచన నాకు రాలేదు.

ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతుంటే అమ్మ నా దగ్గరికి వచ్చింది. "పోనీ ఈ పూట కూడా సెలవు పెట్టరాదూ ఇంకా డల్‌గా వున్నావు" చెప్పింది.

"లేదమ్మా యివాళ చాలా యింపార్టెంట్ పనులు వున్నాయి. వెళ్ళాలి" చెప్పి బయల్దేరాను.

వాకిట్లో వెంకట్ కార్లో నాకోసం వెయిట్ చేస్తూ వున్నాడు. ఇద్దరం వెంకట్ కార్లో ఆఫీసుకి బయలుదేరాం. దారిలో బంక్ దగ్గర ఆగి క్యాష్ డ్రా చేశాను. వర్కర్స్‌కి పేమెంట్స్, యింకా షిప్‌మెంట్ లోడింగ్‌కి ఎడ్వాన్స్ పేమెంట్ యివ్వడానికి.

వస్తూనే ఎకౌంట్స్ చూసే పనిలో పడ్డాను. వెంకట్, కార్టన్ బాక్సుల్లో ప్యాక్ చేసిన సరుకులు పెట్టించి సీల్ చేయిస్తున్నాడు.

ఒక గంటసేపు ఎకౌంట్స్ చూశానో లేదో విపరీతంగా తలనొప్పి ప్రారంభమైంది. ఇంకా జలుబు పూర్తిగా తగ్గకపోవడం ముందురోజు రాత్రి స్వప్న గురించిన ఆలోచనలతో సరిగ్గా నిద్రపట్టకపోవడంతో విపరీతమైన అలసటగా అనిపించింది. కాఫీ తాగుదామని కుర్చీలో నుంచి లేచాను.

గుమ్మంలోకి రాగానే చిత్ర వస్తూ కనిపించింది.

"చిత్ర ఈ టైంలో యిక్కడ అదీ ఒంటరిగా" ఆశ్చర్యపోయాను.

"హలో.. చిత్రా"

నా పలకరింపుకి ముక్తసరిగా నవ్వింది.

"బావ వున్నాడా? ఫోన్ చేస్తుంటే స్విచ్చాఫ్ అని వస్తుంది. అందుకని నేనే వచ్చాను" అంది గంభీరంగా.

వెంటనే, నేనూ ట్రైచేసి చూశాను.

స్విచ్చాఫ్ మెసేజ్ వినిపించింది. వెంకట్ ఏమైనా తెలుసేమో, ఎక్కడికి వెళ్ళాడో? నేను కనుక్కొని చెప్తాను" అంటూ వెంకట్ కోస్మ గోడౌన్ వైపుకి కదిలాను.

"ఇంత హఠాత్తుగా చిత్ర ఎందుకు వచ్చింది? ఇంట్లో ఏదన్నా గొడవా?" సందీప్ కావాలనే ఫోన్ స్విచ్చాఫ్ చేశాడా?"లాంటి అనుమానాలన్నీ ఒక్కసారిగా పుట్టుకొచ్చాయి.

వెంకట్‌తో మాట్లాడి తిరిగి వచ్చేసరికి చిత్ర, నా సీటు దగ్గర నిలబడివుంది. నేను వచ్చేసరికి, ఏదో సవరిస్తున్నదల్లా హఠాత్తుగా సర్దుకుని నిలబడింది. చిత్ర వాలకం చూస్తే నాకు అనుమానం వచ్చింది.

"ఇవాళ్ అర్రాత్రికి లోడింగ్ అయ్యి షిప్‌మార్ట్‌కి మెటీరియల్ చేరాలి. ఆ పని మీద బైటికి వెళ్ళాడు. వచ్చాక నేను యిన్‌ఫార్మ్ చేస్తాను."

"అలాగే" చెప్పి కదిలింది చిత్ర.

"ఎలా వెళతావు? ఇక్కడ ఆటోలు అంత త్వరగా దొరకవు వెంకట్ డ్రాప్ చేస్తాడు నిన్ను" చెప్పాను.

"లేదు. ఆటోని బైట ఆపి వచ్చాను. బావ వస్తే త్వరగా యింటికి రమ్మని చెప్పండి" చెప్పి హడావుడిగ వెళ్ళిపోయింది.

"ఏంటో అంత అర్జంటుపని" అనుకుంటూ తిరిగి నా పనిలో పడిపోయాను. లంచ్ తర్వాత, వర్కర్స్‌కి పేమేంట్ యివ్వడానికి సేఫ్ ఓపెన్ చేశాను.

చూస్తే అందులో క్యాష్ లేదు.

ఒక్కసారిగా నా గుండె జారిపోయింది.

హడావుడిగా పక్కడ్రాలు అన్నీ చెక్ చేశాను.

చూస్తే అందులో క్యాష్ లేదు.

ఒక్కసారిగా నా గుండె జారిపోయింది.

హడావుడిగా పక్క డ్రాలు అన్నీ చెక్ చేశాను. ఎక్కడా కనిపించలేదు.

పరుగున వెంకట్ దగ్గరకెళ్ళి విషయం చెప్పాను. "సరిగ్గా గుర్తుతెచ్చుకో, ఎక్కడ పెట్టావో" అంటూ నాతోపాటే రూం అంతా గాలించాడు.

"బ్యాగ్ తెచ్చి సేఫ్‌లో పెట్టాను. సేఫ్ కీస్ ఈ డ్రాలో పెట్టాను" చెప్పాను మళ్ళీ ఒక్కసారి సేఫ్ తీస్తూ.

"హూ!" ఈ రూంలోకి ఎవరన్నా వచ్చారా?" అడిగాడు చేత్తో గడ్డం రుద్దుకుంటూ.

"ఇందాక చిత్ర వచ్చింది. మరెవ్వరూ రాలేదు."

"ఇప్పుడేం చేద్దాం?"

"ఒకటా, రెండా ఎనిమిదిలక్షల క్యాష్" కంగారుపడిపోయాన్నేను. ఒంట్లో బాగోకపోవడంవల్లో, టెన్షన్‌కో తెలీదు. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి.

"తనూ నువ్వు ముందు రిలాక్స్‌డ్‌గా వుండు. ఇలా కూర్చో" వెంకట్ నన్నా కుర్చీలో కూర్చోపెట్టి మంచినీళ్ళగ్లాసు అందించాడు.

"నేను వర్కర్స్‌కి పేమెంట్ తర్వాత యిస్తామని చెప్పివస్తాను ఈలోపు ఏదో ఒకటి ఆలోచిద్దాం" చెప్పి వెళ్ళాడు.

వెంకట్ వెళ్ళిన రెండు నిముషాలకే సందీప్ వచ్చాడు.

ఆందోళనగా వున్న నా మొహం, ఒంటినిండా చెమటలూ చూసి "ఆర్యూ ఓకే? ఒంట్లో బాగోలేనప్పుడు ఆఫీసుకి ఎందుకు వచ్చావు?" అంటూ దగ్గరగా వచ్చాడు.

"సందీప్ క్యాష్ పోయింది" ఏడుపు గొంతుతో అన్నాను.

అతను కనుబొమలు ముడుస్తూ నావైపు చూశాడు.

"క్యాష్ ఏంటి? పోవడం ఏంటి?" అడిగాడూ ఆదుర్దాగా.

"వర్కర్స్ పేమెంట్స్‌కీ, రేపటికి షిప్‌యార్డ్‌లో నీ ఖర్చులకీ క్యాష్ డ్రా చేశాను. ఇక్కడే సేఫ్‌లో పెట్టి, తాళాలు డ్రాలో పెట్టాను. కనిపించడంలేదు."

నేను చెబుతుండగానే వెంకట్ తిరిగి వచ్చాడు.

"విషయం తెలిసినట్టుందిగా. ఇందాక చిత్ర రూంలోకి వచ్చింది. ఆ తర్వాత ఎవరూ రాలేదు. అప్పట్నుంచే క్యాష్ కనిపించడంలేదు" నేను కళ్ళతో వారించేలోపే వెంకట్ చెప్పేశాడు.

"అంటే, ఏంటి నువ్వనేది?" సందీప్ మాటలు కరుకుగా వచ్చాయి. పరిస్థితి శృతి మించేట్టుందని అర్ధమైంది నాకు.

"ఓ.కే కూల్" అంటూ స్మదీప్ చెయ్యిపట్టుకుని వారించాను.

"చిత్ర యిక్కడికి వచ్చింది అన్నాను. ఆ తర్వాతే డబ్బు కనిపించలేదు. ఆ అమ్మాయి నీకు మరదలు అయితే కావచ్చు. కానీ మేం అనుమానించడానికి అవకాశం వుంది కదా! మేమిద్దరం అయితే తీసే ఛాన్సే లేదు. ఈ షిప్‌మెంట్ వెళ్ళడం నీకెంత యింపార్టెంటో మాకూ అంతే యింపార్టెంట్" వెంకట్ విసుగ్గా అన్నాడు.

సందీప్‌కి కోపం వచ్చింది.

"చిత్రే గనక డబ్బు తీసివుంటే అందులో ప్రతి పైసాకీ బాధ్యతనాది. వడ్డీతో సహా యిస్తాను.

కానీ అది పొరబాటు అయితే మాత్రం, మాటలు జారినందుకు నువ్వు బాధపడాల్సి వుంటుంది జాగ్రత్త" తీవ్రంగా అన్నాడు.

"సందీప్ వెంకట్ ఉద్దేశ్యం అదికాదు. నేనే చిత్ర యిక్కడికి వచ్చిందని చెప్పాను. ఏదో మిస్ అండర్‌స్టాండింగ్ అయివుండొచ్చు" సర్ది చెప్పే ప్రయత్నం చేశాను.

"తనూ నువ్వు ఆగు" వెంకట్ కల్పించుకున్నాడు.

"ఇది మిస్ అండర్ స్టాండింగ్ అయివుండొచ్చు. కాదనను. కానీ నీతోబాటూ నేనూ పగలూ రాత్రీ కష్టపడుతున్నానిక్కడ. మా యింట్లో నాకూ యిబ్బందులు వున్నాయి. కానీ మా యింట్లో వాళ్ళెవ్వరూ నా బిజినెస్‌లో తలదూర్చట్లేదు. ఇక్కడికి వచ్చి యిన్స్‌ఫెక్షన్ చేయడంలేదు.

బెటర్ నీ ఫ్యామిలీ డ్రామాని యింటికే పరిమితం చెయ్యి. ఇది నేను ఎప్పుడో చెప్పాలనుకున్నాను. ఇవాళ నా బ్రేక్ పాయింట్ వచ్చేసింది. అందుకే చెబుతున్నాను" అన్నాడు ఆవేశంతో ఊగిపోతూ.

"వెంకట్‌కి ఏమయ్యింది?" అతని మాటలకి షాకయ్యాను నేను సందీప్ సంగతైతే చెప్పక్కర్లేదు.

కోపంతో, అవమానంతో అతని మొహం ఎర్రబడింది.

అతనింకేదో అనేలోపల నాకు సడన్‌గా అసలు విషయం స్ఫురించింది.

"సందీప్ చిత్ర నీ సెల్ సిచ్చాఫ్ అయ్యిందని, నీకోసం వెతుక్కుంటూ యిక్కడికి వచ్చింది. నిన్ను త్వరగా యింటికి రమ్మని చెప్పమంది. బహుశా, ఏదైనా అర్జంట్ మేటర్ అయ్యుండచ్చు' చెప్పాను.

సందీప్ ఒకసారి వెంకట్ వంక కోపంగా చూసి గబగబా అక్కడ్నుంచి వెళ్ళాడు.

అతను వెళుతూనే, తలపట్టుకుని కుర్చీలో కూలబడ్డాను. వెంకట్, బైటికి వెళ్ళి వరండాలో నిలుచున్నాడు. పది నిముషాల తర్వాత, అటూ యిటూ పచార్లు చేసి, వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు వెంకట్.

"ఎక్కువ మాట్లాడానంటావా?" వస్తూనే అడిగాడు.

"చాలా" మూతి విరుస్తూ అన్నాను.

"ఏం చేయమంటావు తనూ? ఎన్నాళ్ళని వాడినే మోస్తూ తిరుగుతాను? వాడికి ఫైనాన్షియల్ ప్రాబ్లెమ్స్ అంటూ వాడి స్టోరీలే ఎన్నాళ్ళని వింటాను.

నాకూ యింటో ప్రెషర్ పెరిగిపోతుంది. ఎక్కడో ఒకచోట సెటిల్ అవ్వాలి. మా మా మావయ్య కూతురు సుధ, నేనూ ప్రేమించుకున్నాం. మా మావయ్య సుధకి సంబంధాలు చూస్తున్నాడు.

ఈ డెలివరీ అయితే నేనూ ఏదో ఒకటి సాధించానని చెప్పుకోవచ్చు. ఇది నాకూ చాలా యింపార్టెంట్.

పెట్టుబడికే చాలా యిబ్బందులు పడ్డాం. టైంకి చేతిలో క్యాష్ పోయిందంటేఃణ ఎలా మేనేజ్ చేస్తాం? రేపటికల్లా డబ్బు అందకపోతే యిన్నాళ్ళ శ్రమవేస్ట్ అవడమేకాదు... కాంట్రాక్ట్ బ్రీచ్ కింద కేసు వేసి, డబ్బు కట్టిస్తారు. ఊహించుకుంటేనే టెన్షన్ వస్తుంది'' అసహనంగా కణతలు రుద్దుకుంటూ అన్నాడు.

''సారీ వెంకట్ ఇదంతా నా అజాగ్రత్త వల్లే జరిగింది'' బాధపడుతూ అన్నాను.

వెంకట్ రెండు నిముషాలపాటు మౌనంగా వున్నాడు.

''నా దగ్గర ఒక అయిడియా వుంది. నా నగలు కొన్ని వున్నాయి అవి అమ్మితే కొంత డబ్బు రావొచ్చు. మిగిలిన ఎమౌంట్‌కి ఎవరి దగ్గరైనా అప్పు నువ్వే పుట్టించాలి''

''గోల్డ్ అమ్ముతావా?'' నమ్మలేనట్టు చూశాడు వెంకట్.

''ఇప్పుడు ఏదోరకంగా డబ్బు ఏర్పాటు చేయకపోతే మొత్తానికే మోసం వస్తుంది. బిజినెస్ మీద యిల్లు తాకట్టులో వుంది. ఈ బిజినెస్‌ని ఎలుగైనా నిలబెట్టాలి'' చెప్పాను పట్టుదలగా.

''సరే ఒక అరగంట టైమివ్వు. నేను తెలిసిన వాళ్ళకి ఫోన్ చేసి, ఎంత వరకూ సర్దగలనో చూస్తాను'' అంటూ లేచి బైటికి వెళ్ళాడు.

**అమ్మకి చెప్పకుండా** లాకర్‌లో నుంచి బంగారు నగలు తీస్తున్నప్పుడు నా చేతులు వణికాయి.

''అర్జంట్‌గా అంటే ఓ రెండు లక్షలు ఏర్పాటయ్యాయి'' కారులో కూర్చుంటూనే చెప్పాడు వెంకట్.

ఇద్దరం సిటీకి వెళ్ళి బంగారం అమ్మితే మొత్తం నాలుగు లక్షలు వచ్చాయి.

''ఇంకా రెండు లక్షలు తక్కువయ్యాయి'' అన్నాను విచారంగా.

''డోంట్ వర్రీ ప్రస్తుతానికి యిక్కడి వర్కర్స్‌కి ఓ వారం తర్వాత డబ్బు యిస్తామని చెబుదాం. ఈ లోపల ఎలాగొలా ఎడ్జస్ట్ చేస్తాను'' చెప్పాడు.

మేం తిరిగి ఆఫీసుకి వచ్చేసరికి, రాత్రి ఏడుగంటలయ్యింది. ఈ మధ్యలో ఎన్నిసార్లు ఫోన్ చేసినా, సందీప్ ఫోన్ తియ్యలేదు.

డబ్బు ఏర్పాటయ్యాక వెంకట్ కూడా చల్లబడ్డాడు.

"సందీప్ గురించి నాకు తెలుసు. ఇవాళ సరుకు లోడింగ్ వుందంటే, అలిగి కూర్చునే మనస్తత్వం కాదు వాడిది. ఇంకా రాలేదంటే ఖచ్చితంగా ఏదో జరిగే వుంటుంది" అన్నాడు సీరియస్‌గా.

వెంకట్ మాటలు అర్థమవుతున్నా ఆలోచించే పరిస్థితిలో లేను నేను. ముందు రోజు ఒంట్లో బాగుండకపోవడం, డబ్బు పోయిందన్న టెన్షనూ, దానికోసం రెస్టు లేకుండా పరుగులు పెట్టడం.. అన్నీ కలిసి ఒక్కసారిగా కళ్ళు తిరిగాయి నాకు.

ఆసరా కోసం గబుక్కున పక్కనున్న గోడని పట్టుకుని నిలబడ్డాను.

"తన్మయీ నీకసలే ఒంట్లో బాగోలేదు. బాగా అలిసిపోయావు. నిన్ను యింటి దగ్గర డ్రాప్ చేస్తాను పద" వెంకట్ అంటుండగానే, అమ్మ ఫోన్ వచ్చింది. "ఇంకా రాలేదేం?" అంటూ. "పద వెళదాం" అన్నాను వెంకట్‌తో.

ఉదయాన్నే నిద్రలేచి, సెల్ ఫోన్ అందుకున్నాను. అందులో మూడు మిస్డ్ కాల్స్ వున్నాయి సందీప్ నుంచి.

"రాత్రి పదిగంటల తర్వాత చేశాడు. టాబ్లెట్ వేసుకుని మొద్దులా పడి నిద్రపోతూ వుండి వుంటాను" అనుకుంటూ తిరిగి ఫోన్ చేశాను. ఫోన్ ఎత్తుతూనే.

"థాంక్యూ తన్మయీ" చెప్పాడతను.

నిన్నరాత్రి గోడౌన్ దగ్గరికి వెళ్ళాను. వెంకట్ జరిగిందంతా చెప్పాడు. నిన్న, నాకు బదులుగా వెంకట్ వెళ్ళాడు చెన్నైకి. ఇవాళ కూడా నేను రాలేను.

వెంకట్ వచ్చేదాకా వర్కంతా నువ్వే చూసుకోవాలి"

"సందీప్ అంతా ఓకేనా? ఏం జరిగింది?" నేను ఆదుర్దాగా అడుగుతూ వుండగానే అతను ఫోన్ కట్ చేశాడు.

ఆఫీస్ నుంచి యింటికి రాగానే అమం నాకోసం ఎదురు చూస్తూ వుంది. "ఒకసారి మనం వెళ్ళి స్వప్నని చూసొద్దాం. త్వరగా రెడీ అవ్వు. అమ్మ చెబుతూనే, త్వరగా ఫ్రెష్ అయ్యి ఛేంజ్ చేసుకుని వచ్చాను.

మేం వెళ్ళేసరికి, స్వప్న, అన్నపూర్ణమ్మగారూ, విశాలాంటీ లాన్‌లో కూర్చుని టీ తాగుతూ వున్నారు. స్వప్న మొహం తేటబడి వుండడంతో రిలీఫ్‌గా అనిపించింది నాకు.

కనీసం మామూలుగా ఉండటానికి ప్రయత్నం చేస్తున్నట్టు కనిపించింది.

"జరిగినదంతా ఓ పీడకలలా మర్చిపోవాలమ్మా! ఈ సొసైటీలో బతకడానికి మగవాళ్ళ కంటే ఆడవాళ్ళకే ఎక్కువ ధైర్యం కావాలి" అమ్మ అంటుంటే స్వప్న నీరసంగా నవ్వింది.

"నిజమే ఆంటీ! కానీ విచిత్రం ఏంటంటే నేను సైకాలజీ చదువుకుని కూడా అతన్ని ఎలా గుర్తించలేకపోయానా?" అని ఆశ్చర్యం వేస్తుంది. బహుశా.. నాకు నచ్చినవాటినే అతనిలో వెతుక్కుంటూ నేనే అతన్ని గొప్పగా ఊహించుకున్నాను. ఆ ఊహే నిజమని నమ్మాను. మా ప్రొఫెసర్స్ చెప్పిన 'హేలో ఎఫెక్ట్' అంటే యిదే అనుకుంటా" అంది నిట్టూరుస్తూ.

"అవతలి వాళ్ళు కావాలని పథకం ప్రకారం మోసం చేస్తే, నువ్వు మాత్రం ఏం చేస్తావు? ఊరికే సెల్ఫ్‌పిటీ మోడ్‌లోకి వెళ్ళకు. ఇది యిలా జరిగిపోయింది అంతే" అమ్మ అంది.

"అవునండీ. ఈ డ్రామాలో దీని ఫ్రెండు సుజిత, వాళ్ళ అన్నయ్య కూడా వాళ్ళే స్వప్నకి వాడిని పరిచయం చేసింది.

సుజీ వాళ్ళ అన్న తనీష్‌తో కలిసి రియలెస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో బాగా నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయారట. చిన్నగా దీన్ని ట్రాప్ చేసి, పెళ్ళి చేసుకుంటే ఆర్థికంగా లాభపడొచ్చని వాళ్ళ ప్లాన్" విశాలాంటి అంది.

"తీపి మాటలతోనో, బెదిరించో, బ్లాక్ మెయిల్ చేసో ఏదో రకంగా లొంగదీసుకోవడమే వాళ్ళ ప్లాను అయ్యివుండొచ్చు" బామ్మగారు అంది.

ఒక వ్యక్తి మీద నమ్మకం పోయాక, వాళ్ళ గురించి నెగెటివ్‌గా ఎన్ని ఊహాగానాలు చెయ్యొచ్చో అన్నీ మాట్లాడేస్తున్నారు.

"పోనీలెండి యిప్పుడివన్నీ అనుకుని ప్రయోజనం ఏముంది?" స్వప్నని కళ్ళతో చూపిస్తూ, సున్నితంగా వారించింది అమ్మ.

కాస్సేపు కావాలనే టాపిక్‌ని వేరే వైపుకి మళ్ళించారు.

చిన్నగా వెలుతురు మసకబారింది. లాన్‌లో లైట్లు వెలిగాయి.

"ఇక మేము వస్తామండి" అంటూ హేండ్ బ్యాగ్‌ని తీసుకుని లేచింది అమ్మ. నేను కూడా వెళ్ళొస్తానని చెప్పి, స్వప్నని దగ్గరకి తీసుకున్నాను.

ఇంతలో, మెయిన్‌గేటు ముందుకి ఒక కారు వచ్చి ఆగింది.

కారులోని వ్యక్తి వాచ్‌మెన్‌తో గొడవపడుతూ వున్నాడు.

చూస్తూ, ఉండగానే కారుని గేటుముందు దారికి అడ్డంగా ఆపి, కిందకి దిగాడతను.

వాచ్‌మెన్ కేకలు పెద్ద పెద్దగా వినిపిస్తూ ఉండడంతో నేనూ, విశాలాంటీ గేటు దగ్గరికి వెళ్ళి చూశా.

అక్కడ కనిపించిన వ్యక్తిని సులభంగానే గుర్తుపట్టాను.

లైటు వెలుతురులో మాసిపోయిన అతని గెడ్డం, లోతుకుపోయిన కళ్ళు, పిచ్చిగా వున్న వాలకం చూసి అనుమానం వచ్చింది మాకు.

మమ్మల్ని చూస్తూనే ఒక్క విసురుతో గేటు తీసుకుని లోపలికి దూకాడు. అతని దగ్గర నుంచి ఆల్కహాల్ వాసన గుప్పుమంది.

"స్వప్నా...స్వప్నా.." అంటూ గట్టిగా అరుస్తూ స్వప్న కూర్చున్న వైపుకి పరిగెత్తాడు తనీష్.

అతని అరుపులూ, వాలకం చూస్తే మనిషి బొత్తిగా మన స్పృహలో ఉన్నట్టులేడు. భయం వేసింది కూడా.

అమ్మ వెంటనే, స్వప్నని లేపి, లోపలికి తీసుకెళ్ళే ప్రయత్నం చేసింది. అతను వాళ్ళ వెనకాలే పరుగెత్తాడు.

అమ్మ గభాల్న స్వప్నని ఇంట్లోకి తీసుకెళ్ళి తలుపు వెయ్యబోతుంటే అతను పిచ్చిపట్టిన వాడిలా ముందుకి దూకి తలుపు సందులో చేయిపెట్టి ఆపాడు.

"ప్లీజ్ స్వప్నా! నా మాట విను. ప్లీజ్.. ఐ లవ్ యూ" అంటూ ఉన్మాదిలా అరుస్తూ స్వప్న కాళ్ళ దగ్గర నేలమిద కూలబడ్డాడు.

స్వప్న భయంతో వణికిపోతూ వుంది. కళ్ళలో, నీళ్ళు కూడా తిరిగాయి. అతన్నలా చూడడం ఆమెకి బాధగానే వుందని గ్రహించాను.

"ఓ.కే బాబూ! టెన్షన్ పడకు. మనం కూర్చుని మాట్లాడుకుందాం లే చిన్నగా" అంటూ అమ్మ నిదానంగా సర్ది చెప్పింది.

సమయానికి అంకుల్, మాధవన్నయ్యకూడా యింట్లో లేరు. అక్కడ వున్న వాళ్ళలో అమ్మ ఒక్కతే ధైర్యస్థురాల్లా కనిపించిందా క్షణం.

అతను లేవబోతున్నట్టే వుండి, మళ్ళీ దబ్బుమని కింద కూర్చుండిపోయాడు.

"సారీ స్వప్నా! నేను నిజం చెప్పకపోవడం తప్పే. కానీ "ఐ రియల్లీ లవ్ యూ!" దాన్ని నేను వదిలేశాను. ఎప్పుడో వదిలేశాను. కట్.. కట్.. కట్.. మా మధ్య ఎప్పుడో కట్ అయిపోయింది.

నన్ను నమ్ము. నన్ను అట్లా సడన్‌గా కట్ చెయ్యొద్దు" అంటూ గభాల్న ముందుకి వంగి స్వప్న రెండు కాళ్ళూ చుట్టేశాడు.

స్వప్న భయంతో గడ్డకట్టుకుపోయింది.

అమ్మ పక్కనే నిల్చుని, స్వప్న చెయ్యి వదలకుండా గట్టిగా పట్టుకుని నిలుచుంది.

"నన్ను పెళ్ళి చేసుకుంటావు కదూ! చెప్పు.. చెప్పు.." అంటూ మోకాళ్ళ మీదలేచి, స్వప్న చెయ్యిపట్టుకుని ప్రాధేయపడుతున్నాడు.

స్వప్న కళ్ళలో నుంచి ధారగా నీళ్ళు. అతని స్పర్శ, మాటలూ, తనకోసం పిచ్చివాడైనట్టున్న అతని వాలకం ఆమెని కదిలించి వేశాయి.

అతని సహచర్యంలో అల్లుకున్న అనుబంధం తాలూకు దారం మళ్ళీ లాగినట్లైంది.

"ఊ!!c..." అది ఏడుస్తూ, ముందుకి వంగి అతన్ని పట్టుకోబోయింది. చప్పున వారించింది అమ్మ.

"అలాగే బాబూ! అంతా నువ్వనుకున్నట్టే జరుగుతుంది. పద! లే ముందు" చెప్పింది అతనితో.

"నేను నిన్ను బాగా చూసుకుంటాను. నువ్వే నా నిజమైన భార్యవి.. అంతే" అతను గొణుగుతూనే వున్నాడు.

ఇంతలో వాచ్‌మెన్, యింకో మనిషి సాయంతో తనీష్‌ని లాక్కెళ్ళడానికి వచ్చాడు. సరిగ్గా అప్పుడే, మాధవన్నయ్య పోలీసులూ వరుసగా రావడం జరిగిపోయింది.

తనీష్‌ని అక్కడ్నుంచి బలవంతగా లాక్కెళ్ళారు.

అప్పటికి, కాస్త ధైర్యం తెచ్చుకున్న స్వప్న కాస్తా ఆ సంఘటన తర్వాత మళ్ళీ బేజారయిపోయింది.

"ఇదంతా మూమెంటరీ ఫీలింగ్స్ అంతే" అని నచ్చచెప్పడానికి చాలా ట్రై చేశాం అందరం. కానీ తనీష్‌తో బాగా ఎమోషనల్‌గా ఎటాచ్ అయిపోయిన స్వప్నకి మా మాటలు అర్థం కాలేదు.

అతని కోసం ఏడుస్తూనే వుంది.

"అతని మీద ప్రేమతో కాదు నువ్వు ఏడ్వడం. అతనలా అయిపోవడానికి కారణం నువ్వేనన్న గిల్టీఫీలింగ్ అంతే.

నిన్న మోసం చేసి కూడా, అతని ఎలాంటి బాధాలేదు. ఏదో అతనూ మనిషే కాబట్టి, టెంపరరీగా బ్రేక్‌డౌన్ అయివుండొచ్చు. అయినా అతను చెప్పేదంతా నిజమని ఎలా నమ్మడం? అతను డ్రామాలాడడం లేదని ఎలా చెప్పగలవు?" అమ్మ నచ్చ చెప్పింది.

రాత్రి పదిగంటల వరకూ, అమ్మా, నేనూ అక్కడే వున్నాం. స్వప్నకి టాబ్లెట్ యిచ్చి పడుకోబెట్టాక, యింటికి తిరిగి వచ్చాం.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. తనీష్ ఉన్మాదం వేడుకోలూ పదే పదే గుర్తుకి వస్తున్నాయి. అది అబద్ధం అని నమ్మాలనిపించడంలేదు. తనీష్ స్థానంలో సందీప్ స్వప్న స్థానంలో నేనూ వుంటే? ఒక్కసారి ఆలోచించాను.

ఖచ్చితంగా కరిగిపోతానేమో? నిజానికి ప్రేమించబడడాన్నే ఆడపిల్ల ఎక్కువగా ప్రేమిస్తుందేమో? అందుకే ప్రపంచంలో ఆడవాళ్ళే ఎక్కువగా మోసపోతున్నారా? ఇక ఆలోచించలేకపోయాను.

మర్నాడు, స్వప్న సందేహాల్ని తీర్చడం కోసం, మాధవన్నయ్య మళ్ళీ తనీష్ భార్యకి ఫోన్ చేసి మాట్లాడించాడు.

ఆవిడ చెప్పినదాన్నిబట్టి యిద్దరి డైవోర్స్ పిటీషన్ కోర్టులో వుంది. అతనికి యిద్దరు పిల్లలు కూడా.

వ్యాపారంలో నష్టపోయి ఆవిడ పుట్టింటింటి తాలూకు ఆస్తులన్నీ కరిగించి వేశాడు ఇదీ మొత్తంగా ఆవిడ చెప్పినదాని సారాంశం.

"ఆవిడ తనవైపే చెప్పి వుండొచ్చు. కానీ కంటికి కనిపిస్తున్న నిజాల్ని కాదనలేం కదా. మోసం చేసే ఉద్దేశ్యం లేకపోతే, నువ్వు అతన్ని మనింటికి తెచ్చే ముందు అతను నీతో నిజం చెప్పివుండేవాడు" అన్నపూర్ణమ్మగారు అంది.

"అతను నిజంగానే నిన్ను ప్రేమిస్తున్నాడనే అనుకుందాం. సినిమా కథల్లోలాగా మీ ప్రేమ నిర్మలమైనదే స్వచ్ఛమైనదీ అనే అనుకుందాం. ఆ తనీష్ ఏదో కారణం వల్ల నీకు నిజం చెప్పలేదనే అనుకుందాం.

వాడెంత మంచివాడైనా యిలాంటి దెబ్బ మళ్ళీ తగిలితే నువ్వు తట్టుకోలేవు. కష్టమో నష్టమో ధైర్యం తెచ్చుకుని గట్టిగా నిలబడాలి.

మళ్ళీ నువ్వు వాడి దగ్గరకి వెళతానంటే మాత్రం కాళ్ళు విరగ్గొడతాను. ఈ గోలతో నాకూ విసుగెత్తిపోయింది" అరిచి గట్టిగా చెప్పి వెళ్ళాడు మాధవన్నయ్య.

"అతనేదో బాధలో వచ్చి ఓ అరగంట ఏడ్చి గొడవ చేస్తే అతను సత్యవంతుడై పోతాడా? కాస్త బుర్ర పెట్టుకుని ఆలోచించు" అన్నపూర్ణమ్మగారుఉ కూడా మందలించింది.

స్వప్న కూడా వాళ్ళు చెప్పింది ఆలోచించడం మొదలుపెట్టింది.

"మొత్తానికి ఒక మాయం నుంచి బైటపడింది" అనుకున్నాన్నేను.

వెంకట్, సందీప్ యిద్దరూ ఆఫీసుకి రాకపోవడంతో తప్పనిసరిగా నేను వెళ్ళాల్సివస్తూ వుంది.

స్వప్న విషయం ఒక పక్క కలిచివేస్తుంటే, సందీప్ ఫోన్ తియ్యకపోవడం యింకొంచెం కలతపెడుతూ వుంది.

"కామ్‌డౌన్ తన్మయీ లైఫ్‌లో యిటువంటివి జరుగుతూ వుంటాయి." అంతరాత్మ చెబుతుంటే, సమాధానపడి పని చేసుకుపోతూ వున్నాను.

మూడవరోజు ఉదయానికి సందీప్, వెంకట్ యిద్దరూ ఆఫీసుకి వచ్చారు.

"అనుకున్నపని అనుకున్నట్టు అయ్యింది. సరుకు చేరగానే మనకి డాలర్లలో డబ్బులు వస్తాయి" హాయిగా కుర్చీలో వెనక్కి వాలి నవ్వుతూ చెప్పాడు వెంకట్.

"థాంక్‌గాడ్ అయాం వెయిటింగ్ ఫర్ దట్ డే" సంతోషంగా అన్నాన్నేను. వెంకట్ ఉన్నట్టుండి ఏదో గుర్తొచ్చినట్టు బ్యాగ్ జిప్ తీసి, ఒక కవర్ నా ముందు పెట్టాడు.

"ఈ డబ్బు తీసుకో" వెంకట్ అంటూండగానే

"ఇదిగో డబ్బు" అంటూ సందీప్ కూడా ఒక కవరు తీసి టేబుల్ మీద పెట్టాడు.

"వర్కర్స్‌కి యివ్వడానికి తక్కువపడ్డ డబ్బా" ఒక ఫ్రెండ్ సర్దాడు" చెప్పాడు వెంకట్.

"ఈ డబ్బు చిత్ర తీసినదానిలో మిగిలింది. మిగతాది రేపు వచ్చే డబ్బులో నా వాటాలో నుంచి తీసి కట్టేస్తాను." సందీప్ నేరుగా మా వైపు చూపకుండా గోడవైపు చూస్తూ అన్నాడు.

ఆ మాటలు అనేటప్పుడు అతని గొంతు కుంచించుకునిపోయింది. చెప్పి వెంటనే వెనక్కి తిరిగాడు.

ఇంకొక్క క్షణం కూడా అక్కడ నిలబడడానికి అతనికి అభిమానం అడ్డు వచ్చేట్టుందని అర్ధమైంది నాకు.

"సందీప్.. ప్లీజ్" పిలిచాను నేను.

అతను వెనక్కి తిరగలేదు.

సరిగ్గా, అప్పుడే వెంకట్ కుర్చీలో నుంచి లేచి సందీప్‌కి అడ్డంగా నిలబడ్డాడు.

"ఏంట్రా?" అని వెంకట్ కళ్ళెగరేస్తుంటే,

"ఇప్పుడేదన్నా గొడవ జరగబోతుందేమో?" అని నా గుండె దడదడలాడింది.

"చిత్ర డబ్బు తీస్తే బాధ్యత అంతా నీ నెత్తిన వేసుకుంటావా? ఏదో ఫ్రస్టేషన్‌అన్నాను. ఆ మూమెంట్ అలాంటిది.

ఏం మనం ఫ్రెండ్సే కాకుండా పోయామా?" అంటూ సందీప్‌ని కౌగలించుకున్నాడు.

సందీప్ అటువైపుకి తిరిగి ఉండడంతో అతని మొహం నాకు కనిపించలేదు. నా కళ్ళు మాత్రం చెమర్చాయి, వాళ్ళిద్దర్నీ చూసి.

మనసు గాల్లో ఎగిరే దూదిపింజలా తేలికబడింది.

"హే తన్మయీ నువ్వు ఏడుస్తున్నావ్" అంతరాత్మ అరిచింది.

"ష్షి...ష్షి.." అంటూ కళ్ళు తుడుచుకున్నాను.

"ఇవాళ కూడా మనం తన్మయికే డ్యూటీ వేద్దాం. పద! నీతో ఒక అర్జంటు పని వుంది" అంటూ ముందుకి వంగి బల్లమీద సందీప్ పెట్టిన క్యాష్ కవర్ అందుకున్నాడు.

"మేం వచ్చేసరికి సాయంత్రం ఐదవుతుంది" అంటూ సందీప్ భుజం మీద చెయ్యివేసి నా వైపు తిరిగి నవ్వాడు వెంకట్.

సాయంత్రం ఐదయినా వెంకట్, సందీప్ తిరిగి రాలేదు. అప్పటికే వర్కర్స్ అందరూ వెళ్ళిపోయారు.

నేను ఆఫీసుకి తాళం వేసి నా దినచర్యలో భాగంగా వెనకవైపు కొలను దగ్గరకి వెళ్ళి సూర్యాస్తమయాన్ని చూస్తూ కూర్చున్నాను.

కొలనులో గాలికి ఏర్పడ్డ నీటి తరంగాలు, క్రమంగా పెద్దవిగా మారి తిరిగి నీటిలో కలిసిపోతున్నాయి.

వాటిని చూస్తూ, నేనూ ఆలోచనల సుడుల్లో పడిపోయాను.

స్వప్నని తనీష్ మోసం చేయడం, సందీప్‌కి నేను దగ్గరవ్వడం, మా అమ్మకి సందీప్ మీద సదభిప్రాయం లేకపోవడం లాంటివన్నీ ఒక్కొక్కటిగా నా బుర్రలో సుడులు తిరిగాయి.

ముఖ్యంగా స్వప్న ఎపిసోడ్ తర్వాత సందీప్‌తో నా భవిష్యత్తు ఎలా ఉండబోతుందో అన్న కలవరం మొదలైంది.

ఎప్పుడూ ఆహ్లాదంగా కనిపించే అందమైన సాయంకాలం అత్యంత నిశ్శబ్దంగా, భయం గొలిపేలా తోచింది. ఇక అక్కడ ఉండాలనిపించలేదు.

సెల్‌లో టైం చూసుకుని లేవబోతుండగా, సందీప్ వచ్చాడు.

"ఆఫీస్‌కి తాళం వేసి వుంది. అయినా ఖచ్చితంగా నువ్వు యిక్కడే ఉండివుంటావనుకున్నాను" అంటూ నా దగ్గరికి వచ్చాడు.

ఒక్క క్షణం సందీప్‌ని కళ్ళ నిండుగా చూసుకున్నాను.

చాలా రోజుల తర్వాత యిద్దరం ఏ చికాకులూ లేకుండా ఏకాంతంగా కలవడం యిప్పుడే

అప్పటిదాకా మనసుని కలవరపెట్టిన ఆలోచనలన్నీ అతని సమక్షంలో క్రమంగా బలహీనపడిపోయాయి.

ఒక్కసారి అతనికి దగ్గరగా చేరి నా మనసులోని భయాల్నీ, అభద్రతనే అతని స్పర్శలో మరిచిపోవాలనిపించింది.

కానీ నా అంతట నేను అడుగు ముందుకు వెయ్యలేక అక్కడే నిలబడిపోయాను.

"నువ్వు నగలు అమ్మావని వెంకట్ చెప్పాడు. నా దగ్గర మిగిలిన డబ్బుతో ఇవి తెచ్చాను. ఈ అయిడియా వెంకట్‌దే నీకు తెలిస్తే ఒప్పుకోవని నాకు తోచినవి సెలెక్ట్ చేసి తెచ్చాను."

అతనామాట అంటూంటే, నాకు సంతోషంతో నోటమాటరాలేదు.

"దిసీజ్ ద ఫస్ట్ గిఫ్ట్... ఫ్రం హిమ్. పర్లేదు.. నలిగిపోయిన గులాబీ కాకుండా, బంగారు నగలు తెచ్చాడు" అంతరాత్మ గుసగుసలాడింది.

ఆనందంగా కవరు తీసి చూడబోయాను.

"ఇంకా కొంత డబ్బు తక్కువే అయ్యింది. త్వరలోనే తిరిగి యిచ్చేస్తాను" సందీప్ తను చెప్పాలనుకున్నది పూర్తి చేశాడు.

కవరులో నుంచి బైటికి తీసిన బాక్సుని అలాగే తిరిగి లోపల పడేశాను.

"మరి, ఈ వారం రోజులకీ, వడ్డీ కూడా కలిపి యివ్వాలని మర్చిపోయావా?" కోపంగా అతని కళ్ళలోకి చూస్తూ అడిగాను.

"అది కాదు తనూ" అతనేదో చెప్పబోయాడు.

"నువ్వు కంటికి కనిపించి మూడురోజులైంది. అసలు చిత్రకి అంత అర్జంటుగా డబ్బు అవసరం ఎందుకొచ్చింది? ఎందుకు నువ్వు మూడీగా వుంటున్నావు? నేను అడగకుండానే నీ ప్రాబ్లెమ్స్ నాతో షేర్ చేసుకుంటావని ఎదురు చూస్తున్నాను నేను. నువ్వేమో, నువ్వు వద్దు. నీ డబ్బు వద్దు. అన్నట్టు బిహేవ్ చేస్తున్నావు" అన్నాను కోపంగా.

"నిన్ను అలాంటి భ్రమలో పెట్టడం నా తప్పేనేమో" అన్నాడతను నెమ్మదిగా.

"అంటే?" నా కనుబొమలు ముడుచుకున్నాయి.

"నువ్వేం చెప్పాలనుకుంటున్నావో సూటిగా చెప్పు" తీవ్రంగా అన్నాను.

"అతనేం చెప్పబోతున్నాడు?" ఊహిస్తేనే నా గుండె దడదడా కొట్టుకుంది.

"ఐ యామ్ సారీ నువ్వు నాకోసం చాలా చేశావు. నేను ఎమోషనల్ మూమెంట్‌లో.

అదే ఆ రోజు సాయంత్రం మనిద్దరి మధ్య జరిగింది ప్లీజ్ మర్చిపో. ఇంకోసారి అలాంటి పొరబాటు జరగదు."

అతను ఒక్కొక్క వాక్యమే చెబుతూ వుంటే, నా గుండె భగ్గుమంది నా చేతిలోని కవరు విసిరిపుచ్చి కొట్టాలన్నంత కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకున్నాను.

"ఇదంతా చిత్రకోసమేనా?" ఉక్రోషంగా అడిగాను.

"చిత్రకి యిందులో ఏ సంబంధంలేదు" బాలెన్స్‌డ్‌గా ఉన్నాయతని మాటలు.

"మరి.. ఈ నాలుగురోజుల్లో ఏం మారిపోయింది? కారణం ఏంటి?" నిలదీశాను.

"నేను పొరపాటు చేశానని తెలుసుకున్నాను. అదే కారణం " చెప్పాడు స్థిరంగా.

అతను అబద్ధం చెబుతున్నాడు. అది నాకు స్పష్టంగా అర్ధమౌతుంది. ఏదో జరిగింది. నన్ను దూరం చేసి, ఆ సమస్యకి పరిష్కారం చూడాలనుకుంటున్నాడు.

కానీ నేను అతనితో కలిసి అతని ప్రాబ్లెమ్స్ అనీ షేర్ చేసుకుందామనుకుంటున్నాను. నేను అనుకున్న స్థానం అతని మనసులో నాకు లేదు" ఆ మాట అనుకోగానే బాధతో మనసు కుంగిపోయింది.

లోపల అదిమి పెట్టుకున్న బాధ అంతా కళ్ళలో సుడులుగా తిరిగింది.

**"తన్మయీ! జాగ్రత్త.** అతని ముందు ఒక్క కన్నీటిబొట్టు కూడా రాల్చకు. అతన్ని కావాలనుకున్నప్పుడు ఏడిస్తే అర్ధం వుంది. కానీ అతను 'వద్దు..పో" అంటున్నప్పుడు అతని ముందు ఏడ్చి ఎగతాళి పడకు" అంతరాత్మ హెచ్చరించింది.

"అలాగే" చెప్పి పెదవిని పటికింద బిగబట్టి కన్నీళ్ళు ఆపుకున్నాను.

"మరొక్కమాట మాట్లాడకుండా వెళ్ళి కారులో కూర్చున్నాను.

నన్ను నేను సముదాయించుకుని, తేరుకోవడానికి రెండు నిముషాల సమయం పట్టింది.

చిన్నగా కళ్ళు తుడుచుకుని, కారు స్టార్ట్ చేసి, స్టీరింగ్ మీద చేతులు వేశాను. సందీప్ వెనకాల నిలబడి నా కారువైపే చూస్తూ వుండడం రేర్ వ్యూ మిర్రర్‌లో నుంచి నాకు కనిపించింది.

ఆ సాయంత్రం ఎప్పుడు మసక చీకట్లోకి జారిపోయిందో, నాకు తెలియనేలేదు.

కారు కొద్ది దూరం సాగేవరకూ, అతను అలాగే నిలబడివున్నాడు.

నేను అతన్ని చూస్తూనే వున్నాను.

నేను వెళ్ళిపోతున్నా, అతను యింకా నావైపే చూస్తూ వుండడం నాకు సంతోషంగా అనిపించింది.

ఏడ్చి తేలికబడిన మనసులో అద్దంలో కనిపిస్తున్న అతని ప్రతిరూపాన్ని అలాగే బంధించేశాను.

"అమ్మా నీతో కొంచెం మాట్లాడాలి" డిన్నర్ తర్వాత అమ్మ గదిలోకి వెళ్ళాను.

సందీప్ యిచ్చిన కవర్‌ని తీసుకెళ్ళి నేరుగా, అమ్మ చేతిలో పెట్టాను.

"ఏంటిది?"

ఆశ్చర్యంగా చూస్తూ లోపలనుంచి ఒక్కొక్క బాక్స్‌నే తీసి మంచం మీద పెడుతూ వుంది అమ్మ.

నేనూ వెళ్ళి అమ్మ పక్కనే మంచం మీద కూర్చున్నాను.

"నీకు ఒక విషయం చెప్పాలి. నీకు తెలియకుండా ఒక పని చేశాను" చేతులు నులుముకుంటూ చెప్పాను.

"ఏంటో చెప్పు" అమ్మ నావంక చూస్తూ అంది.

"నేను నీకు తెలియకుండా నా నగలు అమ్మేశాను. బిజినెస్‌లో అర్జంటుగా క్యాష్ అవసరపడింది" అంటూ ఆ రోజు జరిగినదంతా వివరంగా చెప్పాను. అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"డబ్బు సర్దుబాటు అయ్యాక, సందీప్ ఈ నగలు కొనిచ్చాడు."

నీకు అనుమానంగా వుంటే వీటి క్వాలిటీ, వెయిట్ చెక్ చేయించు. డిజైన్ నచ్చకపోయినా మార్చుకోవచ్చు. ప్రాబ్లం లేదు" చెప్పి భయంగా అమ్మ వైపు చూశాను.

అమ్మ ఒకసారి నావైపు గంభీరంగా చూసింది.

"నీకూ, సందీప్‌కీ మధ్య ఏదైనా వుందా? అబద్ధం చెప్పకు" సీరియస్‌గా అడిగింది.

"అవును" నిజం ఒప్పుకున్నాను.

"కానీ అది నా వైపు నుంచి మాత్రమే. అతను కన్ఫ్యూజన్‌లో వున్నాడు. బహుశా, వాళ్ళింట్లో వాళ్ళకి నేనంటే, యిష్టం లేదనుకుంటాను" అన్నాను ముభావంగా.

ఆ రోజు సాయంత్రం నాకూ, సందీప్‌కీ జరిగిన సంభాషణ గుర్తొచ్చి నా మొహం వాడిపోయింది.

అమ్మ మనసులో ఏమనుకుందో ఏమో..

"తన్మయిని యిష్టపడని వాళ్ళు కూడా వుంటారా?" అంది నా చేయి పట్టుకుంటూ లాలనగా.

"ఒక్కొక్కసారి మనం కావాలని చెయ్యకపోయినా ఎదుటివారికి తప్పుడు సంకేతాలే అందుతాయి. మనం రంగారావు అంకుల్‌ని సర్వెంట్‌లా చూస్తామని, సందీప్‌కి కోపం. అతనికే కాదు సుమకీ, ఆంటీకీ కూడా నచ్చదు. ఏమో రంగారావుగారు మనసులో ఏమనుకుంటుంటారో ఎవరికి తెలుసు?"

"ఎందుకు అన్నింటికీ ఆయన మీద భారం వేస్తావు?" అడిగాను ధైర్యం చేసి.

అమ్మ ఒక క్షణం నా కళ్ళలోకి చూసింది.

"నీకొక విషయం చెప్పాలి తనూ. ఎప్పటినుంచో చెప్పాలని అనుకున్నాను. బహుశా యిప్పటికే ఆలస్యం అయ్యిందనిపిస్తుంది" అంది బరువుగా.

"ఏంటమ్మా?" అమ్మ మొహంలోకి చూస్తూ అడిగాను.

"నీకులాగే, నేనూ మా అమ్మా నాన్నలకి ఒక్కతే కూతురిని. ఆ రోజుల్లోనే మీ తాతయ్య, అమ్మమ్మలది కులాంతర వివాహం వాళ్ళు చాలా అభ్యుదయభావాలు ఉన్నవాళ్ళు. అందుకే బంధువులకి దూరమయ్యారు.

నా పెళ్ళి విషయంలో కూడా దాదాపుగా అలాగే జరిగింది. నీకు తెలుసు. మాది కూడా లవ్‌మారేజ్.

మీ నాన్నవాళ్ళ ఫ్యామిలో గుజరాత్ నుంచి వచ్చి హైదరాబాదులో వ్యాపారం ప్రారంభించారు. అప్పట్లో నేను హైదరాబాదులో హాస్టల్‌లో వుండి చదువుకునేదాన్ని. మేమిద్దరం కాలేజీలో వుండగానే ప్రేమించుకున్నాం.

అందరిలాగా, పార్కులకీ సినిమాలకీ తిరిగి ప్రేమించుకోలేదు మేము. కాలేజీలోనే గంటల తరబడి మాట్లాడుకునేవాళ్ళం. సమాజం గురించీ, భవిష్యత్తు గురించి మీ నాన్న మాట్లాడే మాటలు నన్ను బాగా ప్రభావితం చేశాయి.

దాంతో ఇద్దరం పెళ్ళి చేసుకుంటే భవిష్యత్తు అందంగా వుంటుందని ఊహించుకున్నాను.

నా మనసులో ఎప్పుడూ, మా అమ్మానాన్నా గడిపిన జీవితమే ఆదర్శంగా కనిపిస్తూ వుండేది. సమాజానికి ఎదురు తిరిగి కూడా చాలా గొప్పగా బతికి చూపించారు మీ అమ్మమ్మ, తాతయ్య.

వాళ్ళలాగే నేనూ ధైర్యంగా ఉండేదాన్ని. ఆడపిల్లగా నేను తీసుకునే నిర్ణయం వల్ల ఎలాంటి పరిణామాలు వుంటాయో అన్న ఆలోచన అస్సలు లేదు నాకు. ఎందుకంటే, నేను చూసిన, మా అమ్మా నాన్నలది ఒక విజయవంతమైన కాపురం. నేను ఫెయిల్యూర్ స్టోరీలు వినలేదు. విన్నా నాకు పట్టలేదు.

కొద్దిరోజులకి నాకు జాబ్ వచ్చింది. మీ నాన్న కూడా బిజినెస్ చేయాలన్న ఆలోచనలో వున్నారు. ఇద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం.

మా యింట్లో మా పెళ్ళికి సంతోషంగా ఒప్పుకున్నారు. మీ నాన్న వాళ్ళింట్లో ఒప్పుకోలేదు. ఎదురు తిరిగారు. వాళ్ళది చాలా కన్సర్వేటివ్ ఫ్యామిలీ. మీ నాన్న అంటే నాకు ప్రాణంగా వుండేది. యిద్దరం పెళ్ళి చేసుకున్నాం.

మీ నాన్న వాళ్ళింట్లో వాళ్ళు అలిగి ఫ్యామిలీ మొత్తం తిరిగి గుజరాత్ వెళ్ళిపోయారు. మీ నాన్న అప్పుడప్పుడూ గుజరాత్ వెళ్ళి వస్తుండేవాళ్ళు.

ఆ తర్వాత నువ్వు కడుపులో పడ్డావు. ఆ వెంటనే, మీ తాతయ్య చనిపోయారు. అప్పుడు గుజరాత్‌లో వున్న మీ నాన్నకి కబురుచేస్తే రాలేదు.

ఆ తర్వాత మూడు నెలలైనా మీ నాన్న ఉండలేదు. ఆ రోజుల్లో సెల్‌ఫోన్లూ, యింటర్నెట్‌లూ లేవు. నేనే మీ నాన్నని వెతుక్కుంటూ గుజరాత్ వెళ్ళాను.

అక్కడికి వెళ్ళాక ఒక షాకింగ్ న్యూస్.

మీ నాన్న మొదట్లో ఒకటి రెండుసార్లు వచ్చారట. ఆ తర్వాత రాలేదని చెప్పారు. వాళ్ళు కొడుకు కోసం కంగారుపడిపోయారు. నేను వెనక్కి వచ్చేశాను.

తర్వాత నువ్వు పుట్టావు. ఓ పదిరోజుల తర్వాత మీ నాన్న వచ్చి ఓ మూడు నెలలు వుండి, తర్వాత చెప్పాపెట్టకుండా ఎటో వెళ్ళిపోయాడు. ఆయన మొదలుపెట్టిన బిజినెస్ మూతపడిపోయింది.

ఇంకో పెళ్ళి చేసుకున్నారేమో అని నా అనుమానం. అడిగితే లేదని వాదించేవారు. పోనీ ఏదైనా యిల్లీగల్ యాక్టివిటీలో పడ్డారా, లేకపోతే ఏదైనా మానసికపరమైన సమస్యా? చెబితే కలిసి పరిష్కరించుకుందాం అని ప్రాధేయపడ్డాను. ఏం లేదనేవాడు. ఆయన యింట్లో వున్న నాలుగురోజులూ గొడవలే. మళ్ళీ మూడు నెలలు మాయం. రెండు నెలలు మళ్ళీ యింట్లో వున్నాడు. ఆ తర్వాత యేడాదిపాటు రాలేదు.

గుజరాత్‌లో వాళ్ళింట్లో వాళ్ళు నన్నూ, అమ్మమ్మనీ తిడుతూ వుండేవాళ్ళు. మీ నాన్న అలా అయిపోవడానికి కారణం మేమే అంటూ.

ఖచ్చితంగా అతనికి వేరే సంసారం వుందని అర్థమైపోయింది నాకు. ఇలా అప్పుడప్పుడూ వచ్చిపోయే మొగుడు నాకు వద్దనిపించింది. ఈసారి వస్తే ఖచ్చితంగా డైవోర్సు తీసుకుందామని నిర్ణయించుకున్నాను.

అటు చూస్తే మా ఆర్థిక పరిస్థితి అస్సలు బాగోలేదు. రెండు తరాల నుంచి కులాంతర వివాహాలు కావడం, మరీ నేను వేరే రాష్ట్రం వ్యక్తిని పెళ్ళిచేసుకోవడంతో మాకెవ్వరూ అయినవాళ్ళు లేకుండా పోయారు.

నేను, అమ్మమ్మ, నువ్వు. యింట్లో ముగ్గురం ఆడవాళ్ళం. చిన్న ఉద్యోగం. డబ్బుకి కష్టంగా వుండేది. కొన్నాళ్ళకి అమ్మమ్మ కూడా పోయింది.

''ఒంటరిగా బతకడం చాలా కష్టం తనూ'' అని ఆగింది అమ్మ. అమ్మ మనసులో ఏడుస్తుంది. నేను భయంగా అమ్మకేసి చూశాను. అమ్మ మళ్ళీ చెప్పటం మొదలుపెట్టింది.

''నేను చిన్నగా తేరుకున్నాను. పరీక్షలు రాసి ప్రమోషన్లు సాధించాను. మీ నాన్న తిరిగిరాక అప్పటికి మూడేళ్ళు పైన అయ్యింది.

అప్పుడు నాకొక ఆలోచన వచ్చింది.

ఇంకో నాలుగేళ్ళకి కూడా మీ నాన్న తిరిగి రాకపోతే, డెత్ సర్టిఫికెట్ తీసుకోవచ్చు. బిజినెస్ క్లోజ్ చేయగా కొంతడబ్బు మీ నాన్న ఎకౌంట్‌లో పడింది. అప్పట్లో ఆన్‌లైన్ బాంకింగ్‌లు లేవు. డెత్ సర్టిఫికెట్ యిస్తే ఆ డబ్బు నా చేతికి వస్తుంది. నీ భవిష్యత్తుకి ఉపయోగపడుతుంది.

నిజానికి ఆ డబ్బు మా నాన్న పెట్టిన పెట్టుబడే నీకంటే ఆ సమయంలో నాకు ఏదీ ఎక్కువ అనిపించలేదు.

నేను ఎంతో ప్రేమించాను మీ నాన్నని.. క్షణం కూడా వదిలి ఉండలేననుకున్నాను. అలాంటి మనిషిని మళ్ళీ కంటికి కనిపించకూడదని కోరుకున్నాను.

ఒక్కోరోజు రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టేదికాదు. మనసులో ఓ గిల్టీఫీలింగ్ ఉండేది. కానీ పరిస్థితులూ, బతుకు పోరాటం మనిషిని మార్చేస్తాయి. నా కోరిక నెరవేరింది. మీ నాన్న డబ్బు నా చేతికి వచ్చింది. ఈ మధ్యలో ఒకసారి మీ నాన్న వాళ్ళ అమ్మానాన్నల్ని చూసి వెళ్ళాడని తెలిసింది. అయినా, నేను తెలియనట్టే వున్నాను.

చట్టపరంగా నేను విముక్తురాలిని.

"అంటే" నేను నమ్మలేనట్టు చూశాను అమ్మవైపు.

"అవును. మీ నాన్న బతికేవున్నారు. కానీ నీకూ నాకూ కాదు. మన జీవితాల్లో ఆయనలేడు. యేడాదికి ఒకసారి ఆయన తమ్ముళ్ళో అక్కలో ఫోన్ చేస్తారు. యిక్కడికి వచ్చాడా అని" చెప్పి నీరసంగా నవ్వింది అమ్మ.

నాకు తల తిరిగిపోయినట్లైంది. ఇన్నాళ్ళూ నేను నమ్మిన నిజం అబద్ధమా? అమ్మ నన్ను చూసి మళ్ళీ నవ్వింది.

"నీకు అర్థం చేసుకునే వయసు రావాలనే యిన్నాళ్ళూ ఎదురుచూస్తున్నాను. నేను దీన్ని రహస్యంగా వుంచాను. ఇక మీదటకూడా దీన్ని రహస్యంగానే వుండనివ్వు.

ఒకవేళ నువ్వు నీ నాన్నని కలవాలనుకుంటే" అమ్మ మాటలు పూర్తికాలేదు.

"వద్దు" ఠక్కున చెప్పాను. "నాకు నాన్నలేడు. అంతే. నన్ను యిలాగే ఉండనివ్వు" అంటూ అమ్మ ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాను.

"ఇప్పుడు నీ ప్రశ్నకి జవాబు చెబుతాను" అంటూ అమ్మ నా జుట్టు సవరించింది.

"సింగిల్ పేరెంటింగ్ చాలా కష్టం తనూ. మనిషికి యింకో మనిషి అండకావాలి. నీకు ఏడేళ్ళప్పుడు వైరల్ న్యుమోనియా వచ్చింది. ఆఫీసు తరపున యిన్స్‌పెక్షన్‌కి తప్పనిసరిగా వెళ్ళాల్సిన పరిస్థితి. నువ్వు ఆస్పత్రిలో పడివున్నావు. అప్పుడు ఒక ఆత్మీయుడిలా కనిపించాడు రంగారావు. నిన్ను దగ్గరుండి సొంతబిడ్డలా చూసుకున్నాడు.

అప్పట్నుంచి నేను అతన్ని వదలలేదు.

మీ నాన్న ఎపిసోడ్ తర్వాత మనుషుల్లో నమ్మకాన్ని వెదకడం చాలా కష్టమైన పనే.

కానీ నాకు రంగారావుగారు దొరికాడు. మంచివాడు, మర్యాదస్తుడు, భయస్థుడు. అతని చేత నా అధికారంతో పనులు చేయించాను. ఈ వూళ్ళో అమ్మమ్మ వాళ్ళ యింటిస్థలంలో ఈ బిల్డింగ్ కట్టించాను. రంగారావే అన్నీ చూసుకున్నాడు.

మంచివాళ్ళకి దేవుడు మేలు చేస్తాడంటారు. నేను దేవుడిని నమ్మను. మంచివాళ్ళ మంచితనాన్ని అందరూ వాడుకోవాలని చూస్తారు. అమాయకుల్నీ క్షమించే గుణం వున్నవాళ్ళనే మళ్ళీ మళ్ళీ మోసం చేస్తుందీ లోకం.

దుర్మార్గులూ, మోసగాళ్ళ జోలికి ఎవరూ వెళ్ళరు. వాళ్ళ చేతిలో మోసపోయినా 'మన ఖర్మ' అనుకుని వదిలేస్తారు.

ఎందుకంటే బలవంతుడు, మొండివాడు మూర్ఖుడు. వీళ్ళే గెలిచేది. అసలు నా ఉద్దేశ్యంలో మంచివాళ్ళుగా పుట్టినవాళ్ళే. పోయిన జన్మలో ఎక్కువ పాపాలు చేసివుంటారు.

అందుకే అందరినీ క్షమించే చేస్తూ అందరికీ సాయం చేస్తూ మళ్ళీ మళ్ళీ మోసపోతుంటారు.

ఈ లోకం నుంచి నేను నేర్చుకున్న పాఠం యిది. అందుకే లోపల ఎలా వున్నా పైకి బలంగా కనిపించాలనుకున్నాను. ఒంటిగా ఉండే మహిళ ఎంత గట్టిగా వుండాలో తెలుసుకున్నాను.

ఈ ప్రపంచంలో పైకి కనిపించే రంగులన్నాయి. లోపల వున్న మచ్చల్ని దాచడానికే అని మనమే తెలుసుకోవాలి.

ఇక్కడ బతకడానికి ఓ వేషం కావాలి. అందుకే పులితోలు కప్పుకున్నాను. రంగారావు పరిచయం అయిన తర్వాత కూడా ఏ మాత్రం అలుసు గీతగీసి యివ్వలేదు. అతన్ని చేతులు కట్టుకుని నిలబడే దూరంలోనే ఉంచాను. ఇన్నేళ్ళయినా ఆ గీత అలాగే ఉంది.

అయితే అతని విషయంలో నేను మరీ కఠినంగా ఉండలేదు. నావల్ల అతనికీ చాలా ఫేవర్స్ జరిగాయి. ఎన్నోసార్లు ట్రాన్స్‌ఫర్స్ ఆపించాను. రంగారావు అతి మంచితనంతో, అవసరం అని వచ్చిన ప్రతివాడికీ సాయం చేసి, దెబ్బతింటుంటాడు. తన అవసరాలకి మళ్ళీ అప్పులు చేస్తుంటాడు.

రంగారావుకి ఎన్నోసార్లు నేను డబ్బు సర్దాను. మళ్ళీ తిరిగి యివ్వమని అడగలేదెప్పుడూ.

ఓ రకంగా చెప్పాలంటే నోటితో అనకుండానే మేం యిద్దరం చేసుకున్న ఒప్పందం అది" చెప్పి నిట్టూర్చింది.

పైకి ఎంతో ధైర్యంగా కనిపించే అమ్మలో ఈ బలహీనమైన కోణాన్ని చూసి భరించలేకపోయాను.

"అమ్మా!" అంటూ లేచి రెండు చేతులతో గట్టిగా కావలించుకున్నాను.

''ఇది తప్పో.. ఒప్పో జరిగిపోయింది. అందువల్ల అతని కుటుంబం బాధపడి ఉండొచ్చు. కానీ నేను దీన్ని మార్చలేను. జీవితం చాలా పెద్దది తనూ. విలువైనది. నీ జీవితం అంతా ఈ ఒక్క చిక్కుముడినే తీసుకుంటూ కూర్చోవడం కరెక్ట్ కాదు.

ఆ విషయం నువ్వూ సందీప్ ఆలోచించుకోండి'' చెప్పింది అమ్మ.

అమ్మకి చిత్ర గురించి చెబుదమా వద్దా? అని ఆలోచిస్తుంటే, అంతరాత్మ అరిచింది.

''ఇప్పటికి జరిగిన బరువైన డిస్కషన్స్ చాలు. ఇంక అమ్మని ప్రశాంతంగా వుండనివ్వు'' అంటూ.

''సరే'' అని తలూపాను.

''అమ్మా! సందీప్ మీద నీ ఒపీనియన్ ఏంటి?'' అడిగాను.

''మొండివాడు కానీ, మంచివాడు. మీ యిద్దరూ యిష్టపడితే నేను కాదనడానికి కారణాలేవీ లేవు.

కాకపోతే జీవితంలో కాస్త స్థిరపడిన తర్వాతే ఏ నిర్ణయం తీసుకున్నా బావుంటుందని నా ఆలోచన'' చెప్పింది నా తలమీద చెయ్యివేస్తూ.

''థాంక్యూ.. అమ్మ'' అంటూ అమ్మని మరింత గట్టిగా కౌగలించుకున్నాను.

సెల్లులో అలారం మోగడంతో, బద్ధకంగా పక్కకి తిరిగి అలారం ఆపేశాను. ఇప్పుడు చిత్ర ఎలాగూ రావడంలేదు కాబట్టి. ఆలస్యంగా నిద్రలేస్తున్నాను. నా డైలీ ఎక్సర్‌సైజ్ వాకింగ్ రూపంలో ఆఫీసు బ్రేక్ టైంలో అయిపోతుంది. అప్పటికీ టైం ఏడుగంటలు దాటడంతో త్వరగా లేచి, రెడీ అయ్యి కారు కీస్ తీసుకుని హడావుడిగా బయల్దేరాను.

ఒక యిరవై నిమిషాల తర్వాత కారు టర్నింగ్ తీసుకుంటుంటే సడన్‌గా నల్లటి ఆకారం ఒకటి అడ్డం వచ్చింది.

ఉన్నపళంగా బ్రేక్ వేశాను.

కారు కింద ఒక మనిషి పడివున్నాడు.

నేను గబగబా కారు దిగేసరికీ దారినపోతున్న యిద్దరు మనుషులు అది చూసి ఆగారు.

కిందపడివున్న వ్యక్తి అక్కడే అతనికి సౌకర్యంగా ఉందన్నట్టు, పక్కకి తిరిగి పడుకున్నాడు.

అతని దగ్గర్నుంచి ఒకటే దుర్వాసన.

వెంటనే, అతన్ని గుర్తుపట్టాన్నేను. వెంకట్, నేనూ కారులో వెళుతున్నప్పుడు యిలాగే అడ్డం పడ్డాడు.

"నువ్వేం కంగారుపడకమ్మా. వీడుట్టి తాగుబోతు ఎదవ. పగలూ రాత్రి తేడా లేకుండా, యిలాగే తాగి రోడ్డుకి అడ్డం పడిపోతుంటాడు.

మేం పక్కకి లాగుతాం. నువ్వెళ్ళమ్మా" అన్నాడొకాయన.

"పర్లేదండీ నేను అతన్ని యింటి దగ్గర దింపేస్తాను. ఆయన యిల్లు నాకు తెలుసు. ఇలాగే వదిలేస్తే, ఏ వెహికల్ కిందైనా పడొచ్చు. ప్రాణాలకే ప్రమాదం" అన్నాన్నేను.

"ఆడకూతురివి. నీకెందుకమ్మా. ఈ తాగుబోతు ఎదవ సంగతి" అన్నాడు వాళ్ళలో ఒకతను.

నేను పట్టుబట్టడంతో కాదనలేక, చిన్నగా కారు వెనకసీట్లో ఎక్కించారతన్ని.

నేను కారు రివర్స్ చేసి, ఆయన యింటివైపుకి పోనిచ్చాను. ఆయన యిల్లు వస్తూనే కారాపి దిగమన్నాను.

అప్పటికి, స్పృహలోకి వచ్చాడాయన.

"ఆయ్ నేను దిగను" ఒక్కసారిగా కీచుగా అరిచాడు.

అప్పటికే కారులో ఆ దుర్వాసన పీల్చి, పీల్చి చిరాగ్గా వుంది నాకు.

"ఓ ఫైవ్ హండ్రెడ్ యిస్తానంటే దిగులూ. లేకపోతే దిగను. అంతే" అన్నాడు. సగం ఊడిపోయి సగం మచ్చలు పడిపోయిన పళ్ళని చూపిస్తూ.

"ఈ అయిదొందలతో మళ్ళీ తాగుతాడు కాబోలు. నేను యింటికి చేర్చినంతసేపు పట్టదు. ఈయన మళ్ళీ మందుషాపుకి వెళ్ళడానికి.

ఐదు నిముషాలో మళ్ళీ కథ మొదటికి. ఈయన ప్రాణం గాల్లోదీపం "ఛీ..ఛీ" విసుగొచ్చింది.

ఆ తాగుబోతు మాత్రం కారు దిగలేదు.

యింట్లో ఎవరన్నా ఉన్నారా? అని చూశాను. పోయినసారిలాగే తాళం కప్ప వేళ్ళాడుతూ వుంది గుమ్మానికి.

ఇంక ఆయన్ని భరించే ఓపికలేక ఐదొందలు యిచ్చి వదిలించుకున్నాను.

"ఈయన్ని ఎలా భరిస్తున్నారో యింట్లో వాళ్ళు" అనుకోగానే రాత్రి అమ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

"నాన్న బాధ్యత లేకుండా ప్రవర్తించడం, మోసం చెయ్యడం భరించలేకపోయింది" అమ్మ.

"మరి వీళ్ళ యింట్లో వాళ్ళ పరిస్థితి ఏమిటో"

తాళం కప్ప వేసి వున్న గుమ్మం కేసి జాలిగా చూసి, కారు ఎక్కాను.

నేను వెళ్ళేసరికి సందీప్ ఆఫీస్ రూంలో కూర్చుని, లాప్‌టాప్ చూస్తున్నాడు. అతన్ని చూస్తూనే, నా పెదవులు విచ్చుకున్నాయి.

ముందురోజు సాయంత్రం మా యిద్దరి మధ్య జరిగిన సంభాషణని అస్సలు నమ్మాలనిపించలేదు అతన్ని చూస్తుంటే.

''అదంతా అబద్ధం తనూ. అతను నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాడు'' అంతరాత్మ అరిచి చెప్పింది.

''అవును'' పైకే జవాబిచ్చాను నేను.

''ఏంటి అవును?'' అడిగాడు సందీప్ నావైపు విచిత్రంగా చుస్తూ.

''అబ్బే ఏం లేదు? నేనేం అన్నాను'' భుజాలెగరేస్తూ కప్పిపుచ్చాను. అతను ఎందుకు నాకు దూరంగా వుండాలని ప్రయత్నిస్తున్నాడో నాకు అర్థం కావడంలేదు.

రాత్రి అమ్మతో మాట్లాడిన తర్వాత నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. నేరుగా వచ్చి అతనికి పక్కగా వున్న కుర్చీలో కూర్చున్నాను. టేబుల్ మీద కొత్తగా ఫ్లవర్‌వేజ్ కనిపించింది. అందులో గులాబీపూలు గుత్తిగా పెట్టివున్నాయి.

గులాబీల్నీ, సందీప్‌నీ పక్కపక్కనే చూసి, నాకు ఫక్కున నవ్వొచ్చింది. ''ఆ గులాబీలు నీకోసం వచ్చినవి కాదు. మల్లన్న బాక్‌యార్డ్‌లో గులాబీల్ని కోసి తెచ్చి యిక్కడ పెట్టాడు.

ఈ మధ్య కాస్త క్రియేటివ్‌గా పనిచేస్తున్నాడు'' లాప్‌టాప్‌లో నుంచి తలపైకెత్తి చెప్పాడు సందీప్.

''నేను నవ్వింది వాటిని చూసికాదు'' అంటూ మళ్ళీ చిలిపిగా నవ్వాను.

''వెయిట్'' అంటూ నా మొహంలోకి చూశాడు సందీప్.

''ఎప్పుడు గులాబీల్ని చూసినా, వెంటనే నన్ను చూసి నవ్వుతావు. దేనికి? కనుబొమలు ఎగరేస్తూ అడిగాడు.

నాకు మళ్ళీ నవ్వొచ్చింది.

''ఓ.కే. నువ్వు కోప్పడను.. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోను. మధ్యలో లేచి వెళ్ళను'' అని ప్రామిస్ చేస్తే చెప్తాను అన్నాను. సీరియెస్‌నెస్ నటిస్తూ.

''సరే చెప్పు'' అతనూ నవ్వాడు.

''ఒకవేళ నువ్వు నన్ను పెళ్ళికి ప్రపోజ్ చేయాలంటే నా మాటలు పూర్తికాకముందే అతను నావైపు చురుగ్గా చూశాడు.

"చెప్పానుగా యిదంతా ఒక చిలిపి ఊహ అని. నువ్వు మామూలుగా వింటానంటే చెప్తాను" అన్నాను ఛెయిర్‌లో వెనక్కి వాలుతూ.

"సరే చెప్పు" ఒప్పుకున్నాడు.

"ఓ.కే నువ్వు నన్ను ప్రపోజ్ చేయాలనుకుంటే నన్ను ఎక్కడికి తీసుకు వెళతావు? ఖరీదైన హోటల్‌కో రిసార్ట్‌కో తీసుకెళ్ళేంత డబ్బు నీ దగ్గరలేదు కాబట్టి నన్ను నీ బైక్ మీద ఎక్కించుకుని ఏ బీచ్‌కో తీసుకువెళతావు. డైమండ్ రింగ్ లాంటివి అస్సలే కొనలేవు కాబట్టి. యిలాంటి ఓ గులాబీని కొని ఏ ఖాళీ పేస్టు డబ్బాలోనో పెట్టి తెస్తావు.

బీచ్‌లో నువ్వు "తడా" అంటూ గులాపువ్వు బైటికి తీస్తూనే. ఎవరో "టౌన్ ప్లానింగ్ ఆఫీసరు గారి అమ్మాయి కదూ" అని అరుస్తారు. అంతే నేను పరుగెత్తి పారిపోతాను" అంటూ వర్ణించి, వర్ణించి చెప్పి మరీ నవ్వాను.

సందీప్ కూడా నా మాటలకి నువ్వు ఆపుకోలేకపోయాడు.

"ఎలా వస్తాయ్. నీ బుర్రలో యిలాంటి ఊహలు" అన్నాడు నవ్వుతూ.

"అక్కడితో అయిపోలేదు. నువ్వు యిచ్చిన ఆ గులాబీని నేను భద్రంగా దాచుకుంటాను. మన పిల్లలకి దాని గురించి చెబుతూ వుంటే, మన బాబు వాటి రెక్కల్ని పీకిపైకి విసిరేస్తాడు. ఆ వాడిపోయిన గులాబీ రెక్కలు మనమీద పడుతూ కితకితలు పెడుతూ వుంటే మనం పకపకా నవ్వుతూ వుంటాం" అని కూడా చెప్పాలనిపించింది.

కానీ చెప్పలేక కనురెప్పల్ని కిందకి వాల్చేశాను.

"తనూ" పిలిచి

ఒక్క క్షణం నావైపు సీరియస్‌గా చూశాడు సందీప్.

"చేతిలో డబ్బులేనప్పుడు యిలాంటి ఊహలు సరదాగానే వుంటాయి. కానీ నిజ జీవితంలో ఇది సాధ్యమేనా?" అడిగాడు సూటిగా.

వెంటనే, మా నాన్న గురించి అమ్మ చెప్పిన నిజాలు మనసులో మెదిలాయి.

బాంక్‌లో నాన్న పేరుతో ఉన్న డబ్బు అవసరమై, బతికున్న వ్యక్తిని చనిపోయినట్టుగా నమ్మించింది అమ్మ.

మనిషికి ముందు బ్రతుకు కావాలి. ఆ తర్వాత గౌరవం, అభిమానం కావాలి. ఆ తర్వాతే ప్రేమ కావాలి.

"సాధ్యం కాదు" సందీప్ ప్రశ్నకి నిజాయితీగా జవాబిచ్చాను.

"డబ్బులేక సమస్యలతో సతమతమౌతుంటే 'ప్రేమ' గుర్తుకి రాదు.

"మన చేతిలో 'కానీ' లేకపోయినా నీ చేతిలో నా చెయ్యి వుంది"

"ఈ ఎండిపోయిన రొట్టెని సగం సగం తిందాం లాంటి డైలాగులు సిన్మాల్లో, కథల్లోనే బావుంటాయి" చెప్పాను.

నా జవాబు విని, అతను మౌనంగా వుండిపోయాడు.

అతని ఆర్థికపరిస్థితిని నాకు బాగా తెలుసు కాబట్టి నా అభిప్రాయాన్ని ఉన్నదున్నట్టు చెప్పాననుకుంటున్నాడా?

లేకపోతే

"అలాంటి పరిస్థితుల్లో ఉండి డబ్బులేక కీచులాడుకుంటూ నిస్సారంగా బతుకుతున్న వాళ్ళ అమ్మా నాన్నల గురించి ఆలోచిస్తున్నాడా?"

ఏదేమైనా అతను నా దగ్గర ఏదో దాస్తున్నాడు. ప్రేమకంటే ముందు అతనికేదో కావాలి. వెళ్ళి చెబుదాం. ఇది విన్న తర్వాతైనా, వాళ్ళమ్మ అర్థం చేసుకుని ఎంకరేజ్ చేస్తుందేమో?" అన్నాను ఆశగా.

"సరే అయితే నేను ఒక అరగంటలో సందీప్ వాళ్ళింటి దగ్గర ఉంటాను" చెప్పి ఫోన్ పెట్టేశాడు వెంకట్.

**నేను సందీప్ వాళ్ళ** యింటిగేటు తీయబోతుండగా వెంకట్ వచ్చాడు. తలుపు తీసుకుని లోపలికి నడిచాం యిద్దరం.

బైట ఎవ్వరూ కనిపించలేదు. వరండా ముందు చెప్పులు వదలబోతుండగా ఉన్నట్టుండి లోపలనుంచి ఏడుపు వినిపించింది.

వెంటనే వెంకట్ వైపుకి చూసి కళ్ళతోనే సైగ చేశాను.

ఇది సరైన సమయం కాదు అనిపించింది మాకు. ఇంతలో సుమిత్రాదేవి మాటలు వినిపించాయి.

"మీ నాన్న ఆత్మహత్య చేసుకుని చచ్చినా నీకేం పట్టదా? ఆ రోజు సమయానికి చిత్ర డబ్బు తెచ్చి యివ్వబట్టి మీ నాన్నని దక్కించుకున్నాం"

ఆవిడ మాటలు వింటూనే వెనక్కి తిరగబోతున్న వాళ్ళం కాస్తా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నాం నేనూ, వెంకట్.

"అమ్మా!" వారిస్తున్నట్టుగా అంటున్నాడు సందీప్.

"నా నోరే మూయించరా. మీ నాన్న ఈ గతికి రావడానికి కారణం నువ్వు కాదూ. చదువైపోతూనే హాయిగా ఉద్యోగంలో చేరితే ఈపాటికి అక్షరూపాయల జీతం తీసుకుంటూ కార్లో తిరిగేవాడివి. ఇలా నువ్వు వ్యాపారం అంటూ ఊరేగబట్టి కదా మీ నాన్నకి 'ఖర్మ పట్టింది. నువ్విలా చేయకపోతే అప్పుల వాళ్ళకి భయపడి మీ నాన్న ఆత్మహత్యకి ప్రయత్నించేవాడా? నీ వెనకాల ఓ చెల్లెలు వుంది. దాని బతుకేం కావాలి?

ఇంకా ఎన్నాళ్ళీ దరిద్రంలో కొట్టుకు చావాలి మేము?

నువ్వేదో ఉద్ధరిస్తావనే అప్పులు చేసి నిన్ను చదివించామని మర్చిపోకు'' ఆవేశంగా అరుస్తూ వుందావిడ.

''అమ్మా నాన్న గురించి నువ్వేం బాధపడకు. నిజంగా పరిస్థితి యింత దారుణంగా వుందని నాకు తెలియదు. నాన్న నాతో ఒక్కమాట అన్నా నేను చూసుకుని వుండేవాడిని.

ఇకనుంచి ఈ రెస్పాన్సిబిలిటీ నాది. అప్పులూ, యింటి ఖర్చులూ అన్నీ నాకు వదిలేయండి. సుమ చదువు సంగతి కూడా నేనే చూసుకుంటాను.'' అన్నాడు కాన్ఫిడెంట్‌గా.

''నువ్వే చూడాలి. కానీ నీకు నీ దరిద్రగొట్టు స్నేహితుల నుంచి విముక్తి దొరికితే కదా మమ్మల్ని పట్టించుకునేది'' అంది సుమిత్రాదేవి నిష్టూరంగా.

ఆవిడ మాటలకి యిద్దరం గతుక్కుమన్నాం. వెనక్కి తిరిగి వెళ్ళాలనే ఆలోచన మాని వెంకట్ అక్కడే నిలబడిపోయాడు.

''మధ్యలో వాళ్ళేం చేశారు?'' విసుగ్గా వినిపించాయి సందీప్ మాటలు.

''ఇంట్లో కూర్చున్నాను కదా అని నాకేం తెలియదనుకోకు. నీకు ఈ వ్యాపారం చేసేంత సాహసం ఎలా వచ్చింది? వాళ్ళని చూసుకుని కదూ.

ఆ ఆఫీసరమ్మకి మీ నాన్న చేస్తున్న గులాం గిరీ చాలదన్నట్టు, నిన్ను కూడా గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు తల్లీకూతుళ్ళు.

ఇదే చెప్తున్నా నువ్వు ఆ పిల్లతో తిరగడం నాకు తెలియదనుకోకు. నిన్ను రక్తమాంసాలు ధారపోసి కన్నాం. అల్లారుముద్దుగా పెంచాం. అప్పులు చేసి మరీ డబ్బులు కువ్వలు కువ్వలుగా పోసి చదివించాం. రేపు నువ్వెవర్తినో తెచ్చి, ఆవిడగారి మోచేతి కింది నీళ్ళు తాగమంటే కుదరదు.

ఆ అమ్మాయి రోజుకొకళ్ళ బైక్ మీద, కార్లలో తిరుగుతూ వుంటుందని వీధి వీధంతా చెప్పుకుంటున్నారు.

మేం నీకోసం యింత కష్టపడ్డందుకు మా జీవితాలు సుఖంగా సాగిపోవాలంటే నువ్వు చిత్రని పెళ్ళిచేసుకోవాలి. లేదంటే మీ నాన్నతో బాటు, నీ చెల్లికి కూడా యింత విషమిచ్చి, నేనూ తాగి ఛస్తా''

ఆవిడ మాటలు విన్న తర్వాత నా తల భూమిలోకి కుంచించుకుపోయింది. వెంకట్ మొహంలోకి కూడా సూటిగా చూడలేకపోయాను.

ఆవిడ సమస్య ఏంటో నాకు అర్థంకాలేదు.

కొడుకు బాధ్యతగా వ్యవహరించాలని కోరుకుంటుందా? లేక, తన కంట్రోలులో ఉండాలని అనుకుంటుందా?

ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఆగదలుచుకోలేదు నేను. గబుక్కున వెనక్కి తిరిగాను.

ఇంకా సుమిత్రాదేవి మాటలు వినిపిస్తున్నాయి.

"నీకు నచ్చినట్టు ఆ వ్యాపారం ఏదో చేసుకుంటానన్నా నేను అడ్డు చెప్పను. కానీ నువ్వు చిత్రని తప్ప యింకెవర్నీ పెళ్ళి చేసుకోనని మాటియ్యి. లేకపోతే నేను చచ్చింత ఒట్టు" సుమిత్రాదేవి అరుస్తుంది.

నేను గబగబా గేటు దగ్గరికి నడిచాను.

ఆవిడ ప్రశ్నకి సందీప్ ఏం సమాధానం యిచ్చాడో నాకు వినిపించలేదు. నేను వినదలుచుకోలేదు కూడా.

ఎంత సంతోషంగా, శుభవార్త వినిపించాలని ఆరాటంగా వచ్చానో అంతే బాధతో బరువుగా గేటు దాటాను.

"తన్మయీ! ఆర్యూ ఓకే"

వెంకట్ మాటలకి పెదవులు బిగబట్టి తలవూపాను.

"ఆవిడంతే. నేను నీకు ముందే చెప్పాను కదా. ఆమె మాటల్ని సీరియస్‌గా తీసుకోవద్దు" వెంకట్ ధైర్యం చెప్పాడు.

"అదికాదు నేను ఆలోచిస్తున్నది. రంగారావు అంకుల్ సూసైడ్ ఎటెంప్ట్ చేశారంటే నమ్మలేకపోతున్నాను. బహుశా, సందీప్ ఈ విషయంలో గిల్టీగా ఫీలవుతూ వుండొచ్చు. చిత్ర ఆ డబ్బు.. ఎందుకు తీసిందో. సందీప్ చిత్ర గురించి ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడలేదో ఇప్పుడు అర్థం అవుతుంది. చిత్ర ఆ డబ్బుని రంగారావు అంకుల్ హాస్పిటల్ బిల్లుకోసం తీసి ఉండొచ్చు" అన్నాను.

"యూ ఆర్ రైట్" తలాడిస్తూ అన్నాడు వెంకట్.

"ఇంకొక్క విషయం మనం యిక్కడికి వచ్చి వెళ్ళినట్టూ సందీప్‌కి చెప్పొద్దు ప్లీజ్"

"అలాగే" చెప్పి, వెంకట్ వెళ్ళిపోయాడు.

నేనూ, వెంకట్ ఆఫీసు రూంలో కూర్చుని వున్నాం. పొద్దుటి నుంచి మూడ్ ఆఫ్‌లో ఉన్న నన్ను నవ్వించే ప్రయత్నం చేస్తున్నాడు వెంకట్.

"హలో" సందీప్ వచ్చాడక్కడికి.

చాలా మామూలుగా, ఉత్సాహంగా ఉన్నాడతను.

"ఇవాళ మన ఫస్ట్ పేమెంట్ వచ్చింది" అన్నాడు. మా యిద్దరివైపు చూసి నవ్వుతూ.

"సందీప్ నాకు యిప్పుడే డబ్బు అవసరంలేదు. నీకు అవసరం అయితే, నా వాటా డబ్బులు నువ్వు వాడుకోవచ్చు" చెప్పాను సీరియస్‌గా.

"యా!" వెంకట్ కూడా అదేమాట అన్నాడు.

సందీప్ మా యిద్దర్నీ మార్చి చూశాడు.

"ఫస్ట్ మనం లోన్ యిన్‌స్టాల్‌మెంట్ కట్టాలి. ఆ తర్వాత ఇంకా కొత్త ఆర్డర్స్‌కి 'రా మెటీరియల్' కోసం కాస్త పెట్టుబడి పెట్టాలి.

మనం ఎక్స్‌పోర్ట్ చేసే పోర్టుకి దగ్గరగా ఉండే ఏరియాల్లో ఇంకా కొత్త డీల్స్ ఏమైనా దొరుకుతాయా అని ట్రై చేస్తున్నాను.

మీ యిద్దరికీ యిప్పుడే డబ్బుతో అవసరం లేదంటే, దాన్ని తిరిగి బిజినెస్‌లో పెడదాం" అన్నాడు కూల్‌గా.

"నేనూ, వెంకట్ ఆశ్చర్యంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నాం"

"ఏమైంది?" సందీప్‌కి మమ్మల్ని చూసి డౌటొచ్చింది.

"ఏం లేదు. నీ యిష్టం. నువ్వెలా అంటే అలాగే చేద్దాం" అన్నాన్నేను. వెంకట్ కూడా అందుకు ఒప్పుకున్నాడు.

ఆదివారం రోజు లేటుగా లేచి బద్ధకంగా సోఫాలో వాలి న్యూస్ చూస్తూ వున్నాను.

టివీలో కనిపించిన ఒక న్యూస్ క్లిప్పింగ్ చూసి "అమ్మా...అమ్మా! త్వరగా...రా" గట్టిగా కేకెపెట్టాను.

అది తనీష్ తండ్రి సూసైడ్ వార్త.

తనీష్ వాళ్ళ నాన్న అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడట. కొడుకు ప్రేమించిన అమ్మాయితో ఎంగేజ్‌మెంట్ జరిపించారు.

ఆ తర్వాత, ఎంగేజ్‌మెంట్‌ని రద్దు చేసి పెళ్ళి కాన్సిల్ చెయ్యడంతో కొడుకు డిప్రెషన్‌లోకి వెళ్ళాడనీ వృద్ధాప్యంలో ఆసరాగా ఉండవలసిన కొడుకు అలా పిచ్చివాడై ఉండడం చూసి భరించలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ లెటర్ రాసి చనిపోయినట్టు వార్త ప్రసారం అవుతుంది.

తనీష్, తండ్రి శవం దగ్గర కూర్చుని గుండెలు పగిలేలా ఏడ్వడం పదే పదే చూపిస్తున్నారు స్క్రీన్ మీద.

"ఎందుకు ఈ కాలం పిల్లలు బంధాల్ని గౌరవించడం లేదంటారు? చెట్టునుంచి ఆకుని తుంపి పడేసినంత ఈజీగా ఎలా బ్రేకప్ చెప్పగలుగుతున్నారు?" యాంకర్ ఓ పెద్దావిడని కూర్చోబెట్టి ప్రశ్నిస్తుంది.

ఆ వార్త చూసి నేనూ, అమ్మ షాకయ్యాం.

తనీష్ వాళ్ళింట్లో జరిగింది విషాదమే. కానీ, అతని కన్నీళ్ళు నాటకం అని చెప్పలేము. కానీ, దాన్ని ఎంత తప్పుగా ప్రొజెక్ట్ చేసి చూపిస్తున్నారు?

ఇంతలో ఆ యాంకర్ 'యిప్పుడే అందిన తాజా సమాచారం' అంటూ ఓ చిన్న వీడియో క్లిప్పింగ్‌ని ప్లే చేసింది.

రెండురోజుల క్రితం, తనీష్ స్వప్న వాళ్ళింటి ముందు చేసిన గొడవ తాలూకు వీడియో అది. దాన్ని చూస్తుంటే, ఎక్కడో యిరుగు పొరుగు యిళ్ళలో బాల్కనీలో నుండి రికార్డ్ చేసినట్టుగా వుంది. మాటలు రికార్డ్ కాలేదు.

ఆ వీడియోలో తనీష్ స్వప్న కాళ్ళమీదపడి ప్రాధేయపడుతున్నట్టూ మా అమ్మ, యింకా యింట్లో మిగిలిన వాళ్ళూ అతనికి అడ్డుపడుతున్నట్టూ వుంది.

దాని వెనుక వున్న నిజాలు మాత్రం ఎవ్వరికీ తెలియదు.

ఒక నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నమ్మేలా చూపించడం ఎంత తేలికో అర్థమైందా క్షణం నాకు.

స్వప్న కోలుకోవడం మళ్ళీ యిలాంటిది ఏదో ఒకటి జరిగి దెబ్బతినడం

ఆ వీడియో చూసిన దగ్గర్నుంచి స్వప్న పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది.

"ఇదంతా, నీవల్ల జరిగింది కాదు. ఆయన బిజినెస్ వత్తిళ్ళు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని వుంటాడు. అంత గిల్ట్ నీమీద తీసుకోకు" అని అందరం స్వప్నకి చెప్పి చెప్పి అలసిపోయాం.

"ఒకవేళ మీ పెళ్ళి జరిగివుంటే వాళ్ళ నాన్న ప్లేస్‌లో నువ్వు ఉండేదానివేమో ఎవరికి తెలుసు? ఎంత ప్లానింగ్ లేకపోతే, ఆ వీడియో తీసి మీడియాకి యిస్తారు?" అమ్మ చెప్పింది.

"ఇలా చెప్పి లాభం లేదు. షీ నీడ్స్ కౌన్సిలింగ్" మాధవన్నయ్య తేల్చి చెప్పాడు విసుగ్గా.

"మీరందరూ నా మాట వినండి" అన్నపూర్ణమ్మగారు మధ్యలో కల్పించుకుంది.

"కొద్దిరోజులు నేనూ, స్వప్నా రామచంద్రాపురంలో మన ఫార్మ్ హౌస్‌లో ఉండి వస్తాం. ఈ చుట్టాలూ, పలకరింపులూ పరామర్శలకి దూరంగా ఉంటే మంచిది కొన్నాళ్ళపాటు.

అక్కడి వాతావరణం, గోదావరి గాలికి కాస్త మనశ్శాంతి వస్తుంది. అప్పటికీ కుదుటపడకపోతే ఏం చెయ్యాలో ఆ తర్వాత ఆలోచిద్దాం" అందావిడ.

ఆ సలహా అందరికీ నచ్చింది.

రెండు రోజుల తర్వాత ఆఫీసు నుంచి యింటికి తిరిగి వచ్చాను. కారు పార్క్ చేసి లోపలికి వస్తుంటే లోపల నుంచి కొత్త గొంతులు వినిపిస్తూ వున్నాయి.

వాకిట్లో చాలా జతల చెప్పులు కనిపించాయి.

"మా యింటికి ఈ టైంలో యింతమంది వచ్చారా? యింపాజిబుల్. అందులోనూ వీక్‌డేస్‌లో యింటికి ఎవర్నీ పిలవడానికి అమ్మ యిష్టపడదు" అనుకుంటూ లోపలికి వచ్చాను.

తలుపు చప్పుడు అవుతూనే లోపల కూర్చున్న అందరి మొహాలూ నావైపుకి తిరిగాయి.

"తన్మయీ నీ కోసమే వెయిట్ చేస్తున్నాం" అంటున్న నిరంజన్‌ని చూసి షాకయ్యాను.

"నిరంజన్ నువ్వేంటి యిక్కడ?" అంటూనే అక్కడున్న అందర్నీ పరికించి చూశాను.

నిరంజన్‌తో పాటు అతని పేరెంట్స్ కూడా వచ్చారు.

వాళ్ళకి ఎదురుగా వున్న సోఫాలో అమ్మ కూర్చుని వుంది. ఆ పక్కనే వున్న సింగిల్ సీటర్ సోఫాలో రంగారావుగారు కూర్చుని వున్నారు.

అప్పటికి నా మెదడు కొద్దికొద్దిగా విషయాల్ని ప్రాసెస్ చేయడం మొదలు పెట్టింది.

నిరంజన్, పేరెంట్స్‌ని తీసుకుని మా యింటికి వచ్చాడన్నమాట. అనుమానలేదు. పెళ్ళి సంబంధం మాట్లాడడానికే అయ్యుంటుంది. విషయం అర్ధంకాగానే, చికాకు పుట్టింది నాకు.

అమ్మ మొహం కూడా అసహనంగా చిరాగ్గా వుంది. "అంటే హఠాత్తుగా చెప్పాపెట్టకుండా ఊడిపడ్డారన్నమాట" అంతరాత్మ ఊహించి చెప్పింది.

"రామ్మా! ఇలా వచ్చి కూర్చో" నిరంజన్ వాళ్ళ అమ్మగారు పిలిచారు. నేను వెళ్ళి ఆవిడ కూర్చున్న సోఫాలోనే కాస్త ఎడంగా కూర్చున్నాను.

"శ్రీనివాసరావుగారింట్లో ఎంగేజ్‌మెంట్‌కి వెళ్ళినప్పుడు మీ అమ్మాయిని పరిచయం చేశాడు నిరంజన్. అప్పుడే మా వాడి ఫీలింగ్స్ అర్ధమయ్యాయి. లక్కీగా మా అబ్బాయికి మంచి జాబ్ కూడా వచ్చింది. నిజంగా మీ అమ్మాయి మా పాలిటి అదృష్టలక్ష్మి" అమ్మతో చెప్తూ వుందావిడ.

నేను యధాలాపంగా రంగారావుగారివైపు చూశాను. ఆయన ఎడమచేతి మణికట్టుకి కట్టు కట్టి వుంది. పాలిపోయిన మొహంతో యాంత్రికంగా వాళ్ళ మాటలు వింటున్నట్టుంది ఆయన వాలకం.

సంతోషంగా బతకడం అంత కష్టసాధ్యమైన విషయమా? బంధాలూ, ప్రేమలూ కూడా గుర్తుకు రానంత భారమైపోతుందా జీవితం ఎవరికైనా?

వెంటనే నాన్నని వద్దనుకున్న అమ్మ నిర్ణయం గుర్తొచ్చింది.

"తనూ! ఈ ప్రశ్నకి సమాధానం నువ్వు ఊహించినంత తేలిక కాదేమో. ఆయనది గట్టి మనసు కాదేమో. ఆర్థిక భారంతో భుజాలూ, భార్య సాధింపుల్తో చెవులు బరువెక్కిపోయి వుంటాయి. పాపం బలహీనమైన మనసు భరించలేకపోయి వుంటుంది" చెప్పింది అంతరాత్మ.

ఏ సమస్యకీ పరిష్కారం ఎవరూ చెప్పలేరు. ఎవరికివారే దాన్ని శోధించి కనుక్కోవాలి. ధృఢంగా అమలు చేయగలగాలి.

అయిన వాళ్ళెవ్వరూ లేకపోయినా, అమ్మ ధైర్యంగా ఓ నిర్ణయం తీసుకుంది. దాన్ని అమలు చేసింది.

స్వప్న మాత్రం మనసుని కూడగట్టుకోలేకపోతుంది "ఇలా యింకా ఆలోచనల్లో కొట్టుకుపోతూనే ఉండేదాన్నేమో.

ఇంతలో అమ్మ పిలిచింది. "తనూ నువ్వెళ్ళి ఫ్రెష్ అయ్యి రా అలసిపోయి వుంటావు" అమ్మ చెబుతూనే అక్కడ్నుంచి కదిలాను.

నేను తిరిగి వచ్చేసరికి హాల్లో అమ్మ తప్ప ఎవ్వరూ లేరు. "నీకు యిప్పుడే పెళ్ళి చేసే ఉద్దేశ్యం లేదని చెప్పి పంపించాను వాళ్ళని. నీ ఒపీనియన్ ఏమీ మారలేదుగా. ఇంకోసారి ఆలోచిస్తావా?" నా వైపు చూస్తూ అడిగింది అమ్మ.

"నో అమ్మా!" ఒక్క అంగలో అమ్మ దగ్గరికి వెళ్ళి చేతులు పట్టుకున్నాను. "నో సెకండ్ థాట్స్" చెప్పాను నమ్మకంగా.

"అయితే మీ బిజినెస్ కాస్త సెటిలయ్యాక రంగారావుగారితో మాట్లాడతాను. ఫైనాన్షియల్గా స్థిరపడడం పెళ్ళికి చాలా అవసరం" చెప్పింది.

రంగారావుగారి సూసైడ్ ఎటెంప్ట్, ఫైనాన్షియల్ వత్తిడులు, బిజినెస్ బాధ్యతలూ, సుమిత్రాదేవి సాధింపులూ సందీప్ని ఊపిరి పీల్చుకోనిస్తూ ఉండవు. ఇది అస్సలు రైట్ టైమ్ కాదు.

పైగా చిత్ర గురించి అతను ఏం నిర్ణయం తీసుకున్నాడో నాకు తెలియదు. అందుకే "ఇప్పుడే వద్దమ్మా ఎప్పుడు మాట్లాడాలో నేను చెబుతాను" అన్నాను అమ్మతో.

"సరే" ఒప్పుకుంది అమ్మ. "స్వప్న యివాళ రామచంద్రాపురం వెళుతుందన్నావు. ఒకసారి నువ్వెళ్ళి కలిసిరా" గుర్తు చేసింది భుజం తడుతూ.

నేను వెళ్ళేసరికి స్వప్న వాళ్ళు బ్యాగులు సర్దుకుని రెడీగా వున్నారు. అన్నపూర్ణమ్మగారు పెట్టిన ముహూర్తం ప్రకారం వాళ్ళు బయలుదేరడానికి యింకా ఒక గంట టైముంది.

పోయినసారి కలిసినప్పుడు లేని సంసిద్ధత స్వప్న మొహంలో ఈసారి కనిపించింది. ప్రయాణానికి యిష్టపూర్వకంగా తయారైంది.

ముందురోజు, తనీష్ మాధవన్నయ్యని కలిసి కాళ్ళావేళ్ళా పడ్డాడట. తనమీద పెట్టిన కేసులు ఎత్తివేయండని.

"స్వప్న మనస్తత్వం నాకు బాగా తెలుసు. తన కోసం బాధపడుతూ, తన చుట్టూ తిరుగుతూ వుంటే ఖచ్చితంగా స్వప్న మనసు కరుగుతుంది. అందుకే మీ యింటి చుట్టూ తిరగడం, తాగి బ్రేక్ డౌన్ అయినట్టూ కనిపించడంలాంటివి కావాలనే చేశాను. ఇంకెప్పుడూ మీకెవ్వరికీ కనిపించను. ఈ కేసులు మాత్రం ఎత్తివేయండి" అని బతిమాలాడట.

ఈ వివరాలన్నీ విశాలాంటీ చెప్పింది నాతో.

"పాపం పుణ్యం భగవంతుడే చూసుకుంటాడు. పోయిన మన పరువెలాగూ రాదు. వాడి ఖర్మానికి వాడిని వదిలెయ్. మనం యిక వాడిని గురించి చర్చించవద్దు" అన్నపూర్ణమ్మగారు తేగేసి చెప్పింది.

మాధవన్నయ్య మాత్రం అతని మీద పెట్టిన కేసుల్ని ఎత్తివేయడానికి ఒప్పుకోవడంలేదు.

నిజంగా, తనీష్ తెగువకి నాకు ఆశ్చర్యమేసింది. "చేసిన మోసం బైటపడ్డ తర్వాత కూడా స్వప్నని ఎమోషనల్‌గా టార్గెట్ చేసి లోబరుచుకోవాలన్న అతని ఆలోచనకి ఒళ్ళు జలదరించింది.

సైకాలజీ చదివి, నలుగురికీ కౌన్సిలింగ్ యివ్వాల్సిన స్వప్న, తనే కౌన్సిలింగ్ తీసుకునే పరిస్థితికి రావడం చాలా బాధనిపించింది.

"బిడ్డ మొహంలో నవ్వు చూసి ఎన్నిరోజులైందో" అంటూ వెళ్ళేటప్పుడు అన్నపూర్ణమ్మగారు కళ్ళొత్తుకుంది.

స్వప్న ఎప్పటిలా మాములుగా నవ్వుతూ తిరిగి కనిపించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను. బరువైన మనసుతో కౌగలించుకుని వీడ్కోలు చెప్పాను. స్వప్న వెళ్ళిపోయాక, మనసంతా దిగులు ఆవరించుకుంది. ఏ పని మీద మనసు కుదరడంలేదు.

ఒకవేళ, సందీప్ నిజంగానే చిత్రని పెళ్ళిచేసుకుంటే, నేను నవ్వుతూ రెసెప్షన్‌కి వెళ్ళి బొకే యిచ్చి విషెస్ చెప్పగలనా?

నాలో స్తబ్ధతకి కారణం స్వప్న పరిస్థితే అయినా, మనసు లోపల ఏమూలో నా గురించి నేను భయపడుతున్నట్టు నాకు తెలుస్తూనే వుంది.

గోడౌన్ వెనకాల బెంచీమీద ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తూ వున్నాను.

ఎప్పుడూ ఆహ్లాదంగా అనిపించే ఆ పరిసరాలు, నా ఒంటరితనాన్ని మరీ మరీ గుర్తుచేసి భయపెడుతున్నట్టు వుంది.

ఇక, అక్కడ ఉండలేనట్టు లేచి, కారు దగ్గరికి నడిచాను.

`తనూ` సందీప్ పిలిచాడు.

`నీతో కొంచెం మాట్లాడాలి` అన్నాడు నా దగ్గరికి వస్తూ.

సాయంకాలపు వెలుతురులో ఎత్తైన ఆకుపచ్చని చెట్ల ముందు నిలబడివున్న అతని ఆకారాన్ని అలాగే చూస్తూ వుండిపోయాను.

`తనూ!` మళ్ళీ పిలిచాడతను.

`ఆ!ఁ చెప్పు" అన్నాను ఉలిక్కిపడుతూ.

"ఇక్కడ కాదు. అలా కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు చెట్లకి కిందవైపున గట్టులా ఉన్న ప్రాంతాన్ని చూపిస్తూ.

అతన్ని చూస్తూ వుంటే మళ్ళీ మనసులో ఏవో ఆశలు మొలకెత్తాయి. ఆ వర్షం కురిసిన సాయంకాలంలాంటి ఇంకో అందమైన సాయంత్రం నా జీవితంలోకి రాబోతుందా? ఒకే ఒక్క క్షణం ఆశ మెరుపులా మెరిసింది.

వెంటనే అంతరాత్మ మేల్కొంది. "తనూ! ఎమోషన్‌లో ఎక్కువగా ఆలోచిస్తున్నావు" హెచ్చరించింది.

వెంటనే తేరుకున్నాన్నేను.

"నాకు అర్జంట్ పని వుంది. నువ్వు చెప్పాలనుకున్నదేదో యిక్కడే చెప్పు" అన్నాను సందీప్ వైపు సూటిగా చూస్తూ.

"నిన్న నిరంజన్ మీ యింటికి వచ్చాడా?" కనుబొమలు ముడుస్తూ అడిగాడతను.

నాకు విషయం అర్థమైంది.

"అవును ఫ్యామిలీతో వచ్చాడు. నాతో పెళ్ళి సంబంధం కుదుర్చుకోవడానికి" తెచ్చిపెట్టుకున్న కాన్ఫిడెన్స్‌తో ధృఢంగా అన్నాను.

"తన్మయీ యూ నో నిరంజన్. వాడికీ నాకూ స్కూల్ డేస్ నుంచి అస్సలు పడదు. వాడెలాంటివాడో నీకూ తెలుసు. నువ్వు డెసిషన్ తీసుకునే ముందు ఒక్కసారి ఆలోచించు" కోపంగా చెప్పాడు.

"అదంతా ఒకప్పటి సంగతి. నిరంజన్‌కి నేనంటే యిష్టం. ఇప్పుడతనికి మంచి జాబ్ వచ్చింది. నెలకు దాదాపు లక్షపైనే జీతం. నేను కాదనడానికి కారణం ఏముంది?

మీ అమ్మైనా నువ్వు అలాంటి జాబ్ చెయ్యాలనే కదా కోరుకుంటుంది. అన్నింటినీ మించి మా రెండు ఫ్యామిలీల మధ్య ఎటువంటి విభేదాలు లేవు. వాళ్ళమ్మగారికి నేనంటే సదభిప్రాయమే వుంది" అన్నాను పదునుగా.

అతను ఒక్క క్షణం సీరియస్‌గా నా వైపు చూశాడు.

"కంగారు పడకు నాకంతా తెలుసు. చిత్ర మీద ఆవిడకున్న ఆశలు నా మీద వున్న వ్యతిరేకత అన్నీ తెలుసు. నేను నిరంజన్‌ని వద్దనడానికి నువ్వు యింకేదైనా కారణం చెప్పు వింటాను" సూటిగా అడిగాను.

"తనూ ఐ లవ్ యూ ఇంతకన్నా మరోకారణం కావాలా?" అని అతడు అంటాడని ఆశపడ్డాను.

కానీ సందీప్ మౌనంగా నిలబడ్డాడు.

అతనలా అనలేదు. అతని పరిస్థితి నాకు తెలుసు అందుకే నేను మాట్లాడకుండా గబగబా కారు పార్కింగ్ దగ్గరికి నడిచాను.

ఎప్పటిలాగా వెనకనుంచి అతని కళ్ళు నన్నే చూస్తూ ఉంటాయి. నాకు అర్ధమవుతూనే వుందా విషయం. కానీ నేను వెనక్కి తిరగలేదు.

అర్ధరాతి మంచి నిద్రలో ఉన్నప్పుడు దభీమని ఏదో పడిన చప్పుడైంది. ఉలిక్కిపడి నిద్రలేచాను.

బెడ్ లాంప్ వెలుతురు కంటికి మసగ్గా కనిపించింది. ఇంతలో మళ్ళీ చప్పుడైంది. ఈసారి శ్రద్ధగా విన్నాను. హాల్లో నుంచి వస్తుందా శబ్దం. ఆ వెంటనే అడుగుల చప్పుడు.

"కొంపదీసి దొంగా?" ఆ మాట అనుకోగానే గుండె జారిపోయింది. వెంటనే నా సెల్‌లో మెసేజ్ బీప్ మంది.

సెల్ ఫోన్‌ని చేతిలోకి తీసుకున్నాను. టైం పన్నెండు గంటల నలభై నిముషాలు చూపిస్తుంది.

అమ్మ దగ్గర్నుంచి యింత రాత్రప్పుడు మెసేజ్. భయంగా ఓపెన్ చేసి చూశాను. "లాక్ ద డోర్ యిమ్మీడియట్లీ" అని వుంది.

అంటే, అమ్మ కూడా మేలుకునే వుంది. ఈ శబ్దాలూ, మనిషి కదులుతున్న అలికిడి నా భ్రమకాదు.

వెంటనే ఒక్కసారిగా మంచం మీద నుంచి దూకి, ఒక్క అంగలో డోర్ దగ్గరకి వెళ్ళాను.

డోర్ లాక్ చేసి, తలుపు సందుల్లో కన్ను పెట్టి చూశాను.

హాల్లో ఒక నల్లటి ఆకారం కదులుతున్నట్టూ కనిపించింది.

ఆ ఆకారం నెమ్మదిగా అమ్మ గది వైపుకి కదులుతున్నట్టనిపించింది.

"అమ్మా!" కంగారులో పైకే అనేశాను.

ఇప్పుడు నాలో భయంపోయి అమ్మని గురించిన ఆదుర్దా మొదలైంది. "ఏమిటి చేయడం? తలుపు తీసుకుని బైటికి వెళ్ళాలా? పోనీ ఆ దొంగని వెనుక నుంచి ఎటాక్ చేస్తే ఎలా?" ఆందోళనకి మెదడులో ఆలోచనలు కూడా ఒకదానినొకటి ఢీ కొంటున్నట్టున్నాయి. చల్లబడుతున్న అరచేతుల్ని ఒక్కసారి గట్టిగా రుద్దుకుని, వణుకుతున్న చేతులతో గడియ తీయడానికి సిద్ధమయ్యాను.

లాక్ మీద అలా చెయ్యి వేశానో లేదో వెంటనే, 'ధన్' మంటూ పెద్దగా చప్పుడు వినిపించింది.

ఇక, క్షణం ఆలస్యం చేయకుండా తలుపు తీశాను. హాల్లో సోఫా పక్కన గుర్తు తెలియని మనిషి కిందపడి ఉన్నాడు. అమ్మ తన గది గుమ్మంలో చేతిలో రివాల్వర్‌తో నిలబడివుంది.

**అమ్మ గదిలోనుంచి** ట్యూబ్‌లైట్ వెలుతురు దాదాపుగా సగం హాలువరకు పరుచుకుని వుంది.

సోఫా పక్కన పడిపోయిన వ్యక్తి, బుల్లెట్ తగిలిన కాలుని పట్టుకుని మెలికలు తిరిగిపోతున్నాడు.

అమ్మ, సేఫ్టీ కోసం గన్ లైసెన్స్ చాలాకాలం క్రితమే తీసుకుంది. ప్రమాదకర పరిస్థితుల్లో గురి తప్పకుండా కాళ్ళమీద కాల్చడంలో శిక్షణ తీసుకుంది. అమ్మ షూటింగ్‌లో పర్‌ఫెక్ట్.

ఆ రివాల్వర్‌ని యిన్ని రోజుల తర్వాత యిలా ఉపయోగించడం చూసి నోరు వెళ్ళబెట్టాను నేను.

"తనూ!..ఆర్యూ ఓకే?" అమ్మ నన్ను అడిగింది.

"ఊఁ" రెప్పవేయకుండానే తలాడించాను.

వెంటనే అమ్మ సెల్‌ఫోన్ నుంచి రెండు మూడు కాల్స్ వెళ్ళాయి. కాస్సేపటికి రంగారావుగారూ, సందీప్ వచ్చారు. ఆ వెంటనే పోలీసులు కూడా వచ్చారు.

సోఫా పక్కన తెలివి లేకుండా పడివున్న దొంగని చూసి ఆశ్చర్యపోయారంతా. సబ్ ఇన్స్‌పెక్టర్ నోరు తెరిచి అడగబోయేలోపలే అమ్మ చెప్పింది.

"అవి నిజం బుల్లెట్స్ కావు. డమ్మీవి. మైల్డ్ సెడేషన్ యింజెక్ట్ చేస్తాయి" వివరణ యిచ్చింది.

కానిస్టేబుల్స్ దొంగని లేపి తీసుకు వెళ్ళారు.

ఎస్సై, అమ్మ, రంగారావు అంకుల్, దొంగ ఎటువైపు నుంచి వచ్చాడు? తలుపు గడియని ఎలా కట్ చేశాడు అని, అన్నీ చెక్ చేస్తూ వున్నారు. వాళ్ళు చర్చించుకుంటూ వుంటే, సందీప్ ఒక పక్కగా నిలబడి వాళ్ళ మాటలు వింటూ మధ్య మధ్య అమ్మ వంకే తదేకంగా చూస్తు వున్నాడు. అతని కళ్ళలో అమ్మపట్ల మెచ్చుకోలు స్పష్టంగా కనిపిస్తూ వుంది నాకు.

ఎస్సై వెళ్ళిపోయాక, రంగారావుగారు "రేపొద్దున వచ్చి తలుపు గడియలు బాగు చేయిస్తానమ్మా. ఏదైనా అవసరం వుంటే ఫోన్ చెయ్యండి" చెప్పి వెనక్కి తిరిగాడు.

"సందీప్ కేవలం వాళ్ళ నాన్నకి తోడుగా మాత్రమే వచ్చినట్లున్నాడు. నిన్ను కనీసం పలకరించను కూడా లేదు" అంతరాత్మ కంప్లైంట్ చేసింది. ఆ మాటలు అతనికి వినిపించినట్టే వెళుతున్నవాడల్లా ఠక్కున వెనక్కి తిరిగాడు.

"తనూ! ఆర్యూ.. ఓకే?" అడిగాడు దగ్గరగా వచ్చి.

"ఊం" తలాడించాను.

అతనింకేమీ మాట్లాడలేదు. ఒకేసారి యిద్దరం చూపులు మరల్చుకున్నాం. అతను వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

తెల్లవారేసరికల్లా మా యింట్లో జరిగిన ఉదంతం ఊరంతా మారుమోగిపోయింది. మొదటగా.. రాజ్యంగారు. ఆవిడ వస్తూనే అమ్మని ఒక అద్భుతవ్యక్తిని చూసినట్టు చూసింది.

సాక్షాత్తూ నేలమీద అవతరించిన దుర్గాదేవిని చూసినట్టు భక్తితో అమ్మవైపు తిరిగి 'నమస్తే అమ్మా' అంటూ చేతులు జోడించింది.

"లోకంలో యిలా కూడా జరుగుతుందా? మగమనిషి తోడులేకుండా ఓ దొంగవెధవని ధైర్యంగా ఎదిరించొచ్చా? మామూలుగా కనిపించే ఆఫీసరమ్మలో ఒక ఝాన్సీ లక్ష్మీబాయి దాగి వుందా?"

రాజ్యంగారి కళ్ళల్లో ఎన్నెన్నో భావాలు. తాదాత్మ్యత మరీ ఎక్కువై అమ్మ పాదాల మీద పడిపోతుందేమో అని భయమేసింది నాకు.

ఈవిడ్ని యిలాగే వదిలేస్తే ట్రాన్స్‌లోకి వెళ్ళిపోతుందేమో అని "ఆంటీ" అని గట్టిగా పిలిచాను.

"అమ్మా!..ఆ! వస్తున్నా" అంటూ ఈలోకంలోకి వచ్చి గబగబా వంటింట్లోకి వెళ్ళింది. నేను ఆఫీసుకి వెళ్ళడానికి గేటు తీసుకుని బైటికి వస్తూనే కార్‌పార్కింగ్‌లో ఎన్నో జతల కళ్ళు, నావైపు అబ్బురంగా, విచిత్రంగా చూశాయి.

"ఝాన్సీకి రాణీ" వాళ్ళ అమ్మాయినే యింతలా చూస్తున్నారంటే యిక అమ్మ సిట్యుయేషన్ ఎలా వుండబోతుందో. అమ్మ అసలు పట్టించుకోదు కాబట్టి సరిపోయింది" అనుకున్నాను.

ఆఫీసుకి వెళుతూనే "హలో తన్మయీ మేడంగారూ" అంటూ వంగి దణ్ణం పెడుతూ ఆటపట్టించాడు వెంకట్.

"నిన్నిలా గౌరవంగా, వినయంగా ట్రీట్ చేయకపోతే ఆంటీ నన్ను కూడా షూట్ చేసి పారేస్తారేమో. ఇక నీ వంక ఎవ్వరూ కన్నెత్తి చూడరు. పెళ్ళి కావడం కూడా కష్టమేమో నీకు. వెనకాల గన్ పట్టుకున్న అత్తగారిని చూస్తే ఎవరికైనా భయమే కదా."

"నిన్నూ" చేతిలో పేపర్స్ విసిరికొట్టబోయినట్టు నటించి నవ్వేశాను.

"జోక్స్ ఎ పార్ట్. కానీ ఆంటీ సాహసానికీ, గుండె ధైర్యానికీ హేట్సాఫ్. కానీ నిజం చెప్తున్నాను. నీకు అందులో పదోవంతు ధైర్యం కూడాలేదు."

"వెంకట్" వారిస్తున్నట్టుగా అన్నాను. "పొద్దుటినుంచి ప్రతిచోటా యిదే టాపిక్. ప్లీజ్... యింక చాలు"

"సరే..సరే నువ్వు చెప్పు నిరంజన్ మీ యింటికి వచ్చాడట అన్నాడు" క్యూరియస్‌గా ముందుకి వంగుతూ.

నేను చేతిలో బ్యాగ్‌ని టేబుల్ మీద పడేసి ఛెయిర్‌లో కూర్చున్నాను. "నిరంజన్ గురించి నీకు తెలుసు. ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోకు" అన్నాను కూల్‌గా.

"మరి ఆ సంగతి తెలియక మా వాడు కాస్త టెన్షన్ పడుతున్నట్టున్నాడు" దూరంగా నిలబడి వర్కర్స్‌తో మాట్లాడుతున్న సందీప్ వైపుకి చూసి నవ్వుతూ అన్నాడు.

వెంకట్ మాటలకి నేను జవాబివ్వలేదు.

"ఇది చెప్పు మనం డబ్బు వాడుకోమని చెప్పినా తిరిగి బిజినెస్‌లో ఇన్వెస్ట్ చేస్తానంటున్నాడు. మరి ఆ అప్పులన్నీ ఎలా మేనేజ్ చేస్తాడు?"

వెంకట్‌కి ఈ విషయం తెలిసుంటుందని నా నమ్మకం. అందుకే అడిగాను.

"సందీప్ వాళ్ళ నాన్నలాగా నోట్లో నాలుక లేనివాడు కాదు. అప్పుల వాళ్ళతో గట్టిగానే మాట్లాడాడు. హెచ్చు వడ్డీలూ, దొంగ ఎకౌంట్‌లూ రాసిన వాళ్ళకి ఎక్స్‌ట్రాగా యిచ్చేది లేదని తెగేసి చెప్పాడు.

అప్పుల వాళ్ళకి కొద్దికొద్దిగా వాయిదాల పద్ధతి మీద యిచ్చేట్టుగా ఒప్పందం కుదిరింది. నిన్న నేనూ, మాధవ్ సందీప్‌తోబాటు వెళ్ళి యివన్నీ సెటిల్ చేసుకుని వచ్చాం.

ఇంక, ఈ బిజినెస్‌లో డబ్బు వాడుకోకపోవడానికి కారణం ఏంటంటే ఇంత డబ్బు ఒక్కసారిగా వస్తుందంటే వాళ్ళమ్మ కంట్రోల్‌లో ఉండదని వాడి భయం. ఈ బిజినెస్ వాడి డ్రీమ్. ముందుగా దీన్ని అనుకున్న లెవిల్‌కి తీసుకువచ్చాకా వాడు వేరే వాటి గురించి ఆలోచిస్తాడట" అన్నాడు సందీప్ నిలబడ్డ వైపుకి చూస్తూ.

వెంకట్ మాటలు వింటూనే నా మనసు తేలికపడింది. ''ఎంతైనా నీకు అన్ని విషయాలు తెలుస్తాయి. నాతో అస్సలు షేర్ చేసుకోడు'' అన్నాను నిష్టూరంగా.

''వాడొక బోరు బావి. నాతో అయినా అవసరం ఉంటేనే చెప్తాడు. మా అయ్య ఎమ్మెల్యే కదా నా ఫేసు అక్కడ అవసరం. అందుకే చెప్పాడు. నువ్వు యిందులో ఫీలవ్వాల్సిందేమీ లేదు'' అన్నాడు నవ్వుతూ.

నేను యింటికి వచ్చేసరికి హాల్లో అమ్మా, రంగారావు అంకుల్ కూర్చుని ఉన్నారు.

నేను గుమ్మం దాటి అడుగు లోపల పెట్టానో లేదో ఆయన ''ఇక నేను వస్తానమ్మా'' అంటూ లేచారు.

అప్పుడే అమ్మ ఒక కవరు తీసి ఆయన చేతిలో పెట్టడం నా కంట పడింది.

ఆయన వెళ్ళిపోతూనే అమ్మని అడిగాను. ''రంగారావు అంకుల్ మళ్ళీ డబ్బు అడిగారా నిన్ను?''

''ఆఁ''

నేను ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాను.

''అమ్మా! ఆయన మణికట్టుకి కట్టుకట్టి వుంది చూశావా?'' అడిగాను మళ్ళీ.

''చూశాను. యింట్లో దేనికో నట్టు బిగుస్తూ వుంటే స్క్రూడ్రైవర్ బెసికి చేతిలో బలంగా దిగబడిపోయిందట'' మామూలుగా చెప్పింది అమ్మ.

''ఓఁ'' అమ్మకి ఈ విషయం తెలియదని అర్థమైంది.

జరిగినదంతా చెప్పి, సందీప్‌కీ నాకూ మధ్య అడ్డకిగా నిలబడ్డ వాళ్ళ పరిస్థితులన్నీ వివరించి అమ్మని సందేహంలో పడేయడం కరెక్టు కాదనిపించింది.

''తనూ నీకో విషయం చెప్పాలి. రంగారావు యిందాక సందీప్‌కీ, చిత్రకీ ఎంగేజ్‌మెంట్ జరగబోతుందని చెప్పారు. అందుకే ఖర్చులకోసమని, కొంత డబ్బు అప్పుగా అడిగారు. ఆయన్నే అడిగేద్దామనిపించింది కానీ ముందుగా నిన్ను అడిగి కన్‌ఫర్మ్ చేసుకుందామని ఆగాను. వాట్స్ గోయింగ్ ఆన్'' అడిగింది సీరియస్‌గా.

నేను ఏ విషయం దాచాలనుకున్నానో సరిగ్గా అదే అమ్మకి తెలిసిపోయింది. నిజానికి అమ్మ చెప్పిన విషయం నాకే నమ్మబుద్ధికాలేదు. కొద్దిరోజుల క్రితం అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకి ప్రయత్నించిన మనిషి నాలుగురోజులు తిరక్కముందే కొడుకు ఎంగేజ్‌మెంట్ కోసం, మళ్ళీ అప్పు చేస్తున్నాడు.

''తనూ! ఏం జరిగిందో చెప్పు'' పరధ్యానంగా వున్న నన్ను రెట్టించింది అమ్మ.

"ఏదో మిస్ అండర్‌స్టాండింగ్ జరిగింది. నేను సందీప్‌తో మాట్లాడి నీకు చెప్తాను. డోంట్ వర్రీ" అన్నాను అమ్మతో, ప్రశాంతంగా వున్నట్టు నటిస్తూ.

"తన్మయీ జాగ్రత్త" అమ్మ కళ్ళలో భయం కనిపించింది. "స్వప్న సంగతి చూశావుగా ఆలోచించి నిర్ణయం తీసుకో" హెచ్చరించింది.

"అలాగే" చెప్పి, నా గదిలోకి వెళ్ళాను.

గదిలోకి వెళ్ళి తలుపు మూస్తూనే చేతిలోని ఫోనూ, పర్సు మంచం మీదికి విసిరికొట్టాను.

లోపలినుంచి తెలియని అసహనం. రెండు చేతివేళ్ళని జుట్టులోకి జొనిపి ఆలోచిస్తూ మంచం మీద కూలబడ్డాను.

"నిరంజన్ విషయంలో నేను మాట్లాడినదానికి ప్రతీకారంగా యిదంతా చేస్తున్నాడా సందీప్?

లేకపోతే రంగారావుగారే డబ్బుకోసం అలా అబద్దం చెప్పారా? ఛ..ఛ ఆయన అబద్దాలు చెప్పరు. చిన్నప్పట్నుంచి అంకుల్ గురించి నాకు తెలుసు.

పోనీ సందీప్‌కే ఫోన్ చేసి అడిగేస్తే? ఏమని అడుగుతాను. చిత్రతో ఎంగేజ్‌మెంట్ వార్త నిజమే అయితే? 'చిత్రతో ఎంగేజ్‌మెంట్ మానేయ్. నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని వేడూకోవాలా? ఆ విషయం అతనికి తెలియదా? ఆలోచించి ఆలోచించి నా మెదడు వేడెక్కిపోయింది.

"సందీప్ వాళ్ళమ్మ బావిలో దూకుతాను, ఉరేసుకుని ఛస్తాను బెదిరించి ఒప్పించి వుంటుందా?" ఖచ్చితంతా అంతే. అదే నిజమని నా మనసు చెబుతుంది.

గోడౌన్ వెనకాల కొలను దగ్గర అపుడపుడూ నేను కూర్చునే బెంచీమీద కూర్చుని వున్నాను. కుంగుతున్న సూర్యుడు ఎర్రని కాంతితో పరిసరాలన్నీ ఆక్రమించేస్తున్నాడు.

ఎదురుగా కొలనులో నడుములోతు నీళ్ళలో నిలబడి సందీప్ నన్ను పిలుస్తున్నాడు. నేను గబగబా అతని అడుగులు వేయబోయాను. నా కాళ్ళ కింద అంతా చిక్కటి బురద. నా బలం అంతా ఉపయోగించినా, ఒక్క అంగుళం కూడా కదలలేకపోయాను.

"తన్మయీ..తన్మయీ" సందీప్ నన్ను పిలుస్తున్నాడు.

తలెత్తి అతనివైపు చూశాను.

కాస్సేపటి క్రితం నీళ్ళలో నిలబడివున్నట్టు కనిపించిన అతను చిక్కటి బురదలో కూరుకుని పోయి వున్నాడు.

"తనూ.. అటు వెళ్ళొద్దు. వచ్చెయ్. అది ఊబి" అని వెనకాలనుంచి అమ్మ, స్వప్న పిలవడం వినిపించింది.

నా మనసులో భయం పుట్టుకొచ్చింది. తెలియకుండానే ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

సందీప్‌ని చూశాను. అతను ఆరాటంగా నా వైపే చూస్తున్నాడు. ఇద్దరం కొద్ది దూరంలోనే వున్నా ఎప్పటికీ కలుసుకోలేనంత దూరంలో ఉన్నామనిపించింది. ఆతృతగా అతనికోసం పరిగెత్తుతున్న మనసుని ఎవరో గట్టిగా కళ్ళాలు వేసి వెనక్కి లాగుతున్న భావన.

"సందీప్" గుండె బద్దలయ్యేట్టు అరిచి బురదలో పడిపోయాను. ఎర్రటి సూర్యకాంతి నా కళ్ళలో పడి నా కన్నీళ్ళు కూడా ఎర్రగా మారాయి.

ఒకవైపు అతని దగ్గరకి వెళ్ళలేకపోతున్నానన్న బాధ, మరోవైపు బురదలో చిక్కుబడిపోయి ఏమీ చేయలేని నిస్సహాయత. రెండూ కలిసి ఏడుపు ముంచుకొచ్చింది.

వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టాను. నా మొహం అంతా కన్నీళ్ళతో తడిసిపోతూ వుంది. మరుక్షణంలోనే చిన్న ఉలికిపాటు. నా చెంపలకి మెత్తగా, వెచ్చగా తగులుతూవుందేదో.

అది.. దిండు. నేను మంచం మీదే పడుకుని వున్నాను అని అర్థమవుతూనే ఠక్కున లేచి కూర్చున్నాను.

ఇంకా నా గుండె దడదడలాడుతూనే వుంది. అది కల అని తెలిసినా కూడా నాలో అలజడి తగ్గలేదు.

"తనూ! కంగారు పడకు నీ మనసులో భయమే అలా కలలా కనిపించింది" అంతరాత్మ చెప్పింది.

ఒకసారి చెంపల్ని గట్టిగా చేతుల్తో రుద్దుకుని లేచి మంచినీళ్ళు తాగి పడుకున్నాను. ఎంతకీ నిద్రపట్టలేదు.

నెమ్మదిగా లేచి అమ్మ గదిలి వెళ్ళి చిన్నగా తలుపు తీసి చూశాను. నీలం రంగు బెడ్‌లాంప్ వెలుతురులో ప్రశాంతంగా నిద్రపోతూ కనిపించింది అమ్మ. అమ్మ మొహం చూస్తూనే మనసులో అలజడి తగ్గినట్టైంది. హాయిగా నిద్రపోతున్న మనిషిని లేపాలనిపించలేదు.

ఒక్క అడుగు వెనక్కి వేసి తలుపు దగ్గరికి లాగబోయాను.

"తనూ" నిద్ర విడీవిడనట్టుగా వున్న అమ్మ గొంతు మెత్తగా పలికింది. నేను గుమ్మం దగ్గరే నిలబడి వున్నాను.

"రా!" లేచి టేబుల్ లాంప్ ఆన్ చేస్తూ పిలిచింది అమ్మ.

నేను వెళ్ళి అమ్మ పక్కన కూర్చున్నాను.

గోడమీద గడియారం రెండుగంటలు చూపిస్తూ వుంది. అంత రాత్రివేళ అమ్మ దగ్గరికి అలా రావడాన్నిబట్టే నా మనసులో ఆందోళనని కనిపెట్టేసింది అమ్మ.

నెమ్మదిగా నా తలమీద చేయి వేసి "ఏంటి చెప్పు" అడిగింది లాలనగా. నా బాధని పంచుకోవడానికి ఆ రెండు మాటలు, ఆ చేతి స్పర్శ చాలనిపించింది. ఏమీ మాట్లాడకుండా అమం ఒళ్ళో తలపెట్టి పడుకున్నాను.

ఆ క్షణం నా బాధలన్నీ మరిచిపోయి మళ్ళీ చిన్నపిల్లనైపోయాను.

"సందీప్ ఎంగేజ్‌మెంట్ వార్త విని కలవరపడుతున్నావా?" నా జుట్టూ సవరిస్తూ అడిగింది.

నేను పలకలేదు. నా మనసుని గుచ్చి ఏడిపించే విషయాన్ని ప్రస్తావించడానికి నాకు ధైర్యం చాలలేదు.

"తనూ" అమ్మ రెట్టించింది.

అమ్మ పిలుపు నేను అణిచిపెట్టాలనుకుంటున్న ఆలోచనా తరంగాల్ని పైకి లాగాయి. అమ్మదగ్గర నేను ఏ విషయమూ దాచలేనని అర్థమైంది. మొత్తం ఉన్నదున్నట్టు వివరంగా చెప్పేశాను.

"పిచ్చిదానా" అంటూ అమ్మ నా తలమీద చెయ్యివేసి, చిన్నగా నవ్వింది.

"నువ్వు చాలా మంచిదానివి తనూ. నీవల్ల ఎవరు యిబ్బందులు పడుతున్నా భరించలేవు. నీ వల్ల సందీప్ సమస్యల్లో చిక్కుకుంటాడేమోనని నీ భయం. అతను సంతోషంగా వుంటేనే నువ్వూ సంతోషంగా వుండగలవు.

సందీప్ కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయి వున్నాడు. అతన్ని నువ్వు పెళ్ళి చేసుకుని సంతోషంగా ఉండగలవా? మీ పెళ్ళి వల్ల కలహాలు పెరుగుతాయేమో? లేకపోతే మీరిద్దరూ కలిసి ధైర్యంగా నిలబడి మీరు కోరుకున్న లైఫ్‌ని పొందగలరో ఆలోచించు.

నీ మనసు ఏం చెబుతుంది?"

నేను లేచి అమ్మ మొహంలోకి చూశాను. నా దగ్గర జవాబు లేదు. ఏ నిర్ణయమూ తీసుకునే ధైర్యమూ లేదు. అది నా మొహం మీద రాసినట్టు కనిపిస్తూనే వుంది.

"నేనొక మాట చెప్తాను" అంటూ అమ్మ నా భుజం మీద చెయ్యి వేసింది. "జీవితం చాలా పెద్దది తనూ. అది ఎక్కడా ఎవరికోసమూ ఆగిపోదు. ఆగిపోకూడదు.

ప్రేమకంటే ముందు జీవితానికి కావలసినవి చాలా వున్నాయి. అవన్నీ దక్కితేనే ప్రేమ మన కళ్ళకి కనిపిస్తుంది. నీకు ఆ యింట్లో గౌరవం, అభిమానం దొరుకుతాయని నమ్మకం వుంటేనే పెళ్ళి గురించి నిర్ణయం తీసుకో. నీకు నిర్ణయం తీసుకునే ధైర్యం లేకపోయినా నువ్వు కన్ఫ్యూజన్‌లో వున్నా కొన్నాళ్ళు వేచి చూడు.

జరిగే ఒక్కొక్క రోజు నిన్ను ఏదో ఒక దిక్కుకి నడిపిస్తూ వుంటుంది. అప్పుడు, నీ అంతట నువ్వే డెసిషన్ తీసుకోగలవు."

ఏం చేయాలో అర్ధంకాని స్థితిలో వున్న నాకు, అమ్మ మాటల్లో ఒకదారి దొరికినట్టైంది.

కొద్దిరోజులు వెయిట్ చేయడమే సరైన దారేమో. బహుశా సందీప్ కూడా అమ్మలానే ఆలోచిస్తున్నాడేమో? ఆ మాట అనుకోగానే నా మనసు శాంతించింది.

"థాంక్యూ అమ్మా" అంటూ అమ్మ మెడచుట్టూ చేతులు వేసి ముద్దుపెట్టాను.

"వెళ్ళి పడుకో" యిప్పటికే చాలా లేటయ్యింది" అమ్మ అంటుంటే అక్కడ్నుంచి కదిలాను.

"గీతోపదేశం అయ్యిందిగా ఇది నీ జన్మంతా గుర్తుపెట్టుకోవాలి. ఏంటి? సరేనా?" అంతరాత్మ మాట్లాడింది.

"సరే..సరే" అంటూ నా గదిలోకి వచ్చి మంచం మీద వాలిపోయాను.

సగం తీసి వున్న కిటికీ కర్టెన్‌లో నుంచి ఎండ నేరుగా వచ్చి నా మొహం మీద పడుతూ వుంది.

"అమ్మో టైం ఎంతైంది?" అనుకుంటూ కంగారుగా లేచి సెల్ చేతిలోకి తీసుకున్నాను. టైం తొమ్మిది గంటలు దాటింది.

వంట గదిలో నుంచి శబ్దాలు వినిపిస్తున్నాయప్పటికీ. రాజ్యంగారు వంట చేస్తున్నట్టున్నారు.

తీరిగ్గా లేచి, బాత్రూంకి వెళ్ళబోతుండగా.. "అమ్మాయిగారూ..అమ్మాయిగారూ" అంటూ రాజ్యంగారు వున్నట్టుండి కేకపెట్టింది. నేను తలుపు తీసుకుని బైటికి వచ్చాను.

"అమ్మగారు..అమ్మగారు"

"ఏంటి అమ్మగారు?" ఆదుర్దాగా అడిగాను.

"అమ్మగారికేదో అయ్యిందమ్మా. ఇంకా నిద్రలేవలేదేమని గదిలోకి వెళ్ళి చూశాను. అమం పిలిస్తే పలకడంలేదు" ఆయాసపడుతూ అందావిడ.

"రాత్రి లేటుగా పడుకున్నాం. నిద్రపోతూ వుండుంటుంది.

అయినా నీకు తలుపు ఎవరు తీశారు?" అడిగాను అనుమానంగా.

నా దగ్గర తాళం ఉంది కదమ్మా.ముందు నా మాట వినండి. అమ్మ ఎప్పుడూ ఆలస్యంగా లేవరు. అందులోనూ చిన్న అలికిడైనా చటుక్కున లేస్తుందమ్మ. అలాంటిది నేను ఎంత పిలిచినా పలకడంలేదు.

నాకు గాభరాగా వుంది వచ్చి చూడండి" అంది కంగారుపడిపోతూ. ఆవిడ మాటలు విన్నాక నాకూ భయమేసింది. గబగబా అమ్మ గదిలోకి వెళ్ళాను.

అమ్మ పక్కకి తిరిగి పడుకుని దిండుకి, తలకీ మధ్య చెయ్యిపెట్టుకుని పడుకుని వుంది.

"అమ్మా! అమ్మా" అంటూ భుజం తట్టాను. అమ్మ పలకడంలేదు. నా గుండె దడదడలాడింది. నాడి పట్టుకుని చూస్తే అందడంలేదు. వెంటనే అంబులెన్స్‌కి ఫోన్ చేశాను. రాజ్యంగారిని యింట్లో ఉండమని చెప్పి హడావుడిగా అమ్మని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళాను.

మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చిందనీ అప్పటికే ప్రాణంపోయి కొన్ని గంటలయ్యిందని చెప్పారు.

ఒక్కసారిగా నాకు తలతిరిగినట్లైంది. అది నిజమో పీడకలో తెలియని అయోమయ పరిస్థితిలోకి వెళ్ళిపోయాను. "అమ్మ ఇక లేదు" అనుకోగానే కాళ్ళూ చేతులు వణికాయి. శరీరం స్వాధీనం తప్పి దభీమని కుర్చీలో కూలబడ్డాను.

రాత్రి అమ్మతో మాట్లాడుతూ అమ్మ ఒళ్ళో తలపెట్టుకుని చిన్నపిల్లనైపోవడం వెచ్చటి అమ్మ చేతి స్పర్శ. ఆ అనుభూతులన్నీ మనసులో అలాగే వున్నాయి. ఇంతలోనే యిలా ఎలా జరిగింది.

మనసు పూర్తిగా 'డినయల్' మోడ్‌లోకి వెళ్ళిపోయింది.

అరచేతుల్లో మొహాన్ని దాచుకుని ఏడుస్తూ కూర్చున్నాను. అలా టైం ఎంత గడిచిపోయిందో తెలియదు. రంగారావు అంకుల్ ఎప్పుడు వచ్చారో ఆయనకి ఎవరు ఇన్‌ఫార్మ్ చేశారో తెలియదు. ఇంకా అమ్మని చూడడానికి ఎవరెవరో వచ్చారు. వాళ్ళెవ్వరూ నాకు తెలియదు. రంగారావుగారే హాస్పిటల్ ఫార్మాలిటీస్పూర్తిచేసి శవంగా మారిన అమ్మని యింటికి తెచ్చారు.

కబురు చెయ్యాల్సిన వాళ్ళెవరన్నా వున్నారామ్మా?" రంగారావు అంకుల్ అడిగారు.

"మీకు తెలియని వాళ్ళెవరూ లేరంకుల్" చెప్పాను.

"బంధువులెవరన్నా..."

"లేరు"

ఆయనింకేమీ అడగలేదు. అమ్మ ఆఫీసువాళ్ళు కొంతమంది వచ్చి చూసి వెళ్ళారు.

మాధవన్నయ్య, విశాలాంటీ, అంకుల్ వచ్చారు.

సందీప్‌తో పాటు సుమిత్రాదేవి కూడా వచ్చింది.

పురోహితుడిని పిలిపించారు. ఆచారం ప్రకారం ఏవేవో కార్యక్రమాలు చేస్తున్నారు. అమ్మకి వీటన్నింటిమీదా నమ్మకం లేదని నాకు తెలుసు.

అలాంటివి చేసినా చేయకపోయినా నేను స్పందించే పరిస్థితిలో లేను. అమ్మ నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయిందన్న శోకంతో నా మనసు నలిగిపోతూవుంది.

"అమ్మా మీ గోత్రం" అడిగారు.

"తెలియదు"

చుట్టూ వున్నవాళ్ళు నా వైపు విచిత్రంగా చూశారు.

"అందుకే అన్నారు 'కులం గోత్రం' పుట్టుపూర్వోత్రాలు ఉండాలీ అని. అయినా యిదేం విచిత్రం. ఒక్క చుట్టం పక్కం కూడా లేకుండా" ఎవరో ఒకావిడ అంటూ వుంది.

"నాకెవ్వరూ లేరు. అయితే దానికి నేనేం చెయ్యను" అని గట్టిగా అరవాలనిపించింది. అయినా మౌనంగా విని వూరుకున్నాను. నాకెవ్వరికీ జవాబు చెప్పే ఓపికలేదు. దారీ తెన్నూ తెలియనంతగా చీకటిలో చిక్కుకుపోయినట్టుంది నా అప్రిస్థితి.

రంగారావుగారు, సందీప్, మాధవన్నయ్య ఆ కార్యక్రమాలన్నీ చూసుకున్నారు. అంతా అయిపోయాక అందరూ వెళ్ళిపోయాక రంగారావుగారు నా దగ్గరికి వచ్చారు.

"అమ్మా దినకర్మలు చేయాలి" అంటూ ఏదో చెప్పబోతుంటే నేను అడ్డు తగిలాను.

"అవన్నీ వద్దండి. అమ్మకి అలాంటివాటి మీద నమ్మకం లేదు. అమ్మ పేరుతో ఏదైనా మంచిపనులు చేయడానికి డొనేషన్ యివ్వాలనుకుంటున్నాను.

ఓ యాభైవేలకి ఎన్ని 'గుడ్ డే' బిస్కట్ పాకెట్స్ కొని పంచండి. అమ్మకి అవంటే చాలా యిష్టం" అన్నాను బరువుగా.

రంగారావుగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఇక్కడ నువ్వు ఒంటరిగా ఎలా వుంటావమ్మా? కొద్దిరోజులు సుమిత్ర నీకు తోడుగా యిక్కడే వుంటుంది" అన్నాడాయన.

"సుమిత్రాదేవి ఆయనవంక చురుగ్గా చూసింది.

"అవసరం లేదంకుల్. రాజ్యంగారు నాకు తోడుంటారు. ఆవిడకి ఇది అలవాటైన యిల్లే" చెప్పి వారించాను.

"అబ్బే నువ్వేం మొహమాట పడక్కర్లేదమ్మా నీకు అవసరం అంటే నేను తోడుగా వుంటాను" సాగదీస్తూ అంది సుమిత్రాదేవి.

"ఫర్వాలేదండి. నేను మేనేజ్ చేసుకుంటాను" చెప్పి నీరసంగా సోఫాలో వాలిపోయాను.

రంగారావుగారు, సుమిత్రాదేవి వెళ్ళిపోయారు. వాళ్ళటు వెళ్ళిన రెండు నిముషాలకి సందీప్ లోపలికి వచ్చాడు. నేను సోఫాలో నుంచి లేవబోతుంటే గబుక్కున నా భుజం మీద చేయివేసి వారించాడు.

ఏమన్నా తిన్నావా?" అడిగాడు నా పక్కనే కూర్చుంటూ.

"ఊఁ" తలాడించాను.

అతను నేరుగా వంటగదిలోకి వెళ్ళి జ్యూస్ గ్లాసుతో తిరిగొచ్చాడు.

"నువ్వేం తినలేదని నాకు తెలుసు. కనీసం ఈ జ్యూస్ అన్నా తాగు" పక్కన కూర్చుని జ్యూస్ గ్లాస్‌ని నీటికి అందిస్తూ అన్నాడు. నేను సందీప్ కళ్ళలోకి చూశాను.

అతని చేతుల్లో వాలిపోయి నా గుండెల్లోని బరువు అంతా దిగిపోయేలా ఏడ్వాలనిపించింది ఆ క్షణంలో.

నన్ను నేను నిగ్రహించుకున్నాను.

మౌనంగా అతని చేతినుంచి జ్యూస్‌గ్లాస్‌ని అందుకున్నాను.

"తనూ" నెమ్మదిగా ఎంతో ఆప్యాయంగా పిలిచాడు సందీప్.

"నా వల్ల నువ్వు బాధపడి వుంటే అయామ్ సారీ. అవన్నీ మర్చిపో. డోంట్ థింక్ యూ ఆల్ ఎలోన్. నేనెప్పుడూ తోడుగా వుంటాను. మనం ఎప్పటికీ.." అతని మాటలు పూర్తికాకముందే గుమ్మంలో ఎవరో గొంతు సవరించిన శబ్దం వినిపించింది.

తక్కున తలతిప్పి చూశాం యిద్దరం.

సుమిత్రాదేవి తీక్షణంగా మా వైపే చూస్తూ నిలబడివుందక్కడ.

సందీప్ నాకు ఎంత దగ్గరగా కూర్చుని వున్నాడో తక్కున స్ఫురణకు వచ్చింది. వెంటనే అతనికి ఎడంగా జరిగాను.

"నీకోసం వెతుకుతున్నాను. నాన్న నీతో మాట్లాడాలట" మా యిద్దరిని మార్చి చూస్తూ, సందీప్‌తో అంది.

సందీప్ వెంటనే లేచాడు. సందీప్ వెంటనే లేచాడు. వెళ్ళబోయేముందు ఒకసారి నా వైపుకి తిరిగాడు.

"జాగ్రత్త!.. టేక్ కేర్" నా కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు.

నన్ను దగ్గరికి తీసుకుని ఓదారుస్తూ అతను చెప్పాలనుకున్న మాటల్లా అనిపించాయని.

సుమిత్రాదేవి మళ్ళీ ఓసారి నన్ను ఎగాదిగా చూసి, గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

రాత్రి ఏడుగంటలయ్యింది. చీకటి చిక్కనయ్యే కొద్దీ మనసులో నిర్లిప్తత ఆవరించుకుంటూ వుంది.

అమ్మ గది దాటుకుని వెళుతూ వుంటే లోపల అమ్మ పుస్తకం చదువుతూ కూర్చుందేమో? ఆఫీస్ ఫైల్స్ చూస్తుందేమో అన్నట్టే వుంది. వాస్తవం గుర్తుకి వస్తూనే మళ్ళీ మనసంతా శూన్యం.

అమ్మ చెప్పులు, ఆమె వాడే వస్తువులు చూసినప్పుడల్లా కళ్ళలో నీళ్ళు పొంగుకుని వస్తున్నాయి.

రాజ్యంగారి బలవంతం మీద రెండు ముద్దలు తిని, నా గదిలోకి వెళ్ళి పడుకున్నాను. కాస్సేపటికి తలుపు తడుతున్న చప్పుడైంది. కలలోనా, నిజంగానా అర్థం కాలేదు. మళ్ళీ శబ్దం వినిపించగానే లేచి లైట్ వేశాను. టైం పదిన్నర అయ్యింది.

బైట వాన చినుకులు ప్రారంభమయ్యాయి. గాలికి కర్టెన్లు ఊగుతున్నాయి. "ఇంకోసారి తలుపు తడితే రాజ్యంగారు లేస్తారేమో? ఆవిడా బాగా అలిసిపోయింది" అనుకుంటూ హాల్లోకి వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా సందీప్ నిలబడి వున్నాడు.

"ఈ టైంలో వచ్చావు. ఏదన్నా అర్జంట్ పని వుందా?" అడిగాను ఆశ్చర్యంగా. అతను లోపలికి ఒక అడుగు వేసి నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఐ కుడున్ట్ స్లీప్. కళ్ళు మూసుకుంటే నువ్వే గుర్తొస్తున్నావు. ఒంటరిగా ఎలా వున్నావా అని టెన్షన్ పడుతున్నాను. అందుకే వచ్చాను" చెప్పాడు మెల్లగా.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు నాకు.

"థాంక్యూ" అన్నాను కూడదీసుకుని.

ఆ రోజు మధ్యాహ్నం సుమిత్రాదేవి చురుక్కుమనే చూపులు గుర్తొచ్చాయి. కానీ ఈ టైంలో నువ్విక్కడ.. ప్లీజ్ వెళ్ళు" తడబడుతూ అన్నాను.

అతను ఒకసారి నా కళ్ళలోకి చూశాడు. అక్కడనుంచి కదలడం యిష్టంలేనట్టు, స్పష్టంగా కనిపిస్తూ వుంది అతని మొహంలో. నేను వెనక్కి తిరిగి తలుపు తీసేసరికి వాన జోరందుకుంది.

క్షణాల్లో ఉధృతంగా మారిన వానని చూసి అతనికి ఏం చెప్పాలో తెలియలేదు నాకు. సందీప్ కనుబొమలు పైకెత్తుతూ బైట కురుస్తున్న వానవైపు చూశాడు.

"ఓకే! గెట్ యిన్"

నేనంటూనే నా వెనకాలగా వచ్చాడతను.

"ఈ బ్లాంకెట్స్ తీసుకుని సోఫాలో పడుకో" చెప్పి సోఫా మీద దుప్పట్లు పెట్టి నా గదిలోకి నడిచాను.

నిజానికి సందీప్ రాక నాకెంతో హాయిగా అనిపించింది. అతడున్నాడన్న ధైర్యంతో ఆదమరిచి నిద్రపోయాను.

తెల్లవారి కళ్ళు విప్పేసరికి ఎదురుగా వార్డ్‌రోబ్ హాండిల్‌కి బ్లాక్ కలర్ టీషర్ట్ వేల్లాడుతూ కనిపించింది.

అనుమానంగా గుమ్మం వైపుకి చూస్తూనే ఒంటిమీద షర్ట్ లేకుండా నా గదిలోకి వచ్చాడు సందీప్.

"సారీ రాత్రి నీ వాష్ రూం యూజ్ చేశాను. నా షర్ట్ తడిస్తే యిక్కడ తగిలించాను" అంటూ టీ షర్ట్ అందుకున్నాడు.

"ఓ.కే" అంటూ, కండలు తిరిగిన అతని భుజాల్ని చూస్తూనే గబుక్కున కళ్ళు దించుకున్నాను.

ఓ పది నిముషాల్లో యిద్దరం ఫ్రెష్ అయి హాల్లోకి వచ్చాం, అప్పటికే, కాఫీ కలిపి నాకోసం ఎదురు చూస్తున్న రాజ్యంగారు, నాతోబాటు సందీప్‌ని చూస్తూనే ఆశ్చర్యపోయింది.

"సందీప్ రాత్రి నాకోసం వచ్చాడు" క్లుప్తంగా చెప్పాను. ఆవిడ అర్థం చేసుకున్నట్టుగా ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చేసింది.

"నేను బయలుదేరతాను" చెప్పి గుమ్మం వైపుకి కదిలాడు సందీప్. నేనూ అతని వెనకాలే వెళ్ళాను.

డోర్ హేండిల్ మీద చెయ్యి వేసి ఏదో ఆలోచించినట్టుగా మళ్ళీ వెనక్కి తిరిగాడతను.

అతని రెండు చేతులతో నా భుజాల్ని పట్టుకుని "నేను మధ్యాహ్నం మూడింటికి వస్తాను. టేక్ కేర్" అంటూ ముందుకి వంగి నా నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

"ఇదంతా కలా? నిజమా? " నా జీవితంలో అమ్మలేని లోటుని అతను భర్తీ చేస్తున్నాడా?

అతన్నలా గుమ్మం దగ్గర సాగనంపుతూ వుంటే అదేం కొత్తగా అనిపించలేదు నాకు. ఎన్నో సంవత్సరాల నుంచి మేము కలిసి ఉన్నామనే భావనే కలిగింది నాలో.

అన్నట్టుగానే సరిగ్గా మూడింటికల్లా వచ్చాడతను. నాకు తెలియకుండానే, అతనికోసం ఎదురు చూస్తున్నానని అతనొచ్చాక అర్థమైంది నాకు.

అతను వస్తూనే టీ కలిపి తెచ్చాను. ఇద్దరం సోఫాలో కూర్చుని టీ తాగుతూ వున్నాం.

సందీప్ ఆఫీసు విషయాలూ తుఫాన్ వల్ల వెంకట్ చెన్నైలో యిరుక్కుపోయిన సంగతి చెబుతూ వున్నాడు.

ఖాళీ కప్పుని టీపాయ్ మీద పడేసి, అతని మాటలకి "ఊ" కొడుతూ వున్నాను. అవి వింటూ వుండగానే నిద్ర ముంచుకొచ్చేసింది.

అలా ఎంతసేపు నిద్రపోయానో నా నుదుటిమీద ఏదో కదిలినట్టవడంతో మెలుకువ వచ్చింది.

స్పృహలోకి వస్తూనే నా పరిస్థితి అర్థమైంది నాకు. నా తల అతని ఛాతీ మీద వుంది.

నా భూజాన్ని పూర్తిగా చుట్టేసి వుంది. అతని చేయి నేను అతని శరీరం మీదకి వాలిపోయి అతనిలో పూర్తిగా ఒదిగిపోయి వున్నాను.

ఇంతలో నా నుదుటిమీద అతని చేతివేళ్ళ స్పర్శ తెలిసింది. నా మొహం మీదకి వాలిన జుట్టుని సరిచేస్తూ వున్నాడతను.

"తనూ.. కదలకు.. లేదంటే ఈ క్షణం నీ చేతుల్లో నుంచి జారిపోతుంది" అంతరాత్మ సలహా యిచ్చింది.

వెచ్చగా, అతని చేతుల్లో ఒదిగి, ఆ క్షణాలన్నీ మనసులో పదిలంగా దాచుకున్నాను.

ఆ తర్వాత అలాంటి క్షణాలు మరెన్నో, నా అనుభవంలోకి వచ్చాయి. దాదాపు వారం రోజులపాటు, రోజూ ఏదో ఒక టైంలో సందీప్ మా యింటికి వస్తూనే వున్నాడు.

ఇద్దరం సోఫాలో గువ్వల్లా ఒకరి చేతుల్లో ఒకరం ఒదిగిపోయి కబుర్లు చెప్పుకునేవాళ్ళం.

ఒక్కోసారి రాత్రి పదిగంటలప్పుడు వచ్చేవాడు సందీప్. 'ఆకలిగా వుంది' అంటే వంటింట్లో యిద్దరం కలిసి వంట చేసేవాళ్ళం.

ఆఫీసు పనుల్తో చికాకు పడిపోయి వచ్చిన రోజు నా ఒళ్ళో తలపెట్టుకుని పడుకునేవాడు.

ఆ వారం రోజుల్లోనే అతను నాకు మరింత దగ్గరయ్యాడు

అమ్మ దూరమయ్యాక ఏర్పడిన శూన్యం అతని ఉనికితో భర్తీ అవుతూ వుంది.

"వస్తున్నా"

సాయంత్రం ఐదు గంటలప్పుడు కాలింగ్ బెల్ మోగింది.

"సం...దీ..ప్" అంటూ తలుపు తీసిన నేను ఎదురుగా స్వప్న వాళ్ళమ్మ విశాలాంటిని చూసి మాటలు సగంలోనే మింగేశాను.

"రండి ఆంటీ" పక్కకి తొలిగి పిలిచాను.

ఆంటీ, టీ తాగి కాస్సేపు కూర్చున్నారు. నా గురించిన వివరాలు అడిగారు.

రంగారావ్‌గారు అమ్మకి ఆఫీసు నుంచి రావలసిన ప్రావిడెంట్ ఫండ్ తాలుకు కాగితాలన్నీ తెచ్చి యిచ్చారని చెప్పాను.

అమ్మ డెత్ సర్టిఫికెట్ మొదలుకుని యితరత్రా పేపర్‌వర్క్ అంతా రంగారావుగారే చూసుకుంటున్నారు.

"నీకేదైనా హెల్ప్ కావాలంటే, మాధవ్‌ని అడుగు అని చెప్పి సోఫాలో నుంచి లేచిందావిడ.

గుమ్మం దగ్గరికి వెళ్ళాక మళ్ళీ ఒకసారి వెనక్కి తిరిగింది. ఆవిడ పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపించారు.

"ఆంటీ మీరేదో చెప్పాలనుకుంటున్నట్టున్నారు. ప్లీజ్ చెప్పండి" అన్నాను.

విశాలాంటి ఒకసారి నన్ను చూసి నిట్టూర్చింది.

"తనూ నువ్వూ మా స్వప్నలాంటిదానివే నాకు. అందుకే చనువుతీసుకుని చెబుతున్నాను. సందీప్ మీ యింటికి తరచూ వచ్చి వెళుతున్నాడని అందరూ చెప్పుకుంటున్నారు. ఊళ్ళో వాళ్ళు ఏదో అంటున్నారని కాదు నా భయం. నువ్వు ఎలాంటి ఊబిలో దిగబడిపోతున్నావో అని కంగారుగా వుంది నాకు.

స్వప్న సంగతి చూశావుగా. యిప్పుడిప్పుడే అది కోలుకుంటూ వుంది. నీకూ, సందీప్‌కీ మధ్య ఏదైనా వుంటే, పెద్దవాళ్ళుగా మేం మాట్లాడి నీ పెళ్ళి చేస్తాం కానీ నువ్వుమాత్రం మా స్వప్నలా తొందరపడి నీ జీవితం పాడుచేసుకోకు"

స్వప్నని గుర్తు చేసుకుంటూ ఆవిడ కన్నీళ్ళు పెట్టుకుంది.

"అయామ్ సారీ ఆంటీ" గబుక్కున ఆవిడ చేతుల్ని పట్టుకున్నాను.

"మీరు చెప్పింది గుర్తుపెట్టుకుంటాను" అన్నాను తలవంచుకుంటూ.

ఆంటీ వెళ్ళిపోతూనే రంగారావుగారు వచ్చారు.

"అమ్మ పేరుతో బ్యాంక్‌లో లాకర్ వుంది. ఇవాళ బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడాను. రేపొకసారి నువ్వు వస్తే, లాకర్ ఓపెన్ చేసి బాంక్‌కి హేండోవర్ చేయాలి.

వెంటనే, నీ పేరుతో యింకో లాకర్ కూడా, అక్కడే ఓపెన్ చేద్దాం." చెప్పారాయన.

ఆయన కళ్ళలో బాధ, అమ్మమీద అభిమానం స్పష్టంగా కనిపించింది నాకు.

ఈయన కేవలం 'అమ్మ ఆయన పైన పనిచేసే ఆఫీసరు' అని మాత్రమే అనుకుంటే, యిప్పుడు నాకోసం మా యింటిచుట్టూ తిరగవలసిన పనేమీలేదు. ఆయన చేసే ప్రతిపనిలో నాకు నిజాయితీ కనిపిస్తూవుంది. బహుశా, అమ్మకి ఎవరైనా అన్నదమ్ములు ఉండివున్నా యింతలా సపోర్ట్ చేసేవారు కాదేమో.

నా మనసు ఆలోచనపొరల్లో కూరుకుపోయి వుండగానే ఆయన వస్తానంటూ లేచి వెళ్ళారు.

మర్నాడు పదిగంటలకల్లా రంగారావుగారు చెప్పినట్టు బ్యాంక్‌కి వెళ్ళాం. ఫార్మాలిటీస్ పూర్తయ్యాక, లాకర్‌లో ఉన్న నగలూ, డాక్యుమెంట్స్‌ని నాతో పాటు యింటికి తెచ్చాను.

వాటిని ఒక్కొక్కటే తీసి చూస్తుంటే అందులో ఒక పొడవాటి బ్రౌన్ కలర్ కవర్ కనిపించింది. దానిమీద నా పేరు రాసి వుంది. ఆ హేండ్ రైటింగ్ అమ్మది.

"ఏంటా?" అని ఆశ్చర్యంగా తెరిచి చూడబోతుండగా, కాలింగ్‌బెల్ మోగింది. గది తలుపు దగ్గరికి వేసి వచ్చి తలుపు తీశాను.

"హలో...తన్మయి"

నిరంజన్ పలకరించాడు.

"అయామ్ సారీ మీ అమ్మగారి గురించి తెలిసింది. పూనే నుంచి నిన్ననే వచ్చాను. ఎప్పుడెప్పుడు నిను చూద్దామా అని అనుకుంటూనే వున్నాను నిన్నటినుంచి" అన్నాడు కళ్ళకి పెట్టిన కూలింగ్ గ్లాసెస్ తీస్తూ.

"లోపలికి రా" దారి యిచ్చానతనికి.

నిరంజన్ వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

ఓ అరగంటసేపు మాట్లాడాడు నాతో. నేరుగా వత్తిడి చేయలేదు కానీ అతనితో పెళ్ళి గురించి ఓ నిర్ణయానికి రమ్మని అతని మాటల సారాంశం నిరంజన్‌ని వెళ్ళమనలేక అతని మాటలు వినలేక యిబ్బందిపడిపోయాను. సరిగ్గా అప్పుడే నా ఫోన్ రింగయ్యింది.

"సారీ! ఐ హావ్ టూ టేక్ దిస్ కాల్" నేను చెప్పిన తర్వాత తప్పని సరై లేచి వెళ్ళాడు.

ఫోన్ మాట్లాడి, సెల్ పక్కన పడేస్తూనే మళ్ళీ కాలింగ్ బెల్ మోగింది. సందీప్ వచ్చాడు.

"నిరంజన్ వచ్చినట్టున్నాడు" కనుబొమలు ముడుస్తూ, గుమ్మలో నిలుచునే అడిగాడు.

"అవును. పరామర్శించడానికి వచ్చాడంతే"

"అలాగా" అంటూ అతను లోపలికి రాబోయాడు. నేను ఠక్కున ఒక అడుగు ముందుకు వేసి అతనికి అడ్డంగా నిలబడ్డాను.

"సందీప్" అని ఆగిపోయాను.

"ఏంటి? "

"థాంక్యూ నాకు కష్టం వచ్చినప్పుడు నువ్వు తోడుగా వున్నావు. కానీ దిసీజ్ నాట్ రైట్. దయచేసి నువ్వు యింటికి రావద్దు. త్వరలో నేను ఆఫీసుకి వస్తాను. ఏ విషయాలైనా అక్కడే మాట్లాడుకుందాం" చెప్పేశాను. నిజానికి ఆ మాటలు

పలకడానికి నా మనసు ఎదురుతిరుగుతూ వుంది. కానీ విశాలాంటీ రంగారావుగారూ నా కళ్ళముందు మెదిలారు. అందుకే ధైర్యం చేసి చెప్పాను.

నేనలా అంటానని అతను ఊహించలేదు. ఒక్క క్షణం పాటు నిరాశ అతని కళ్ళలో మెదిలి మాయమైపోయింది.

"ఇదంతా, నిరంజన్ వచ్చి వెళ్ళినందువల్లా?" కోపంగా అడిగాడు. నాకూ ఛరున కోపం వచ్చింది.

"చాలా చీప్‌గా ఆలోచించావు. నువ్విలా అంటావని అస్సలు అనుకోలేదు. నీకు చెప్పాల్సింది చెప్పాను. ఇక నువ్వు వెళ్ళొచ్చు" అనేసి కోపంగా అతని మొహం మీదే తలుపేశాను.

"తనూ అతను డిసప్పాయింట్‌మెంట్‌లో అలా అన్నాడు. అసలే నిరంజన్‌కీ అతనికీ పడదు. దానికితోడు నిరంజన్ పెళ్ళి ప్రపోజల్ కూడా తెచ్చాడు. అపార్థం చేసుకోవడం, సహజమే. అందులో ఆశ్చర్యమేమీలేదు. నువ్వు నెమ్మదిగా చెప్పుండాల్సింది. తొందరపడ్డావ్" అంతరాత్మ గోలపెట్టింది.

"తప్పు చేశానా?" అనుకుంటూ బ్రౌన్ కవర్‌ని చేతిలోకి తీసుకున్నాను.

దాన్లో, మధ్యకి మడిచిపెట్టిన స్టాంపు కాగితాల గుత్తి కనిపించింది. దానితో బాటు ఒక లెటర్ కూడా వుంది.

ఆ స్టాంపు కాగితాల్ని తీసి, నాలుగులైన్లు చదివాక, అది అమ్మ రాసిన 'విల్ ' అని అర్థమైంది.

దాన్ని, పక్కన పెట్టి, లెటర్‌ని చేతిలోకి తీసుకున్నాను. అమ్మ నాకు రాసిన ఉత్తరమది.

అమ్మ చేతిరాత చూడగానే, నా కళ్ళు చెమ్మగిల్లాయి ప్రియమైన తనూ..

నీకు నా నోటితో చెప్పని కొన్ని విషయాల్ని ఈ లెటర్‌లో వ్రాస్తున్నాను. మీ నాన్న గురించి నీకు చెప్పాను. మీ నాన్న మళ్ళీ మనవైపు తిరిగి చూడలేదని అబద్ధం చెప్పాను.

నువ్వు ఇంటర్మీడియట్ చదివేటప్పుడు, ఒకసారి మీ నాన్న నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. పొరపాటు చేశాననీ తన తప్పులన్నింటినీ క్షమించమనీ వేడుకున్నాడు. మళ్ళీ తిరిగి, కలిసి జీవితం ప్రారంభిద్దామని ప్రాధేయపడ్డాడు.

కానీ నిజం ఏమిటంటే మీ నాన్ననీ, మీ నాన్న రెండవ భార్యనీ, ఆమె పిల్లల్నీ నేను పోషించాలి. ఆ ఉద్దేశ్యంతోనే ఆయన వచ్చాడని నాకు తెలిసింది.

కానీ నేను మళ్ళీ మీ నాన్న మొహం చూడలేనని చెప్పేశాను. కనీసం, యిప్పుడున్న కుటుంబంతో అన్నా బాధ్యతగా ఉండమని సలహా మాత్రం యిచ్చానంతే.

ఈ రహస్యం నాకూ రంగారావుగారికీ మాత్రమే తెలుసు. రంగారావుగారు నిజంగా మనకి ఆత్మబంధువు. నాకు తోడబుట్టిన వాళ్ళెవరైనా ఉన్నా ఆయనలాగా నా కోసం నిలబడరు.

మనకి తెలిసీ రంగారావుగారి కుటుంబంలో కొన్ని సమస్యలకు మనం కారణం అయ్యాం. ఆయన సమయాన్నీ, ఎనర్జీనీ మన కోసంకేటాయించేలా చేశాం. మీ నాన్నపట్ల మనకి ఏ బాధ్యతా లేదు. కానీ రంగారావుగారి పట్ల మనకి బాధ్యత వుంది.

ఇది నువ్వు కూడా గుర్తుపెట్టుకోవాలని నా కోరిక.

ఆయని సంతోషపెట్టలేకపోయినా ఆయన బాధలకి మనం కారణం కాకూడదు. ఇది నేను నా జీవితంలో చెయ్యలేకపోయాను.

పెద్ద వయసులో అయినా ఆయనకి శాంతి, విశ్రాంతీ దొరకాలని నా ఆశ.

నేను నా జీవితకాలంలో సంపాదించినదంతా నీ పేరున పెట్టాను. ముందు మన చుట్టూ ఉండేవాళ్ళని సంతోషంగా ఉండేట్టు చూసుకోగలగాలి మనం. ఆ తర్వాతే దానధర్మాలు. ఇది నేను నమ్మిన సిద్ధాంతం.

రాజ్యంగారి అమ్మాయి చదువుకి మనం చేసే సాయం ఆగిపోకుండా చూడు.

నేను ఒంటరిగా జీవితాన్ని లాగాను. అదెంత కష్టమో నాకు తెలుసు. అమ్మ చేతిరాత చూడగానే, నా కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ కష్టం రాకూడదని కోరుకుంటున్నాను. సందీప్‌ని కావచ్చు మరెవరైనా కావచ్చు. నువ్వు పెళ్ళి చేసుకోవాలి. ఒక మంచి కుటుంబాన్ని ఏర్పరుచుకోవాలి

ప్రేమతో

అమ్మ.

ఉత్తరం చదువుతూనే మనసంతా భారంగా అయ్యింది. సరిగ్గా వారం క్రితం రాసిన ఉత్తరం అది. ఇంతలోనే అమ్మకి యిలా జరిగింది.

అమ్మ రాసిన వీలునామా తీసి చూశాను. అమ్మ పేరుతో ఉన్న స్థిరచరాస్తులన్నింటినీ సర్వహక్కులతో నాకు అప్పగించినట్టు రాసి వుంది.

అమ్మ ఎల్.ఐ.సి డబ్బులు, ప్రావిడెంట్‌ఫండ్ డబ్బులు అన్నీ చేతికి వచ్చేవరకు రంగారావుగారు నన్ను వెంటబెట్టుకుని అన్ని ఆఫీసులకీ తీసుకెళ్ళారు. వాటితోబాటూ అమ్మ స్టాక్ మార్కెట్‌లో పెట్టిన డబ్బుకూడా నా పేరుతో ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

ఒకరోజు సాయంత్రం రంగారావుగారు యింటికి వచ్చారు.

"అమ్మా నీకు రావల్సిన డబ్బు అంతా వచ్చేసింది. జాగ్రత్త చేసుకో. ఎవ్వరికీ నీ ఫైనాన్షియల్ వ్యవహారాలు తెలియనియ్యకు.

నీకు యిక మీదట కూడా ఏ సహాయం కావాలన్నా నన్ను అడగొచ్చు. ఇది సమయం కాదు కానీ త్వరలో నువ్వు పెళ్ళి చేసుకుంటే బావుంటుంది. నీకూ సపోర్టుగా వుంటుంది" చెప్పాడాయన.

ఆయన మాటలు విన్న తర్వాత, చాలా గిల్టీగా అనిపించింది నాకు. ఆయన కన్నకూతురిలాగా నా గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు. నేను సందీప్ విషయం ఆయన దగ్గర దాచాను. విశాలాంటీ చెప్పినట్టు, సందీప్ మా యింట్లో ఒంటరిగా నాతో గడపడం అందరి దృష్టిలో అనుమానించతగ్గ విషయమైతే అది రంగారావుగారికీ అవమానమే కదా.

"వస్తానమ్మా! ఇంకేదన్నా పనివుంటే చెప్పు నాకు" అంటూ సోఫాలో నుంచి లేచాడాయన.

నేను ఆయన మొహం వైపు మొదటిసారి పరిశీలనగా చూశాను. బాగా అలసిపోయినట్టుగా వుంది ఆయన మొహం. ఆయన నుదుటి మీద మడతలు ఆయన జీవితంలో చూసిన ఎత్తుపల్లాల్లా వున్నాయి. జేబులో నుంచి కర్చీఫ్‌ని తీసి, నుదుటిమీద చెమటల్ని తుడుచుకుంటూ వెనక్కి తిరిగాడు.

ఆయన్నలా చూస్తుంటే నా  మనసుపొరల్లో ఎక్కడో కలుక్కుమంది.

ఆయన్నలా చూస్తుంటే నా మనసుపొరల్లో ఎక్కడో కలుక్కుమంది. ఆయనలా వెళుతూనే సందీప్ నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్ తీయకుండా స్క్రీన్ వంకే చుస్తూ కూర్చున్నాను. "అసలు నేనేం చేస్తున్నాను. సందీప్‌కీ, చిత్రకీ ఎంగేజ్‌మెంట్ అని అమ్మ చెప్పింది. నిజంగా చిత్రతో ఎంగేజ్‌మెంట్ జరిగితే నాకూ, సందీప్‌కీ మధ్య ఉన్న రిలేషన్‌ని ఏమని అనాలి? ఇంకా, ఎన్నాళ్ళు నన్ను నేను మోసం చేసుకుంటూ వుంటాను? ఈ విషయం ఎలా అయినా తేల్చేయాలి" గట్టిగా అనుకున్నాను.

అనుకున్నదే తడువు ఫోన్ ఎత్తాను. "ఒక అరగంటలో వచ్చేయి. నేను వెయిట్ చేస్తూ వుంటాను" చెప్పి ఫోన్ పెట్టేశాను.

రాజ్యంగారు ఫ్లాస్కులో పోసి వుంచిన టీ తాగి, షవర్ చేసి వచ్చాను. వదులుగా వుండే తెల్లని చుడీదార్ వేసుకుని జుట్టుని పైకి మడిచి క్లిప్ పెట్టుకుంటూ అద్దంలో చూసుకున్నాను.

నా ఆలోచనల్ని ప్రతిబింబిస్తున్నట్టుంది నా మొహం. మనసులో సుడులు తిరుగుతున్న భయాలన్నీ నా కనుపాపల్లో కనిపించాయి.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది.

ఒకసారి నిటారుగా నిలబడి అద్దంలో నన్ను నేను చూసుకుని డోర్ దగ్గరికి నడిచాను.

తలుపు తీస్తూనే ఎదురుగా నిరంజన్ కనిపించాడు.

"నువ్వు ఈ టైంలో" ఆశ్చర్యంగా అడిగాను.

"నన్ను ఎక్స్‌పెక్ట్ చేస్తున్నట్టు లేవు నువ్వు" అంటూ అతని చేతిలోని తెల్లగులాబీల బొకేని నాకందిస్తూ వున్నాను. పర్లేదు రా" సందేహిస్తూనే లోపలికి పిలిచాను.

"నిరంజన్ ఉద్దేశ్యం ఏమిటో ఎందుకు వచ్చాడో రహస్యమేమీ కాదు. కానీ అతనిలా తిరగడం కరెక్ట్ కాదేమో" అంతరాత్మ చెప్పింది.

"కాఫీ...టీ... ఏం తీసుకుంటావు?" అడిగాను.

"ఏం వద్దు"

నేను చేతిలోని బొకేని టీపాయ్ మీద పెట్టి కూర్చున్నాను.

"నిరంజన్ నిన్ను ఏవో ఊహల్లో ఉంచడం నాకు యిష్టంలేదు. నిన్న ఈ విషయంగా మీ అమ్మగారు కూడా ఫోన్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెళ్ళి గురించి ఆలోచించే స్థితిలో లేను నేను. నీకు మంచి లైఫ్ పార్టనర్ దొరుకుతుంది. ఈ సంగతి నేనే నీకు ఫోన్ చేసి చెప్పాలనుకున్నాను. ఈలోగా నువ్వే వచ్చావు" సూటిగా చెప్పేశాను.

నిరంజన్ సోఫాలో నుంచి లేచాడు.

"ఐ యామ్ సారీ. నువ్వున్న సిట్యుయేషన్‌లో పెళ్ళి ప్రసక్తి తేవడం నాదే తప్పు. నువ్వు ఆలోచించగలిగే పరిస్థితిలో లేవు. నేను యివాళ రాత్రి ఫ్లైట్‌కి పూనే వెళ్ళిపోతున్నాను. ఒక నెల తర్వాత మళ్ళీ వస్తాను. అప్పుడు నువ్వే నిర్ణయం తీసుకున్నా ఓ.కే" అన్నాడు స్థిరంగా. నేను నీరసంగా నిట్టూర్చాను.

"అలాగే" అన్నాను పొడిగా అతని మనసుని తుంచివేయడం యిష్టంలేక ఏదో ఆలోచిస్తున్నట్టు నెమ్మదిగా అడుగులు వేస్తూ బైటికి నడిచాడు నిరంజన్.

నేను తలుపు వేసి, వంటగదిలోకి వెళ్ళి జగ్‌లో నుంచి మంచి నీళ్ళు వంపుకుని తాగాను. "సందీప్‌తో ఏం మాట్లాడాలి?" అన్నదాని మీదే నా మనసు ఆగిపోయింది.

ఇంతలో 'ధన్' మంటూ తలుపు దగ్గర చప్పుడైంది.

ఆ వెంటనే పెద్దగా అరుపులు వినిపించాయి.

గభాల్న వెళ్ళి తలుపు తీశాను.

అక్కడ కనిపించిన దృశ్యం చూసి నాకు కళ్ళు తిరిగాయి. సందీప్, నిరంజన్ ఒకరి కాలర్ మరొకరి చేతుల్లో పట్టుకుని తోసుకుంటున్నారు. చూస్తూ ఉండగానే సందీప్ నిరంజన్ చేతుల్ని విడిపించుకుని, అతన్ని ఒక్కతోపుతోశాడు.

నిరంజన్ వెళ్ళి గేటుమీద పడ్డాడు. అతని పెదవి చిట్లి రక్తం కారుతూవుంది. అప్పటికే యిరుగుపొరుగు వాళ్ళు కిటికీల్లోంచి, బాల్కనీల్లోంచి చోద్యం చూస్తూ వున్నారు.

నేను పరుగున యిద్దరి మధ్యలోకి వెళ్ళాను.

సందీప్ కోపంతో బుసలు కొడుతున్నాడు. అతని దగ్గరికి వెళ్ళి, చెయ్యిపట్టుకుని లేవదీయబోయాను.

**వెంటనే,** నిరంజన్ వైపుకి తిరిగాను. అతని దగ్గరకి వెళ్ళి, చెయ్యిపట్టుకుని లేవదీయబోయాను.

సందీప్ వెంటనే వచ్చి నన్ను బలంగా పట్టుకుని పక్కకి లాగి నిరంజన్‌కి చెయ్యి యిచ్చి పైకి లేపాడు.

''మళ్ళా యిటువైపుకి కనిపించకు ''జాగ్రత్త'' బెదిరించాడు నిరంజన్‌ని.

నిరంజన్ చిట్లిన పెదవి నుంచి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ నావైపు కోపంగా చూశాడు.

ఆ చూపుకి నాకు భూమిలోకి దిగబడిపోవాలన్నంత అవమానంగా తోచింది. ''నిరంజన్.. అయామ్ సారీ''

నా మాటలు పూర్తికాకముందే, నా చెయ్యి పట్టుకుని లాగి నాకు అడ్డంగా నిలబడ్డాడు సందీప్.

''ఇక వెళ్ళు'' అన్నాడు నిరంజన్‌తో విసురుగా.

సందీప్ చర్యలకి నాకు పీకలదాకా కోపం వచ్చింది.

బైట నిలబడి, ఈ గొడవంతా చూస్తున్నవాళ్ళకి మరింత వినోదం కల్పించడం యిష్టంలేక, గబుక్కున లోపలికి వెళ్ళి తలుపేసుకున్నాను.

''తనూ! తలుపు తియ్. '' తలుపు మీద కొడుతున్నాడు సందీప్.

''ఒక్కసారి నా మాట విను ప్లీజ్''

నేను అతన్ని పట్టించుకోకుండా ఉండాలని ఎంత ప్రయత్నించినా నా వల్ల కాలేదు అతను తలుపు తడుతూనే వున్నాడు.

గబగబా వెళ్ళి, కోపంగా తలుపు తీశాను.

నేను తలుపు తీసిందే తడవుగా, అతను మెరుపులా లోనికి వచ్చి డోర్ లాక్ చేశాడు.

"ఏంటీ తమాషా?" కోపంగా అడిగాను.

"తనూ డోన్ట్ యూ నో వాడెలాంటివాడో నీకు తెలియదా? పైకి మెత్తగా కనిపించే పాము వాడు. అయినా వాడిని ఎందుకు ఎంటర్‌టెయిన్ చేస్తున్నావు నువ్వు?" అంతే కోపంగా అరిచాడు అతను కూడా.

నాకు ఒళ్ళు మండింది.

"నీకూ నిరంజన్‌కీ పడనంత మాత్రాన. నేను అతనితో మాట్లాడకూడదనడానికి నువ్వెవరు?

"తనూ! వాడు పైకి కనిపించినంత మంచివాడు కాదు. మన కాలేజ్‌లో లత అనే అమ్మాయి సూసైడ్ చేసుకుని చచ్చిపోయింది గుర్తుందా? అది వీడూ.. వీడి ఫ్రెండ్స్ వల్లే" నన్ను కన్విన్స్ చేస్తూ అన్నాడు.

అతని మాటలు విని షాకయ్యాను నేను. లత సూసైడ్ అప్పట్లో పెద్ద దుమారం అయ్యింది. కానీ ఆ కేసు బైటికి రాలేదు. లత పేరెంట్స్ యిష్టపడకపోవడంతో కేసు మూసేసారు. దాని వెనకాల నిరంజన్ వున్నాడా? తలచుకుంటేనే నాకు భయమేసింది.

నా ఎక్స్‌ప్రెషన్ చూసి అతను నా దగ్గరికి వచ్చాడు.

"నువ్వు యిక్కడ ఒంటరిగా వుంటున్నావు. నిరంజన్ మాటిమాటికీ యిక్కడికి రావడం కరెక్ట్ కాదు" నచ్చచెబుతూ అన్నాడు.

"మరి, నీ గురించి ఏమనుకోవాలి? నువ్వు చేస్తున్నదీ అదేగా?" కనుబొమలు పైకెత్తుతూ ప్రశ్నించాను.

సందీప్ మొహం వాడిపోయింది.

"నేనూ, నిరంజన్ ఒకటేనా అని నువ్వు అడగొద్దు. నువ్వా రేపు నన్ను వదిలేసి ఇంకెవర్నో పెళ్ళిచేసుకుంటావు. ఇప్పుడు యిలా యింటిచుట్టూ తిరిగి అవమానపరుస్తావు. అంతేగా. ఇప్పటికే నేను చాలా మాటలు వినాల్సొచ్చింది.మా అమ్మ పోయినప్పట్నుంచి మీ నాన్నగారు నన్ను కంటికి రెప్పలా కనిపెట్టుకుని వుంటున్నారు. నేను ఆయన మొహంలోకి సూటిగా చూడలేకపోతున్నాను. ఐ కెన్ నాట్ కంటిన్యూ దిస్. మన రిలేషన్‌ని బిజినెస్ వరకే పరిమితం చేద్దాం" చెపుతూ వుంటే నా గొంతు వణికింది.

"అయామ్ సారీ" నెమ్మదిగా చెప్పాడు సందీప్.

"నీ యిబ్బందుల్ని గమనించలేకపోయాను. కానీ నిజంగా నాకు అవేమీ తెలియలేదు. నీ బాధని షేర్ చేసుకోవాలన్న ఆలోచన తప్ప నాకింకే విషయం అర్థంకాలేదు. నాకు అర్థమైందల్లా ఒక్కటే, నిన్ను వదిలి నేను ఉండలేనని" నా చేతులు పట్టుకుంటూ చెప్పాడు.

అతను చెప్పినదంతా నిజం. నా మనసు నమ్మింది. అతనితో గడిపిన క్షణాలు అది నిజమని వత్తాసు పలికాయి.

"మనిద్దరి మధ్యా ఏమీలేదని, నేనే నీతో అన్నాను. ఆ మాటలు మర్చిపో తనూ.

నువ్వు లేకపోయినా నేను ఉండగలను అనే ధైర్యం ఉంది నాకు. కానీ, నువ్వు ప్రోబ్లంలో వుంటే నిన్ను ఒంటరిగా వదిలి ఉండలేను అని తర్వాత అర్థమైంది. నువ్వు ఒంటరిగా బాధపడుతూ వుంటే నీ పక్కన నేను లేకపోవడం నాకు నరకంగా అనిపిస్తుంది.

ఐ ఆల్వేస్ వాంటెడ్ టూ ప్రొటెక్ట్ యూ.. ఐ లవ్ యూ"

అతను ఒక్కొక్క వాక్యం చెపుతూ వుండగానే నా కళ్ళు చెమ్మగిల్లాయి. నేను వినాలనుకున్న, కోరుకున్న అతని మనసులోని ఫీలింగ్స్ అన్నీ బయటపెట్టాడతను.

ఎప్పుడూ కాన్ఫిడెంట్‌గా కనిపించే, అతని కళ్ళు కూడా తడి అయ్యాయి.

ఇక సందీప్‌కి దూరంగా ఉండడం నావల్ల కాలేదు.

ఉద్వేగంతో అతనిని అల్లుకుపోయాను. అతను రెండు చేతులతో నన్ను గట్టిగా పట్టుకున్నాడు. అతని గుండె చప్పుడు నా గుండెలో ప్రతిధ్వనించింది.

"ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా?" నా చెవిలో గుసగుసగా అతని మాటలు వినిపించాయి.

చిన్నగా నవ్వుతూ అతని చేతులనుంచి నన్ను నేను విడిపించుకున్నాను.

"మరి చిత్రతో నీ ఎంగేజ్‌మెంట్?" కనుబొమలు పైకి ముడుస్తూ ప్రశ్నించాను.

"అది జరగదు. యూ డోంట్ వర్రీ త్వరలోనే మన గురించి ఒక డెసిషన్ తీసుకుందాం. సరేనా?" నా నుదుటి మీద జుట్టుని సవరిస్తూ చెప్పాడు. నాకు తెలియకుండానే నా పెదవులు సంతోషంతో విచ్చుకున్నాయి.

బుగ్గలు ఎరుపెక్కాయి.

సందీప్ ముందుకి వరిగి, నా బుగ్గమీద పెదవులతో సుతారంగా తాకాడు.

ఓ.కె ఒక అరగంటలో నాకొక యూ.ఎస్ కాల్ వుంది. కొత్తగా కాంట్రాక్ట్ కోసం ప్రయత్నిస్తున్నాను. వస్తాను. జాగ్రత్త టేక్ కేర్" అంటూ నా భుజం తట్టాడు.

చిరునవ్వుతో సందీప్ వైపు చూశాను. ఈ కొద్దిక్షణాల్లోనే మా యిద్దరి మధ్య కొత్త బంధమేదో పెనవేసుకున్నట్టుగా అనిపించింది మనసు. గాల్లో తేలిపోతూవుంది.

'ఫైనల్‌గా నీ లవ్ నీకు దక్కిందోచ్' ఆనందంగా అరిచింది అంతరాత్మ.

ముసిముసి నవ్వులతో దాన్ని జోకొట్టాను.

సందీప్ మరోసారి వెనక్కి తిరిగి నావైపు చూసి నవ్వాడు. అతను డోర్ తియ్యబోతుండగా కాలింగ్ బెల్ మోగింది. నేను కదిలి వచ్చేలోప్లే సందీప్ తలుపు తీశాడు.

"ఓహో నీ పర్మినెంట్ ఠికానా యిప్పుడు యిక్కడేనన్నమాట" వెటకారంగా ఓ గొంతు వినిపించింది.

ఆ గొంతు సుమిత్రాదేవిది.

వెంటనే నేను అదిరిపడుతూ ముందుకి వచ్చి నిలుచున్నాను.

సుమిత్రాదేవి నిప్పులు కురిసే కళ్ళతో సుడిగాలిలా లోపలికి దూసుకు వచ్చింది. ఆమె వెనకాలే ఏ టెన్షనూ లేకుండా "ఈ స్క్రిప్టు అంతా నాకు ముందే తెలుసు" అన్నట్టు నిలబడివుంది చిత్ర.

ఆవిడ వాలకం చూస్తూనే జరగబోయేది పసిగట్టినట్టున్నాడు సందీప్. వెంటనే "అమ్మా! పద యింటికి వెళదాం" అన్నాడు ఆవిడ చెయ్యిపట్టుకుని లాగుతూ.

ఆవిడ కోపంతో చేతిని ఒక్కసారిగా విదిలించికొట్టింది.

"ఇంటికే వెళదాం. యింటికే వెళ్ళాలి కూడా నిన్ను యింటిదారి పట్టించడానికే నేను వచ్చింది. కాకపోతే నిన్ను పట్టిన ఈ మోహినీ పిశాచాన్ని వదిలించిగానీ, యిక్కడ్నుంచి నేను కదలను అంటూ.

"రావే.. రా! .. రా" అంటూ నన్ను చూసి గట్టిగా అరిచింది.

ఆవిడ అరుపులకి నా గుండె వేగం హెచ్చింది.

ఎటువంటి సమస్యనైనా ఆలోచించి ఎదుర్కోవడం నాకు తెలుసు. కానీ యిలా అఘాయిత్యంగా ఆగం చేసి, తగాదాలు పడడం నాకు తెలియదు.

"ఏమ్మా! బతికున్నన్నాళ్ళూ మీ అమ్మ ఉద్యోగం వంకతో నా మొగుణ్ణి తన చుట్టూ తిప్పుకుంది. ఇప్పుడు నువ్వు నా కొడుకుని పట్టుకున్నావు.

ఇన్నాళ్ళుగా కాపురం చేశాను కానీ యిలా మగాళ్ళని యింటిచుట్టూ తిప్పుకునే తెలివితేటలు నాకు లేవు తల్లో .. గట్టి గట్టిగా అరుస్తూ వుందావిడ.

ఆవిడ మాట్లాడే ఒక్కొక్క మాటకీ నేను ఒక్కో అడుగు భూమిలోకి దిగబడుతున్నట్టనిపించింది.

నా కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలాయి.

"నన్నేమైనా అనండి. మాఅమ్మని అనొద్దు. ఆవిడ ఈ లోకంలోనే లేదు" ఎలాగో గొంతు పెగుల్చుకుని చెప్పాను.

"అంటాను. ఒక్కసారి కాదు. వదసార్లు అంటా. ఆ తల్లిపోలికలే వచ్చాయి నీకు. ఏం మత్తు చల్లావో వీడూ నీ యింటి గుమ్మం పట్టుకునే వేలాడుతున్నాడు. నా మేనకోడలి మొహం కూడా చూడట్లేదు.

ఇలాంటి అమాయకురాలి ఉసురుపోసుకుని నువ్వు బాగుపడతావా?" సుమిత్రాదేవి రంకెలు వేసింది.

"అమ్మా!" గట్టిగా అరిచాడు సందీప్.

అతని మొహం కోపంతో ఎర్రగా అయ్యింది. "నువ్వు యింకొక్క మాట మాట్లాడినా మర్యాదగా వుండదు" అరిచాడు ఆవేశంగా.

సందీప్ అలా అనగలడని, ఊహించని సుమిత్రాదేవి తత్తరపడింది.

ఒక్క క్షణం ఆగి సన్నగా రాగం మొదలుపెట్టింది.

"నాకు తెలుసురా! నువ్వు మారిపోయావు. నువ్వు మా సందీప్‌వి కాదు. నేను పెంచిన నా బిడ్డవి కాదు. ఇవి నీ మాటలు కాదురా. నువ్వు దేవకన్య అనుకునే ఈ దెయ్యం నీ చేత మాట్లాడిస్తుంది.

వామ్మో దీన్ని వదిలించడం మావల్ల అయ్యేట్టు లేదు.

కడుపు కట్టుకుని, రెక్కలు ముక్కలు చేసుకుని పెంచి యింతవాడిని చేస్తే, నువ్వు యిలా మారిపోయావు.

డబ్బు కుప్పలు కుప్పలు పోసి చదివించాం రా నిన్ను.

ఈ ముసలి వయసులో మమ్మల్నిలా అన్యాయం చేస్తావా? దాని వల్లోపడి మాకు కాకుండా పోతావా?

నలుగురు పెద్దమనుషుల్ని పిలిచి దీనికి బుద్ధి చెప్పిస్తాను" శోకాలు పెడుతూ నిష్టూరాలు పోయింది.

తెరిచివున్న గుమ్మంలో నుంచి, చుట్టూ పోగైన జనాలు కనిపించారు నాకు. సిగ్గుతో, బాధలో నాలో నేనే చచ్చిపోయాను.

"అమ్మా!" గట్టిగా అరిచి, ఆవిడ రెక్కపట్టుకున్నాడు సందీప్. నేను కళ్ళనీళ్ళతో సందీప్‌వైపుకి చూశాను.

"సందీప్ ప్లీజ్ నువ్వు యిక్కడినుంచి వెళ్ళు. ఈ గొడవని మరింత పెంచకు. ప్లీజ్" అంటూ కళ్ళతోనే అభ్యర్ధించాను.

అంత బాధలోనూ అతనికి యూ.ఎస్ కాల్ వుందని నా మనసులో మెదులుతూనే వుంది.

అతను 'సరే' అన్నట్టుగా నా వైపు చూశాడు.

సుమిత్రాదేవినీ, చిత్రనీ చూసి, కోపంగా తలతిప్పుకుని ధనాధనా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడక్కడనుంచి.

"అదిగో చూడు. నాదస్వరానికి తలాడించే పాములా, దానిమాట ఎలా వింటున్నాడో" కోపంతో ఊగిపోయిందావిడ.

"ఏంటమ్మా? ఏంటి సంగతి?" చుట్టూ చేరినవాళ్ళలో ఒకాయన పెద్దరికం చూపించాలని ఆరాటంగా అడిగాడు.

సుమిత్రాదేవి నోరు విప్పబోతుంటే, చిత్ర వారించింది.

"అత్తయ్యా ఇక చాలు బావకి బాగా కోపం తెప్పించినట్టున్నావు.." సందీప్ వెళ్ళినవైపే చూస్తూ భయంగా అంది.

"నువ్వేం భయపడకు. దీనికి బుద్ధి చెబితేగానీ నా కడుపుమంట చల్లారదు. నా కొడుకుని నాకు కాకుండా చేసింది." ఆవిడ లొడలొడా వాగుతూనే ఉంది. నేను నిస్సహాయంగా అలా నిలబడి చూస్తూ వుండిపోయాను.

"చూడమ్మాయ్ ఒంటరి ఆడపిల్లవి. నువ్వే జాగ్రత్తగా మసులుకోవాలి" ఒక పెద్దావిడ సానుభూతిగా సలహా పారేసింది.

"సర్లే నీ చాదస్తపు సలహాలు. ఈ కాలం పిల్లలు అంతే. ఎప్పుడూ మగపిల్లల బండిమీదో, కారులోనో తిరుగుతూనే వుంటుంది. ఓ అరగంట క్రితం యిద్దరు మగాళ్ళు ఈ పిల్లకోసం యిక్కడే కొట్టుకున్నారు.

నువ్వు నోరుమూసుకుని పద" పక్కనున్నావిడ లోగుంతుకతో విసుక్కుంటూవుంది.

"అత్తయ్యా మనం వెళదాం. ఇక చాలు" సుమిత్రాదేవి చెయ్యి లాగుతూ అంది చిత్ర.

ఆవిడ వెనక్కి తిరగబోతూ, నావైపు చురుగ్గా చూసింది. "దీనికీ డోసు చాల్లే. యిప్పుడల్లా మళ్ళీ మన జోలికి రాదు" అంటూ వెటకారంగా నవ్వి అక్కడినుంచి కదిలింది.

చుట్టూ చేరినవాళ్ళలో ఆవిడ సానుభూతి పరులూ స్నేహితులూ ఆవిడ వెంట నడిచారు.

నేను దిక్కుతోచని దానిలాగా అలాగే నిలబడిపోయాను.

పొద్దు వాలిపోతూ వుంది.

సాయంకాలపు ఎండ, బైటవరకే పరిమితమైపోయింది. ఇంటిలోపల అంతా చీకటి. ఆ యింటి గుమ్మానికి లోపల నేనున్నాను. బైటవైపు మొత్తం ప్రపంచం వుంది. అమ్మమ్మ.. అమ్మ.. నేను ఎప్పుడూ ప్రపంచానికి యిటువైపే నిలబడి వున్నామా? లేకపోతే ప్రపంచమే ప్రతిమనిషికీ అలా ఎదురై నిలబడుతుందా? నా మెదడు ఇంక ఆలోచించలేకపోయింది.

ఎక్కడో ఫోన్ రింగవుతున్న శబ్దం విని, మంచం మీద యిటునుంచి అటుకి దొర్లాను. మనసు కలతగా ఉండడంవల్ల రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. కళ్ళు ఒకటే మండుతున్నాయి.

ఫోన్ యింకా రింగవుతూనే వుంది. ఆ సౌండు దిండు కిందనుంచి అని అర్థం కాగానే, దిండు మీద చెయ్యి దూర్చి ఫోన్ బైటికి తీశాను.

"హలో! తనూ" ఫోన్ తీస్తూనే సందీప్ గొంతు వినిపించింది.

"ఊ!c.."

"అయామ్ సారీ నిన్న మా అమ్మ చేసిన గొడవకి చాలా డిస్టర్బ్ అయివుంటావు" రాత్రంతా నీ గురించే ఆలోచిస్తూ వున్నాను" నిజాయితీగా పలికిందతని గొంతు.

"నువ్వెందుకు సారీ చెబుతున్నావు? ఇందులో నీ తప్పేమీలేదు. తప్పేదైనా వుంటే అది నాది. ముందూ వెనుకా ఆలోచించకుండా నా పరువు నేనే తీసుకున్నాను" గుండె లోపల్నుంచి గొంతులోకి బాధ ఎగదన్నింది.

"తన్మయీ యూ డోంట్ వర్రీ దీనికి అతి తొందరలో ఒక సొల్యూషన్ ఆలోచిద్దాం. ప్లీజ్ నువ్వు బాధపడకు" ఆప్యాయంగా అన్నాడు.

"అయామ్ ఆల్‌రైట్" కూడదీసుకుని పలికాను నేను.

"ఇవాళ ఆఫీస్‌కి రా. అక్కడ మాట్లాడుకుందాం" చెప్పి ఫోన్ పెట్టేశాడు.

డోర్ లాక్ చేసి హేండ్ బ్యాగ్‌లో ఉంచి కారు కీస్ తీస్తుంటే, రంగారావుగారు వచ్చారు.

నిన్న జరిగిన హంగామాకి, నేను నేరుగా ఆయన మొహంలోకి చూడలేకపోయాను. సుమిత్రాదేవి అరిచి , గోల చేసినప్పుడు కూడా నేనేదో తప్పు చేశానన్న ఫీలింగ్ నాకు రాలేదు. కానీ, రంగారావుగారిని చూస్తుంటే మాత్రం నేను పొరబాటు చేశానేమో అన్న భావన కలిగింది.

**నిన్న పోయింది** నా పరువేకాదు. వాళ్ళింటి పరువుకూడా. ఒకవేళ, నేనూ, సందీప్ ఒక్కటవ్వడం ఆయనకి యిష్టంలేకపోతే మాత్రం నేను చేసింది ఖచ్చితంగా తప్పే. ఆయన బాధకీ, అయిష్టానికీ కారణం నేను కాకూడదు. అది అమ్మ రాతపూర్వకంగా నాకు రాసిచ్చిన శాసనం. దాన్ని నేను దాటలేను.

ఆయన ఏం మాట్లాడటానికి వచ్చారో అనుకుంటూ ఊపిరి బిగబట్టి నిలుచున్నాను.

"పనిమీద వెళుతున్నట్టున్నావు. నేను మళ్ళీ కలుస్తాలేమ్మా" అంటూ ఆయన వెనక్కి తిరగబోయాడు.

"అంకుల్.." నేను ఆపాను.

"ఫర్వాలేదు చెప్పండి" ఆయన ఏం చెప్పినా జీర్ణించుకోవడానికి సిద్ధపడుతూ అన్నాను.

ఆయన తల కొద్దిగా వంచి తటపటాయిస్తున్నట్టు చూశాడు.

"లోపల కూర్చుని మాట్లాడుకుందాం రండి" అంటూ వెనక్కి తిరగబోయాన్నేను.

"వద్దమ్మా" వారించాడాయన.

"నిన్న జరిగినదానికి క్షమాపణ చెబుదాం అని వచ్చాను. నువ్వూ మా సుమలాంటిదానివే నాకు. జరిగింది మర్చిపో. నిజానికి మీ అమ్మ ఉండివుంటే, యివాళ నేను నా మొహం కూడా చూపించగలిగేవాడిని కాదు.

ఏవి ఎలా అన్నా జరగనీ నీకే అవసరం వున్నా నేనున్నానని గుర్తుపెట్టుకో" అంటూ నా తలమీద చెయ్యివేసి వెనక్కి తిరిగాడు.

ఆయన మాటలకి నేను విస్తుపోయాను. నేను ఊహించని విధంగా మాట్లాడాడాయన.

సందీప్ గురించిగానీ, నా గురించిగానీ అస్సలు అడగలేదు. మమ్మల్ని సమర్ధించలేదు. మందలించలేదు.

ఆయన ఆలోచిస్తున్నట్లు ఒక మనిషిని బాధపెట్టామే అనే. ఎంతసింపుల్‌గా ఉంది ఆయన ఆలోచన. ఆయన ఫ్యూచర్ లాభనష్టాలులాంటివేవీ ఆలోచించడా?

వెనక్కి తిరిగి వెళుతున్న ఆయన్ని పరీక్షగా చూశాను. ఇవాళ ఆయన మరింత కొత్తగా కనిపించాడు.

ఎదుటివారిని బాధపెట్టకపోవవడం, చేసే పనిని నిస్వార్ధంగా చేయడం ఈ రెండే ఆయనకి తెలుసు.

"ఇది ఒక వరమా? శాపమా?" నాకు అర్ధంకాలేదు.

నా సెల్‌లో ఆ ఐదు నిముషాల్లోనే నాలుగుసార్లుటైం చూసుకున్నాను. ఆఫీసుకి వెళ్ళాక తెలిసింది. సందీప్ అనుకోకుండా మెటీరియల్ పర్చేజింగ్‌కి అర్జంటుగా పక్క ఊరికి వెళ్ళాల్సి వచ్చిందని.

"సాయంత్రం ఐదు గంటలకల్లా వచ్చేస్తాను. ప్లీజ్ .. వెయిట్ చెయ్యి" సందీప్ పంపించిన మెసేజ్‌ని మరోసారి చూశాను.

అప్పటికే బైట చీకటి దట్టంగా అల్లుకుంది. వాచ్‌మెన్ మల్లన్న తప్ప వర్కర్స్ అందరూ వెళ్ళిపోయారు.

ఫోన్ మాట్లాడడం పూర్తి చేసి ఆఫీసు రూంలోకి వచ్చాడు వెంకట్.

"తన్మయీ టైం ఏడు దాటింది. సందీప్ లేటవ్వచ్చు. బాగా మబ్బులు పట్టేసాయి. వాన వచ్చేట్టుంది. నువ్వు యిక్కడ వెయిట్ చెయ్యడం సేఫ్ కాదు. పద వెళదాం." టేబుల్ మీద లాప్ టాప్ పెడుతూ అన్నాడు.

నేను మళ్ళీ సందీప్ సెల్‌కి కాల్ చేశాను.

"స్విచ్చాఫ్ చేసి వుంది" అన్న మెసేజ్ పదేపదే వినిపిస్తూ వుంది.

"ఫోన్‌లో ఛార్జింగ్ అయిపోయివుంటుంది తనూ. డోంట్ వర్రీ. ఏ క్షణానైన వాన పడొచ్చు. హర్రీ అప్. నేనూ నీతోపాటు చాలాసేపు వెయిట్ చేశాను. నా కారు వైపర్స్ సరిగ్గా పనిచేయడంలేదు. వానపడితే యిబ్బందవుతుంది. ప్లీజ్. వెళదాం పద."

వెంకట్ చెబుతూ వుండగానే, నేను కుర్చీలోనుంచి లేచాను.

"ఇక సందీప్ ఆఫీసుకి రాకపోవచ్చు. నేరుగా యింటికే వెళతాడు. నువ్వు ఈ లాప్‌టాప్, ఛార్జర్ వాళ్ళింట్లో యిచ్చెయ్. లేకపోతే ఎకౌంట్స్ టాలీ చెయ్యడం లేటయిపోతుంది. బిల్స్ అన్నీ వెంటనే ఎంటర్ చెయ్యాలంటాడు సందీప్" అంటూ బ్యాగ్ నా చేతికి యిచ్చాడు.

నేను సందేహంగా వెంకట్‌వైపు చూశాను.

"ప్లీజ్ తనూ 'వర్క్ కమ్స్ ఫస్ట్ ఆల్వేస్' అంటావుగా నువ్వు మిగతావన్నీ పక్కన పెట్టు .." అన్నాడు అభ్యర్థిస్తూ.

"సరే" తలూపాను నేను.

అప్పటికే గాలి హోరు హెచ్చింది. సన్నసన్నగా వానచినుకులు పడడం మొదలైంది. ఇద్దరం గబగబా ఆఫీస్ రూం లాక్ చేసి పార్కింగ్ వైపుకి పరిగెత్తాం.

"తనూ లాప్‌టాప్ మర్చిపోకుండా యివ్వు. లేదంటే అర్ధరాత్రి ఆఫీసుకో, మా యింటికో వచ్చేస్తాడు" కారు డోరు తీస్తూ మరోసారి హెచ్చరించాడు వెంకట్.

"అలాగే" చెప్పి నా కారులో ఎక్కాను. లాప్‌టాప్ బాగ్‌ని పక్క సీట్లో పెట్టి కారు స్టార్ట్ చేశాను.

దాదాపుగా సగం దూరం వచ్చేసరికి, సన్నని తుంపర్లుగా వున్న వాన కాస్తా పెద్ద జల్లుగా మారింది.

కాస్త దూరం వెళ్ళాక, కుడిచేతివైపు మలుపు తిప్పి, కారుని సందీప్ వాళ్ళ ఇంటిముందు ఆపాను.

బుక్‌సీట్‌లో నుంచి రెయిన్ కోట్ తీసి వేసుకుని, లాప్‌టాప్ బ్యాగ్ తడవకుండా రెయిన్ కోట్ లోపల దూర్చి గట్టిగా అదిమిపట్టుకున్నాను. కార్ డోర్ తీసి దిగి, రెండు అడుగులు వేశానో లేదో ఠక్కున స్ట్రీట్‌లైట్స్ ఆగిపోయాయి. చీకట్లో చిన్నగా అడుగులో అడుగు వేసుకుంటూ జాగ్రత్తగా గేటుదాకా నడిచాను.

ఇంతలో యింట్లో నుంచి పెద్ద పెద్దగా మాటలూ, అరుపులూ వినిపిస్తూ వున్నాయి.

"బుర్రకి పనిపెట్టే అవసరమే లేదు. అది సుమిత్రాదేవి గొంతే. ఇది వాళ్ళింట్లో ఎప్పుడూ వినిపించే మద్దెల దరువే" అంతరాత్మ చెప్పింది.

నేను చిన్నగా నవ్వుకుంటూ అడుగులు ముందుకు వేశాను.

"ఇంట్లోకి అడుగు పెట్టావంటే మర్యాద దక్కదు. జాగ్రత్త" సుమిత్రాదేవి అరుపూ.. ఆ వెనకాలే "అమ్మా!అమ్మా!" అంటూ సుమ ఏడుపూ వినిపించింది.

"ఈ టైంలో లోపలికి వెళ్ళడమా, వద్దా?" అని ఆలోచిస్తూనే గేటు మీద చెయ్యి వేశాను. గేటు లోపలనుంచి గడియ వేసి లేదేమో తక్కున దానంతట అదే తెరుచుకుంది.

చలికి వణుకుతూ, వానకి తడవకుండా లాప్‌టాప్ బ్యాగ్‌ని మరింత బద్రంగా పొదివి పట్టూకుని నాలుగడుగులు వేశాను. యధాలాపంగా యింటి గుమ్మం వైపుకి చూస్తూనే ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి స్థాణువైపోయాను.

సుమిత్రాదేవి రంగారావుగారిని వరండా గ్రిల్స్‌లో నుంచి బైటికి తోసేస్తూవుంది. ఆవిడ విసురుకి ఆయన నిలదొక్కుకోలేకపోతున్నాడు.

ఎత్తుగా, బలంగా భారీగా వున్న ఆమె నిలువెత్తు విగ్రహంలా వరండా తలుపుకి అడ్డంగా నిలబడివుంది. ఆమెలోని కోపం, ద్వేషం అంతా ఆమె బాడీ లాంగ్వేజ్‌లో స్పష్టంగా తెలుస్తూవుంది నాకు.

"అమ్మా ప్లీజ్ అమ్మా వద్దు. నాన్న అసలే ఆయాసం మనిషి. ఈ వానకి తట్టుకోలేడు. వద్దమ్మా" సుమ సుమిత్రాదేవికి అడ్డం పడి బతిమాలుతూ వుంది.

"అయితే మీ నాన్నని ఒప్పించి. మీ నాన్న చెబితే వాడు వింటాడు. చిత్రని చేసుకోవడానికి వాడిని ఒప్పించమని. అప్పుడే ఈ యింట్లోకి ఆయన్ని అడుగుపెట్టనిచ్చేది.

ఆ కొరివిదెయ్యం మీ నాన్నకి ఎందుకు ఎక్కువో, నాకు ఛస్తే అర్ధమై చావడంలేదు. నా మేనకోడలు నా యింట్లో కోడలుగా అడుగుపెట్టాలి. అంతే" గర్జించింది.

"అమ్మా! యిందులో నాన్న ప్రమేయం ఏముందమ్మా? నాన్న ఏం చేయగలడు? అన్నయ్యకి చెప్పలేక నాన్ననెందుకు సాధిస్తావు?" సుమ రంగారావుగారిని పట్టుకుంటూ అరిచింది.

"నాకదంతా అనవసరం. ఆ యింటిలో పరిచయాలు. ఈయనగారి వల్లే జరిగాయి. అదే నా కొంపముంచింది. ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవడం నాకు యిష్టం లేదని మీ నాన్న ఒక్కమాట చెప్పమను. అప్పుడు తలుపు తీస్తాను" అంటూ యిద్దర్నీ ఒక్క తోపుతోసి, వరండా గ్రిల్స్‌లో నుంచి తోసేసి, తలుపువేసింది.

"అమ్మా! అమ్మా! తలుపు తియ్యి" సుమ అరుస్తూనే వుంది. అదేమీ పట్టనట్టుగా సుమిత్రాదేవి గ్రిల్స్‌కి తాళం వేసి లోపలికి వెళ్ళి హాలు తలుపు కూడా బిగించేసింది.

వాన యింకాస్త హెచ్చింది.

"నా కళ్ళముందు జరుగుతున్నదంతా నిజమేనా?" నాకు నమ్మబుద్ధికాలేదు. బుర్రంతా స్తంభించిపోయినట్టైంది.

నా ఎదురుగా ముప్పై అడుగుల దూరంలో వరండాలోని లైట్ల వెలుతురులో ఆ చిన్న యింట్లో జరుగుతున్నదేంటో నాకు స్పష్టంగా కనిపిస్తూవుంది. అది అబద్ధం అని చెప్పలేను.

వీధిలైట్లు వెలగకపోవడం, అరటి చెట్లు అడ్డంగా వుండడంతో నేను మాత్రం వాళ్ళకి కనిపించడంలేదు.

ఇంత జరుగుతున్నా రంగారావుగారు ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఆయన మౌనంగా వచ్చి, యింటిముందు వున్న ఒక రాతి బెంచీమీద కూర్చున్నాడు. రెండు చేతులూ మోకాళ్ళ మీద ఆనించి ముందుకి వంగి తలవంచుకుని కిందకి చూస్తూ వున్నాడు.

చుట్టూ చీకటి, దానికి తోడు చలిగాలి.

ముందుకి వంగివున్న ఆయన శరీరం వణుకుతూ వుండడం అంత దూరానికి కూడా నాకు స్పష్టంగా తెలుస్తూ వుంది. ఆయన ఆయాసపడుతున్నాడో, ఏడుస్తున్నాడో నాకు అర్ధంకాలేదు.

"నాన్నా.. సరే అని చెప్పు నాన్నా. 'సరే' అని చెప్పు" వణికిపోతున్న ఆయన్ని పట్టుకుని పెద్దగా ఏడుస్తూ వుంది సుమ.

ఇంతలో హఠాత్తుగా ఆయన ఛాతీ ఎగసిపడడం ప్రారంభించింది. సుమ కష్టం మీద ఆయన్ని లేపి వరండా ముందు వున్న సన్‌షేడ్ కింద, తడవకుండా కూర్చోపెట్టే ప్రయత్నం చేసింది.

"అమ్మా.. అమ్మా! తలుపు తియ్యమ్మా. నాన్నకి బావుండలేదు. ఎక్కిళ్ళు వస్తున్నాయి..." సుమ కంగారుగా వ్రండా గ్రిల్స్ గడియని తట్టి శబ్దం చేస్తూ ఏడుస్తూ వుంది.

అప్పటిదాకా ఓ మాదిరిగా కురుస్తున్న వాన వున్నట్టుండి ఉధృతమైంది. అప్పటిదాకా కనిపిస్తున్న దృశ్యం కొద్దిగా మసకబారింది.

రంగారావుగారు కూర్చున్నవాడల్లా వున్నట్టుండి పక్కకి ఒరిగిపోయారు. ఆయన నిస్సహాయతనే తండ్రికోసం సుమ పడే ఆరాటాన్ని చూసి నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

గబుక్కున ఒక అడుగు ముందుకు వెయ్యబోయి కూడా కాళ్ళకెవరో సంకెళ్ళు తగిలించినట్టుగా హఠాత్తుగా ఆగిపోయాను.

నేను వెళ్ళడం సమస్యని మరింత పెంచుతుందని నాకు తెలుసు. అలాగని వెనక్కి తిరిగి వెళ్ళడానికీ మనసు రాలేదు. ఇప్పటిదాకా సందీప్‌తో రిలేషన్‌ని రంగారావుగారికి తెలియకుండా వుంచడం తప్పేమో అన్న ఫీలింగ్ మాత్రమే ఉండేది.

కానీ, ఈ సంఘటన చూస్తుంటే, నేను చేస్తున్నది పాపం కూడానేమో అన్న భావన కలిగించింది.

"ఈ క్షణంలో సందీప్ యిక్కడికి వస్తే బావుండు" ఏడుస్తూ మనసులోనే ముక్కోటి దేవతలనూ ప్రార్థించాను.

ఇంతలో, ఠక్కున హాలు తలుపు తెరుచుకుంది. సుమిత్రాదేవి లోపలినుంచి వరండాలోకి వచ్చింది.

"నేను చెప్పినట్టు చేస్తాడా మీ నాన్న?" గంభీరంగా అడిగింది సుమ వంక చూస్తూ.

"అలాగే అమ్మా! అలాగే తలుపు తియ్యి" రంగారావుగారిని లేపి నిలబెడుతూ అంది.

"మీ అన్నకిగానీ ఈ విషయం తెలిసిందా, నేనూ, చిత్ర కాఫీలో విషం కలుపుకుని తాగి ఛస్తాం గుర్తుంచుకోండి. ఆ తల్లిలేని బిడ్డ ఉసురు తగులుతుంది మీకు ఊ.. నడవండి" బెదిరిస్తూ ఉందావిడ.

సుమ, రంగారావుగారూ యిద్దరూ లోపలికి వెళ్ళారు.

ఆ తర్వాత వరండా గ్రిల్స్ తలుపులూ, ఆ వెంటనే హాలు తలుపులూ మూసుకున్నాయి.

ఆ సంఘటనతో ఆయన మనసు ముక్కలు ముక్కలు అయిపోయివుంటుంది. పిల్లల భవిష్యత్తు కోస్మ చిత్రహింసలు అనుభవించే తల్లుల్ని చూశాను. కానీ.. ఓ తండ్రిని చుడడం యిదే మొదటిసారి. తన కుటుంబాన్ని ఒక సంపూర్ణమైన కుటుంబంగా లోకానికి చూపించడానికి ఆయన యిన్ని కష్టాలు భరిస్తున్నాడా?"

రంగారావు గారు సుమ లోపలికి వెళ్ళగానే తెరమీద దృశ్యం మాయమైనట్టైంది. నేను స్పృహలోకి వచ్చాను. అప్పటిదాకా నేను ఏ పరిస్థితిలో అక్కడ వున్నానో నాకు అర్థంకాలేదు.

వానకి, అరటి పాదుల మీదుగా పారిన నీళ్ళు నా చెప్పుల్నీ, పైజమానీ బురద చేసేశాయి. రెయిన్‌కోటు కవర్ చేయని, నా నడుమూ, కింద భాగం అంతా తడిసి ముద్దయిపోయింది.

హఠాత్తుగా నా చేతిలో లాప్‌టాప్ వున్న సంగతి గుర్తుకు వచ్చింది నాకు. ఆ పరిస్థితిలో దాన్ని యిచ్చే సాహసం చెయ్యలేక, బురదలో దిగబడ్డ చెప్పుల్ని విదుల్చుకుంటూ వెనుదిరిగాను.

ఇంటికివచ్చి, పొడిబట్టల్లోకి మారి, తల తుడుచుకుంటూ సోఫాలో కూర్చున్నాను.

అరగంట క్రితం జరిగిన సంఘటనే నా కళ్ళముందు మెదులుతూ వుంది. ఆయన పక్కకి ఒరిగిపోయినప్పుడు నా గుండె దడదడలాడింది. ఆ సమయంలో ఆయనకి ఏదైనా స్ట్రోక్ గానీ వచ్చివుంటే ఆయనకిగానీ జరగరానిది జరిగివుంటే ఆలోచించడానికే భయం వేసింది నాకు.

ఆ భారం గుండెల్లో జీవితాంతం మోయగలనా? మనసంతా పిచ్చి పిచ్చి ఆలోచనలు. అసహనంగా సోఫాలో నుంచి లేచి బెడ్ రూంలోకి వచ్చాను. బెడ్‌సైడ్ టేబుల్ మీద లాంప్ స్విచ్ వేస్తుంటే, చేయి తగిలి ఏదో పేపర్ కిందపడింది.

వంగి, దాన్ని చేతిలోకి తీసుకుని చూశాను.

అది అమ్మ వీలునామాతో బాటు రాసి వుంచిన లెటర్.

"ఆయన్ని సంతోష పెట్టలేకపోయినా ఆయన బాధలకి మనం కారణం కాకూడదు" రంగారావుగారి గురించి, అమ్మ రాసిన వాక్యం నాకంటపడింది. గత కొద్దికాలంగా నా మనసులో రేగుతూ సమసిపోతూ వున్న సంఘర్షణ మళ్ళీ నాలో మొదలైంది.

తెల్లవారి నిద్రలేచేసరికి ఒళ్ళంతా నెప్పులు. రాత్రి వానకి తడవడంవల్ల కాస్త జలుబు కూడా చేసింది ఆ రోజు ఆఫీసుకి వెళ్ళకూడదని నిర్ణయించుకునే ఆలస్యంగా నిద్రలేచాను.

లేచిన వెంటనే నేను మొదటగా చేసినపని రంగారావుగారికి ఫోన్ చేయడం. ఆయన గొంతు విని, ఆయన క్షేమంగా వున్నారని తెలుసుకున్న తర్వాత రిలీఫ్‌గా అనిపించింది.

సోఫాలో బద్ధకంగా కూర్చుని, రాజ్యంగారు యిచ్చిన్ అకాఫీని మెల్లగా తాగుతూ వున్నాను. ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది.

"నేను చూస్తాను అమ్మాయిగారు. మీరు కాఫీ తాగండి" అంటూ రాజ్యంగారు కదలబోతుంటే తక్కున లేచి "ఒక్క నిముషం" అంటూ ఆపానావిడని.

వచ్చింది ఖచ్చితంగా సందీపేనని నా నమ్మకం. లాప్‌టాప్ వంకతో నిన్న మాట్లాడాలనుకున్న విషయం చెప్పాలని వచ్చివుంటాడు.

"ఆంటీ ఎవరు వచ్చినా నాకు ఒంట్లో బాగోలేదనీ మాట్లాడలేననీ చెప్పండి" చిన్నగొంతుతో చెప్పి నా గదిలోకి వెళ్ళాను.

రెండు నిమిషాలు తర్వాత రాజ్యంగారు నా గదిలోకి వచ్చింది.

"సందీప్ వచ్చాడు. మీరు నిద్రపోతున్నారని చెప్పాను. అయినా ఎదురు చూస్తానంటూ సోఫాలో కూర్చున్నాడు" చెప్పింది.

"ఈ లాప్‌టాప్ బాగ్ అతనికి యివ్వు. యింకెప్పుడూ యింటికి రావొద్దన్నానని చెప్పు" అన్నాను చిరాగ్గా, బ్యాగ్‌ని ఆవిడ చేతికి అందిస్తూ.

ఆవిడ యిబ్బంది పడుతూ, మొహమాటంగా నావైపు చూసింది.

"మొన్న జరిగిన తమాషా తర్వాత కూడా అతనిక్కడికి రావడం కరెక్టేనంటారా?" కోపంగా అన్నాను.

ఆవిడ, మారు మాట్లాడకుండా నా చేతిలోని బ్యాగ్ తీసుకుని హాల్లోకి వెళ్ళింది. "బాబూ అమ్మాయీ" ఆవిడ అంటూండగానే..

"బ్యాగ్ యివ్వండి వెళ్ళాలి" జవాబుగా అతని మాటలు వినిపించాయి నాకు. సందీప్ హర్ట్ అయ్యాడని తెలిసినా, ఏమీ చెయ్యలేని పరిస్థితి నాది.

ఆ మరుసటిరోజు కూడా ఆఫీస్‌కి వెళ్ళలేదు నేను. సందీప్ ఫోన్ చేసినా ఏదో ఒక వంక చెప్పి ఫోన్ పెట్టేస్తూ వున్నాను.

"కానీ యి ఎంతోకాలం అతన్నుంచి పరిగెత్తలేనని నాకు తెలుసు. త్వరగా ఏదో ఒకటి చెయ్యాలి" ఇదే ఆలోచన రోజంతా మెదడుని తొలిచేసింది.

సాయంత్రంగా యింటి నుంచి కదిలి క్రికెట్ గ్రౌండుకి వెళ్ళాను.

అప్పటిదాకా, ఆడుకోవడానికి పిల్లలు వచ్చినట్టులేదు. మైదానం అంతా ఖాళీగా వుంది.

చిన్నప్పట్నుంచీ సందీప్ ఆ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతూనే వున్నాడు. ఎన్నోసార్లు అతను కొట్టిన బంతికి కావాలని ఎదురుగా వెళ్ళి దెబ్బలు తగిలించుకునేదాన్ని. అతని అటెన్షన్ పొందడం కోసం.

అది గుర్తొచ్చి నవ్వుకున్నాను.

సందీప్‌కి క్రికెట్ అన్నా, ఆ గ్రౌండ్ అన్నా ప్రాణం. బిజినెస్‌లో కాస్త స్థిరపడ్డాక, అక్కడొక క్రికెట్ స్కూల్ స్టార్ట్ చేయాలన్నది అతని కోరిక. అక్కడ కూర్చుంటే అతను దగ్గరే వున్నట్టనిపించింది. అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు. కాస్సేపటికి గ్రౌండ్‌లో పిల్లలు జమ అయ్యారు.

నేను లేచి బైటికి నడిచాను.

ఇంటి దగ్గర మలుపు తిరుగుతూ వుండగా, సుమ ఎదురైంది. నన్ను చూస్తూనే తిరస్కారంగా మొహం తిప్పేసుకుంది. నాకు ఎప్పటిలా కోపం రాలేదు.

"రంగారావు అంకుల్ ఎలా వున్నారు?" అని అడగాలనుకుని అడగలేక ఆగిపోయాను.

నాలుగు రోజుల తర్వాత, వెంకట్ ఫోన్ చేశాడు.

"సందీప్ కన్‌సైన్‌మెంట్ పంపడానికి చెన్నై వెళ్ళాడు. సందీప్ అవుటాఫ్ టౌన్ వెళితే చెప్పమన్నావుగా అందుకే ఫోన్ చేశాను: అన్నాడు.

వెంటనే నేను బ్యాగ్ తీసుకుని ఆఫీసుకి బయలుదేరాను.

"అసలు ఆఫీసు మొహం నువ్వు, నీ మొహం మేమూ మర్చిపోయామనే అనుకున్నాం" అన్నాడు వెంకట్ వెళుతూనే, నన్ను చూసి నవ్వుతూ.

"అవును. నువ్వనన్‌దే నిజం కాబోతుంది. ఇక నేను ఆఫీసుకి రాబోవడంలేదు. ఆఫీస్ రికార్డ్స్ కోసం నా రిజిగ్నేషన్ లెటర్ నీకు మెయిల్ చేశాను. చెక్ చేసుకో" అన్నాను కుర్చీలో కూర్చుంటూ.

వెంకట్ ఉలిక్కిపడ్డాడు.

"తనూ జోక్ చేస్తున్నావా? ఆర్యూ ఓకే" అన్నాడు ముందుకి వంగుతూ.

"అమ్మ పోయిన తర్వాత నాకు యిక్కడ ఉండబుద్దికావడంలేదు. ఐ నీడ్ ఎ ఛేంజ్. కొన్నాళ్ళు బ్రేక్ తీసుకుని ఏదైనా జాబ్ చెయ్యాలనుకుంటున్నాను" చెప్పాను సీరియస్‌గా.

వెంకట్ నావైపు విచిత్రంగా చూశాడు.

"ఇంకో విషయం అంటూ నా బ్యాగ్ తెరిచి అందులో నుంచి నాలుగు జ్యూవెలరీ బాక్సుల్ని తీసి టేబుల్ మీద పెట్టాను.

"నా నగలు అమ్మి కంపెనీ అవసరాలకి డబ్బు సర్దినప్పుడు సందీప్ నాకు కొనిచ్చిన నగలివి.

ప్లీజ్ ఇవి సందీప్‌కి తిరిగి యిచ్చెయ్. కావాలంటే వీటికి బదులుగా క్యాష్‌ని నా ఎకౌంట్‌లో వెయ్యమను. ఐ కాన్ట్ కీప్ దిస్.."

"తన్మయీ ఇదంతా సీరియస్ గానే చెపుతున్నావా? నువ్వు ఈ కంపెనీలో యిన్వెస్ట్ చేశావు. మీ యిల్లు కూడా తాకట్టులో వుంది. ఈ టైంలో యిలా మధ్యలో వదిలేసి ఎలా వెళ్తావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇవన్నీ చూసుకోవడానికి నువ్వు వున్నావుగా" అన్నాను నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"కానీ సందీప్... నువ్వెళ్ళిపోతే వాడెలా?" అంటూ నా వైపు చూశాడు.

"వెంకట్ ప్లీజ్" ఆ విషయం మాట్లాడడం యిష్టంలేదన్నట్టుగా చెయ్యి పైకెత్తి ఆపమని సైగ చేశాను.

"నీకూ సందీప్‌కీ మధ్య ఏదన్నా వుంటే కూర్చుని మాట్లాడుకోవచ్చు. ఈ మధ్యకాలంలో నువ్వూ వాడూ బాగా క్లోజ్ అయ్యారు. నువ్వు ఎందుకు యిలాంటి డెసిషన్ తీసుకున్నావోకానీ, నువ్వు మాత్రం ఖచ్చితంగా తిరిగి వస్తావు" అన్నాడు నమ్మకంగా.

"చూద్దాం" పొడిగా చెప్పి మరో మాటకి అవకాశం యివ్వకుండా వెనక్కి తిరిగాను.

**కారు టౌన్‌లోకి** ఎంటరవుతూనే ఒక తాగుబోతు వ్యక్తి నా కారుకి అడ్డుపడబోయాడు.

అతన్ని చూడగానే నేను గుర్తుపట్టాను. ఆ రూట్లో ఎప్పుడూ తాగిపడిపోతూ వుంటాడు. అతని నుంచి వచ్చే దుర్వాసన, నోటిమీద వాలుతూ వుండే ఈగలూ, మాసిన బట్టలూ అన్నీ గుర్తుకు వచ్చి, కడుపులో వికారంగా అనిపించిందో క్షణం.

"ఇప్పుడతను డబ్బు లివ్వమని, ఖచ్చితంగా గొడవ చేస్తాడు అనుకుంటూ ఉండగానే ఒక అమ్మాయి అక్కడికి వచ్చి తూలుతున్న ఆయన్ని భుజాల చుట్టూ చేయివేసి పట్టుకుంది.

ఆయన నాలుగడుగులు వేసి భళ్ళున వాంతి చేసుకున్నాడు. అది చూస్తూనే చీదరగా మొహం తిప్పేసుకున్నాను.

కానీ ఆ అమ్మాయి, కర్చీఫ్ తీసి ఓపికగా ఆయన మూతి తుడిచి తీసుకువెళుతూ వుంది వాళ్ళిద్దరూ పక్కకి తిరగగానే, నెమ్మదిగా నా కారుని ముందుకు పోనిచ్చాను.

వెనక నించి సరిగ్గా కనిపించని, ఆ అమ్మాయి మొహం అప్పుడు స్పష్టంగా కనిపించింది.

ఆ అమ్మాయి చిత్ర.

"నాన్నా! పద" అంటూ ఆయన చెయ్యిపట్టుకుని నడిపించడం చూసి ఆశ్చర్యపోయాను.

ఇతనా చిత్ర తండ్రి.

చిత్ర మీద బోలెడంత జాలి కలిగింది. అలాంటి వ్యక్తిని ఆమడదూరంలో చూసినా అసహ్యించుకుంటారు జనాలు. అలాంటి మనిషి చిత్రకి తండ్రి.

చిత్రకి తల్లిలేదు. తండ్రి వల్ల ఉపయోగం లేదు. నాలుగిళ్ళలో యోగా నేర్పిస్తూ కాలేజీ ఫీజులు కట్టుకుంటుంది. తండ్రిని రిహేబిలిటేషన్ సెంటర్‌లో చేర్చడానికి బహుశా ఆమె దగ్గర డబ్బు వుండి వుండదు.

ఫర్వాలేదు సుమిత్రాదేవి గయ్యాళి గంపే కావచ్చుకానీ, ఆమె వల్ల కనీసం చిత్ర లైఫ్ అన్నా బాగుపడుతుంది. సందీప్ లాంటి వ్యక్తి ఆమెకి తోడుగా వుంటే ఆమె సమస్యలు తీరిపోతాయి.

నేను తీసుకున్న నిర్ణయం గురించి నా మనసులో ఏమూలో గిల్టీ ఫీలింగ్ వున్నా అది ఆ క్షణంలో ఎగిరిపోయింది.

ఇంటికి వస్తూనే నా సెల్‌ఫోన్‌లో నుంచి సిమ్ కార్డ్ మార్చేశాను. ఇంటి తాళాలు మాధవన్నయ్య దగ్గర యిచ్చేసి, కారు కూడా అక్కడే పెట్టి, నడుచుకుంటూ ఇంటిదారి పట్టాను.

వచ్చే దారిలో సందీప్ వాళ్ళ యిల్లు కనిపించింది. అప్రయత్నంగా నా కళ్ళు అటువైపుకి తిరిగాయి. ఆ యింటి వీధి గేటు తెరిచి వుంది. లోపల దండెం మీద ఆరేసిన సందీప్ చొక్కా కనిపించింది. కాస్త దూరంలో అతని బైక్ పార్క్ చేసి వుంది.

ఆ క్షణం నాకు సుమిత్రాదేవి, రంగారావుగారూ, చిత్ర ఎవ్వరూ గుర్తుకి రాలేదు. సందీప్ అతని తాలూకు జ్ఞాపకాలు మనసుని ఆక్రమించేశాయి. మనసంతా మెలిబెట్టినట్టనిపించింది.

ఆ బైక్ వెనకాల సీటు యిక పర్మినెంటుగా మరొకరిది అంతరాత్మ చెప్పింది. కళ్ళల్లో సుడులు తిరిగిన నీళ్ళని పైకి రానివ్వకుండా నిగ్రహించుకున్నాను.

దాదాపుగా పదకొండుగంటల ప్రయాణం తర్వాత, తెలతెలవారుతుండగా, బస్సు స్టేషన్ చేరింది.

"రామచంద్రాపురం.. రామచంద్రాపురం" కండక్టర్ అరుపులతో నిద్రలేచాను. లగేజ్ తీసుకుని బస్ దిగి, స్టేషన్ బైటకి వస్తూనే నన్ను పిక్ చేసుకోవడానికి కారు వచ్చింది.

అరగంట గడిచేసరికి స్వప్న వాళ్ళ ఫామ్ హౌస్ ముందర వున్నాను. నన్ను చూస్తూనే పరుగున వచ్చి కౌగిలించుకుంది స్వప్న ఎన్ని రోజులైందో నిన్ను చూసి" అంటూ.

స్వప్న మొహం యిదివరకటి కంటే తేటబడి, ఆరోగ్యంగా కనిపించింది. నవ్వుతూ వున్న స్వప్నని చూసి సంతోషించాను.

స్వప్న వెనకాలే అన్నపూర్ణమ్మగారు కూడా వచ్చారు.

"బావున్నావమ్మా?" అంటూ ఆప్యాయంగా పలకరించిందావిడ.

"ఇదేనే మా ఫామ్‌హౌస్. ఎలా వుంది చెప్పు?" అంది స్వప్న హుషారుగా. చుట్టూ కొబ్బరి చెట్లు, వాటిముందు పొదల్లా పెరిగిన పూల చెట్లు, కాస్త పక్కగా మట్టిలో వేసిన ఎత్తైన గట్టు, దాని వెనకాల కనుచూపు మేర అరటి తోపు. అరటితోపు చుట్టూ గట్ల వెంబడి కొబ్బరి, మామిడి, నేరేడూలాంటి పెద్ద పెద్ద చెట్లు పెంచివున్నాయి.

పల్లెటూరి వాతవరణాన్ని ప్రతిబింబించేలా, చిన్న డాబా దాని ముందు పెంకులతో దించిన వరండా. వరండాలో ఆకుపచ్చని రంగు వేసి వున్న చెక్క స్తంభాలు. వరండా ముందు ఆరేడు మెట్లూ, మెట్లకి రెండువైపులా వెడల్పాటి అరుగులూ వున్నాయి.

ఇంటిముందు ఆవరణలో ముప్పాతిక భాగం మేరకు చదునైన నాపరాళ్ళు పరచి వున్నాయి. ఆ పక్కగా అరటి తోపుకి ముందువైపు ఒక పెద్ద తొట్టి, ఒక పంపూ కూడా వున్నాయి.

ఇంటినీ, మెయిన్ రోడ్డునీ కలుపుతూ మట్టిరోడ్డు వేసి వుంది.

"మీ ఫామ్ హౌస్ సింప్లీ సూపర్బ్" చెప్పాను. అంతా కళ్ళతోనే స్కాన్ చేసేస్తూ.

"సుందరీ ఈ లగేజ్ లోపల పెట్టు" అంటూ అన్నపూర్ణమ్మగారు కేక వేయగానే ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి బైటికి వచ్చి సామాను అందుకుంది.

స్వప్న నా చెయ్యి పట్టుకుని "ఆంటీ గురించి తెలిసినా రాలేకపోయాం. అయామ్ వెరీ సారీ బామ్మకి అప్పుడు ఒంట్లో బాగుండలేదు" చెప్పింది బాధగా.

పలకరింపులూ, పరామర్శలూ అన్నీ అయ్యాక పెరట్లో అరుగుమీద కాఫీలు తాగుతూ కూర్చున్నాం.

అమ్మ పోయిన తరువాత, వరుసగా జరిగిన సంఘటనలూ, సుమిత్రాదేవి ప్రవర్తన అన్నీ చెప్పుకుని గుండె బరువు దించుకున్నాను.

"ఏంటో తల్లీ కాలం మారింది కానీ మనుషులు మాత్రం మారలేదు. మా కాలంలోనే గయ్యాళి ఆడవాళ్ళు ఉన్నారనుకున్నాను. ఇప్పుడూ ఉన్నారన్నమాట" అంది నిట్టూరుస్తూ.

"నువ్వు మరీ మోడ్రన్ అయిపోయావు బామ్మా. ఏంటోనమ్మా మాకాలంలో అయితే మొహాలు కూడా చూడకుండా పెళ్ళి చేసుకునేవాళ్ళం. ఈ పిల్లలు ప్రేమలూ, దోమలూ అంటూ వెర్రి వేషాలు వేస్తున్నారు. ఆనక ఏడుస్తున్నారు అని మమ్మల్ని తిట్టిపొయ్యాల్సింది పోయి మా కాలంలో గయ్యాళి ఆడవాళ్ళు ఉండేవాళ్ళు అంటావేంటి?" అని స్వప్న పకపకా నవ్వింది.

స్వప్న చెప్పిన తీరుకి మేమిద్దరం కూడా నవ్వేశాము.

నేను రామచంద్రాపురంలో ఉండగానే నా జీవితంలో ఎన్నో మార్పుల్ని ఒక్కసారే తెచ్చిన వానాకాలం వెళ్ళిపోయింది. నెమ్మదిగా 'చలి' ఆ స్థానాన్ని ఆక్రమించేసింది.

ఆ రోజు మధ్యాహ్నం ఎండలో స్వప్న, నేనూ షికారుగా అరటితోటలో తిరిగి వెచ్చగా అనిపించినచోట గట్టుమీద కూర్చున్నాం.

స్వప్న మునపటిలా నవ్వుతూ, సంతోషంగా వుంది. పీడకలలాంటి గతం నుంచి బైటపడ్డట్టే అనిపించింది.

"స్వప్నా నీ ఫ్యూచర్ గురించి ఏమాలోచించావు?" అడిగాను నేను.

"పెళ్ళి గురించేనా నువ్వు మాట్లాడేది?" స్వప్న గొంతులో విసుగు ధ్వనించింది.

"పెళ్ళి గురించి కాదు నేనడిగేది. ఎన్నాళ్ళని యిక్కడ మీరిద్దరే వుంటారు? నీ కెరీర్ గురించి, పర్సనల్ లైఫ్ గురించి ఏదో ఒక ఆలోచన చేయాలి కదా?"

"అమ్మా అన్నయ్యా పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. నేను పెళ్ళికి రెడీగా లేను. యూఎస్‌లో యూనివర్శిటీకి అప్లై చేస్తున్నాను. సీట్ కన్‌ఫర్మ్ అయితే వెళ్ళిపోతాను. ఈ విషయం యింట్లో వాళ్ళకి తెలియదు. తెలిస్తే అంత ఈజీగా ఒప్పుకోరు. సమయం వచ్చినప్పుడు వాళ్ళకి చెప్పి, కన్విన్స్ చేస్తాను. ప్లీజ్ కీప్ దిస్ యాజ్ ఎ సీక్రెట్" నా చేతిమీద చేయివేస్తూ చెప్పింది.

"అలాగే" చెప్పాను నేను.

స్వప్నతో, బామ్మగారితో రోజులు సరదాగానే సాగిపోతున్నాయి. కానీ రాత్రిపూట అందరూ నిద్రపోయాక నా గదిలో ఒంటరిగా మంచం మీద పడుకుని ఉన్నప్పుడు ఒకరకమైన భయం ఆవరిస్తుంది.

"నేనెక్కడున్నాను?" అమ్మా.. అమ్మా" అని అరుస్తూ వులిక్కిపడి లేస్తాను. అప్పుడు అమ్మ చనిపోయిందని గుర్తుకు వస్తుంది. సందీప్ గుర్తుకు వస్తాడు. నా జీవితం గురించి నాకు భయం వేస్తుంది.

రామచంద్రాపురం వచ్చి దాదాపుగా పదిరోజులపైనే అయ్యింది. గాలిమార్పూ, కొత్త వాతావరణం, స్వప్న సాహచర్యం అన్నీ బాగానే వున్నా త్వరగానే పరిసరాలు బోరుకొట్టాయి. ఏదో ఒక పని వుంటేగానీ ప్రస్తుత పరిస్థితి నుంచి బైటపడేట్టుగా లేదనిపించింది.

"తన్మయీ యింకా యిలాగే వున్నావా? త్వరగా రెడీ అవ్వు. గుడికి వెళదాం" స్వప్న దుపట్టా సర్దుకుంటూ చెప్పింది.

"గుడికా? యిప్పుడే వెళుతున్నామా?" అప్పటికే రెడీ అయిపోయి వున్న స్వప్నని చూస్తూ ఆశ్చర్యంగా అడిగాను.

"నిన్ను తయారుగా వుండమని గంటక్రితమే చెప్పానుగా" అంది స్వప్న కనుబొమలు ఎగరేస్తూ.

"నిజమా?"

"నాకెప్పుడు చెప్పిందా?" అని ఆలోచిస్తూ అన్నాను.

"ఎనీవే బామ్మ కూడా తయారైపోయింది. ప్రవచనానికి ఆలస్యం అవుతుందేమో మేం వెళ్ళివస్తాం"

స్వప్న చెబుతూనే "సరే" అంటూ సోఫాలో నుంచి లేచాను.

"అన్నట్టు ఈ పూట సుందరి రాదు. నాలుగింటికే వంట చేసి పెట్టి వెళ్ళిపోయింది. నువ్వు మాకోసం వెయిట్ చెయ్యకు. చపాతీలు వేడి చేసుకుని తినేసెయ్" గుమ్మం దిగుతూ చెప్పింది స్వప్న.

"అలాగే" చెప్పి తలుపేసుకున్నాను. తిరిగి వచ్చి సోఫాలో కూర్చుని లాప్‌టాప్ ఒళ్ళో పెట్టుకుని నా రెస్యూం ప్రిపేర్ చేసుకుంటూ కూర్చున్నాను. దాదాపుగా ఒక గంట గడిచిన తర్వాత కాలింగ్ బెల్ మోగింది. లేచి తలుపు తీశాను.

"సందీప్" ఆశ్చర్యంతో నోటమాట రాలేదు నాకు.

"ఇక్కడ ఎలా? నేనిక్కడ వున్నానని ఎలా తెలిసింది?"

సందీప్ గొంతు సవరించుకున్నాడు.

"లోపలికి రావచ్చా?"

"ఆ!!ఁ.. సారీ" తడబడుతూ దారి యిచ్చాను.

"అదేంటి? కాలికేమయ్యింది?" అతను ఒకొక్క అడుగే నెమ్మదిగా వేస్తుంటే కంగారుగా అడిగాను.

"చిన్న యాక్సిడెంట్ ఫుట్ ఫ్రాక్చర్ అయ్యింది. కుడిచేత్తో క్రచ్ పట్టుకుని లోపలికి వస్తూ అన్నాడు.

"ఆర్యూ ఓకే? ఎలా జరిగింది?" సపోర్ట్‌గా అతని చెయ్యి పట్టుకునే ప్రయత్నం చేస్తూ అన్నాను.

"కంగారు పడకు గోడౌన్‌లో సరుకు సర్దిస్తుంటే, కాలిమీద వెయిట్ పడింది" నేరుగా వచ్చి, క్రచ్ పక్కన పెట్టి సోఫాలో కూర్చున్నాడు.

"నువ్వు యిక్కడికెందుకు వచ్చావు?" అడిగాను అతన్ని సుటిగా.

"అదే ప్రశ్న నేను నిన్ను అడగాలనుకుంటున్నాను. నువ్వెందుకు వచ్చావిక్కడికి?"

"నీకన్నీ తెలుసు సందీప్ నా చేత చెప్పించాలని ట్రై చెయ్యకు" సోఫాలో లాప్‌టాప్‌ని తీసి టేబుల్ మీద పెడుతూ అన్నాను.

అతన్నుంచి జవాబేమీ రాలేదు.

ప్రయాణం వల్ల అలసిపోయి, వడిలిపోయినట్లుగా వుందతని మొహం.

"ఎలా వచ్చావు? నేను యిక్కడున్నట్టు వెంకట్ చెప్పాడా?" అడిగాను పొడిగా.

"ఊహూ!" చేత్తో జుట్టు వెనక్కి తోసుకుని నుదురు రుద్దుకున్నాడు.

"వాడు మాటిచ్చాడంటే చచ్చినా తప్పడు. అస్సలు చెప్పలేదు. నువ్వు యిక్కడికే వచ్చివుంటావని నేను ఊహించాను. మాధవ్‌ని అడిగి అడ్రస్ తీసుకున్నాను. వెంకట్ కారు తీసుకుని వచ్చాను."

నాకేం మాట్లాడాలో తోచలేదు.

చేతులు వెనక్కి కట్టుకుని గోడకానుకుని నిలబడ్డాను.

అతను నెమ్మదిగా లేచి, క్రచ్ సాయంతో నా దగ్గరికి వచ్చాడు.

"తనూ! నువ్వు నన్ను ప్రేమించింది యింతేనా? ఎలా వదిలేసి రాగలిగావు?" అతను దగ్గరగా నా ముందుకు వచ్చి నిలుచున్నాడు.

నేను దేన్నుంచి పారిపోయి రావాలనుకుంటున్నానో అదే నన్ను ఎటూ కదలకుండా బంధించివేసింది.

సందీప్ తాలూకు ఆకర్షణ శక్తి నన్ను అయిస్కాంతం లాగినట్టు లాగేసింది. ఇద్దరం సంతోషంగా గడిపిన క్షణాలు గుర్తొచ్చాయి.

కాలు ఫ్రాక్చర్ అయినా, నాకోసం యింత దూరం డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడు. నేనెంత నిర్ధాక్షిణ్యంగా వదిలేసి వచ్చాను అతన్ని.

అతనిలోని ప్రేమ అంతా ఆ నిశ్శబ్దంలో నాకు అనుభవమౌతూవుంది.

కనురెప్పలు ఎత్తి అతని కళ్ళలోకి చూశాను.

అతని కళ్ళలో నన్ను కోల్పోతానేమోనన్న బాధ స్పష్టంగా కనిపించింది. అతను చటుక్కున వంగి నన్ను ముద్దుపెట్టుకున్నాడు.

నా మనస్సూ, శరీరం అతన్ని కోరుకుంటుంది. నాకు తెలియకుండానే నా రెండు చేతులూ అతని మెడని చుట్టుకున్నాయి.

అతని ప్రేమతో ఏకత్వభావనని అనుభవించేలోపలే మనసు తప్పు చేస్తున్నావని హెచ్చరించింది.

గబుక్కున నా రెండు చేతుల్ని వెనక్కి తీసి అతన్ని భుజాలు పట్టుకుని ఆపి నెమ్మదిగా తల పక్కకి తిప్పుకున్నాను.

"దిసీజ్ నాట్ రైట్ సందీప్ మనం చేస్తున్నది కరెక్ట్ కాదు" అన్నాను పక్కకి తిప్పుకుంటూ అతని మొహంలో కోపం, నిరాశ, అసహనం అన్నీ ఒకేసారి కలగలిపి కనిపించాయి.

"వై ఆర్ యూ ఎవైడింగ్ మీ. ఆ రోజు మా అమ్మ మీ యింట్లో గొడవచేసినదానికి నీ రియాక్షన్ యిది" అంటే మాత్రం నేను ఒప్పుకోను. నీ పద్ధతి నాకేం నచ్చలేదు. మనం దీనిగురించి మాట్లాడుకుందాం అని చెప్పాను నీకు. అయినా నువ్వు పారిపోయి వచ్చావు. ఐ థాట్ యూ లవ్ మీ. యూ స్టాండ్ ఫర్ మీ. కానీ నువ్వు నన్ను డిసప్పాయింట్ చేశావు. యూ ఆర్ సో వీక్" కోపంగా అరిచాడు.

"యస్. నేను వీక్ పర్సన్ని." నేనూ ఉక్రోషంగా అరిచాను.

"మనిద్దరి మధ్యా ఏమీలేదు అని నువ్వు అన్నప్పుడు నేను నిన్ను ప్రశ్నించలేదు. నువ్వు అన్ కండిషనల్గా ప్రేమించాలని నిన్ను నిర్భందించలేదు" ఆ మాటలంటున్నప్పుడు నా శరీరమంతా ఉద్వేగంతో వణికిపోయింది. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఇద్దరం కాస్సేపు మౌనంగా వున్నాం.

"అతనికి తెలియదు. రంగారావు అంకుల్కి నా జీవితంలో ఎటువంటి స్థానం వుందో. ఆ రోజు వర్షం కురిసిన రాత్రి ఆయన ఎలా ట్రీట్ చేయబడ్డారో తెలియదు. ఇప్పుడవన్నీ అతనికి చెపితే ఏదో సొల్యూషన్ కోసం అతను ఆలోచిస్తాడు. అది అంకుల్ని మరింత చిక్కుల్లో పడేయగలదు. ఇదే బెస్ట్ సొల్యూషన్. అంతే" నాకు నేనే చెప్పుకున్నాను.

"అయామ్ సారీ. ఐ డిన్ట్ మీన్ ఇట్ ఆవేశంలో అనేశాను" చెప్పాను, ఒక్క నిమిషం ఆగి.

అతను తల వూపాడు.

నేను వేసిన చిక్కుముడి అతనికి అర్థంలేనిదిగా కనిపిస్తూవుంది. నా మీద కోపంగా వున్నాడని నాకు తెలుస్తూనే వుంది.

"ఆకలిగా వుంది తినడానికి ఏమైనా పెడతావా?" అడిగాడతను.

"ఇంతసేపూ అతను ఆకలితో వున్నాడేమో అన్న స్పృహే లేదునాకు. ఛ. కనీసం అతనికి మంచినీళ్ళు కూడా యివ్వలేదు" అనుకుంటూ గబగబా కిచెన్లోకి వెళ్ళాను.

చపాతీలు, కూర వేడిచేసి ప్లేట్లో పెట్టి తెచ్చి యిచ్చాను.

అతను తిన్న తర్వాత లేవబోతుంటే గబుక్కున ముందుకు వచ్చి, అతని చేతిలో ప్లేట్ని అందుకున్నాను.

"ఫర్లేదు. ప్లేట్‌లోనే చెయ్యి కడుక్కో" అంటూ మంచినీళ్ళ బాటిల్ అందించాను. అతనొకసారి నావైపు చూసి, బుద్ధిగా నేను చెప్పినట్టే చేశాడు. ప్లేట్ సింక్‌లో వేసి తిరిగి వచ్చి సోఫాలో అతనికి కాస్త ఎడంగా కూర్చున్నాను.

"ఏం మాట్లాడాలి? ఏమో? తెలియదు. అన్ని తలుపులూ నేనే మూసేశాను" ఆలోచిస్తూ వున్నాను.

అతను కట్టు కట్టిన కాలిని పైకి లేపి "నీకు అభ్యంతరం లేకపోతే కాసేపు రెస్ట్ తీసుకుంటాను" అంటూ వెనక్కి జరిగి సోఫాలో అడ్డంగా వాలాడు.

నేను సర్దుకుని లేవబోయేలోపలే అతను నా చేతిని గట్టిగా పట్టుకుని ఆపి, నా ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు.

"సందీప్" వారిస్తున్నట్టుగా అన్నాన్నేను.

"ప్లీజ్" నా మొహంలోకి చూస్తూ రెండు చేతులతో నా చేతిని పట్టుకున్నాడు.

"నేను యింకేమీ మాట్లాడను. నిన్ను యిబ్బంది పెట్టను. సరేనా?"

అతను కోపంగా అన్నమాటలు కంటే, ఈ మాటలు మరింత బాధపెట్టాయి నన్ను.

మా యిద్దరికీ మళ్ళీ ఆ క్షణాలు దొరకవన్నట్టుగా నిశ్శబ్దంగా ఆ అనుభవాన్ని గుండెల్లో పదిలపరుచుకుంటూ వున్నాను.

కాస్సేపటికి కాలింగ్ బెల్ మోగింది.

ఇద్దరం లేచి సర్దుకుని కూర్చున్నాం. నేను వెళ్ళి తలుపు తీశాను.

"అబ్బా! చాలానే లేటయ్యింది గుళ్ళో" స్వప్న చెప్పులు వదిలి లోపలికి వస్తూ అంది.

"అర్రెరె సందీప్ నువ్వెప్పుడు వచ్చావు? రియల్లీ ఎ సర్ ప్రైజ్" అంది సందీప్‌ని చూస్తూనే.

నేను స్వప్నవైపు చురచురా చూశాను.

"ఇదంతా ముందే నీకు తెలుసు కదూ" అన్నాను. స్వప్నకి మాత్రమే వినపడేలా.

"ఏం బాబూ ఎలా వున్నావు? కాలికేమయ్యింది?" అన్నపూర్ణమ్మగారి పరామర్శలు మొదలయ్యాయి.

ఆ రోజు రాత్రికి అక్కడే వున్నాడు సందీప్.

తెల్లవారింది నిద్రలేచి బైటికి వచ్చి చూసేసరికి సందీప్ కారు అక్కడలేదు. పొద్దున ఐదు గంటలకే లేచి వెళ్ళిపోయాడు.

"చాలా డిసప్పాయింటెడ్‌గా వున్నాడు" వెనకాల నుంచి చెప్పింది స్వప్న.

"యూ లాస్ట్ హిమ్ ఫరెవర్" అంతరాత్మ చెప్పింది.

ఆ తర్వాత నాకు రామచంద్రాపురంలో కూడా ఉండబుద్ది కాలేదు. హైదరాబాదులో ఒక యింటర్వ్యూకి పిలుపు రావడంతో బయలుదేరి వెళ్ళాను.

జాబ్ రావడం.. అక్కడే ఒక అపార్టుమెంటు అద్దెకి తీసుకుని చేరిపోవడం అన్నీ టకటకా రెండువారాల్లోనే జరిగిపోయాయి.

స్వప్న హైదరాబాదులో ఉన్న తన ఫ్రెండ్స్‌కి నా గురించి చెప్పి, వాళ్ళు నాకు సాయపడేలా చేసింది. స్వప్న ఫ్రెండ్స్ సహాయంతో నేను త్వరగానే హైదరాబాద్‌లో సెటిలయ్యాను.

కొత్త ఉద్యోగం బాగానే వుంది. కొత్త వ్యక్తులు, కొత్త పరిచయాలు జీవితం పూర్తిగా మారిపోయినట్టయ్యింది.

కానీ మనసు లోపల ఏర్పడిన శూన్యం మాత్రం భర్తీ కాలేదు. రోజువారీ పనులు మామూలుగానే చేసుకుపోతున్నా. ఒంటరిగా, ఏ పనిలేకుండా వున్నప్పుడు మాత్రం లోపల అణిచిపెట్టుకున్న బాధ కెరటంలా పైకి తంతూ వుంటుంది. అందుకే, ఎప్పుడూ నేను ఏదో ఒక పని చేస్తూ వుండడం అలవాటు చేసుకున్నాను.

ఆఫీసులో ఎక్కువ గంటలు పనిచేసే ఏకైక వ్యక్తిని నేనే. నేను హైదరాబాదు వచ్చిన తర్వాత మూడు కేలండర్లు మారిపోయాయి. కానీ నా జీవితంలో మాత్రం ఏ మార్పూ రాలేదు.

ఈ మూడు సంవత్సరాలలో ఆఫీసులో నాతోబాటు పనిచేసే కొలీగ్స్ అందరితో బాగా స్నేహం పెరిగింది.

అందులో కొందరు ఆత్మీయురాలిగా చూస్తే, కొందరి కళ్ళు మాత్రం నన్ను ఆరాధనగా చూస్తూ వుంటాయి.

కానీ యివేమీ నన్ను కదిలించలేకపోయాయి.

నేను హైదరాబాదు షిఫ్ట్ అయిన రెండు నెలలకి స్వప్న అమెరికా వెళ్ళిపోయిం ది.. సైకాలజీలో హయ్యర్ డిగ్రీ కోసం బోస్టన్ యూనివర్సిటీ చేరింది.

అక్కడే స్వప్నకి అభీతో పరిచయం అయ్యింది. అభీ.. అభినవ్ తెలుగువాడే ఇద్దరూ 'తానా' సభలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. తనీష్ వల్ల కలిగిన గాయాన్ని మర్చిపోయి లైఫ్‌లో ముందుకు వెళ్ళింది స్వప్న.

అభీ స్వప్న అమెరికాలోనే పెళ్ళి చేసుకున్నారు.

నిజానికి ప్రేమ విషయంలో నాకంటే ఎక్కువ కుంగిపోయింది. డిప్రెషన్‌లోకి కూడా వెళ్ళింది. ఏడ్చింది. దిగులు పడింది. డీలా పడిపోయింది. అయినా, లేచింది. ముందుకు నడిచింది.

నేను స్వప్న లా డిప్రెషన్‌లోకి వెళ్ళలేదు. నలుగురి ముందు బైటపడి ఏడ్వలేదు. నేను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి సందీప్‌కి దూరంగా వచ్చి నా జీవితం నేను సాగిస్తున్నాను.

అయినా పెళ్ళి ఆలోచన చెయ్యలేకపోయాను. సందీప్‌కి దూరమయ్యానన్న బాధ నా గుండెల్లో నిశ్శబ్దంగా గూడుకట్టుకు పోయింది. అది పైకి కనిపించకపోయినా నా అంతరంగాన్ని మొత్తం చీకటి మయం చేసింది.

ఒకరోజు పొద్దున ఆఫీసుకి బయల్దేరబోతుండగా సెల్‌లో మెసేజ్. "ప్లీజ్ మీట్ మీ ఎట్ నోవాటెల్ ఎట్ ఫైవ్ ఇన్ ద ఈవినింగ్‘ నీడ్ ఎ ఫేస్ టూ ఫేస్ టాక్" అరుణ్.

మేసేజ్ చదివాను.

అరుణ్ నేను హైదరాబాద్ వచ్చిన కొత్తలో స్వప్న ద్వారా పరిచయం అయ్యాడు.

సహజంగానే, అరుణ్‌ది ఎక్కువగా మాట్లాడే మనస్తత్వం కావడం, యింకా బోల్డంత కలుపుగోలుతనం కూడా వుండడం వల్ల తొందరగా మా యిద్దరికీ స్నేహం కుదిరింది.

"ష్యూర్!" రిప్లై యిచ్చి, సెల్‌ని హ్యాండ్ బాగ్‌లో వేసి, డోర్ లాక్ చేశాను.

సాయంత్రం నాలుగింటికే ఆఫీస్ నుంచి బైటపడి అరుణ్‌ని కలవడం కోసం బయలుదేరాను. నవంబర్ నెల మొదలవడంతో వాతావరణం కొద్దిగా చల్లగా వుంది. గంటలోపే కారు ‘నోవాటెల్‘ ముందు ఆగింది.

కారు పార్క్ చేసి దిగి, "ఇదే ప్లేస్ కదా" అనుకుంటూ, సెల్‌లో మెసేజ్ ఓపెన్ చేసి రీకన్ఫర్మ్ చేసుకున్నాను.

పార్కింగ్ నుంచి కదిలి, నీడలు తేలుతూ వున్న నల్లని గ్రానైట్ మెట్లమీద హైహీల్స్‌ని టకటకలాడిస్తూ డోర్ తీసుకుని లోపలికి వెళ్ళాను.

తలుపు తీస్తూనే, ఏ.సి వెంట్‌లో నుంచి చల్లగాలి ఒక్కసారిగా మొహాన్ని తాకింది. భుజాల మీదకి వదిలేసిన జుట్టుతో బాటు, నేను కట్టుకున్న లైట్ వెయిట్ శారీ కొంగూ ఒకేసారి గాలికి రెపరెపలాడాయి.

హోటల్ లోపల పరుచుకున్న ఆర్టిఫిషియల్ లైటింగ్, సన్నగా వినిపిస్తున్న మ్యూజిక్. బైట నుంచి పూర్తిగా వేరే వాతావరణంలోకి వచ్చిన ఫీలింగ్‌ని కలిగిస్తూ వుంది.

ఫోర్క్‌లూ, స్పూన్‌లూ, పింగాణీ గిన్నెలకీ, ప్లేట్లకీ తగిలి చేస్తున్న సన్నటి శబ్దాల మధ్య ఠీవిగా నడుచుకుంటూ, నేను వెళ్ళాల్సిన టేబుల్ వైపుకి నడిచాను. మధ్య మధ్య కొన్ని తలలు నావైపు తిరిగి చూడడం. కొన్ని చూపులు నా వెనకే రావడం నాకు తెలుస్తూనే వుంది.

"హాయ్!" కాస్త దూరం నుంచి అరుణ్ చెయ్యివూపాడు.

నవ్వుతూ వెళ్ళి అతని ఎదురుగా కూర్చున్నాను.

"యూ ఆర్ లుకింగ్ బ్యూటిఫుల్" కన్నార్పకుండా నన్నే చూస్తూ అన్నాడు.

"థాంక్యూ! ఇవాళ ఆఫీస్‌లో 'ఎథినిక్ డే' అని యిలాంటి గెటప్‌లో వెళ్ళాల్సివచ్చింది. రొటీన్ గోల. దీపావళి ప్రీ సెలబ్రేషన్స్‌ట. ఇంతకీ ఎంతసేపట్నుంచీ వెయిట్ చేస్తున్నావు?" హాండ్ బ్యాగ్‌ని తీసి పక్క ఛెయిర్‌లో పెడుతూ అన్నాను.

"ఎక్కువసేపు కాలేదు. ఆర్డర్ చేద్దామా?" అంటూ మెనూకార్డు ముందుకి తోశాడు.

ఇద్దరం ఎవరికి కావలసింది వాళ్ళం ఆర్డర్ చేశాం.

అరుణ్ నేను హైదరాబాదులో జాబ్‌లో చేరినప్పుడు స్వప్న ద్వారా పరిచయం అయ్యాడు.

సహజంగానే, అరుణ్‌ది ఎక్కువగా మాట్లాడే మనస్తత్వం కావడం, ఇంకా బోల్డంత కలుపుగోలుతనం కూడా వుండడం వల్ల, తొందరగానే మా యిద్దరికీ స్నేహం కుదిరింది.

కాస్సేపు, ఆ మాటా, ఈ మాటా అయ్యాక, "ఏంటీ? ఫోన్‌లో కాకుండా, ఫేస్ టూ ఫేస్ మాట్లాడాలి అని పిలిచావు?" నేరుగా విషయం అడిగేశాను.

అరుణ్ భుజాలెగరేసి, చిన్నపిల్లాడిలా చేతులు రుద్దుకున్నాడు.

అతని వాలకం చూస్తుంటే, నెర్వస్‌గా వున్నాడనిపించింది.

ఇంతలో, వెయిటర్ మేం ఆర్డర్ చేసిన సూప్, న్యూడిల్స్, సలాడ్ తీసుకువచ్చి, టేబుల్ మీద పెట్టి వెళ్ళాడు.

"కమాన్! రిలాక్స్ అంత నెర్వస్‌గా ఫీలవక్కర్లేదు. టైం తీసుకుని చెప్పు" సూప్ బౌల్ ముందుకి లాక్కుంటూ చెప్పాను.

"తనూ.. అదీ.. అదీ.. నా మీద నీ ఒపీనియన్ ఏంటి?" ఆరాటంగా నా మొహంలోకి చూస్తూ అడిగాడు.

అతని వాలకాన్ని బట్టి, అతని ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకున్నాను.

"చెప్పేదేముందీ? యూ ఆర్ ఎ జెంటిల్మేన్" అన్నాను బైటపడకుండా నవ్వుతూ.

"అంటే నేనొక గుడ్ హజ్బెండ్‌ని కాగలనంటావా?" అడిగాడు.

"అది నేనెలా చెబుతాను? నీ భార్య మాత్రమే చెప్పగలదు" అన్నాను కాజువల్‌గా.

"అదే. నువ్వు నా భార్య అయితే... ఐ మీన్ నువ్వే నా వైఫ్‌గా వున్నావనుకో. నేను హజ్బెండ్‌గా నీకు ఓ.కేనా! "ధైర్యం చేసి అడిగేశాడు.

వెంటనే, నా చేతిలోని స్పూన్‌ని సూప్ బౌల్‌లోకి వదిలేశాను.

"నాకు తెలుసు. నువ్వు సందీప్ అనే అతన్ని ప్రేమించావని. నాకేం అభ్యంతరంలేదు. ఈ రోజుల్లో యిది చాలా కామన్. నాకూ పాస్ట్‌లో యిద్దరు గాళ్‌ఫ్రెండ్స్ వున్నారు. ఒకరితో చాలా సీరియస్ రిలేషన్‌షిప్ కూడా ఉండేది. కానీ, అది వర్కవుట్ అవలేదు. మెచ్యూరిటీలేని వయసు.

నిన్ను మూడేళ్ళ నించి చూస్తున్నాను. పెళ్ళి చేసుకుంటే, నీలాంటి అమ్మాయే కావాలనిపించింది.

నీ వైపు నుంచి నువ్వు ఒప్పుకుంటే చాలు. నాకింకేమీ అవసరంలేదు. నా గురించీ నీకు తెలుసు. పెద్దగా బాదరబందీ లేని ఫ్యామిలీ మాది. మా అమ్మా నాన్నా చాలా ఓపెన్ మైండెడ్ పీపుల్.

నువ్వు లేకపోతే నేను చచ్చిపోతాను. నిన్నే ప్రేమిస్తున్నాను అని సినిమా డైలాగులు చెప్పను. ఈ వయసులో అలా మాట్లాడితే అది ఒక పెద్ద జోక్‌లా వుంటుంది. నా ప్రపోజల్ గురించి నువ్వు కాస్త ఆలోచించి చెప్పు అని మాత్రం అడగగలను" చెప్పేసి వెనక్కి వాలాడు.

నేను అరుణ్ చెప్పిందంతా సావధానంగా విన్నాను. అతను చెప్పిన తీరు నిజంగా నాకు నచ్చింది.

"ఐ విల్ థింక్ ఎబౌట్ యిట్" చెప్పాను పొడిగా.

"హమ్మయ్య" గట్టిగా నిట్టూర్చాడు అరుణ్.

నేను అతనివైపు ఆశ్చర్యంగా చూశాను.

"కంగారుపడకు. ఈ రిలీఫ్ నువ్వు ఒప్పుకుంటావని కాదు. నేను నిన్నరాత్రి నుంచి ప్రిపేరయ్యినదంతా కరెక్ట్‌గా, తడబడకుండా చెప్పగలిగినందుకు. ఇంకా, నువ్వు వేడి వేడి సూ ప్ నా మీద దొర్లించనందుకు" అన్నాడు నవ్వుతూ. అతని మాటలకి నేనూ నవ్వాను.

"చూడూ! నీ డెసిషన్ ఏదైనా, మనం ఎప్పటికీ ఫ్రెండ్స్‌లానే వుంటూ. ఒకవేళ మనిద్దరికీ పెళ్ళి కాలేదనుకో అప్పుడు నేను మా అమ్మ పోరు పడలేక వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాననుకో. నేను మా ఆవిడతో గొడవపడ్డప్పుడల్లా, యిలా నీతో కూర్చుని సూప్ అయినా తాగొచ్చు. అన్నాడు మళ్ళీ నవ్వేస్తూ.

అపార్ట్‌మెంట్ తాళం తీసి, లోపలికి వచ్చాను. వస్తూనే, ఫ్రెష్ అయ్యి నైట్‌పాంట్, టీ షర్టులోకి మారి సోఫాలో వాలిపోయాను. బైట దీపావళి సంబరాలు జరుగుతున్నాయి. పైకెగిసిన తారాజువ్వలు, ఆకాశంలో పువ్వుల్లా విచ్చుకుని, కిటికీ అద్దాల్లో తళుక్కుమని మెరిశాయి.

కానీ, యింట్లో మాత్రం భయంకరమైన నిశ్శబ్దం. మూడు సంవత్సరాల నుంచి, యిదే ఒంటరి జీవితం నాది. సరదాగా వెలిగించడానికి కొన్ని కేండిల్స్ తెచ్చాను కానీ, వెలిగించబుద్ధి కాలేదు. అలాగే బద్ధకంగా సోఫాలో కూర్చుని వున్నాను.

ఇంతలో నా ఫోన్ రింగయ్యింది. యూ.ఎస్ నుంచి స్వప్న ఫోన్ చేసింది.

"హలో!" నిరాసక్తంగా పలికాను.

"అరుణ్ కలిశాడా నిన్ను?" అడిగింది వెంటనే.

"అంటే, నీకు అంతా ముందే తెలుసన్నమాట" కనుబొమలు చిట్లిస్తూ అన్నాను.

"అఫ్‌కోర్స్! నువ్వూ ఆలోచించు. ఎన్నాళ్ళని ఒంటరిగా వుంటావు నువ్వు? సందీప్‌తో పాచప్ చేసుకోవడానికి నువ్వు యిష్టపడలేదు. అది నీ డెసిషన్. మరి ఎందుకు నిన్ను నువ్వే పనిష్ చేసుకుంటున్నావు? దీనివల్ల ఒరిగేదేమీలేదు.

రేపీపాటికి సందీప్‌కి ముద్దుముద్దుగా తెల్లటి బుగలతో వుండే పిల్లలు పుడతారు. అప్పుడతను అన్నీ మరిచిపోతాడు. ఆ కన్నింగ్ చిత్రని కూడా నెత్తిన పెట్టుకుని పూజిస్తూ, హాయిగా, ఆనందంగా లైఫ్ గడిపేస్తాడు. నువ్వేదో పెద్ద త్యాగం చేశాననుకుంటున్నావు కానీ, అప్పుడు తెలుస్తుంది నీకు అసలైన బాధ అంటే ఏంటో?"

"..."

"అందుకే, నేను చెప్పినదాని గురించి ఆలోచించు. అరుణ్ మంచివాడు. అభీ కూడా నీకు మరీ మరీ చెప్పమని చెప్పాడు."

"అభీ ఎలా వున్నాడు? అడిగానని చెప్పు"

"ఆ!c బానేవున్నాడు. నెక్స్ట్ మంత్ యిద్దరం యిండియాకి వస్తున్నాం. బామ్మ ఆరోగ్యం బావుండడంలేదు. ఒకసారి వచ్చి చూడాలనుకుంటున్నాం. నిన్నుకూడా ఎప్పుడూ అడుగుతూనే వుంటుంది బామ్మ. వీలైతే నువ్వూ రాకూడదూ"

"ట్రై చేస్తాను"

"సరే.. అయితే అభీ వాళ్ళ మదర్ ఫోన్ చేస్తున్నారు. వెంటనే, ఎత్తకపోతే ఆవిడ అలుగుతుంది. ఎంతైనా అత్తగారు కదా" అని గలగలా నవ్వి ఫోన్ పెట్టేసింది.

స్వప్న మళ్ళీ మామూలు మనిషయ్యింది. జీవితం నార్మల్ అయిపోయింది. స్వప్న ఎంత దెబ్బతిన్నా వెనకాల అండగా ఓ కుటుంబం వుంది.

అలాగే, సందీప్ కూడా ఎక్కువరోజులు నా గురించి ఆలోచించలేడు. అతనికి బిజినెస్ వుంది. ఫ్యామిలీ వుంది. స్వప్నలాగే, పెళ్ళి చేసుకున్న తర్వాత, తన లోకంలో పడిపోతాడు.

మళ్ళీ ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టేశాయి.

ఎప్పుడు పడుకున్నానో సోఫాలోనే కునుకుపట్టేసింది.

"తనూ! తనూ" ఎవరో భుజం తట్టి లేపుతున్నారు.

"ఊఁ.." బద్ధకంగా కళ్ళు విప్పాను.

"పిల్లాడు ఏడుస్తున్నాడు. ఏంటా మొద్దు నిద్ర..లే" కళ్ళు విప్పి చూసేసరికి ఎదురుగా అమ్మ నిలబడి వుంది.

పక్క గదిలోనుంచి పసిపిల్లాడి ఏడుపు వినిపిస్తూ వుంది. పరుగున ఆ గదిలోకి వెళ్ళాను.

అక్కడ ఉయ్యాలలో ముద్దులొలుకుతూ, తెల్లగా బొద్దుగా ఒక బాబు కనిపించాడు. నేను గబుక్కున ఆ చిన్నబాబుని ఎత్తుకుని గుండెలకి హత్తుకున్నాను. విచిత్రం నేను ఎత్తుకోగానే బాబు ఏడుపు ఆపేశాడు.

అప్పుడే, "ఏడుపు ఆపేశాడా?" అంటూ సందీప్ ఆ గదిలోకి వచ్చాడు. వస్తూనే, నా భుజం మీద చేయివేసి ముందుకి వంగి బాబు నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాడు.

వెంటనే, బుజ్జిబాబు నవ్వుతూ, కేరింతలు కొట్టడం మొదలుపెట్టాడు.

"ఎంతో ముద్దుగా వున్నాడు ఎవరీ పిల్లాడు?" అడిగాను సందీప్ వైపుకి చూస్తూ. సందీప్ నా కళ్ళలోకి చూసి నవ్వాడు.

"తెలియనట్టు అడుగుతావేం? మన బాబే" అన్నాడు నవ్వుతూ.

ఒక్కసారిగా అదంతా నమ్మలేనట్టు అనిపించింది నాకు.

సందీప్ నవ్వు, భుజం మీద తన చేతి స్పర్శ పసిపిల్లాడిని ఎత్తుకుని గుండెకి హత్తుకున్న వెచ్చదనం స్పష్టంగా తెలుస్తున్నాయి.

"ఇది కలకాదు నిజమే" అనుకుంటుండగానే, ఠక్కున మెలుకువ వచ్చింది.

కళ్ళు విప్పి చూశాక, నేను కూర్చున్న సోఫా చుట్టూ వున్న గోడలూ కనిపించాయి. 'అది కలే' అని నిర్ధారణ చేసుకున్నాను.

కానీ మనసులో నేను పొందిన అనుభూతి వల్ల అది 'నిజమే' అన్న భ్రమలోనే వున్నాను.

సందీప్ పక్కన వుండడం, పసిపాపడి కేరింతలూ, అన్నింటికన్నా మేమంతా ఒక 'హేపీ ఫ్యామిలీ' అన్న ఫీలింగ్ సంతోషంతో ముంచెత్తాయి నన్ను.

"నీ మనసులో అంతర్లీనంగా వున్న కోరికే అలా కలలాగా వచ్చింది తనూ" అంతరాత్మ చెప్పింది.

"నిజమే" ఒప్పుకున్నాన్నేను.

మర్నాడు, ఆఫీస్‌కి వెళుతుండగా సెల్ రింగయ్యింది. ఒక చేత్తో స్టీరింగ్‌ని పట్టుకుని, ఫోన్‌లో స్పీకర్ ఆన్ చేశాను.

"హలో ... తన్మయీ" వెంకట్ గొంతు వినిపించింది. వెంటనే, కారుని పక్కకి తిప్పి ఆపాను.

"సందీప్ చెల్లెలు ఉమ మేరేజ్ ఫిక్స్ అయ్యింది. రంగారావు అంకుల్ నిన్న నా దగ్గరికి వచ్చారు. నీకు యిన్విటేషన్ పంపమని అడిగారు.

పాపం ఆయనకి నిన్ను చూడాలని వున్నట్టుంది. నీ ఫోన్ నెంబర్ నా దగ్గర ఉంటుందనీ, నేను ఎవ్వరికీ యివ్వననే ఆయనకీ తెలుసు. అందుకే, నన్ను పంపించమని మరీ మరీ చెప్పి వెళ్ళారు. నీకు వాట్సప్‌లో పంపించాను చూడు"

"ఓ.కే థాంక్యూ వెంకట్" చెప్పాను.

"నువ్వు వస్తే బావుంటుంది. రంగారావుగారు కూడా పెద్దవారైపోయారు. ఆయనకి నిన్ను చూడాలనివుందని. విన్న ఆయన మాటల్లో నాకు అర్థమైంది. ఒకసారి వస్తే బావుంటుంది నువ్వు."

"అలాగే తప్పకుండా ప్రయత్నిస్తాను"

"సందీప్ ఎలా వున్నాడు?" అని అడగాలనిపించింది. కానీ ఆగిపోయాను.

"సందీప్ నీ యింటి లోను పూర్తిగా తీర్చేశాడు. ఈ మధ్య నేనూ ఆఫీస్‌కి ఎక్కువగా వెళ్ళడం లేదు. బాగా బిజీ అయిపోయాను. అంతా వాడే చూసుకుంటున్నాడు. యిప్పుడు కంపెనీ కింద మరో యిరవై ఎకరాల పొలం, కొత్త ఎక్విప్‌మెంట్ కూడా కొన్నాడు.

ఉయ్ ఆర్ రన్నింగ్ ఇన్ ప్రాఫిట్స్ ఇన్‌వెస్ట్‌మెంట్స్ పోనూ నీ వాటా డబ్బు నీ ఎకౌంట్‌లో వేస్తున్నాడు."

"ఐ నో నేను చూసుకుంటున్నాను" చెప్పాను.

"సందీప్ నా గురించి అడుగుతాడా? చిత్రతో సందీప్‌కి పెళ్ళి జరిగిందా? లాంటి ప్రశ్నలు నా మనసుని తొలిచేశాయి.

బహుశా, నేను బాధపడతాననేమో. స్వప్నగానీ, వెంకట్‌గానీ ఆ విషయాలు నాతో ప్రస్తావించరు.

నా మనసులో ప్రశ్నలకి ఏ జవాబూ యివ్వకుండానే, వెంకట్ ఫోన్ పెట్టేశాడు.

లంచ్ బ్రేక్‌లో వాట్సప్ ఓపెన్ చేసి, వెంకట్ పంపించిన యిన్విటేషన్ కార్డుని చూశాను. అప్పటికి, నాలుగోసారి ఆ ఇన్విటేషన్‌ని చూడడం.

"రంగారావుగారు ఎంతో అభిమానంతో ఈ యిన్విటేషన్‌ని పంపమని అడిగి వుంటారు" టాబ్ క్లోజ్ చేస్తూ నిట్టూర్చాను.

"ఎన్నాళ్ళని యిలా తప్పించుకుని తిరగడం? పారిపోవడం? అక్కడ నీకొక యిల్లు వుంది. మీ అమ్మ జ్ఞాపకాలు వున్నాయి. నీకొక బిజినెస్ వుంది. సందీప్ మీద ప్రేమకొద్దీ యిల్లూ, నగలూ తాకట్టు పెట్టి మరీ అందులో యిన్వెస్ట్ చేశావ్. అవన్నీ వదులుకుని ఎక్కడో చెట్టు తొర్రలో దాక్కుంటానంటే, ఎలా కుదురుతుంది?" స్వప్న ఫోన్‌లోనే వాయించేసింది.

"అయితే, యిప్పుడేం చెయ్యమంటావ్ నన్ను?" విసుగ్గా అడిగాను.

"ధైర్యంగా ఊరికి వెళ్ళు. ఇష్టమైతే పెళ్ళికి హాజరు వెయ్యి లేకపోతే లేదు.

రంగారావుగారిని ఒకసారి చూసి, కనీసం పలకరించిరా. ఆ మాత్రం చెయ్యొచ్చు ఆయన కోసం. బామ్మ కూడా నిన్ను చూడాలని అడుగుతూ వుంది.

ఆ టైంకి మేం ఎలాగూ అక్కడే వుంటాం కాబట్టి, నువ్వు మా యింట్లోనే దిగు.

సందీప్ అంటే యిష్టమైతే పెళ్ళి చేసుకోవాలి. అలా కుదరదు. అనుకున్నప్పుడు ఆ ఫీలింగ్స్‌ని వదిలేసుకోవడానికి ట్రై చేయాలి. ఇంకా, అతన్నే తలుచుకుని కుమిలిపోవడం కరెక్ట్ కాదు.

ఇంకా నువ్వు యిలాగే బిహేవ్ చేస్తే నేనే నీకు థెరపీ యివ్వాల్సి వుంటుంది. నువ్వు ధైర్యంగా వెళ్ళి ఫేస్ చెయ్యి. అది మీ యిద్దరికీ మంచిది. ఆలోచించు" స్వప్న గట్టిగా చెప్పింది.

నేను ఆలోచనలో పడ్డాను.

వారం రోజుల తర్వాత..

రైలు దిగుతూ వుండగానే సన్నగా వానచినుకులు ప్రారంభమయ్యాయి. వానతో ఆ వూరితో ముడిపడిన జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా నా అందిలో మెదిలాయి.

స్ట్రోలర్ సూట్ కేస్‌ని తీసుకుని స్టేషన్ బైటికి రాగానే, స్వప్న వాళ్ళ డ్రైవర్ కనిపించాడు. బ్యాగ్ డిక్కీలో పడేసి, కారు వెనక సీట్లో ఎక్కి కూర్చున్నాను.

స్వప్న వాళ్ళింటికి వెళ్ళేదారిలో ముందుగా, మా యిల్లు కనిపించింది. నేను ఎలా వదిలేసి వెళ్ళానో అచ్చు అలానే వుంది.

కారు కొద్దిగా ముందుకి సాగి, తర్వాతి మలుపు తిరిగింది. అక్కడ, సందీప్ వాళ్ళ యింటి కోసం నా కళ్ళు వెతికాయి.

పాతగేటు, పెంకుల పంచ, కొబ్బరి చెట్లు ఏవీ కనిపించలేదు. ఆ స్థానంలో పెద్ద విల్లా ఒకటి కనిపించింది.

"అంటే, సందీప్ కొత్తగా యిల్లు కట్టాడన్నమాట. ఖచ్చితంగా సుమిత్రాదేవి ఈ విషయంలో సంతృప్తి పడే వుంటుంది" అనుకుని నవ్వుకున్నాను.

స్వప్న వాళ్ళింటికి చేరేసరికి, తుప్పరగా పడుతున్న వాన కాస్తా ఆగిపోయింది. వాళ్ళింట్లో దిగుతూనే అందరూ ఆప్యాయంగా పలకరించారు. అన్నపూర్ణమ్మగారిని చూడడానికి, స్వప్నా, నేనూ ఆవిడ గదిలోకి వెళ్ళాం. ఆవిడ దాదాపుగా నడవలేనిస్థితిలో వుంది. మనిషి సాయంతో బాత్రూంకి మాత్రం వెళ్ళగలుగుతుంది.

బైటకి రావాలంటే మాత్రం, వీల్ ఛెయిర్‌ని వాడుతున్నారు.

నన్ను చూస్తూనే, అన్నపూర్ణమ్మగారు నవ్వింది.

"నన్ను చూడడానికి వచ్చావుటే. మా స్వప్న పెళ్ళి అయ్యింది. నీ పెళ్ళి కూడా అయ్యేదాకా వుండి, పోవాలనుకుంటున్నాను. త్వరగా పెళ్ళి చేసుకో" అందావిడ. ఒంట్లో ఓపిక లేకపోయినా, కంఠం మాత్రం అలాగే వుంది.

ఆ రోజు సాయంత్రం రాజ్యంగారు, నేను వచ్చానని తెలిసి నన్ను చూడడానికి వచ్చారు.

"ఇది వరకటి కంటే, కాస్త ఒళ్ళు తేలి బావున్నావు" అంది నన్ను చూస్తూనే. వాళ్ళమ్మాయి యింజనీరింగ్ వచ్చే యేడాదిలో పూర్తవతుందట. అమ్మనీ, అమ్మ మంచితనాన్ని చూసుకుని, కాసేపు బాధపడింది.

ఆవిడ వెళ్ళిపోయిన ఓ అరగంటకి, అందరినీ లాన్‌లో సమావేశపరిచింది స్వప్న. అందరం టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం.

సరదాగా మాట్లాడుతూ వున్నవాళ్ళల్లా, ఉన్నట్టుండి ముసిముసి నవ్వులు నవ్వుతూ వున్నారు స్వప్న అభీ.

"ఏం జరిగిందబ్బా" అని ఆలోచించే లోపలే వెనక నుంచి "సర్‌ప్రైజ్" అని గావుకేక వినిపించింది.

ఉలిక్కిపడి, కిందపడబోయి తమాయించుకుని, వెనక్కి తిరిగాను వెనకాల, భుజానికి బ్యాగ్‌లో పళ్ళన్నీ కనిపించేల నవ్వుతూ అరుణ్ కనిపించాడు.

"నువ్వేంటిక్కడ?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"నేనే రమ్మన్నాను" స్వప్న చెప్పింది.

"మా నాన్న కబుర్లు అభీకి సరిపోవు. పోతే, మాధవన్నయ్య ఎప్పుడూ బిజీగా వుంటాడు. అందుకే, యిక్కడున్న నాలుగు రోజులూ అభికి కంపెనీగా వుంటాడని రమ్మన్నాను."

స్వప్న నాతో అంటూ అభీతో కళ్ళు కలిపి నవ్వడం నా కంటబడింది.

**మర్రోజు ఉదయాన్నే,** స్వప్న వాళ్ళమ్మగారు అందరినీ గుడికి ప్రయాణం కట్టించారు. స్వప్న, అభీ యిద్దరూ కలిసి మొదటిసారిగా ఇంటికి వచ్చారు. స్వప్నకి పెళ్ళైతే, భారాభర్తలిద్దర్నీ వెంకటేశ్వరస్వామి గుడికి తీసుకువస్తానని మొక్కుకున్నారట. నేను రానంటున్నా ఒప్పుకోలేదు ఆంటీ.

తప్పనిసరై, ఆవిడ బలవంతం మీద పట్టుచీర కట్టి రెడీ అయ్యాను.

అన్నపూర్ణమ్మగారూ రావాల్సిందేనని పట్టుబట్టింది స్వప్న. ఆవిడనీ తయారు చేసి, వీల్‌ఛెయిర్‌లో తెచ్చే ఏర్పాట్లు చేశారు.

ఇక, అరుణ్‌ని బతిమాలాల్సిన అవసరమే లేకపోయింది. "నాకిలాంటివన్నీ చాలా యింట్రస్ట్" అంటూ ముందే రెడీ అయి కూర్చున్నాడు.

అంతేకాదు. ప్రతి అది నిముషాలకీ ఏదో వంకతో, నా చూట్టూనే తిరుగుతూ వున్నాడు. నాకు చికాకు పుట్టుకొచ్చింది.

"నువ్వు ఈ అరుణ్‌ని, నా కోసమే యిక్కడికి పిలిపించావు కదూ" స్వప్న చేయి గిల్లుతూ గొణిగాను.

"అవును. నువ్వు ఎప్పుడూ ఆఫీసు పనిలో బిజీగా వుంటావు. ఇలాంటి వెకేషన్ టైంలో దగ్గరగా వుంటేనే, ఒకరినొకరు అర్థం చేసుకునే ఛాన్స్ వుంటుంది" నన్ను ముందుకు తోస్తూ చెప్పింది.

రెండు పెద్దకార్లలో, బయలుదేరి అందరం గుడికి చేరుకున్నాం. ప్రదక్షిణలు అయిపోయాక, స్వప్న, అభీలకు మళ్ళీ కొంగుముడులు వేసి వాళ్ళచేత ప్రత్యేకంగా పూజ చేయిస్తూ వున్నారు.

"తన్మయీ కారులో పట్టువస్త్రాల కవర్ వుంది. తేవడం మర్చిపోయాను. మన డ్రైవర్ మోహన్ అక్కడే వుంటాడు. కొంచెం తీసుకురా అమ్మా" విశాలాంటీ చెప్పడంతో కదిలాను నేను.

రెండడుగులు వేశాక "కారు వెనకసీట్లో ఉంది ఆ కవరు" మళ్ళీ కేకేసి చెప్పింది ఆంటి. నేను ఆవిడ మాటలు వింటూ, తల వెనక్కి తిప్పి రెండడుగులు వేశాను. ఇంతలో వెనకనుంచి ఎవరో వచ్చి డాష్ యివ్వడంతో ముందుకి తూలాను.

"సందీప్".. నాకు డాష్ యిచ్చిన వ్యక్తి సందీప్ అని అర్థమైంది. నేను ఇంకా ఏదో అనే లోపలే, దభీమంటూ కిందపడిపోయాను. నేను కట్టుకున్న లేత ఆకుపచ్చరంగు పట్టుచీర కుచ్చిళ్ళు నా కాలికి అడ్డు తగిలాయి.

ముందుకు పడిపోవడంతో గభాల్న రెండు చేతులూ, నేలకి ఆనించి, బాలెన్స్ చేసే ప్రయత్నం చేశాను.

తలయెత్తి సందీప్ వైపు చూశాను. అతన్ని చూస్తూనే నా కళ్ళు మెరిశాయి.

అతను చొక్కా కాలర్నీ, చేతిని సరిచేసుకుంటూ పక్కకి తిరిగాడు.

"సందీప్"

పిలిచానో లేదో నాకే తెలియలేదు.

హెల్ప్ కోసం నా చేతిని చాపి, అతని కళ్ళలోకి సూటిగా చూశాను. అతను వెనక్కి తిరిగి నా వైపుకి వంగబోయి ఆగిపోయాడు. అతని కళ్ళు నావైపు కోపంగా చూశాయి. వెంటనే, తలతిప్పుకుని వెళ్ళిపోయాడు. నా చిన్నప్పుడు జరిగిన, యిలాంటి ఒక సంఘటనే నాకు గుర్తుకు వచ్చింది. నిస్సహాయంగా, అతను వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాను.

"హే తనూ! ఏమైంది? పడిపోయావా?" అరుణ్ అంతదూరం నుంచి గబగబా పరిగెత్తుకుంటూ నా దగ్గరికి వచ్చాడు.

"నా చేయి పట్టుకో. చెయ్యి నా భుజం మీద వెయ్యి" అంటూ ఉదారంగా తన బాడీని అంతా మెలికలు తిప్పుతూ మరీ, నాకు సపోర్ట్ యిచ్చి, నన్ను లేవదీశాడు.

"చేతులకి మట్టి అయ్యిందా?" అంటూ నా రెండు అరచేతుల్ని తన చేతులతో తెరిచి చూశాడు. నేను యిదంతా పట్టించుకునే స్థితిలోలేను. నా మనసూ, చూపులూ సందీప్ వెనకాలే వెళుతున్నాయి.

సందీప్ కోపంగా ముందుకు వెళుతున్నవాడల్లా, అరుణ్ మాటలకి తలతిప్పి చూశాడు.

అరుణ్ చేతుల్లో వున్న నా చేతులవైపు తీక్షణంగా చూశాడు సందీప్. వెంటనే, ఒకసారి నా కళ్ళలోకి సూటిగా చూసి, మళ్ళీ వెనక్కి తిరిగాడు.

"ఈ అరుణ్ రాంగ్ టైంలో ఎంట్రీ యిచ్చాడు" అంతరాత్మ గావుకేక పెట్టింది.

వెంటనే అతని చేతుల్లో నుంచి, నా చేతుల్ని వదిలించుకుని, సందీప్ వెనకాలే పరుగెత్తాను. 'సందీప్' అంటూ పిలిచానతన్ని.

నా పిలుపుకి అందకుండా అతను గబగబా నడుస్తూ వున్నాడు. చూస్తూ వుండగానే, గుడి వెనకపక్క మలుపు తిరగడంతో, అతను నా కంటికి కనిపించలేదు.

ఇంతలో భళ్ళున ఏదో పగిలిన శబ్దం అయ్యింది. ఏం జరిగిందోనని ఉన్నపళంగా, గబగబా పరిగెత్తాను నేను.

సందీప్, చేతిలోని సెల్‌ఫోన్ అక్కడ నేలమీద ముక్కలైపడివుంది.

అక్కడున్న అందరూ ఆశ్చర్యంగా తలలు తిప్పి సందీప్ వంకే చూస్తున్నారు. అక్కడే మాధవన్నయ్య కూడా నిల్చుని వున్నాడు.

"సందీప్ ఏమైంది?" అడిగాడు అతన్ని చూస్తూ.

"నథింగ్. సెల్‌ఫోన్ జారిపడింది. డోంట్ వర్రీ" అంటూ వంగి సెల్‌లో నుంచి సిమ్ కార్డ్‌లాగి చూస్తుండగానే, ఫోన్‌ని రీసైకిల్ బిన్‌లో వేసి వెళ్ళిపోయాడు.

అక్కడున్న వాళ్ళ మొహాల్లో కనిపించిన ఎక్స్‌ప్రెషన్‌ని బట్టే నాకు అర్థమైంది. 'అతను సెల్‌ఫోన్‌ని నేలకి విసిరికొట్టాడని.'

పట్టు వస్త్రాలు తీసుకుని గుడిలోపలికి వచ్చేసరికి "మేం కొత్తపెళ్ళి కూతుర్ని యిక్కడే చూస్తున్నామన్నమాట" అంటున్న విశాలాంటీ మాటలూ వినిపించాయి.

రెండడుగులు వేయగానే సుమ, రంగారావుగారు, సుమిత్రాదేవి ఇంకా కొంతమంది బంధువులు, ఎదురుగా వరుసలో నిలబడి వున్నారు.

"సందీప్ ఫ్యామిలీ అంతా గుడికి వచ్చారన్నమాట అనుకుంటూ నా చేతిలో వున్న కవర్‌ని విశాలాంటీకి యిచ్చి, ఆవిడ పక్కనే నిలబడ్డాను.

"అత్తయ్యా బావ ఎక్కడున్నాడు?" అంటూ అప్పుడే చిత్ర అక్కడికి వచ్చింది. రెండు చేతులకీ నిండుగా గాజులూ, పాపిట్లో కుంకుమ, బొట్టు, మెడలో నల్లపూసలతో నిండుగా కనిపించింది.

"అంటే సందీప్‌కీ, చిత్రకీ పెళ్ళయ్యిందా?"

"అమ్మా! బావున్నావా?" రంగారావుగారు ఆప్యాయంగా పలకరించారు.

"సుమ పెళ్ళికి నువ్వు తప్పకుండా రావాలి" మరీ మరీ చెప్పాడాయన. సుమ నా వైపు అభావంగా చూసింది.

సుమిత్రాదేవి నామీద విరుచుకుపడేదేమో. కానీ మాధవన్నయ్య వాళ్ళు వుండడంతో నోరు విప్పలేదు.

వెంటనే, నేను అక్కడ నుంచి వచ్చేశాను.

"తన్మయీ! తన్మయీ" స్వప్న నేను తలుపు తీసేదాకా, తడుతూనే వుంది.

"పొద్దున గుడి నుంచి వచ్చిన దగ్గర్నుంచి ఏడుస్తూనే వున్నావా?" లోపలికి వచ్చి మంచం మీద కూర్చుంటూ అడిగింది. జవాబుగా నేను తలదించుకున్నాను.

"ఏడ్చి..ఏడ్చి.. నీ కళ్ళు బాదంకాయల్లా ఉబ్బిపోయాయి. నువ్వు సందీప్‌ని మర్చిపోలేకపోతున్నావు" అంది నిట్టూరుస్తూ.

"కానీ మర్చిపోవాలి. సందీప్‌కి పెళ్ళయిపోయింది" అన్నాను ముఖం మీద జుట్టుని వెనక్కి తీసుకుంటూ.

"ఏంటీ? సందీప్‌కీ, చిత్రకీ పెళ్ళయ్యిందనుకుంటున్నావా? నువ్వేదో 'త్యాగశీలినమ్మా' అనుకుంటూ అతన్ని వదిలేసిపోతే, అన్నీ నువ్వనుకున్నట్టే జరుగుతాయా?"

"ఏంటే నువ్వనేది?" ఆత్రంగా అడిగాను.

"సందీప్‌కి పెళ్ళి కాలేదన్న విషయం నాకు తెలుసు. నీ టెన్షన్ చూడలేక, ఇందాక అన్నయ్యని అడిగి, యింకొన్ని వివరాలు తెలుసుకున్నాను.

చిత్రకి పెళ్ళయ్యింది. అదీ లవ్‌మేరేజ్‌ట.

చనిపోయిన వాళ్ళ అమ్మ తాలుకు బంధువట అతను. ఏడేళ్ళ నుంచి యిద్దరూ ప్రేమించుకుంటున్నారట. అన్నయ్య కొంత చెప్పాడు. కొంత నేను ఎంక్వైరీ చేశాను" చెప్పింది నింపాదిగా.

స్వప్న చెప్పింది వింటూనే, నాకు చిత్రమీద ఒళ్ళు మండుకొచ్చింది. సుమిత్రాదేవి వెనకాల నిలబడి నన్ను అవమానించడానికి దొరికిన ఏ అవకాశమూ వదల్లేదు చిత్ర. నన్నేకాదు. సందీప్‌తో చిత్ర పెళ్ళి జరిపించాలనుకున్న స్వంత మేనత్తని కూడా వెర్రిదాన్ని చేసింది. ఏడేళ్ళనుంచి ఎవర్నో ప్రేమిస్తూ సందీప్‌తో పెళ్ళికోసం ఎన్ని నాటకాలు ఆడింది.

పాపం రంగారావు అంకుల్ ఈ పెళ్ళి విషయంగా ఎన్ని హింసలు పడ్డారు" ఆవేశంగా అన్నాను స్వప్నతో.

"అవునవును. నీ ఆవేశం అంతా నా దగ్గరే చూపించు" అంది వెటకారంగా.

"అంటే ఏంటి నీ ఉద్దేశ్యం? ఆ సుమిత్రాదేవిలా రోడ్డునపడి అల్లరి చేయాలా? అలా నేను చేయలేను" రెండు చేతులూ మోకాళ్ళ చుట్టూ వేసి కూర్చుంటూ అన్నాను.

"ఆవిడలా అల్లరి చెయ్యక్కర్లేదు. ఆ చిత్రలాగా తేనె పూసిన కత్తిలానూ ఉండక్కర్లేదు. కానీ అందరూ నీ లైఫ్‌తో ఆటలాడుకోవడానికి నువ్వు గ్రీన్ సిగ్నల్ మాత్రం యివ్వొద్దు. ఇది గుర్తుంచుకో"

స్వప్న చెప్పినదానికి బుద్ధిగా తలూపాను.

"ఇంతకీ, రేపు సుమ పెళ్ళికి వస్తున్నావా?" అడిగింది.

"వస్తాను రంగారావు అంకుల్ ఎంతో ప్రేమగా పిలిచారు" అన్నాను గంభీరంగా.

అనుకున్న సమయానికి, స్వప్న వాళ్ళమ్మగారూ మాధవన్నయ్య, వదిన, స్వప్న, అభీ, అరుణ్, నేనూ కల్యాణమండపానికి చేరుకున్నాం.

సందీప్ పెరిగిన తన హోదాకి తగ్గట్టుగా ఘనంగా ఏర్పాట్లు చేశాడని చూడగానే అర్థమైంది.

మాకు అనుకూలంగా వున్న చోట, వరుసగా కుర్చీల్లో కూర్చున్నాం.

"హే! ఆగండి. నువ్వు బైటే నిలబడు. మీరంతా నా చుట్టుపక్కల నిలబడకండి" ఎవరో అదిలిస్తున్నట్టు మాటలు వినిపించడంతో, కూర్చున్నచోటినుంచే, తలతిప్పి చూశాను.

తెల్లటి బట్టల్లో వెంకట్. సెక్యూరిటీగార్డ్‌నీ, పరివార జనాన్ని మందలిస్తున్నాడు. నేను ఆశ్చర్యపోయి చూస్తూ వుండగానే నేరుగా వచ్చి నా పక్క సీట్లో కూర్చున్నాడు.

"ఎమ్మెల్యేని అవడం కాదుగానీ భలే అధికారం చలాయించేస్తున్నావే" అన్నాను వెంకట్‌తో నవ్వుతూ.

"అఫ్‌కోర్స్ అది మా వంశంలోనే వుందనుకో. అయినా ఈ రాజకీయాలు నాకు యిష్టంలేదు. నీకు తెలుసుగా. అర్జంటుగా కెరీర్‌లో సెటిల్ కాకపోతే మా మామ పిల్లనివ్వనన్నాడు. ఈ బిజినెస్‌ని సందీప్ చేసినంత యింట్రస్ట్‌గా నేను చేయలేకపోయాను. నువ్వెళ్ళిపోయాక మరీ బోర్ కొట్టేసింది. ఎలాగూ, మా నాన్న గొడవపెడుతున్నాడు కదా ఒకసారి ఎందుకు ట్రై చేయకూడదు అనిపించింది. వచ్చే నెలలో నాకూ, సుధకీ పెళ్ళి. అదయిపోతే నాకు రిలీఫ్. ఆ తర్వాత నెక్స్ట్ టర్మ్‌కి పోటీ చేస్తానో చెయ్యనో చెప్పలేను" అన్నాడు నవ్వుతూ.

వరుసగా నలుగురైదుగురు సర్వర్లు వచ్చి, వెంకట్‌కి కాఫీ, టీ, జ్యూస్‌లూ లాంటివి ఆఫర్ చేస్తున్నారు.

వెంకట్ చిరాగ్గా మొహం పెట్టడం చూసి, నాకు నవ్వొచ్చింది.

"ఎమ్మెల్యే ప్రోటోకాల్ ఆరంభమైంది" అన్నాను సరదాగా.

"ఇక్కడితో ఆగిపోతే ఫర్వాలేదు. ఇలా మనిద్దరం పక్కపక్కన కూర్చుని మాట్లాడటం చూసి, ఫోటో తీసి "యంగ్ అండ్ డైనమిక్ ఎమ్మెల్యే న్యూ గర్ల్‌ఫ్రెండ్ ఎలిజిబుల్ బ్యాచిలర్ ఒక యింటివాడవుతాడా? ఈ దృశ్యాలు అవుననే చెబుతున్నాయి.."

అచ్చం టి.వి యాంకర్‌లా గొంతుమార్చి చెబుతుంటే నేను నవ్వు ఆపుకోలేకపోయాను.

"ఆ తర్వాత సుధకీ నాకూ తగాదా" వెంకట్ మాటలకి పకపకా నవ్వుతూ, అనుకోకుండా తలయెత్తి చూసేసరికి, కాస్త దూరంలో నిలబడి, సందీప్ నన్నే చూస్తూ కనిపించాడు.

అతను నిన్న సెల్‌ఫోన్‌ని విసిరికొట్టడం. చిత్రతో అతనికి పెళ్ళి కాలేదన్న విషయం స్వప్న చెప్పడం. అన్నీ బుర్రలో గిరుక్కున తిరిగాయి.

అతనలా నా వైపు చూడడం, నాకు నచ్చింది.

ఇంతలో అరుణ్ పిలవకుండానే, మా మధ్య ఊడిపడ్డాడు. ఎదర వరసలోని కుర్చీని, నా వైపుకి తిప్పి కూర్చుంటూ

"అతనేనా సందీప్? మీ ఇద్దరి మధ్యా ఫ్రెండ్లీ టర్మ్స్ లేవా?" ముందుకి వంగుతూ రహస్యంగా అడిగాడు.

సందీప్ మా యిద్దరి వంకా చూస్తున్నాడు. నేను అతన్ని చూడకపోయినా నా మనసు అదే చెబుతూ వుంది.

"ఇతనెవరు? పరిచయం చెయ్యవా?" వెంకట్‌ని చూపిస్తూ అడిగాడు.

"జస్ట్ ఎ మినిట్ యిప్పుడే వస్తాను" అంటూ వెంకట్ లేచి, సందీప్ దగ్గరికి వెళ్ళాడు.

ఇద్దరూ మాట్లాడుకుంటూ, కల్యాణమండపం ఎంట్రన్స్ వైపుకి నడుస్తూ వున్నారు. నీలం రంగు షేర్వానీలో కొత్తగా కనిపిస్తున్న సందీప్. అలానే చూస్తూ ఉండిపోయాను నేను.

"నీకు యింకా సందీప్ మీద ఫీలింగ్స్ వున్నాయా?" అరుణ్ నా మొహం మీద చేయి ఆడిస్తూ అడిగాడు.

"దేవుడా! యిలాంటి ప్రశ్నలకి నేనేం జవాబివ్వగలను?" అనుకుంటూ.

"జస్ట్ ఎ మినిట్" అని చెప్పి లేచి వాష్‌రూంకి వెళ్ళాను.

**అద్దంలో** చూసుకుంటే నా మొహం నాకే కొత్తగా కనిపించింది.

"నేనేం కోరుకుంటున్నానో, నాకు తెలుసు. అయినా, ఎందుకీ కన్ఫ్యూజన్? భగవంతుడా! హెల్ప్ మీ"

నాలో నేనే మాట్లాడుకుని, మేకప్ రిఫ్రెష్ చేసుకుని బైటికి వచ్చాను. పక్కగదిలో ఏదో చప్పుడవుతుంటే, తొంగి చూశాను.

చిత్ర!

చందేరీ పట్టుచీరలో ఎప్పటిలా హడావుడిగా పనిచేస్తూ అందరికీ 'మన మనిషి' అనిపించే బ్రాండ్ మార్క్‌లో పూలమాలలు సర్దుతూ కనిపించింది.

నాకు ముందురోజు చిత్ర గురించి, స్వప్న చెప్పినవన్నీ చెవుల్లో గింగురుమన్నాయి.

వెంటనే, మెరుపులా గదిలోకి వెళ్ళి, తలుపు గడియవేసి, అడ్డంగా నిలబడ్డాను. చిత్ర చేతిలో పూలదండలు బుట్టలో వేసి

"ఏంటి?" అని అడిగింది సూటిగా.

"నాకు వివరణ కావాలి" అన్నాను గట్టిగా గాలిపీల్చుకుంటూ.

"దేనిగురించి?" అంది నిర్లక్ష్యంగా.

"ఎందుకు సందీప్ లైఫ్‌తో ఆడుకున్నావు? నువ్వు యింకెవర్నో ప్రేమిస్తున్నానన్న విషయం ఎందుకు దాచిపెట్టావు? సుమిత్రాదేవి మీ యిద్దరికీ పెళ్ళి చేయాలని గొడవపడుతూ వుంటే, ఎందుకు అడ్డుచెప్పలేదు?

సందీప్ చేత ఏ విషయమైనా ఒప్పించాలంటే, ఆవిడ సుమనీ, రంగారావుగారిని అడ్డుపెట్టి వాళ్ళని సాధించి, ఏడిపిస్తుందనీ నీకు తెలుసు.

సందీప్‌కి నిన్ను పెళ్ళి చేసుకోవడం యిష్టం లేదనీ తెలుసు. నీకోసం మీ మేనత్త వాళ్ళందర్నీ యిబ్బందులు పెడుతుంటే ఎలా చూస్తూ వూరుకున్నావ్? ఇదంతా ఎందుకు జరగనిచ్చావు?" ఆవేశంగా అడిగాను.

"నువ్వు యింత అమాయకురాలివని యివాళే తెలిసింది నాకు" హేళనగా నవ్వింది చిత్ర.

"నా కోసం ఆవిడ తన మొగుడ్నీ, కన్నబిడ్డల్నీ సాధించుకు తింటే, అది నా తప్పెలా అవుతుంది? అది ఆవిడ తెలివితక్కువతనం. ఎవరి జీవితం వాళ్ళు చూసుకోవాలి. ఏమో నేను ప్రేమించినవాడు నన్ను పెళ్ళి చేసుకోకపోతే అప్పుడు నా పరిస్థితి ఏంటి? సందీప్‌ని ఎలా వదులుకుంటాను?

అందుకే, మా అత్త చిందులు వేస్తూంటే, ఆమె కాళ్ళకింద యింకాస్త మంట పెట్టాను. నా లైఫ్ సెక్యూరిటీ నేను చూసుకోవడంలో తప్పేమీ లేదు. అయినా, సందీప్‌లో ఏం చూసి నువ్వు ప్రేమించావో నాకు యిప్పటికీ అర్థంకాదు.

ఊరి నిండా అప్పులూ, ఏదో కలలుగన్న వ్యాపారమే చేయాలన్న మొండి పట్టుదల ఏదో టైం బావుండి యిప్పుడు బానే సంపాదిస్తున్నాడనుకో.

గయ్యాళి తల్లి, చాతకాని తండ్రి, దద్దమ్మలాంటి చెల్లెలు. సుమతో యిన్నాళ్ళు కలిసి మెలిసి తిరిగినా, నా గురించి ఒక్క విషయం ఈ రోజుకీ తెలియదు దానికి. అని నవ్వి మళ్ళీ మొదలుపెట్టింది.

నాకు తల్లిలేదు. తండ్రి తాగుబోతు. అయితే నేను అంత దయనీయమైన పరిస్థితిలో వున్నానా? నేను సందీప్‌ని పెళ్ళిచేసుకోవాలా? అనిపించేది అప్పుడు నిన్ను చూసి ఆశ్చర్యపోయేదాన్ని.

నీకు చదువు, అందం, ఆస్తి అన్నీ వున్నాయి. అయినా సందీప్‌ని ప్రేమిస్తున్నావు అనుకునేదాన్ని.

అతని వ్యాపారం కోసం నువ్వు పార్ట్‌నర్‌గా చేరి, పెట్టుబడి పెట్టావు. ఆస్తి తాకట్టు పెట్టావు. నగలు అమ్మావు. అతను మనశ్శాంతిగా వుండాలని ఆఖరికి ఊరే వదిలిపెట్టి వెళ్ళిపోయావు.

సందీప్ కోసం నిజంగా నువ్వు అవన్నీ చేస్తున్నావంటే, నేను నమ్మలేకపోయేదాన్ని.

నిజంగా, ఆలోచిస్తే ఈ రోజుకీ నాకీ విషయం అర్థంకాదు.

ఏదైతేనేం లక్కీగా నేను కోరుకున్న వ్యక్తితోనే నా పెళ్ళయ్యింది. ఐ యామ్ హ్యాపీ.

ఇక ఎవరి జీవితాలూ చక్కదిద్దాల్సిన పని నాకు లేదు. ఎవరి జీవితం గురించి వాళ్ళు ఆలోచించుకోవాలి.

కాకపోతే యిన్నాళ్ళూ నేను కష్టపడి సంపాదించుకున్న మంచిపేరు ఎందుకు పోగొట్టుకోవాలి? అనుకున్నాను. అందుకే సందీప్ నిన్ను మర్చిపోలేకపోతున్నాడనీ, అందుకే, నాకు యిష్టంలేకపోయినా, వేరే అతనితో పెళ్ళి ఒప్పుకున్నాననీ చెప్పాను. ఈ రోజుకీ నా పిచ్చి మేనత్త అదే నిజమని నమ్ముతుంది.

నువ్వు తెలివి తక్కువ దానివి కాబట్టి, మైదానం అంతా నాకు వదిలేసి వెళ్ళావు. ఇందులో తప్పొప్పులు ఏమీ లేవు. ఎవరు బాగా ఆడితే, వాళ్ళదే గెలుపు. నీ చేతులారా నువ్వే ప్రేమించిన వ్యక్తిని వదిలేసుకుని వెళ్ళిపోయావు. ఇప్పుడు సందీప్ నాకు అక్కర్లేదు. హీ ఈజ్ ఆల్ యువర్స్. ఈ వివరణ చాలా? యింకా కావాలా?"

నేను ఉన్నచోటే నోరు తెరుచుకుని బొమ్మలా నిలబడిపోయాను.

"అన్నట్టూ నాకూ, సుమకీ 'ఇన్ఫోసిసి ఫౌండేషన్ స్కాలర్ షిప్' కోసం నువ్వే వాళ్ళని కన్సల్ట్ చేసి మా డిటైల్స్ యిచ్చావని నాకు తెలిసింది. నువ్వు నిజంగానే మంచిదానివి" అని నవ్వి, నన్ను పక్కకి నెట్టి తలుపు తీసుకుని బైటికి వెళ్ళిపోయింది చిత్ర.

మళ్ళీ వాష్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కున్నాను. చిత్ర చెప్పిన మాటలు నా బుర్రలో అదేపనిగా తిరుగుతూ వున్నాయి. 'సందీప్‌ని వదిలి వెళ్ళడం' నా తెలివి తక్కువతనం అని తేల్చి చెప్పి నన్ను మరింత కన్ఫ్యూజన్‌లోకి నెట్టి వెళ్ళిపోయింది.

ఏమీ అర్థంకాని, అయోమయస్థితిలో నడుచుకుంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నాను.

"ఆర్యూ ఆల్‌రైట్! ఏమిటలా వున్నావు?" అరుణ్ ఆదుర్దాగా అడిగాడు.

"ఏం లేదు. అయామ్ ఓ.కే" అన్నాను సర్దుకుని కూర్చుంటూ.

"అత్తయ్యా పూలమాలలు సర్దేశాను. సుమ రెడీ అయిపోయింది. గౌరీ పూజ యింకో పదినిముషాల్లో ప్రారంభమౌతుందన్నారు పంతులుగారు" చిత్ర సుమిత్రాదేవితో కలివిడిగా మాట్లాడుతూ మంచితనపు పరిమళాల్ని అన్నివైపులకీ ప్రసారం చేస్తూ వుంది.

నేను నీరసంగా నిట్టూర్చాను.

అరుణ్ సెల్‌ఫోన్ ఛాట్‌లో బిజీ అయిపోయాడు. స్వప్న, అభీ ఏదో జోక్ చెప్పుకుని నవ్వుకుంటున్నారు. మాధవన్నయ్య పెళ్ళికి వచ్చిన వాళ్ళతో మాట్లాడూతూ వున్నాడు. చుట్టూ అంతమంది వున్నా వాళ్ళ మధ్యలో నేను ఒంటరిని అనిపించింది.

బైట శబ్దాలేవీ నా చెవులకి వినిపించడంలేదు. నామనసులో మాటలే నన్ను తొలిచేస్తున్నాయి.

"అమ్మా!"

పిలుపు వినిపించడంలో ఉలిక్కిపడి తలతిప్పాను.

ఎదురుగా రంగారావుగారు.

"నువ్వు వచ్చినందుకు చాలా సంతోషంగా వుందమ్మా" ఆప్యాయంగా పలికారు.

ఎప్పుడూ మనిషికి కాస్త దూరంగా నిలబడి, చేతులు కట్టుకుని నిలబడినా రంగారావుగారి నిర్మలమైన మనసుకీ ఎదురుగా కావలించుకుని ప్రేమ ఒలికిస్తున్న చిత్ర మనస్తత్వానికీ పోలికే లేదనిపించింది.

ఎటొచ్చీ మనిషిని గుర్తించడం మనిషి నేర్చుకోవాలి.

"నీతో మాట్లాడాలమ్మా! ఒకసారి వస్తావా?" చుట్టూ చూస్తూ అడిగాడాయన.

"అలాగే" అంటూ లేచి ఆయన వెంట నడిచాను.

లిఫ్టుదిగి, పార్కింగ్ దాటి, ఓ మూలగా వచ్చి నిలబడ్డాం యిద్దరం.

"అమ్మా! వయసులో పెద్దవాడిని అయినా, మీకున్నంత చదువు, తెలివి జ్ఞానం నాకు లేవు. కుటుంబాన్ని అప్పులపాలే చేశానో అమాయకంగా మోసపోయానో, నాకు తెలియదు. ఎలాంటివాడినైనా నేనూ ఓ తండ్రిని."

"ఆయనలా మాట్లాడుతూవుంటే ఆ డిస్కషన్ ఎటువైపుకి మళ్ళబోతుందో" అని నాకు భయమేసింది.

"అంకుల్ ప్లీజ్... యిప్పుడవన్నీ ఎందుకు?" ఆయన్ని వారించబోయాను.

"చెప్పనీ అమ్మా" నాకు ఉన్న ముక్క మాట్లాడటమే వచ్చు. జీవితంలో ఎప్పుడూ ఎక్కువ మాట్లాడలేదు. పని చెయ్యడం ఒక్కటే నాకు తెలుసు.

మా సందీప్‌కి నాలానే, ఎక్కువ మాట్లాడడం రాదు. వాడు, నా బాధ్యతలన్నీ వాడిపై వేసుకున్నాడు.

ఓ తండ్రిగా, నా బిడ్డలిద్దరూ 'సంతోషంగా ఉండాలి' అనే నేను కోరుకునేది.

నువ్వు వెళ్ళిపోయినప్పటినుంచి, వాడు ఒకలా అయిపోయాడు. ఎవరితో సరిగా మాట్లాడడు. ఒక సరదా, ఒక నవ్వు ఎరగడు. ఇంద్రభవనంలాంటి యిల్లు కట్టినా, వాడా యింట్లో ఉండడు.

ఆఫీసు నుంచి రాగానే నేరుగా మీ యింటికి వెళతాడు. అక్కడే తింటాడు. అక్కడే పడుకుంటాడు. నువ్వనుకుంటున్నట్టు ఆ యింట్లో వేరే ఏ ఫ్యామిలీనో అద్దెకుండడంలేదు. నెలనెలా నీ ఎకౌంట్‌లో, వేరే వాళ్ళ పేరు మీద అద్దె వాడే వేస్తుంటాడు. వాడికి ఆ యింట్లోనే మనశ్శాంతి.

పెళ్ళి చేసుకోమని ఎంత వత్తిడి తెచ్చినా ఉలకడు పలకడు. కేవలం మా అవసరాలు తీర్చడానికే ఉన్నానన్నట్టు వుంటాడు యింట్లో.

ఎప్పుడూ, ఏ విషయాల్లో ఎక్కువగా కల్పించుకోని నేను వాడిని ఒత్తిడి పెట్టి అడిగాను, పెళ్ళిచేసుకోమని.

"తన్మయి పెళ్ళి చేసుకుంటే నేనూ నా పెళ్ళి గురించి ఆలోచిస్తాను" అన్నాడు. వాడెందుకలా అన్నాడో యిప్పుడు నాకర్థమవుతుంది. వాడూహించినట్టే, నువ్వూ పెళ్ళిచేసుకోలేదు.

వాడికోసం నువ్వెన్నో చేశావు. నీకున్నవన్నీ వాడికిచ్చేసి కూడా నువ్వు ఒక్కమాట కూడా మాట్లాడలేదు. నీలా ప్రేమించే అమ్మాయి, వాడికి యింకెక్కడా దొరకదు. అది వాడికి తెలుసు. అందుకే వాడట్లా అయిపోయాడు" చెబుతూ వుంటే క్రమంగా ఆయన గొంతు వణకడం మొదలైంది.

"అంకుల్ యిప్పుడవన్నీ ఎందుకు?" చప్పున ఆయన చేతులు పట్టుకున్నాను.

"ఒక్క నిముషం" అంటూ ఆయన నా చేతులు విడిపించుకుని, చొక్కా జేబులో నుంచి ఏదో వస్తువు బైటికి తీశారు.

"నువ్వు ఈ వూరు వదిలి వెళ్ళిపోయేముందు ఓ రోజు బాగా వర్షం పడింది. ఆ రోజు సుమిత్ర విశ్వరూపం దాల్చింది. హోరువానలో నన్నూ, సుమనీ బైటికి నెట్టేసింది."

"అంకుల్ ... ప్లీజ్" నేను వారిస్తున్నా ఆయన వినడంలేదు.

"ఆ రోజు నువ్వు మా యింటికి వచ్చావు. అన్నీ చూశావు. అప్పుడూ ఈ బ్రేస్‌లెట్ బురదలో పడిపోయింది" అంటూ చీకట్లో మెరుస్తున్న ఆ బ్రేస్‌లెట్‌ని నా అరచేతిలో పెట్టాడు.

"ఇది నీ పుట్టినరోజుకి నేనే కొనుక్కొచ్చాను. నాకు బాగా గుర్తు. మా పిల్లల్లా నిన్ను దగ్గరకి తియ్యకపోయినా నిన్నూ నా పిల్లల్లాగే అనుకునేవాడిని.

ఆ రోజు తర్వాత నువ్వు మళ్ళీ కనిపించలేదు. ఈ వూరు వదిలివెళ్ళిపోయావు. ఫోన్ నెంబరు మార్చేశావు. ఈ ముసలోడు పడుతునన్ బాధలు చూసి భరించలేకపోయావు. సందీప్‌ని వదిలి వెళ్ళిపోయావు.

కానీ తప్పు చేశావమ్మా ఇప్పటివరకూ నా బిడ్డలకోసం, నేనెప్పుడూ బైటపెట్టని మాటని యిప్పుడు చెపుతున్నాను. సుమిత్ర ఒక రాక్షసి.

నన్ను ఆ రాక్షసికి కలకాలం ఎరగా పడివుండమని తేల్చేశావు. నా జీవితంలో నాకే ఆశ లేకుండా చేశావు.

నువ్వు వెళ్ళిపోయినంత మాత్రన సుమిత్ర మారిపోతుందా? సందీప్ మనసులో నుంచి నిన్ను తీసెయ్యగలమా?

దేవుడి దయవల్ల సుమ పెళ్ళై వెళ్ళిపోతుంది.

"నువ్వు సుమిత్రని మర్చిపో. నిన్ను ప్రేమించేవాళ్ళని చూడు. మా సందీప్‌ని పెళ్ళి చేసుకో తల్లీ"

ఆయన కంఠం బరువవుతుంది. ఆయన ఏడుస్తున్నాడా? చీకట్లో ఆయన మొహం సరిగా కనిపించడంలేదు.

"ఈ ముసలోడికి, ఏ పక్షవాతమో వచ్చి మంచాన పడితే నా గొంతులో నీళ్ళుపోసే బంగారు తల్లివి నువ్వేనమ్మా" ఆయన నా రెండు చేతులూ గట్టిగా పట్టుకున్నాడు.

ఎప్పుడూ శాంతంగా వుండే మనిషి అలా చెదిరిపోవడం చూసి, నాకు బాధ కలిగింది.

నిరాడంబరంగా, నిజాయితీగా ఆయన మాట్లాడిన మాటలు నా అమ్మసుని తాకాయి. నా రెండు కళ్ళూ వర్షించాయి.

ఆ చీకటిలోనే ఏదో వెలుగు గోచరించినట్లైంది.

"అలాగే అంకుల్.. "అని నేను మాట యిచ్చిన తర్వాత, ఆయన నా చేతులు వదిలారు. అక్కడ నుంచి కదలబోతుండగా ఒక నీడ కనిపించింది. క్రమంగా అది ఒక ఆకారాన్ని సంతరించుకుంది.

"అంటే, ఈ చీకట్లో మా మాటలు ఎవరైనా వింటు ఉన్నారా?" అనుమానించాను.

వెంటనే ''నాన్నా!'' అన్న పిలుపు వినిపించింది.

''సందీప్'' మనసు ఆరాటంగా పిలిచింది. ''ఇందాకట్నుంచి, చీకటిలో నిలబడి సందీప్ మా మాటల్ని వింటున్నాడా?''

''నాన్నా! వరపూజ మొదలవుతుంది. త్వరగా రండి'' అతను పిలవడంతో రంగారావుగారు కదిలారు.

నేనూ ఆయన వెంట నడిచాను.

పార్కింగ్ దాటి వెళ్ళాక లైట్ల వెలుతురు పడుతూనే ఆరాటంగా సందీప్ వైపుకి చూశాను. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి.

సుడిగుండంలో చిక్కుకుని, కష్టం మీద బైటపడ్డ వ్యక్తిలా వున్నాడతను.

''ఖచ్చితంగా, అతను మా మాటలు విన్నాడు'' నా అనుమానం నిర్ధారణ అయ్యింది.

**పెళ్ళి తతంగం** జరుగుతూ వుంది.

మాంగల్యధారణ పూర్తయ్యింది. ఇంతలోనే ఒక పక్క భోజనాలు కూడా మొదలయ్యాయి. పెళ్ళివారితో బాటు వచ్చిన అతిథుల్ని కూడా భోజనానికి ఆహ్వానిస్తున్నారు. స్వప్న వాళ్ళతో బాటూ, నేనూ డైనింగ్ హాలు వైపుకి కదిలాను.

అక్కడ ఎంట్రన్స్ దగ్గర సందీప్ నిలబడి వున్నాడు.

భోజనాలగది గుమ్మం దాటుతుండగా, ఉన్నట్టుండి, నా చెయ్యి పట్టుకుని వెనక్కి లాగాడు. ''నువ్వు ఉండు'' నాతో చెప్పి, అతిథులు లోపలికి వెళ్ళగానే, నా వైపుకి తిరిగాడు.

''నీతో మాట్లాడాలి పద'' అన్నాడు నా చెయ్యి వదలకుండానే అడుగులు వేస్తూ.

ఇద్దరం పెళ్ళి మండపం వెనకాల వున్న గదిలోకి వెళ్ళాం.

రంగారావుగారు సందీప్ గురించి చెప్పిన మాటలన్నీ మళ్ళీ గుర్తుకు వచ్చాయి నాకు. ''అంటే అయ్యగారు నా కౌచ్‌లో కూర్చుని నా బెడ్ మీదే పడుకుంటున్నారన్నమాట'' నా పెదవులు సంతోషంతో విచ్చుకున్నాయి.

''కూర్చో!'' కుర్చీ చూపిస్తూ అన్నాడు సందీప్.

''తనూ సీను ఖచ్చితంగా నువ్వు వూహించినట్టు రొమాంటిగ్గా వుండకపోవచ్చు బిజినెస్ మీటింగుల్లోలా 'కూర్చో' అంటున్నాడు'' అంతరాత్మ చెప్పింది.

''ష్'' దాన్ని మందలించి, బుద్ధిగా కుర్చీలో కూర్చున్నాను.

"నాన్న చెప్పిందంతా విన్నాను. ఇన్నాళ్ళూ నువ్వు నాతో చెప్పకుండా అలా ఎందుకు వెళ్ళిపోయావు" అని కోపంగా వుండేది. కానీ అతా విన్న తర్వాత నీ మీద కోపం పోయింది. నువ్వు చేసింది కరెక్టే. యూ డోంట్ డిజర్వ్ ఆల్ దిస్. మా నాన్నకి మాటిచ్చావని నన్ను పెళ్ళి చేసుకోవాల్సిన అవసరంలేదు. నీ మంచి మనసుకి, నీకో మంచి ఫ్యామిలీ దక్కాలి. మా కుటుంబంలాంటి కుటుంబం కాదు" అతను నేరుగా నా మొహంలోకి చూడకుండా, గోడ మూలలకి చూస్తూ చెప్పాడు.

నేను చటుక్కున కుర్చీలో నుంచి లేచాను.

"ఒకమాట చెప్పనా? నేనూ అచ్చం నీలాగే ఆలోచించాను. నేను వెళ్ళిపోతే మీరంతా సంతోషంగా, నార్మల్‌గా వుంటారనుకున్నాను. అది జరగలేదు. నిజం చెబుతున్నాను. ఇక్కడ నుంచి వెళ్ళిపోయాక, ఒక్కరోజు కూడా నేను సంతోషంగా లేను.

నేను నీకు చేసినట్టే నువ్వూ నాకు జీవితాంతం పనిష్మెంట్ యివ్వాలనుకుంటే యిలా మాట్లాడు. మీ అమ్మ ఎలాంటిదో తెలిసి కూడా నువ్వు నిజాన్ని యాక్సెప్ట్ చెయ్యలేకపోతున్నావు. ఆ ఫ్రస్టేషనే నీ చేత యిలా మాట్లాడిస్తుంది. ఇలాంటి, ఫ్రస్టేషన్‌తోనే చిన్నప్పుడు నన్ను అసహ్యించుకునేవాడివి. ఇప్పుడు అదే కారణంతో దూరంగా పెట్టాలని చూస్తున్నావు. మీ నాన్న చెప్పింది నిజం.

మనల్ని ప్రేమించేవాళ్ళ కోసం మనం జీవించాలి. నువ్వు లేకుండా నేను సంతోషంగా వుండలేను. ఈ విషయం గుర్తుపెట్టుకుని నిర్ణయం తీసుకో" కళ్ళలో సుడులుగా తిరుగుతున్న నీళ్ళని కంట్రోలు చేసుకునే ప్రయత్నం చేస్తూ గబగబా అక్కడినుంచి బైటికి వెళ్ళాను.

"చిత్ర చెప్పింది, అక్షరాలా నిజం. నువ్వొక తెలివితక్కువ దద్దమ్మవి. లేకపోతే ప్రాణంలా ప్రేమించే వ్యక్తిని వదిలి వెళ్ళిపోతావా? ఇప్పుడు చూడు ఈ చిక్కుముడులన్నీ దానివల్లే వచ్చాయి" అంతరాత్మ తిట్టిపోసింది.

నేను నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి, ఏ.సి వెంట్ పక్కన కూర్చున్నాను.

పెళ్ళికూతురు చీర మార్చుకుని రావడానికి వెళ్ళింది. పెళ్ళికి వచ్చిన జనం, చాలావరకు భోజనాల గదిలో వున్నారు. కొంతమంది హడావుడిగా భోజనం అవుతూనే యిళ్ళకి బయలుదేరారు.

హాల్లో, మిగిలిన జనాలు, పల్చగా గుంపులు గుంపులుగా కూర్చుని వున్నారు.

"కూతురి పెళ్ళి అయ్యింది. ఇక కొడుక్కి పెళ్ళి ఎప్పుడు చేస్తావు?" అమ్మలక్కలు సుమిత్రాదేవిని అడుగుతున్నారు.

"బంగారంలాంటి పిల్ల స్వంత మేనకోడల్ని వదులుకున్నావు. ఈ పందిట్లో ఆ అమ్మాయి అన్ని పనులూ చేస్తూ ఎంత సందడిగా తిరుగుతుందో. ఏమైనా ఈ విషయంలో నువ్వు దురదృష్టవంతురాలివే సుమిత్రా"

ఇంకెవరో సుమిత్రాదేవిని రగిలించారు. దాంతో ఆవిడకి పూనకం వచ్చింది. కాస్త దూరంలో ఒంటరిగా కూర్చుని నేను కనిపించాను. ఏం జరగబోతుందో నేను ఊహించేలోపలే ఆవిడ లేచి, రయ్యిన నా దగ్గరికి వచ్చింది.

"ఈ మహాతల్లి వల్లే నా కొడుకు కాకుండా పోయాడు. దీన్ని చూసే చిత్రని వద్దన్నాడు. మాకు శత్రువైపోయాడు.

నాకింత ద్రోహం చేసి యింకా ఏ మొహం పెట్టుకుని యిక్కడికి వచ్చిందో" అంటూ నా రెక్కపట్టుకుని ఒక్క ఉదుటున నన్ను పైకి లేపింది.

నేను నోరు తెరిచి మాట్లాడబోయే లోపలే నన్ను దూరంగా ఒక్క తోపు తోసింది.

నేను కిందపడబోయాను. పడిపోయాననే అనుకున్నాను. ఇంతలో గబుక్కున సందీప్ వచ్చి నన్ను పట్టుకున్నాడు.

"లీవ్‌మీ నేను వెళ్ళిపోతాను" అంటూ కోపంగా అతని చేతుల్ని విదిలించుకోబోయాను.

"ఇందాక 'ప్రేమించిన వాళ్ళకోసం నిలబడాలి' అంటూ అన్ని నీతులు చెప్పావు అసలు సమయంలో వెళ్ళిపోతానంటే ఎలా?"

సందీప్ నాతో అంటూ.. అందరి ముందు నన్ను గట్టిగా గుండెలకి హత్తుకున్నాడు.

మా చుట్టూ చేరినవాళ్ళు నీళ్ళు తెరిచి యిద్దరి వంకా విచిత్రంగా చూస్తున్నారు.

"మీరు చూస్తున్నది కలకాదు. నిజమే. ఈ అమ్మాయినే నేను ప్రేమించాను. మీ అందరికీ కాలక్షేపం కబుర్లు కావాలంటే ఎన్నైనా చెప్పుకోండి. కానీ ఈ అమ్మాయి జోలికి వస్తే మాత్రం నేనూరుకోను."

వాళ్ళమ్మతోబాటు, చుట్టూ వున్న అందరివైపూ చూస్తూ అన్నాడు.

"ష్. వదులు.." చుట్టుపక్కల వాళ్ళని చూసి సిగ్గుపడుతూ అన్నాను.

"పర్లేదు. నేనూ మనుషుల్ని హాండిల్ చేయడానికి ఏదో ఒక కొత్తపద్ధతి వెతుక్కోవాలిగా" అని నవ్వుతూ వదిలేశాడు. ఆశ్చర్యంగా, మా చుట్టూ ఉన్నవాళ్ళంతా నవ్వుతూ చప్పట్లు కొట్టడం మొదలు పెట్టారు. ఒక్క సుమిత్రాదేవి తప్ప.

ఎప్పుడు వచ్చాడో అరుణ్ కూడా వాళ్ళతో కలిసి మమ్మల్ని అభినందించాడు. సుమిత్రాదేవి కోపంగా అరవబోతుంటే ఆవిడ స్నేహితురాళ్ళే ఆమెని పక్కకి లాక్కెళ్ళారు.

"వాళ్ళకి కావలసింది ప్యూర్ ఎంటర్ టెయిన్ మెంట్. ఈసారి మనం ప్రొవైడ్ చేశాం" నా చెవిలో గుసగుసగా అన్నాడు సందీప్.

"ఇదంతా కలా నిజమా?" ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు. "ఈ సమస్యని సందీప్ ఎంత సులువుగా పరిష్కరించాడు" నమ్మలేకపోయాను. అతని చేయి పట్టుకుని అలా నిలబడి వుంటే ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా అనిపించింది నాకు.

మా పెళ్ళి చాలా సింపుల్‌గా జరిగిపోయింది. సుమిత్రాదేవి, చిత్ర తప్ప మాకు దగ్గరైనవాళ్ళు, ఆప్తులూ అందరూ పెళ్ళికి వచ్చారు.

"నేను కోరుకున్నట్టే నేను బతికుండగానే పెళ్ళి చేసుకున్నావు. ఎప్పటికీ యిలానే సంతోషంగా ఉండాలి" అంటూ నిండుమనసుతో ఆశీర్వదించింది అన్నపూర్ణమ్మగారు.

మా పెళ్ళి నిశ్చయం అయిన తర్వాతనుంచి సుమ నాతో బాగా మాట్లాడటం మొదలు పెట్టింది. అందరికన్నా ఎక్కువ సంతోషించింది రంగారావుగారు. మా అమ్మ కోరుకున్నట్టుగా నాకూ ఒక కుటుంబం ఏర్పడింది. ఎప్పటికీ ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా నా కుటుంబం కోసం నిలబడాలి అని నా పెళ్ళి అయిన రోజే నిశ్చయించుకున్నాను.

సంవత్సరం తరువాత... తలుపు ధడాల్న తీసిన చప్పుడైంది.

"ష్..ష్.. బాబు నిద్రపోతున్నాడు" చిన్న గొంతుతో అన్నాను.

సందీప్ మెల్లగా నడుచుకుంటూ, నా దగ్గరకు వచ్చాడు.

"ఏదీ, నీ చెయ్యి యివ్వు" అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"దీసీజ్ ఫర్ యూ" అంటూ చేతిలో చిన్న ఎర్రరంగు బాక్సుని వుంచాడు.

దాన్ని తెరిచి చూశాను.

లోపల మిలిమిలా మెరుస్తూ డైమండ్ రింగ్.

"ఒకసారి నువ్వు అన్నావు గుర్తుందా! నేను వాడిపోయిన గులాబీని, ఖాళీ పేస్టు డబ్బాలో పెట్టి తెచ్చి యిస్తానని, డైమండ్ రింగ్‌లాంటి విలువైనవేవీ గుర్తుగా ఇవ్వలేనని.."

"సందీ అది ఒక జోక్ అంతే" అన్నాను సరదాగా మూతి విరుస్తూ.

"అయ్యో! మరి నేను నిజంగానే నిజమైన డైమండ్ రింగ్ తెచ్చేశానే" ఆటపట్టిస్తూ అన్నాడు.

అతని మాటలకి నేను కిలకిలా నవ్వాను.

సందీప్ నా వేలికి ఉంగరం తొడిగాడు. ఆ తర్వాత కూడా అతని చేతులు వెనక్కి వెళ్ళలేదు. చిలిపిగా నా శరీరం మీద యింకాస్త ముందుకి సాగుతూ వున్నాయి.

ఇంతలో "హ్హా.. హ్హా" అని గొంతు సవరించుకున్న శబ్దం వినిపించింది. ఒకరినొకరు వదిలి ఇద్దరం సర్దుకుని నిల్చున్నాం.

"మామయ్యా అప్పుడే వచ్చేశారేం? అత్తయ్య ఎలా వున్నారు?" అడిగాను రంగారావుగారిని.

"మీ అత్తయ్య బ్రహ్మాండంగా వుంది. నువ్వు మంచితనానికిపోయి అవీ యివి యిచ్చిరండి అని పంపిస్తావుగానీ ఆవిడ అన్నీ హాయిగా తిని, నిన్ను తిడుతూ వుంటుంది" అన్నాడాయన సోఫాలో కూర్చుంటూ.

"ఆవిడ నిన్ను జన్మకి క్షమించదు. కొడుకుని కొంగున కట్టేసుకున్నావని కోపం." అంతరాతం సెటైర్ వేసింది.

"ఫర్వాలేదులెండి నాకు అలవాటైపోయింది. నేను పట్టించుకోను" అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

సుమిత్రాదేవి మాతో కలిసి వుండదు. వేరే యింట్లో ఉంటుంది. ఆవిడ ఏం మాట్లాడినా మేము పట్టించుకోవడం మానేశాం.

"అందరూ హాయిగా, సంతోషంగా ఉండాలంటే ఇదే సరైన పద్ధతి" అని మా పెళ్ళికి ముందే చెప్పేశాడు సందీప్.

రంగారావుగారూ, సందీప్ ఆవిడ దగ్గరికి వెళ్ళి వస్తుంటారు.

ఇంతలో ఉయ్యాలలో బాబు నిద్రలేచి ఏడుపు అందుకున్నాడు. వెంటనే నేను బాబుని ఎత్తుకుని బాల్కనీలోకి వెళ్ళి నిలబడ్డాను.

బైట కనిపించిన చెట్లనీ ఎగిరే పక్షులనీ చూసి, ఏడుపు ఆపి, కిలకిలా నవ్వాడు. ఆ చిట్టి చేతుల స్పర్శ నా గుండెల మీద వెచ్చగా అనిపించింది. సంతృప్తిగా నిట్టూర్చాను.

"మనిషి జీవితంలో ఎన్నో బంధాలూ, అనుబంధాలూ ఏర్పడతాయి. కానీ అన్నీ అన్నిసార్లు నిలబెట్టుకోలేము.

మా నాన్న తనీష్ సుమిత్రాదేవి యిలాంటివాళ్ళని వదిలేసి ముందుకు సాగితేనే, మనం సంతోషంగా జీవించగలం. బాధ కలిగించినా, కొన్ని నిర్ణయాలు తప్పవు."

"ఏంటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" సందీప్ నా వెనకాలే బాల్కనీలోకి వచ్చాడు.

"ఏం లేదు.." సందీప్ వంక చూసి, చిరునవ్వు నవ్వాను. అతను నా భుజం చుట్టూ చెయ్యివేసి, చిరునవ్వు నవ్వాను. అతను నా భుజం చూట్టూ చెయ్యివేసి వంగి బాబుని ముద్దాడాడు. సందీప్ స్పర్శతో బాబు ఆనందంగా చేతులు చాపి కేరింతలు కొట్టాడు.

ఒక చల్లటి గాలితెర వాన కబురుని మోసుకొొచ్చింది.

ఆకాశం నెమ్మదిగా 'వానపూల'ను కురిపించడం మొదలుపెట్టింది.